# భారతి

## సచిత్ర
## మాసపత్రిక

సంపాదకుడు

కా. నాగేశ్వరరావు

ఆంధ్రపత్రికా ముద్రాలయము,
మద్రాసు.
౧౯౩౮

సంపుటము ౧౫, సంచిక ౪

# విషయసూచిక



## చిత్రములు

# భారతి చందాదార్లకు హెచ్చరిక

ఈ క్రింది కనబరచిన నెంబర్ల వారికి ఈ నెల (1938 సం. ఏప్రిల్ నెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమునకగు చందా మాకు చేరునట్లు ఈ నెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపులేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమయొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్ము రానిచో సహజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరము వఱకు చందాదారులుగ నుందురను నమ్మకముతో 1938 సం. మే 10-వ తేదిని రూ 6-4-0 లకు వి.పి. పంపుచున్నాము. గావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమానముంచి సొమ్ము చెల్లించి వి. పి. ని గైకొన ప్రార్థితులు. ఒకవేళ తమ కీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మా కావిషయము వెంటనే తెలియజేసినయెడల వి. పి. పంపుట మాపుదుము.

A 13, 16. C 4. D 2. G 1, 6, 7. H 16, 21, 30, 31, 3?, .5
K 3, 4, 6, 14 L. 2. M 4, 5. N. 3, 4, 5. P 28. R 7, 8, 32.
S 4, 14, 16, 17, 18, 19, 21, 23, 50, 55, 82, 137, V 8, 9, 10.

# భారతి

సంపు. ౧౫ | బహుధాన్య, చైత్రమాసము ( ఏప్రిల్ 1938) | సంఖ్య ౪

## తె నుఁ గు శి ల్పి

వి శ్వ నా థ వేం క టే శ్వ రు లు

నీ వెవ్వరోయి శిల్పి - కేవలమృత్యుంజయత్వకీర్తిఁ బరఁగుచున్
మావలను గాలపుందెరఁ - జేవెల్చుచుఁ జూతు కరుణచిలికెడుదృష్టిన్.

రాజులు రాజ్యముల్ సమయరాక్షసుఁ డెత్తుకపోవఁ బోయినన్
దేజ దొలంగ నుజ్వలమతిప్రతిభన్ నవసుందరాత్మశో
భాజితకాలవేగుడవభంగురతారమణీయరూపలీ
లాజయసృష్టివైభవకలాచతురాననమూర్తి వెంతయున్.

శాతవాహనమహాజ్యోతిస్సు గగనభూపథులఁ దీర్చినరంగవల్లికలును
చాళుక్యవంశవైశ్వానరార్చులు దిగ్దిగంతంబులం గ్రమ్మునమృతకళలు
కాకతికనుదోయికలువరేకులు విచ్చి దెసల నిండించిన తేనెవాక
కృష్ణరాయలబాహుకేయూరమణిఘృణుల్ విశ్వంబునించిన వింతవెలుఁగు
తెలుఁగురాజులఖడ్గపుత్రికలమేలి - నృత్యరేఖలు త్వన్మనోనిశితటంక
ధారలో వెల్గుజీవపదార్థమునకుఁ - బరగు నిత్యతేజోమయోపాధు లయ్యె.

నీపేరైన నెఱుంగనేరముకదే నిర్వ్యాజవైరాగ్యవి
ద్యాపారమ్యమహేశ్వరుండవు మహాంధ్రక్ష్మాగిరిప్రోద్భవా
శ్రీపీయూషతరంగసుందరకలాశ్రేయోవిచిన్వత్సుధీ
వ్యాపారుండవు రూపగాంగజలనిత్యస్నాతశీర్షుండవున్.

నటరాజువై ధాన్యకటకవాటికలోన శిల్పవిద్యాతపస్సిద్ధి వడసి
అలయజంతాగుహాభ్యంతరోత్థితశిల్పసర్వరసాపగన్ జట ధరించి
ప్రోలునిపురిశిల్పశైలజన్ వేయికంబాలాట వేరీతి మరులుకొలిపి
విద్యాపురిని శిల్పవృషభు నెక్కి శిలాళియమరాళితోడ వయాళివోయి
ఆంధ్రదేశస్థదేవతాయతనములను - జిత్కళార్వాంతరుత్ఫుల్లశిల్పరూప
శివరసావేశతాదాత్మ్యసిద్ధి నొంది - చిలికి తమ్మృతమ్ము నాంధ్రధీక్షేత్రములను.

అలరువిభావమై యనుభవుఁ డంబికయున్ రసరాజ్యసృష్టికిన్
నెలవులు కాఁగ బ్రహ్మపదనిత్యభవత్కళితత్వవృత్తిఁ దె
ల్గు లెలమిఁ జర్వ్యమాణరసలోలత స్థాయులతొమ్మిదింటి కా
తలిదగుఁ గేవలానుభవధామము నొందరి చిద్రసాకృతిన్.

శివుఁడు నృత్తము చూపఁ జిజ్జడోన్మేళనావ్యాకృతంబగులయవ్యాప్తిఁ జూపి
శివుఁడు నృత్యముసేయ భువనపదార్థవివేచనప్రౌఢిమ పొందుగొలిపి
శివుఁడు నాట్యంబాడఁ జిద్రసైకసువస్తుపూర్ణతావాక్యార్థబోధ సలిపి
శివలాస్యతాండవశ్రీభేదముల సృష్టిసంహృతిక్రీడాప్రశస్తి నెఱపి
శివునిరసమూర్తియుఁ ద్రిలింగభువనరీతి - వ్యంజకవ్యంగ్యభావసంవాద మొలయ
నాంధ్రులహృదంతరంపురసార్ద్రవృత్తి - శివమహాభూతిఁ జేసితి శిల్పసిద్ధి.

శిల తాపాధికద్రవ్యమై యులులఁ గైసేయంగ నీదివ్యహా
స్తలసత్స్పర్శము స్పర్శవేదిగుణబోధం జేసి లోకత్రయో
జ్జ్వలహైరణ్మయరూపసంపద వెలార్పన్ సృష్టిసౌందర్యరే
ఖలు గ్రుచ్చెత్తెడు త్వన్మనఃకమలసౌగంధ్యం బదేలాటిదో!

ఏతాయి గిరిశుఁడో యేది శైలజయో నా ప్రమథులయ్యెడుశిలాప్రతతి యెదియొ
తాలతాలనుగల్గురమణీయదేవతాకృతిఁ జూచు బేసిక న్నెనకమెనగ
నాంధ్రరాజులమూర్తి నభినవోజ్జ్వలశైవరూపసంపద మనోరూఢిఁ దెలిసి
కాలుకన్నొమ్మఱగించి కాలాదికాబాధితానంత్యసంస్థితి నమరఁ జేసి
శివము సత్యమ్ము నౌవస్తుసిద్ధియందు-సుందరాత్మతగూర్చి తానందతుంది
లేందుధరచారుకోటీరహీరకళిక - నాట్యరసధుని పృథ్విపై నాట్యమాడ.

# వరూధిని

పుట్టపర్తి
నారాయణాచార్యులు

అన్యభాషలగతి యెట్లున్నను ఆంధ్రము యొక్క హానివృద్ధులకు రాజులప్రవృత్తియే ముఖ్యకారణము. మనదేశమున - అందును తెనుగునాట - రాజులు కవులను పోషించుట, వారితో గ్రంథములు వ్రాయించి కృతినందుట మొదలగునవి - వీడరాని ముఖ్యలాంఛనములుగ గ్రహించియుండిరి. ప్రబంధము వ్రాయింపని పాళెగాడు లేడు. కృతినందని కోశాధికారి లేడు. ప్రతియొకడును వంతోయింతో భాష నాదరించి తమకును కవు లున్నారనిపించిన వారే. కవులును కాలదేశపాత్రముల ననుసరించి అవసరమైనప్పుడు తక్కువ బేరములకే దిగినారు. నిండుసభలో స్వర్ణాభిషేకమునందిన కవిసార్వభౌముడగు శ్రీనాథుడే యొకమహాగ్రంథమును వాసనాద్రవ్యముల నోపను అవచి తిప్పయ్యశెట్టి కంటగట్టినాడట. ఇతరులనడుగ నక్కరయున్నదా? లోనికొసగు లెట్లున్నను రాజుల యౌదార్యము మాత్రము మెచ్చుకొనకతప్పదు.

ఆనాటిరాజులలో నెవరోతప్ప సామాన్యులందరును పదునుమరచిన దాసరయ్యలే. పుట్టుకనుండియే సుఖమొకటి వెంటబడి యుండుటచే కాలుసేతులుగదలింపలేని - కడకు త్రోవనుగూడ జూడలేని సోమరులైనారు. ఈ యరిష్టమున కింతమో యంతమో లొంగి నిలచినవారు యుద్ధభేరి మ్రోయించినారు. నిరంతరము వీడరాని సుఖపిపాస - లాలసత తప్ప మరేదియు రాజుల జీవితములలో నుండలేదు. విద్యాగంధము లేకుండుటచే నయము - నీతి లేనిభోగము పాత్రతలేని త్యాగము - వారి దైనికజీవితమున దప్పని ముప్పులు. ఇక నిట్టివారికి కవులు దొరకిన వారియవస్థల నేమనిచెప్పవలెను? కోతుల కద్దము దొరకినటువంటిదే: వారిని తమమనసునకు వచ్చినట్లు వినియోగింపసాగిరి. తాముంచుకొన్న సానిపై నొకగ్రంథము, తమపై నొక ప్రబంధము, వేయేల తమదగ్గు, తుమ్ము సర్వము కావ్యవస్తువులేయైనవి. మనకవులకు బత్తెమిచ్చువారు రాజులుగదా! వారియాజ్ఞ చొప్పున మెలగనిచో పొంతకుండలు పొర్లాడవలసినదే. కాన, వారుగూడ తమచిత్తవృత్తులేరీతియున్నను, "అన్యథాశరణం నాస్తి" యని పాలకులనే యనుసరించిరి. వారికినచ్చిన త్రోవనే వ్రాసి మెప్పింపసాగిరి. ఔచిత్యమున్నను, వలసబోయినను, రసమున్నను లేకున్నను, అష్టాదశవర్ణనలులేనిది కావ్యము గాదయ్యెను. నాగబాళి చుట్టుకొన్న పల్లెను వస్తువుగా దీసికొన్నను, అభేద్య ప్రాకారములు గట్టవలసినదే. కడకు కవిత్వమనగా కవిమనస్తత్వముతో సంబంధములేని రసము లేని మరియేవిధమైన సౌందర్యముగాని లేని యసహ్యపదార్థముగా దయారైనది. విజయనగర రాజ్యానంతరము దానికి బట్టిన యవస్థ మరింత దుర్భరమైనది.

అయిన రాజు లందరు నింతే యనియు, వారిదే తప్పంతయు ననుటయు పొరపాటు మహానుభావులగు రాజకవులు కవిరాజులైనారు. సర్వజ్ఞసింగమనాయుడు, కాకతీయులు, విజయనగరాధిపతులు మొదలగువా రుత్తమ విద్యావంతులే. రాయలు "సాహితీసమరాంగణ సార్వభౌము"డట. యుద్ధకాలముల యందును కవులను పల్లకీలలో నెక్కించి వెంట దీసికొనిపోయెడివాడు. తాను స్వయముగా కవి. అయిన రతిరంగములేని యంగడి కవి గాడుసుడీ! ఉభయభాషలయందు సమగ్రమైన పాండిత్యము చేతబట్టి వ్యక్తిత్వమును వెలిగించి తక్కినవారికన్న విలక్షణతను నిలుపుకొన్నమహనీయుడు అగుటచే రచనలోని పరమార్థమేమో, దానియున్న సాధకబాధకము లెట్టివో గురుతించినమనస్వి. తక్కిన రాజధర్మములయెడ నేరీతిప్రవర్తించినను వశ్యవాక్కులగు కవులకుమాత్రము మిత్రుడు దాసుడుగనే మెలగినాడు. రాయలకళాభిరుచి యంతులేనిది. ఒకనాడు విలాసార్థము రాయలు తాతగారి నొకపద్యము జెప్పుడని కోరిరట. పెద్దన్నయు ముసిముసినగవులతో కవిత్వమంత తేలికపదార్థమనుకొన్నావా! అనికసరిరట. వీరకేసరియగు "మూరురాయరగండడు" సంతోషముతో చీవాట్లను సహించి యథార్థకుండెనట. ఇట్టి ప్రభువు లభించుట మన పుణ్యమే. ఆతనియభిమానమే వరూధినికి పురుడుదీర్చిన దనవచ్చును.

నిజముగా నీకాలముననే పలనాటిచరిత వంటి, వీరగాథలు దండిగాబుట్టవలసి యుండెను. కాని మనవాఙ్మయమునకు శృంగార మొకటే వీడరానిచుట్టమైనది. అది వారి జీవితమాత్రముల ననుసరించి యుండు నేమోయని నాయనుమానము.

ఇక పెద్దనయందనా? స్వయముగనే సౌందర్యాభిలాషి. ఒకపెద్దనకే గాదు; సౌందర్యమును లోగుట మనుష్యుల - ముఖ్యముగ కళారాధకుల యాంతరికతత్త్వము. దీనికితోడు జీవితమును బాధాకలితముగాక సంఘము గూడ సుస్థిరమైయుండక ప్రసన్నమైయున్నచో మనసును శాంతిబొంది సృష్టిలోని సౌందర్యమునుబరీక్షించును; చూచియానందించును; లేనిచోట కృత్రిమముగా కల్పించియైనను జూడనాశించును. కాళిదాసురఘువంశమును జూడుడు. మహాకవి పాడుబడిన యయోధ్యను వర్ణించుచు పూర్వపువైభవముల స్మృతికి దప్పిపాకుతో వెనుకకుబోయి యెంచటనో దాగియున్న యభిసారికలను దోడ్తెచ్చినాడు. అజవిలాపమునందు చాతుర్యము తలమాపినది. "కవిజీవితమునకును కవిత్వమునకును సంబంధము లేదు. అదియొక నగిషీపని. కవిజీవితమెరిగినపిమ్మటనే కావ్యము బాగుగా నర్థమగునను నియమము లే"దని కొందరందురు.

నా కీవాదముపై సంపూర్తిగ నమ్మకము లేదు. మనస్తత్వమును దాచి కవిత్వమువల్లగల మహానుభావులను నేను జూడలేదు. జీవితముతో సంబంధములేని మనసుండునా? అటు వాదించువారియందును నా కీపద్ధతి దోచ లేదు. జీవితమున కవిత్వములేనిచో కావ్యముననే యుండదనుకొందును.

రాయలవంటి రసికశిరోమణి నాశ్రయించిన పెద్దనజీవితమున లోప ముండునా? అతడు సర్వము సానుకూలముగ నమరినమహో యదృష్టవంతుడు. ఒకరికై యేడ్పుటయు మరియొకరికై నవ్వుటయులేక, హృదయమును మాత్రమే నమ్మిన స్వతంత్రుడు. నిజముగా మనుచరిత్రములోని కొన్నికొన్ని సన్నివేశములు భావించినపుడు కవితా పితామహుని జీవిత మెంత లలితగంభీర మైనదో చూడలేక పోయితి మే యని కొంచెంతవిచారముగలుగును.

ఆంతరికమును, సహజ సౌందర్యాభిలాషను మెరుగిచ్చు జీవితమును సంపాదించుకొన్న "రేఖాశాలి" గనుకనే ప్రపంచమున సౌందర్యమునే భావించి శాంతిని బొందగలిగినాడు. జీవితములోని శాంతిసౌందర్యములు కావ్యమున కెక్కినవి. నిలుకడతో తీర్చినపాత్రలు ప్రభాత కాలమునందలి లేడీగొలకవలె తళతళ మెఱసి పోవుచున్నవి. కళయనునది రచయితకుగల హృదయపరిణతిని రసికతను వెల్లడించు సాధనముగాని పాండిత్యమును ప్రకటించి పాడు చేయదగిన దొరవుసొమ్ముగాదని గ్రహించిన విలాసియగుటచే బుద్ధిపూర్వకములగు దోషములతో కావ్యమును నింపలేదు. నన్నయలోనియావేశము, తిక్కనలోనియౌచితి, శ్రీనాథునిధారాశుద్ధి ముఖ్యముగా క్రియలసొంపు పెద్దనకవిత్వమునకు సాధనములు. ఈ కూడికచే కొన్ని విలక్షణగుణములను పెద్దనలో నుదురుకొన్నవి.

పితామహుడు తిక్కన నెంతజదివినను తనకుగల చాపల్యమును మాత్రము వీడలేక పోయినాడు. ఒకటి రెండు మూడు చోటులలో శృంగార మస్థానపతిత మైనదనియే చెప్ప వచ్చును. సాహితీప్రపంచమున రసములను బొమ్మలవలె పట్టిపట్టి సముచితముగ నడిపించు సూత్రధారవిద్య యెందరికో లేదు. కొందరికి పడకటింటికవిత్వపుపస ఖడ్గముల కిణకిణలలో నుండదు. ఖడ్గములలోని వెచ్చదనము కొందరికి కౌగిలింతలలో దొరకదు. నాకు జూడ నీ శక్తి సంపూర్ణముగా నొక కవిబ్రహ్మకే యబ్బినది. కాగా, మనము ప్రబంధముల విమర్శించునపు డీ "మార్జిను" కొంతవరకు విడువకతప్పదు. కొన్ని గ్రంథములలో యీ యస్థానపతితమగు శృంగారమును సముచితముగ లేదు. కేవలము బూతులు నిండినవి. అవియన్నియు వారిజీవితములోని యవకతవకలే. దానికి మనము నిందించిన లాభములేదు. ఒక శతాబ్దిలోని యభిరుచి మరియొకదాన లేదు. నన్నయ శృంగారములోని పవిత్రత, యుదాత్తత ప్రబంధములకు లేదు. తిక్కనలోని "సహజత" తరువాతివారికి సున్న. ఆంగ్లమున "పోపు" కవిత్వము నిపుడు ప్రేమించువా రెందరున్నారు? నన్నయవలెనే యించు మించు చిత్రముల సృజియించు "రాసిటీ" కవిత్వము నిపుడు చదువుదురా? మనదృష్టి మారినది. సూటిగా మన తత్త్వమును బట్టియీయగల సన్నివేశములు దప్ప తక్కినవి మన కిపు డంత కాబట్టుటలేదు. ప్రతియొకటియు నింతే. రేపిడియు మారునేమో, ఎవరు చెప్పవారు? మనమూ నెక్కసములగు పట్టులయందు వారిజీవితానుభవ మట్టిదని శాంతించుట మంచిది. "వినరయేచ్ఛ" యని పండ్లు నూరినచో మనకు బాధతప్ప చచ్చినవారికేసహాయమును లేదుగదా! అసలిందులో నంతయు మనదోషమేగాదు, మనచే ముప్పొద్దు ముడుపు లందుకొను దేవతలనుగ్రహించిన విద్యయే. కడుపుచింతలేని చిరంతనరసికులగుటచే పరదచాటును గూడ మాని తమరసికతను, చాపల్యమును తీర్చుకొనుటకై ప్రత్యేకముగ నొకజాతినే సృష్టించిరట. వారే మనము మాటిమాటికి విని వేసారిన యచ్చరలు. వారివి పదునాలుగువంశములట. అందులో బ్రహ్మ స్వయముగా చేతితో గాక మనసుతోడనే "దిద్దితీర్చిన" మానసికసృష్టియు నొకటి. ఎంతయమృతమైనను దినము నదేభోజనమైన నాలుక త్రుప్పువట్టదా? దానిని బాపుకొనుటకై విష్ణువు, మహేశ్వరుడు మొదలగుప్రముఖులందరు అప్పుడప్పుడు "డిన్నరుపార్టీలు" జేయుచుందురు. అట్టియెడల అల్పాహారానంతరము భరతశాస్త్రపుభంగిమలు వెలయించుట వీరి యుద్యోగము. ఇంతే గాక ఇంద్రుడు మొదలగువారు కోరినపుడు వారి రాణివాసములు పిలిపించినపుడు యీ నాగవాసములు పోయి "పాటకచ్చేరీలు" జేసి వత్తురట. ఇక వీరిదివనెచ్చములు భరించు సాహసికులెవరు? ఉపాయకుశలులగు దేవతల కీ మాత్రము తెలియకపోవునా? హయమేధములు, రాజసూయములు మొదలగు సవనతంత్రములను యినాము లుంచినారు. అవి పరంపరగావచ్చు హక్కులు, ఉపకారస్మరణము మరువలేనియచ్చరలు యజ్ఞయాగాదులు చేసినశ్రోత్రియులు, కాలాంతరమున తమ భూములకు వెళ్లినపుడు శక్తికొలది అతిథి సత్కారములు చేయుటాచారము.

స్వర్గలోకపు రాజకీయములందును వీరికి సంబంధము లేకపోలేదు. ఇంద్రునిస్థానము "పర్మనెంటు" కాదు. నూరుయజ్ఞము లాచరించినవా డంతయు దానికై యత్నింపవచ్చును. ఈ పేరాసగల ఋషులు ఒక్కొకసారి తొంబదితొమ్మిది యజ్ఞములను పట్టుదలతో ముగింతురు. అంతవరకు యింద్రుడుగూడ యుపేక్షతోడనో లేక సరిగా ప్రయత్నింపకనో యుండును. నూరవయజ్ఞము గళబద్ధమేగదా? అప్పు డీపేరు మోసిన నాయకురాండ్రు ఆటపాటలతో వారిని వలపించి ప్రయత్నమును మఱపించి యింద్రుని యాసనస్థైర్యమును నిలుపుదురట. వజ్రాయుధము మొక్కపోయినపుడు (సాధారణముగా నింద్రుని కట్టివే యొక్కవలెండు) యింద్రుడీయాయుధముల నుపయోగించి శత్రువుల సాధించును. కాంతల కడగంటి చూపునకు లొంగనిమగవా డెవడుండును? అంతేగాదు; "ఖులాసా"గా నున్నపు డింద్రుడుగూడ వీరిపై వలపుగలిగి కనుగిలుపుట వాడుక. శచీదేవి యెన్నిసారులు మూతిముడిచెనో పాపము! వీరిని స్వీకరించుటలో, నేమియు తరతమ భావము లేదు. స్వర్గమునందు కాలిడినవారికంతయు అప్సరసలపై నధికారమున్నది. అది నిజముగా తకరారులేని పనిగదా!

ఈ వంశములు నాటివి నేటివి గాదుసుడీ! వేదకాలమునుండి యుండనేయున్నవి. మన పురాణములలో సాధారణముగా రంభాదులు కాసెగట్టనిగాథలే యరుదు. ఎంతచిన్నరాజర్షియైనను ఒక్కరంభగాని హాజరై గజ్జె గదలించవలసినదే! లేకున్న మనకవులకు

కడుపే నింపదు. ఏచోట యుద్ధములు జరిగినను సైన్యములతోబాటు వీరును రావలెను. పాపము! కాచినకల్పవృక్షముల పూలన్నియు యోధులహారములకే ఖర్చయినయచ్చరలకో? ఆవిచారము మనవారి కంతగా బట్టలేదు కాబోలు! దేవతలకు, దేవతాసార్వభౌమునికి వీరంతమర్యాదగా జూపదగినవారైనను మన కావ్యవీధులలో మాత్రము చింతపండుకన్న నష్టవరైయేవారు.

పైజెప్పిన పదునాలుగు వంశములలో నెన్నియోతరములు గడచినవి. మనకు మిగిలినవి ముఖ్యులపకొన్ని పేరులే. ఈనాడెంద రున్నారో మనమెఱుగము. ప్రబంధకవులు పోయిననాటనుండి ఆజనాభాలు సరిగా తెలియుటలేదు. అది యట్లుండె.

వరూధిని యొకయచ్చర ముద్దరాలు. సరిగడవవెరిగిన గరగరని నెఱికురులు, తిమురుగొన్న పయోధరములు, సెలవిపారునవ్వులతో, చిన్నివెన్నెలలుగాయు మొగము, మంకెనపూవు వంటివాతెఱ ఆమె బ్రహ్మనడిగి సంపాదించిన వరములు. పైగా నావిడ "తిన్ననిమేను" నిగనిగనిచాయలతో "కాంచనకేతకీకుసుమము" వలెనుండెనట. సౌందర్యముతో తళతళలాడు నామెబాహ్యస్వరూపము, మానసికప్రవృత్తికి ప్రబలమగు పరిమితిని గలిగించినది.

ఈ నిత్యసువాసిని తలిదండ్రులపేరు చెప్పలేదు పెద్దన్న. తల్లి విషయ మెట్లున్నను తండ్రి మాట కొంతచిక్కేగదా! అందుకే యూసమస్య మెల్లగా జారవిడచి పాలసముద్రమున బుట్టిన వంశమని డొంకతిరుగుడుమాటతో తృప్తిబడినాడు. ఆ విచారము ఆతనికే యక్కరలేనిది మనకుమాత్రమేమి! ఎవరో యొకరుండురని శాంతింతము.

వరూధినినివాసము హిమాలయమునందు. ఒక వరూధినియేగాదు; రంభ మొదలగు "కామశాస్త్రోపాధ్యాయిను"లంద రక్కడనే వసించునది. తక్కినవారికి గృహము లుండెనో లేదో? ఉన్న నవియెట్టివో మనకు దెలియదు. మన నాయికకు మాత్రము చక్కనిభవనము గట్టినాడు పెద్దన. దానికిముందు ఆవరణము నందున్న ద్రాక్షపందిరియే గరుడపచ్చలు చెక్కినదట. ఇంటిచుట్టును చెంగలువలతో నిండియున్న కేదారములు, మావులుక్రోవులు, అల్లిబిల్లిగొన్న కాంతారము, హిమవంతమే తయారుచేసి యిచ్చినది. ఇక నామె వయసు మాటగదా? పాటమరించిన జవ్వన మింకను పూర్తిగా పక్వతకురాలేదు. "ఏకసెక్కెము లాడు రెలప్రాయమే" నయ-నాగరికములు గురుతించినది. వినయవిధేయత లలవరించుకొన్నది. వీటినడుమ నపుడపుడు చిన్నతనపుచెరలాటము సేసువ్వానవుచున్నది. చాతుర్యమును, పాండిత్యమును, అనుభవమును గల యచ్చరలసాహాయ్య మపేక్షింపక, నైజగతితోడనే తరిబీతై వారినందరినిగూడ వెనుకవేసినది. రంభాదులకును మనసులో భయము కద్దు. ఎన్నడో జవ్వన మమ్ముకొన్నవారు గదా! మెల్లమెల్లగా నేస్తమును బాటించినారు. కడకు పాపము—ప్రాణసఖులును నైనారు. ముసలిముఱిపెములతో తీరికగాయెనపుడెల్ల వరూధినిచుట్టును జేరి "నీకేమి యదృష్టవంతురాలి"వని యిచ్చకములాడుచుండిరేమో! లేకున్న గ్రాసవాసములకు ముప్పే. ఇప్పటికే యింద్రునిసభలకు, పిలుపువచ్చు మేళములలో వరూధినికే యగ్రతాంబూలము. ఇక మేనకాదుల ప్రాణవాట్యములకై మొగమువాచిన మగవాడెవ డుండును?

వరూధినితోడివారందరు సంగీతము నేర్చినవారే. చెలువ మెరిగినసానివారింటి కంటివచ్చినవిద్యగదా! అయినను, వారికిని వరూధినికి నొకభేదముమాత్రము గలదు. వృత్తికై కళను సాధించినవారు వారు. ఉత్సవసమయములలో దర్బారువకు వెళ్లుటకుమునుపు దుమ్ముకులిపి నాలుగుపాటలు తంత్రులు మీటికార్యమాయె ననిపించుట వారిపని. మన వరూధినీవ్యాసంగ మందమా! అది బ్రదుకునకే యేర్పడినది గాదు; స్వీయానందమునకే, పరమగమ్యముగా నుంచుకొని, నేర్చుకొన్నది. లౌకికమగు ఫలాపేక్షయు, పరాపేక్షయు లేకుండుటచే కళ పరాకాష్ఠ నందినది. రాగమున ప్రాణముగల పట్టులువెదకి "యింపుదళుకొత్త" వీణె వాయింపగలదు. ఆ తంత్రీధ్వనియందు మిళితమై పిల్లగాలివలె నిలుకడతో వెడలు నామె గానమునకు, రాలు గరగి పారెడివట. ఉత్తి వ్యాసంగమేనా? కాదు పాండిత్యమును గడించుకొన్నది. మెడపట్ల పాండిత్యము మాత్రము గాక రసస్వరూపమెరిగి, రసానుభూతికై యత్నించి సంపూర్ణముగ ననుభవించినది. ఆ యింతచాపల్యము లేకయున్నచో ప్రపంచమంతయు చేతులు జోడించియే యుండును! జై జెప్పినవారిలో నొకరును గిరికవలె "పటుశాస్త్ర శ్రేణికాభ్యాసము" చేయనేలేదు.

మొదటనే స్త్రీహృదయము; అందునను ఆయువుపట్టులు వెదకి, యుపాసించు సంగీతపు సహవాసము. వీటితో, నామెమనసు, వెన్నవలె నయినది. నిజముగా విచారించినచో సంగీతము కళలకల్ల రాణివంటిది. చిత్రమునందు వస్తువుయొక్క చంచల ప్రవృత్తులు క్షణికములగు భావములు వరుసగా స్ఫురింపని కొరతయున్నది. కవిత్వమున నీరెండును బాగుగా జూపవచ్చును. కావన కవిత్వముత్తమ మని విమర్శకు లన్నారు. ఇది సత్యమే. కాని కవిత్వమునకన్న నెన్నో రెట్లధికమగు, భావగభీరత సంగీతమునం దిమిడియున్నది. దానియందున్న వివిధ భావసమావేశమును గభీరమగుభావశబలతను, గ్రహించుటకు మనసు గావలెనంతే. ఒకమహానుభావులు సంగీతము కేవలము శ్రవణానందదాయకమేనన్నారు. సరసకవిత్వముమాత్రము సర్వాంగములకును "కుత్తుకబంటి" యగునానందము నిచ్చునట. కవిత్వము నెవరైనను కన్నులతో విందురేమో నాకు దెలియదు. బ్రహ్మ మన యభాగ్యవశమున యేపాములజాతికో తప్ప యీ యర్థశాస్త్ర నియమమును, మనయందు బాటించలేదు. ఇట్టి విపరీతములగు తలపులకు చోటిచ్చుట దానియస్పష్టతలో నున్న దోషమే.

కళామాత్రమునకే శాంతిపరమసాధనమను చుండ సర్వోత్తమమగు సంగీతమున కడుగవలెనా? శాంతియనగా చచ్చుపెద్దమ్మవలె మూలగూర్చుండి మూలుగుటగాదు. గంతులతో కార్యము జరుగదని యెరిగి ప్రసన్నతతో సాధించుటయే దానిపరమగమ్యము. భగవంతుడగు రాజశేఖరుడన్నట్లు సమాధి అనగా నిలు

కడ, శాంతి పర్యాయము గావచ్చును. "దిద్ది తీర్చుటయే" పరమావధి కాదు. మఱి సర్వ గుణములతో సమగ్రముగ సాధించుట. ఈక్రింది రాజశేఖరుని పలుకులు చూడుడు- "కావ్యకర్మణి పరం హేతు స్సమాధిః. సమాధి ర్నామ మనస ఏకాగ్రతా!"

బీభత్సము మొదలగు ఘట్టములయందును సౌందర్యము లేకపోలేదు. సౌందర్యము లేనివస్తువు కళానుభూతికి, ఆనందమునకు పరికరమే గాలేదు. సాధకు డెన్ని పాటులుపడినను కళను పొందదగు - పొందుట పరమావధి యియ్యదియే. తీక్ష్ణదృష్టియు మననయు ముదురు కొలది విషయకర్కశతయు గభీరతయు నదుకుట పరమసత్యము. మన ప్రాచీను లీ రెంటి తత్త్వముల బాగుగా నెఱిగినవారు. విషయమునకే ప్రధానత, గభీరతయున్నచోట ఋషిత్వ మనిరి. సత్యము నానుషంగికముగా సౌందర్యమును ముఖ్యముగా సేవించువారినే కవులనిరి మొదటితరగతి కుపనిషత్తులను జూపి, రెండవ శాఖకు రామాయణాది కావ్యప్రపంచముల నేరుకొనిరి.

అవునుగాని, యీ విరుద్ధపరిస్థితుల కర్థమేమి? నాకు దోచిన దొకటి- భౌతికములగు వాసనలు వీడనివానికి సౌందర్యపక్షపాతిత్వము మఱువరానిది, వీడరానిది. అతని ప్రవృత్తినివృత్తు లారీతి నెందుకు మారినవి? యను ప్రశ్న యనుభవము చాలనిదుడుకుతనము. ఒకకళకుతోడు మఱియొకటి భౌతికముతో, నికను కొంతసమీపసంబంధముగలది, "రొంసగూడెనా" యిక నడుగ నక్కఱయే లేదు.

కాగా వరూథిని చిననాటనుండియు సంగీతమేగాక కామశాస్త్రాభ్యాసములను గూడ గావించినది. దానియందును గూడ చెదరని యాత్మశక్తియే యున్నచో పారమార్థికతనే సాధింపవచ్చును. కాని వరూథినిలేతమనసంతటి కర్కశవిచారములకు తాళలేదు, ప్రయత్నింపను లేదు. సైజముగా మనసుబోవు పద్ధతిని బోవనిచ్చుటయేకాని యదికట్టి నిగ్రహించుటామె రెఱుగదు. తనకన్నులయెదుట గనుపించు సౌందర్యమును చూచి యానందించి దానిశక్తికి లోనుటయే యామె నేర్చినది. చూచినమాత్రమే సంతోషించు యుత్తమసిద్ధాంతమును గూడ నామె యాచరణయందుంచలేదు. దాని ననుభవించి తృప్తిపడవలెనను సామాన్యదృష్టియు నందులో దాగియున్నది. మన మామెనుండి యంతగొప్ప సిద్ధాంతము నభిలషించుట నాకు జూడ వెఱ్ఱియే. మునికొనివచ్చు తొలిప్రాయమున తానునివసించు సౌందర్యసీమలో, ఆ సంఘములో, అట్టి మనఃపరిణతి కవకాశమే లేదు. ప్రతిజీవిపైనను అంతో యింతో అధికారము నెఱపుట పరిసరముల స్వభావమునగదా!

సౌందర్యమును భావించుటయం దామెకు సంపూర్ణమగు నధికారమున్నది. అనుభవముచే తొలినాపునందే హెచ్చుతగ్గులు మంచిచెడ్డలు నేర్పరించు పదునుగల దృష్టిని సంపాదించుకొన్నది. నిరంతరము సౌందర్యమోయని లేకారినది. మంచుకురియు ప్రదేశములలో రాత్రింబవళ్లు ఊపిరిబిగించి తీరనిపూనికతో తపము సాధించు తరుణతాపసులను గాంచి యయ్యో యెంత బ్రాయమే! ఉపభోగార్హమగు దీనిని వైదిక కృత్యములలో వలిపివేయుచున్నారే! కడుపునిండ నారగించి కంటినిండ నిద్రింపరాదా! సుఖముగ భోగింపరాదా! సౌఖ్యములపై ఇంతపగ యెందులకని కరుణావిలులితయై కంట తడి పెట్టుచున్నది. ప్రవరు డెదురుపడినపుడును "పాపము! బ్రాహ్మణుడే! ఆకలిదప్పుల గతి యేమో? యని" సనవుటకు ముందే "కుందనము వంటి మేను మధ్యాందినాతపోష్మగతి గందనేయనియే కుందుచున్నది.

కాంతవరకు కళయొక్క పరమార్థమును దఱిది పక్వమగు హృదయము గలదిగనుకనే యొంతకన్నను తెగింపలేదు. "పూతపపిడి వంటి వలపుందులకించు" సానికులమున బుట్టినను "పవిత్రత" యనుధర్మము కొద్దియో గొప్పో యుంచనేయున్నది. వయానా నాణెముల నెఱిగినను విడ్డూరములు నేర్వలేదు. శకుంతల కన్నను నొక్కయా కొక్కువజదివినది. 'జాలి; యట్టు'వంటి నిగ్రహమును సమకూర్చుకొన్నది ఒకరాయి యొక్కువన్నను పొరబాటుగాదు. కలభాషిణివంటి జాణ గాదు. మహాకవి "మిరాండా" వంటి చక్కిలిగింతలైన నెఱుగనిచేల గాదు. అన్ని రీతుల చక్కని జే. కాని యాపుప్పునకు తోడిమయందే తెవులున్నది. తనకులము, తనమనసు, తనవలపు పరస్పర విరుద్ధములగు సన్నివేశములలో నుండుటచే జీవితకావ్యము రక్తికట్టలేదు.

ఇక నామె దైనిక జీవితమును గురించి విచారింతము. వరూథినియొక్క దినచర్యను స్పష్టముగా విప్పిచెప్పలేదు పెద్దన్న. అయినను వర్ణనాసన్నివేశములబట్టి మనకు సాధ్యమయినంత యూహింతము. తెల్లవారుటతోడనే యాకాశగంగయొక్క నీటి తుంపురులచే చల్లగా స్వాగతమొసగు మారుతములలో రమణీయముగా ప్రొద్దెక్కు కాంతారముల యందు 'షికారు' వెళ్లుట మొదటిపని. వనవిహారములు ముగిసిన తరువాత చెలులును తానును జలకేళీలాల సలై సరస్సులయందోలలాడుదురు. స్నానానంతర మందరును తమతమ యిండ్లకు బోవుదురుగదా! అప్పటినుండియు వరూథినికి కళాభ్యాసమే కాలమును మారినట్లుంతయు తంత్రులను భిన్నభిన్నగతులతో మేళవించి తత్తదనుకూలములను రాగముల నాలపించుచుండెడిది. హిమశైలమునందు వేసవికి గలిగినపుడు మేరుపర్వతములోని కల్పవృక్షముల నీడల క్రింద రచ్చపట్టులలో నందరు కొలువై, వినోదములు ముచ్చటించుకొనుట వాడుక.

వరూథిని సానివాడలలో జేరినపడుచైనను తక్కినవారివలె వలపుబట్టినయెడ వచ్చినవానితో విహరించి సాగనంపునదిగాదని ముందే విన్నవించితినిగదా! వయసా నవోద్భిన్నము; కాపురమున్నది! ప్రకృతిసౌందర్యము తూగియాడు హిమగిరిప్రాంతము. భోగములా! హాయి! హాయి! మనసువకుగూడ నూహించుకొనరానివి. ఆమె వాడుసామానులు సంపూర్ణముగా మనకు దెలియవుగాని యమలేపన ద్రవ్యములుమాత్రము వివరించినాడు చూడుడు:

సీ. "సద్యోవినిర్భిన్న సారంగనాభికా
ప్యాతమైపిసాళించుమృగమదంబు,

కసటుకో బీరెండగరగి కస్రెలసంటి
గమగమవలచు చొక్కపుజవాజి,
పారలెత్తి ఘనసారతరువుల తనుదాన
దొరగినపచ్చ కప్పురపుసిరము
గొజ్జంగిపూపొదల్గురియంగ పటికంపు
దోనల నిండినయట్టిశుచిజలము."
(౨-౫౮.)

ఎవరికున్న దీభోగము? ఇట్టి యపురూపమగు జీవితమును భావోద్వేజకతకు ప్రోదిగూర్చు సన్నివేశములును గలిగి యామె వేసారి నిల్చినదిగదా! ఎందులకు? స్వర్గమున నెవరును మేలురకపుచీటులు లేరా? "జయంత వసంతకంతులు" నిరంతరము సంధ్యవేళల సానిపిండ్లల తిరుగుచుండువారే! మేలేర్చి కోరుకొనరాదా యొకరిని? ఇంద్రసభలకు నాట్యములకై వెళ్లినపుడెంతమంది, కొంగుతాకుటకై యూసించియుండెరు? మనవంటి కుక్షింభరులకు తీరికలేదుగాని అమృతపానమున చియ్యబట్టి తీరికగాగూర్చున్న వారికేమి! నిరంతరమీ విచారములేగదా! అసలింద్రునికే కన్నుగీటినచో ఆ సహస్రనేత్రములు సంపాదించుకొన్న రసికాగ్రణికి మాత్రము చాపల్యము తక్కువా? దైవయోగమున వశుడైనచో తన యదృష్టమునకు మితియేలేదు గదా? ఇవి సామాన్యులను వారి కూశలు. వరూధినివంటి కళామూర్తికివి నచ్చునా? ఆమె 'యలేఖ్యతనూవిలాసుని' వలచినది. "ఉదుటుచూపులుగల జేవనిటుడు నచ్చ డావగపుకు." మరి "తారుణ్య మాగ్ధ్యములు"గల దిక్కనివరుడు గావలెను. ఆమెది ఆదర్శము లేని యవనపు బ్రతుకు గాదు. కళామర్మములు క్రొత్తగా వల్లెవేసినది. తన పచ్చిపాండిత్యమును వెల్లడించుకోరిక యున్నది. దానికై యెదురు చూచుచున్నది. ఆమనోరథము యౌవనకృతమగు మాంద్యమునుగూడ మఱపించునంత తీవ్రమై యుండినది. మునుపు స్వచ్ఛందవృత్తి గలవిలాసి రసికుడగుగంధర్వుడామెను కామించినాడట! తనవిదగ్ధతను జూచి వరూధిని తప్పక ప్రేమించునని గంపెడాసతో వచ్చినాడు. కాని యామె చలించలేదు. వారిరువురికి సంబంధము మనసులు హత్తలేదు. రూపగర్వితుడగువాడు ఒక్క మొగముతో వెనుకకు పోగినాడు. అందచందములతో బాటు అత్యంత రమణీయముగ గుణసౌరభములు వాసించు ముద్దరాలు. ఆత్మశక్తి లేదనరాదు; అపరిణతము. దానికి కళయే కారణము. ఆమె సర్వవిధముల సమ్మానింప దగినదే కాని జీవితమున లోకచుక్క బుట్టినది.

మనుచరిత్రమున నీకథకు ప్రాధాన్యము లేదు. రెండాశ్వాసములే వరూధినియొక్క వృత్తాంతమున గూడినవి. చాలమంది పండితులు పితామహుని కీదోష మంటగట్టిరే యున్నారు. "ఇది పురాణముగాదు. కావ్యము, వరూధినీజీవితము కడపటివరకనువర్తింపనిచో, నైక్యము చెడును." పూర్వపక్షము సరియేగాని యీ గ్రంథమున వాదోష మంత పెద్దదియై యుద్వేగమును గలిగింపదని నా మనవి. కొలతబద్దలతో, కావ్యములగొలుచు బుద్ధిమంతులకు జెప్పలేముగాని యుభయమెరిగినరసజ్ఞులకు దోచుభావ మింతే. లక్షణకారులును తూ-చా-దప్పక, నియమముల బాటించియేతీరవలెనని ముద్రవేయలేదు. భగవంతుడగు రాజశేఖరుడు "లక్షైకతోప్యాః పండితంమన్యాః" అని సెలవిచ్చినాడు. ఈ కథగూడ స్వరోచిజన్మవృత్తాంతమును దెలుపుటకు వచ్చినది. స్వరోచిజన్మానంతరమే ప్రారంభింపగూడదా యన్నచో నపుడింత కంటె చక్కని కవిగ్రంథమునకన్న పాఠకు డూహింపవలిసిన దక్కువగానుండును. వసుచరిత్రము, శృంగారనైషధము మొదలగునాటి కథ వేరు. దీనికిని తక్కిన గ్రంథములకును కవిదృష్టియందును ఫలమునందునుగూడ బ్రహ్మాండమంతభేద మున్నది. ఆ యుపాఖ్యానమే కావ్యయోగ్యము గాదన్నచో నట్టివారికి మనము చెప్పగలసినదియేలేదు. దోషలేశమున్న దానినెల్ల విడుచుచు బోయిన కడకు మనకు మిగులునది పూర్ణానుస్వారమే. అట్టి మడిగట్టుకొన్న మహానుభావులు దోషభూయిష్ఠమగు నీప్రపంచమునుండి సెలవుతీసికొనుట తంటాలేనిపని.

పారిజాతాపహరణమునందువలె ప్రథమాశ్వాసముననే వరూధినిని ప్రవేశపెట్టుటకు వీలులేదు. దానిలో నాతని సాంసారిక పరిస్థితులు దైనికజీవితమును దెలుపకున్నచో ప్రవరునిధర్మనైష్ఠికత మనకు బాగుగా బోధపడదు. పెద్దన సిద్ధాగమనమును పెంచలేదు. విప్రునిధర్మనైష్ఠికతను, సూచించునంగముగా నది సంకుచితముగాక విస్తృతముగాక, మట్టసముగా నున్నది. కనుక మనము ప్రథమాశ్వాసముననే ప్రవేశపెట్టియుండిన దృశ్యకావ్యములతీరును సాధించియుండుసేయని నిట్టూర్చిన లాభము లేదు. ప్రవేశించినది ప్రవరుడు గదా! మొదటనే శృంగారపు త్రోవబట్టించిన చెదరునదికాబోలు, తొలుత భగీరథుని తపోవనము, గంగాతీరణస్థలము, తరువాత లోకమాతయగు భవానీదేవి యుపసోపములు చూపి క్రమముగా 'గ్రేడు' దించినాడు. ప్రవరునిచే, తనివిదీర, పొగడించి చూచినదానధన్యుడనైతి ననిపించినాడు. ఆసందడిలో పాదలేపము కరగించి పైకి బడమన్నాడు. వరూధినియొక్క రంగస్థలమున జవనికానిర్దేశ మెంత హాయిగానున్నదో సహృదయులతలపు దాకక పోదు. తిన్నగా చూతము రండు:

సీ. కులిశధారాహతి పొలుపున భైనుండి
యడుగు మోవగ జేగురైన తటుల,
గనుపట్టులోయ గంగా నిర్ఝరముదార
జలువయౌ నయ్యొటికలకులందు
నిసుకపట్టినచేల నెదిగి యక్కాంచుల
జొరసీక దట్టమై యిరులు గవియ
క్రముకపున్నాగ నారంగరంభావాళి
కేరాదివిటపికాంతారవీథి
గీ. గరలుపిక శారికాకీర కేకిభృంగ
సారసధ్వని దనలోని చంద్రకాంత
దరులు ప్రతిశబ్దమీన గంధర్వయక్ష
గానఘూర్ణితమును నొక్క కోన గనియె."

సందర్భమున కనుకూలమగుభంగి రమ్యముగా జిత్రించినాడు. సర్వసంపూర్ణమగు సౌందర్యముతో వస్తుఫలకన్నుల యెదుట గోచరించుచున్నది. మొదటిపాదమున ఉపమానమును కమగలిగి చూచినచో సౌందర్యపిపాస యందు దానిని కడముట్ట పాఠకుని కందించు పరిశ్రమయందు అతనియాశ యెంతటిదో తెలియరాగలదు. నన్నయ ప్రారంభించిన

బాహ్యవర్ణన ప్రేమునితో పెక్కుపమై తిక్కనతో పుట్టపముగా కళామర్మ ములు నేర్చి శ్రీనాథునియందు తూగి పితా మహునియందు చల్లగా బండినది. "గంధర్వ యక్షగాన ఘూర్ణిత"మని సృష్టించిన చిత్రము నకు ప్రాణప్రతిష్ఠ గావించినాడు. మునియా శ్రమమును భ్రాంతిని గలిగించి యందలి వివిక్త శాంతిని దెలిపి చెదరనిలావణ్య మొసగినాడు.

పురాతన కాలమునుండియు ప్రకృతివర్ణ నమున మనకవు లనుసరించిన పద్ధతులు రెండు గలవు. రంగమున బ్రవేశించుపాత్రల యాంత రిక మనఃప్రవృత్తి కనుకూలమగునట్లు పరిసర ముల వర్ణించుట మొదటిది. రెండవది పాత్రల మన స్తత్వమునకు, అనగా తత్కాల పరిస్థితికి విరుద్ధముగు వడువున నిర్దేశించుట! జాగ్రత్తగా బరీక్షించినచో వేదములనుండియు వీటి కుదా హరణము లివ్వవచ్చును. గీర్వాణమున మన మెఱిగినంతవరకు మొదటివాడగు భాసుని యందు నీ యలవాటు గలదు. అతనినుండి కాళిదాసు సంగ్రహించెను. కాళిదాసు సాధా రణముగా మొదటిమార్గమునే యనుసరించుట వాడుక. అత డనుసరించినాడన్నచో వాఙ్మ యమున నామార్గమే విరివియనుట చెప్పకయే చెప్పినట్లగును. వాల్మీకి పంపావర్ణనమున రెండవదారినే ద్రొక్కెను. వ్యాసవాఙ్మయ మున నీవిధ మెక్కుడు. భవభూతి వ్యాసభగ వానునిమార్గములోనివా డనుటకు సంశయమే లేదు.

రెంటియందును సాధకబాధకములు లేక పోలేదు. పాత్రలపరిస్థితి కనుకూలములగు పరిస రములు, పరికరములు గలచోట సామాజికులు త్వరితముగా లయింతురు. అపుడు కవిపని యు సుఖకరము, మెప్పును సులభము. రెండవ పద్ధతి నీటి కెదురీదుట వంటిది. ప్రకృతి యందుగల విరుద్ధపరిస్థితులలో పాత్రప్రవేశించి నపుడు రెంటివడుమగల వైరుధ్యము దానిచే పరభాగత మనకు స్ఫుటముగా గోచరించును. తన్మూలమున రంగముననున్న పాత్రలకు సం బంధించిన హృదయావేదన మొదలగుభావ ములు చక్కగా మనసునకు బట్టును. మొ దటిమార్గమునయందు శాంతియు, రెండవదాన ఆకులతయు వీడరానివి. స్థలభేదములను, వ్యక్తి భేదములను అనుసరించి కూచి యుపయోగిం చినచో రెండును సామాజికుల, లేక పఠితల హృదయముపై తీవ్రముగ పనిచేయగలవు. మనవాఙ్మయమునను, కొంతవరకు గీర్వాణ మునను నీరెంటి నుపయోగించుటయం దోర్వ రాని, యవకతవకలు లేకపోలేదు. అల్లసాని పెద్దన కాళిదాసనుసరించిన త్రోలుతటికీతి నిందు సక్రమముగ దూచి యుపయోగించి నాడు. ఆవస్తుసౌందర్యము ప్రవరునేగాక ప్రపంచమునంతయు గట్టివేయజాలి యున్నది.

జవనికానిర్దేశమైన తరువాత నారంగమున వాడదగువిస్తువుల జూపుచున్నాడు. మణి మయమగు సంగణము, తరుణసహకారము, దానినీడయందొకవితర్దిక, శీతలానిలము మొద లగునవి. ఇక తిన్నగా వరూధినికై తెర నెత్తి నాడు. అల్లనసోకిపోవు మారుతాంకురము లలో వీణియమెట్లపై వ్రేళ్లు గదలించుచు గూర్చున్నది సమస్తమును ప్రకృతియు నామె గానబ్రహ్మమున లీనమైయున్నది. అప్పటి వరూధినిపరిస్థితిని కవియీరీతి వర్ణించినాడు.

సీ. తతనితంబాభోగనవళాంశుకములోని

యంగదట్టపుకావిరంగువలన

శశికాంతమణిపీఠి జాజువారగ కాయ

లుత్తుంగకుచహాళి నత్తమిల్ల

తరుణాంగుళీధూత తంత్రీస్వనంబుతో

జిలిబిలిపాట ముద్దులు ఘటింప

నాలాపగతి సొక్కియరమోడ్పుగనుదోయి

రతిపారవశ్యవిభ్రమము దెలుప

గీ. ప్రౌఢి బలికించుగీతప్రబంధములకు

క్రమకరపంకరుహరత్నకటక ఝణఝ

ణధ్వనిస్ఫూర్తి తాళమానములు గొలుప

నింపు దళుకొత్త వీణె వాయింపుచుండి.

(౨-౨౮)

నాకు దెలిసినంతవరకు తిక్కనను నూర న్నను విడిచి యిట్టి సుకుమారపద్య మింకొకటి భాషలో లేదు. తతనితంబము ఉత్తుంగకుచ హాళి తరుణాంగుళి యను పదములయందు నవోద్భిన్నమగు యౌవనము ధ్వనించుచున్నది. "జిలిబిలి" పాటలో యౌవనకృతమగు మాం ద్యము ఒయ్యారము నున్నది. ఆలాపమును గావించునపుడు సొక్కిన యరమూత గనులు రతిపారవశ్య విభ్రమమును దెలిపినవట. భళిరా! ఆస్థాయిని, ప్రకృతమున కంటియంటక, సెంత సున్నితముగా బలికించినాడు; ఆ యుప మానము అర్థపుష్టిచే మదించి రమణీయమగు తావి పుక్కిటబట్టిన యేజాపులరటిబాలెంత రాలివలె నున్నది. "ఇంపుదళుకొత్త"ననుటలో నా మెసరసహృదయ మున్నది. ఇచటి "ప్రౌఢి" యనుపదమునకు రసోన్ముఖతయని వ్యాఖ్యానమేమో! తత్కాల మనఃప్రవృత్తి కనుగుణముగ బాహ్య స్వరూపమును జిత్రిం చిన పెద్దన, తిక్కన కెంతటి దగ్గరిశిష్యుడో మనము గ్రహింపవచ్చును. అయిన నొక కొరత. మొదటి పాదములోని తీక్ష్ణదృష్టి రెండవదాన లేదు. అది కేవలము పూరణార్థ మతికించిన ట్లున్నది. నాలుగవ పాదములోని రసాభివ్యంజకత చేనికిని లేదు. భావమును క్రమక్రమముగా పెంచుకొనిపోవు పద్ధతి యందేలనో కొంచెముగా పొరపడినాడు పెద్దన. ధ్వనికారుఁడు "వాచ్యవాచకలక్షణ మాత్రకృత శ్రమాణాం కావ్యతత్త్వార్థ భావనా విముఖానాం స్వరశ్రుత్యాది లక్షణ మివ ప్రగీతానాం గాంధర్వలక్షణ విదామ గోచర యేవాసౌశబ్దః" అన్ననిజము నూ హించికొబోలు ధ్వనిమాధులగు ఛాందసు లకై తానన్నదాని కిగతివ్యాఖ్యానము గల్పిం చినాడు.

"వివిధవిబుధ తరుజనిత మధురమధురసం బానుసదటునన్, జిదిమిన నెరుంగక మదవ హరునైన జదురునన్ గదియగమకించుతివు రునన్ గొమిరెప్రాయంపు మదంబున నవన్య సామాన్యలావణ్యరేఖామదంబునను"

పై పద్యమున ధ్వనిగా గోచరించిన యౌ వన మిందు వాచ్యముగా స్పష్టముగానున్నది.

అందరికన్నను పెద్దనయందు వృత్తవిన్యా సము గొప్పప్రతిభ. ఏ సందర్భమున నేపద్య మును వాడిన వృత్తనియమమున గుదిరినపద ములు శ్రవణమాత్రముననే సౌందర్యము నింపు నని చక్కగా గురుతించినవాఁడు. మచ్చునకు రెండుమాత్రము గానుపింతును.

శా. తావుల్ గ్రోవల జల్లుచెంగలువతే
 దారంబుతీరంబునన్
మావుల్ గ్రోవులు వల్లిబిల్లిగొను కాం
 తారంబునన్ గైందవ
గ్రావాకల్పితకాయమానజటిల
 ద్రాక్షాసుగుచ్ఛంబులన్
పూవుల్ దీవెలనొప్పు నొక్కభవనం
 బున్ గాంచెసోత్కర్ణముల్.

పై పద్యము రెండవయాశ్వాసములోనిది. ప్రవరుడు వరూధినియొక్క భవనమును జూచినసందర్భమున నున్నది. శార్దూలమున యన్నివృత్తములకన్నను సుగుణులెక్కువ. బాగుగా చేతులుజాచి చెప్పుటకు పనికివచ్చుపద్ధతి దానిపుట్టుకతోనే గలదు. ఇచటి యీపద్యముచే వరూధినియొక్క భవనవైశాల్యము మొదలగునవి రేఖామాత్రములుగా సూచితములని చెప్పినచో నవ్వరనుకొందును. పైగా ననుప్రాసములచే బిగింపబడి, కాసెగట్టి నాట్యమునకు నిలిచినయొయ్యారివలె నున్నది. అనుప్రాసములు బలవంతముగాగాక సైజగతితో ప్రవహించినవగుటచే మరింతసుందరములుగా నున్నవి. అదిగో పై పద్యమునవే నాట్యము-

క. మృగమదసౌరభవిభవ
 ద్విగుణితఘనసారసాంద్ర వీటీగంధ
 స్థగితేతరపరిమళమై
మగువపొలుపుదెలుపునొక్క మారుతమొలసెన్

ఈ పద్యముయొక్క గురులఘుస్వరూపములలో నొకసమగ్రమై స్పష్టమగు లయ పాటింపబడినది. కడపటిపాదము ముక్తాయింపిచ్చి ముగించుచున్నది. మరల పల్లవినెత్తినాడు కథకు దిగి.

వృత్తవిన్యాసమున భావమున్నదనుటపిచ్చి యందురేమో! ఈవిషయమున నాకన్న పిచ్చివారు మహనీయులగు విశ్వనాథకవిరాజుగారు. వారింతకుమును నొకచోట మన చరిత్రకారుని వృత్తవిన్యాసమును మాత్రమే గురించి విపులముగ జర్చించియున్నారు. మాయిరువురికన్న క్షేమేంద్రుడు మొదటి పిచ్చివాడు. అతడు ప్రతియొక వృత్తమును విషయవిభాగముతోగూడ నిర్ణయించియున్నాడు.

ఇక ప్రవరునిసంగతి విచారింతము. పర్వతభూములన్నియు ప్రసిద్ధములైనవి దిలకించినాడు. నెత్తిపైప్రొద్దు. ఎండలు తీవ్రములైనవి. ఆకలి ప్రొద్దయినదిగాబోలు మెల్లగా మన యింటిదారి కీడ్చినది. ఎగురబోయినాడు. కాని పాదలేపమేదీ? ఎన్నడో యారిపోయినది. మట్టిదూచినాడు తడిగూడ లేదు. "గిరికటకగుహావిహారమతి" యగువిప్రుని కున్నయుత్సాహమంతయు మాయమైనది. పాపమాతని కిపుడు హిమగిరిమాహాత్మ్యములు శచీదేవియు నింద్రుడు జలకములాడినప్పటి యుల్లాసములు స్ఫురించుటలేదు. మరి "వేదండవరాహవాహారిపుఖడ్గవ్యాఘ్రఘమే" యని భయపడుచున్నాడు. దైవమా! యిచటినుండి బ్రదుకుజీవుడాయని బైటబడిన జాలునని దిక్కులు చూచుచున్నాడు. పోనీ ఒకవేళ తానెవరో మరియొకసిద్ధుని యనుగ్రహముచే నిచటనే సుఖముగా జీవించవనుకొందము. అపారమగు పుత్రప్రేమతో కరగిపోవు "దేవియుందేవరవోలు" ముసలి తలిదండ్రులగతి? "తోడునీడలై" నెన్నంటి క్రీడించుచుండు సచ్ఛాత్రుల యవస్థ? వీటికన్నిటికన్న ముఖ్యములగు నిత్యకృత్యములు? చింతాసాగరమున బడినాడు. ఆకులతచే కమలినమొగముతో నెవడురా, నన్నీకష్టమునుండి గట్టెక్కించు మహాపురుషుడని యా "మిన్నులు బడ్డచోట" వెదకుచు వచ్చుచున్నాడు.

హఠాత్తుగ నాతని కీకోన కంటబడినది. అలతియలతి మలిపులతో ప్రక్కన నొకసెలయేరు మలకలై దిగుచున్నది. దాని కిరువైపులను మల్లికలుపూచి పుష్పించియున్నవి. వెంటనే యందలిసాత్వికత దానితోబాటున్న శాంతి, యతని కర్థమైనది. పేదకు పెన్నిధి దొరకినదని సంతసించినాడు. అచటి కరిగిన తనకు మోక్షము గలుగునను తహతహయెక్కువైనది. "బ్రదుకురా బడజీవుడా" యని మల్లికల యూతతో ప్రవాహమున కెదురెక్కినడచినాడు. ఎదుట నొకకేదారము, ద్రాక్షపందిరి, గరుడపచ్చలచే జెక్కబడిన కుడ్యములతో నిగనిగలాడుచుండు భవనము కంటబడినది. వరూధినిగారి కాయింటికై ఖర్చెంతయ్యెనో యెవరిచ్చిరో, పాపము మనకవులు ధర్మాత్ములు. శర్మగారన్నట్లు యింటపెండ్లాముముక్కరకు ముత్తెము లేకున్నను ముంగిళులమాత్రము ముత్యాల ముగ్గులు బెట్టుకురట. ఎంత సంపన్నగృహస్థుడైనను, ప్రవరుడు రాసులురాసులుగా రత్నముల నిచటను జూచియుండడుగదా! ధర్మకాలపువాడు గనుక వెంటనే "ఉదంచితసౌభాగ్యగరిమ కచ్చెరువడి" నాడు. ఇంతలో మృగమదము ఘనసారము మొదలగువాసనాద్రవ్యములతో సురభితమగు చల్లనిగాలి యెదురువచ్చినది. బ్రాహ్మణుడు మునియాశ్రమమయి యుండదని తీర్మానించుకొన్నాడు. ఆశలో అర్ధభాగము తగ్గినది. కాని యెవరోయొక రుండకతప్పదుగదా! మనకెవరైన నేమి? వారినే యడిగి యూరిదారి తెలిసికొందమని రంగమున ప్రవేశించినాడు. ఎదుటనున్న సౌందర్యసంపుల్లమగు ప్రకృతి, చల్లనిగాలి, వీణావాదము రతీదేవివలెనున్న "మరునానికి శిరోరత్నము" నాతని మనస్తత్త్వముపై నొకసారి గుప్పించి యెగసినవి. హఠాత్తుగ, నకాలమున, గలిగిన యీ విచిత్రసన్నివేశముతో నాతడు విభ్రాంతుడై నిలిచినాడు.

ప్రవరునిది రమణీయమై సుకుమారమగు రూపు, కమలములవంటి కన్నులు, వీనులతోడ రాపాడుభుజములు, విశాలమగు నురము, మృదుపదములు నివి యీతనికి పుట్టుకతో బుట్టిన లక్షణములు. వీటికన్నిటికి పైపూత యగు బ్రహ్మతేజమును కష్టపడి సంపాదించినాడు. ఆ బ్రహ్మతేజ మెట్లుండినదో మన కిపు డర్థముగాదు లెండు. అతని లావణ్యమా! నేరచేటియసలు తెచ్చి నీరజాప్తుని సాన బట్టగా మిగిలిన రాపొడి గలిపి నీటికి బదులమృతము నేవాడి యీతనిదివ్యసుందరవిగ్రహమును తీర్చినాడట బ్రహ్మదేవుడు. చుంగులుదీర్చి కట్టిన నీరుకావిపంచె, అరుణాంశుకోత్తరీయము, లలాటపట్టికయందు, వెండికేకులవలె, పలపలమనిమెరయు విభూతిపట్టెలు, చెవులలో, నిగనిగలాడు, మణికుండలములు,- అతడు మనవంటి దౌర్భాగ్యుడు గాడుగదా!- అతని యాహార్యకములు. (సశేషము.)

## ఐంద్రజాలిక

### శ్రీ మల్లవరపు విశ్వేశ్వరరావు

ఎవతెవు నీవు దూరమున నే భ్రుకుటీనటనమ్ము సేతనో
నవజలదమ్ములందునె వినగ్నగళమ్మున మ్రోగు నిష్ఠురా
రవముల రేపినావు, విను రాల్చిన రిక్కలవెల్ల మంటలై
లవములవమ్ములై తునుకలై చిటిచేర్చెడి నాజగమ్ముపై!

కనబడకే కనుంగవకు గాటపుగోరిక లేలపూన్చి నీ
ధనువున రంగురంగు జలదమ్ముల లేతెర జీల్చెదేల నా
మనసును వ్రేల్చెదేల, పరిమాణము లేని కఠోరభావమూ
నిన మనజాలునే జగతి నీసుమహాస్త్రమె నిప్పుగుప్పినన్?

దురుసుకటారి నీయెదను దూసి నిశాజఠరమ్ముగోసి భీ
కరరుధిరమ్ముబిందువు నొకండయినన్ భువి జేరనీక నే
యరుదగు నింద్రజాలము వియత్తున జేసితొ, శోణితంపు తుం
పరలయి వ్రేలె దారలు నభస్థలి కీలలతోరణమ్ములై!

సుందరవిశ్వమోహిని! రసోల్బణమూర్తి! సుఖాంగనాన నీ
వెందుల కగ్నికుండమిడి, యింధనముల్ రగిలించి, సాంద్రధూ
మాంధములోన ప్రజ్వరిలు హాలహాలాద్భుత కీలికాగ్రసీ
మం దలిరాకుపాదయుగమంట నటించెద వైంద్రజాలికా!

---


## వెన్నెలకడలి

### కుందుర్తి నరసింహారావు

తెలిమబ్బుపట్టుపొత్తిళ్ళ నొత్తిగిలుజాబిల్లి నుయ్యాలలూపెడికరమ్ము
ఆకొన్న చిరుగాలి యాడుపోకినయంత పెన్నుర్వుపాలు చేపెడు నెడంద
పండువెన్నెలసెజ్జపై మేనువాల్చిన ప్రకృతిపజ్జను జోలబాడు నెలుగు
పగటిపోరుల గాసివడు జీవకోటిపై కారుణ్యసుధ జిల్కుకంటివెలుగు
నీసుపర్వరూపజ్యోతి నేడు దెసల-శోభిలు మహోశదరహాసవైభవముగ
అఖిలజగదంబవై మదీయాంతరంగ-నాదరాగమ్ము చూరగొన్నావు, కడలి!

అచ్ఛకళావిలాసవతివై అమరాంబరశోభితాంగివై
స్వేచ్ఛ రుతించునీవదనవీణ చరాచరభూతకోటిచే
తుచ్ఛశరీరవైభవగతుల్ మరపించి యశస్త్రపావిమో
హాచ్ఛవిదివ్యజీవనవిహాయస మార్గములందు ద్రిప్పెదుర్.

---



# త్రిశూలము

విశ్వనాథ సత్యనారాయణ

★

**సప్తమాంకము.**

(ప్రవేశము. జగదేవుఁడు, త్రిపురాంతకభట్టు, బ్రాహ్మణులు.)

త్రిపు:—జగదేవా! నీవు భోజనమునకుఁ బిలిచిన చో బసవేశ్వరుఁ డొక్కఁడే రాఁడు; వీరశైవు లందఱును వత్తురు. వారి పంక్తిని గూర్చుండి బ్రాహ్మణు లందఱును భోజనము చేయరు.

జగ:—నేను బసవేశ్వరు నొక్కనినే భోజనమునకుఁ బిలుతును. ఆయనపంక్తిని గూర్చుండి భోజనము చేయుటకు బ్రాహ్మణుల కేమైన నభ్యంతర మున్నదా?

బ్రా:—బసవనిపంక్తిని భోజనము చేయుటకు బ్రాహ్మణుల కెవ్వరికి నభ్యంతరము లేదు. బసవఁడు జన్మచేత బ్రాహ్మణుఁడు, మహాభక్తుఁడు, సత్యశమదమాది సద్గుణసంశోభితుఁడు. ఆయన బ్రాహ్మణ్యము వదలి పెట్టినను బ్రాహ్మణుఁడే. కాని మీరు భోజనమునకుఁ బిలిచినచో నాయన యొక్కఁడే రాఁడు. శివభక్తు లందఱును దప్పకుండ వెంటఁదెచ్చును.

జగ:— బసవేశ్వరునియనుయాయులలోఁ జాలమంది శమదమాది గుణసంపత్తికల భక్తు లున్నారు. వారు వచ్చినచో.

బ్రా:—దండనాయకా! వారిలో శమదమాదులగు నాత్మగుణములు కలవా రున్నను గులముచేత బ్రాహ్మణులు కారు. చాకలులు, మంగలులు భక్తులైనచోఁ గావచ్చును. వారు గణాచారులవంటివారు. వారిని మేము గౌరవింతుము. వారితోఁ గలసి భోజనముచేయము. వారు మహాభక్తులని తోఁచినచో వారిపాదసేవ చేయుదుము. వారిచేతినీరు త్రాగము.

జగ:—అయ్యా! వారియొద్ద మనకంటె నెక్కువశక్తులు నెక్కువశీలము నుండఁగా వారితో మన మేల కలసి భోజనము చేయరాదు?

త్రిపు:— జగదేవా! బిజ్జలుఁడు మనకు రాజు. మనమందఱ మాయన బంటులము. ఆయనను మహారాజా యని పిలుతుము. ఆయన యన్నచో మనకు భక్తి. కాని యాయనతోఁ గలసి మనము భోజనము చేయము.

జగ:—ఒకపని చేయుదము. బ్రాహ్మణు లందఱు ముందు భోజనము చేయవచ్చును. తరువాత బసవాదులను బిలిచి భోజనము పెట్టుదము.

త్రిపు:—అట్లయినచో బసవన్నకుఁ గోపము రావచ్చును. దేవతానైవేద్యాదికములు మున్నుజరిపి బసవనిపంక్తి నాదరించుట కిష్టములేని బ్రాహ్మణులను ముందారగింపించి తరువాత మనము కొందఱము బసవనితోఁ గలసి భుజింతము.

జగ:—అయినచో నేను బసవామాత్యుని బిలిచి వచ్చెదను. మీరు పోయి దేవతార్చనాదులు ముందు జరిపింపుడు.

(త్రిపురాంతకభట్టును బ్రాహ్మణులును నిష్క్రమింతురు).

జగ:—నే నిటు కర్మసిద్ధాంతమును వదలలేకున్నాను, అటు శివభక్తిని బరిత్యజింప లేకున్నాను. బసవా! నేను నీకు భక్తుడను. తర్కముచేత నెంత యాలోచించినను గర్మసిద్ధాంతమే ధ్రువపడుచున్నది. వర్ణాశ్రమాచారధర్మములే పరమ విశ్వాస్యములుగా నున్నవి. కాని—

సీ. బసవనిమనసులో భావించినంతనే పైకమ్ముచే నొడల్ మఱచిపోరు
దీక్షతో బసవని వీక్షించినంతనే గలపరించిన మొడల్ పులకరింతు
బసవనిస్తోత్రముల్ పాడినయంతనే తలఁగని ప్రేమచేఁ దాంచవింతు
బసవనిపేరు విప్పడినంతనే చిట్టి బసవనిలోనమై దిశలు చూతు

బసవదేవుఁ డొకఁడె ప్రాణలింగము బస
వండె సంగమయ్య భక్తిప్రోవు
బసవ బసవ యన్న పాపౌఘ మెంతయుఁ
బుచ్చుకాయవోలె విచ్చిపోవు.

నే నీకర్మభక్తి సిద్ధాంతముల మధ్య గతాగతకారియైన యుయ్యేలవలె నూఁగుచున్నాను. ఇదిగో బసవామాత్యుని గృహము బసవని నాకనుల పండువుగాఁ జూచెదను. కాని యాయనను జూచినంతనే తోడి యమాత్యుఁ డనిపించుటయే వింతగా నున్నది. నా యాత్మ దేహసంసర్గమునందుఁ జిక్కువడి యావిభేదవుఁ ద్రాళ్లు ద్రెంచుకొనలేకున్నది.

(తెర యెత్తఁగా బసవేశ్వరుఁడు ప్రవేశించును.)

బస:—జగదేవా! రమ్ము! ఏదో పనిమీఁద వచ్చిన ట్లున్నది.

జగ:—అమాత్యశేఖరా! నేఁడు నా కుమార్తె వివాహము. తమరు మాయింటికి భోజనమునకు రావలయును. మీరు వచ్చినచో నా యిల్లు పవిత్రము కాఁగలదు. నాజన్మ కృతార్థమగును. నాయందుఁ బరమశివునకు దయకలుగును.

బస:—జగదేవా! నీవు బ్రాహ్మణుఁడవు. నేను గులము లేనివాఁడను. నేను శివుఁడను. నీవు భవుఁడవు నీ యింటఁగుడుచుటకు నా కభ్యంతరము లేదు గాని నాకు నీ యింట భోజనమిడుటకు నీకు నీబంధుగులకు నభ్యంతరముండవచ్చును. నీమాట యేమో, నీబంధుగులకుఁ దప్పకుండ నష్టంకి యుండును.

జగ:—వృషభావతారా! ఎవ్వరికిని నభ్యంతరములేదు. నీవు నాయింట భోజనముచేయుటకు నా బంధుగులలో నెవరి కభ్యంతరమున్నదో వారందఱితో నా బంధుత్వ మీనాఁడు వదలుకొనుచున్నాను. నీవు నాయింటికి వచ్చి యుద్ధరిగాఁడు నీళ్లు పుచ్చుకొంటివా.

నా పితరుల్ పవిత్రమున వాగులు నాతిను పెల్ల భక్తిప్రో
నై పరమేశ లాంఛన మహోగ్ర విభూతి సముజ్జ్వలంబునా
నా పతిభవ నా మనసునకొ దోలిబత్తిని సత్తరన్న తం
డ్రీ! పరమంపు జాలిఁ గనవే నిటలేక్షణవాహనాకృతీ!

బసవా! నీ పాదాంబుజమ్ములు ముట్టి ప్రార్థించుచున్నాను. నీవు నాయింటికి రాక తప్పదు.

బస:—దండనాయకా! ఇదుఁ జాలచిక్కులున్నవి. విచారించుకొనుము. నీయింటికి వచ్చిరచో నే నొక్కఁడనురాను. నాతో మడివాలుమాచయ్య వచ్చును. శివనాగుమయ్య వచ్చును. బహగరబ్రహ్మయ్య వచ్చును. ఇందులో నెవ్వరును బుట్టుకచేతఁగూడ బ్రాహ్మణులు కారుగదా! వారంద అపరశివులు. పీనమైన దోసముసైరించువారు కాదు, క్రుద్ధులై లయకాలరుద్రులవలె మండిపోదురు. జగదేవా! మనమైత్రి మైత్రిగా నుండనిమ్ము. నాయందు నీకుప్రేమ యున్నచో దానిని బ్రేమగానుండనిమ్ము. నీవు శివభక్తుడవై లింగవంతుఁడవైనచో నీవు పిలువచ్చును. నేనురావచ్చును. మనది యంగాంగి సంబంధము గాదు.

జగ:—బసవా! నేను లింగవంతుఁడను గాకపోయినను నీభక్తుఁడనే యగుదును. నీ శివభక్తుల కొలకు నీకొలకు నేదైనఁ జేయుదును. నీ కత్తితో నాహృదయమును దెఱచిచూడుము. అందు బసవేశ్వరుఁడు ప్రతిష్ఠింపఁబడి యున్నాఁడు. నీవు రాకతప్పదు. నీవురాకపోతివేని శివభక్తులమీఁద నొట్టిడుచున్నాను.

నీవురావేని బసవ! నిర్నిద్రభావ
సంగమేశ! మడివాలు మాచయ్యతోడు.
నీవురావేని బసవ! మనీషిలోక
మహితనుతిపాత్ర శివనాగుమయ్యతోడు.

బస:—జగదేవా! జగదేవ! ఎంతయాన పెట్టితివి? వచ్చెదను, వచ్చెదను, పొమ్ము. భోజనమువేళకు మఱల వచ్చి పిలువుము. నే నింతలో సిద్ధముగా నుండెదను.

జగ:—ప్రభూ! నేను కృతార్థుఁడనైతిని. రెండు గడియలలో మఱల తిరిగివత్తును.

శివుఁడు నాగృహవీథి వేంచేయఁ గలఁడు
హరుఁడు నాయింటిముంగిట నాడఁగలఁడు
మా త్రిమంతుండు బసవఁడు మ్రొగ్గఁగలఁడు
నాగృహాంగణగతతోరణముల యందు.

(నిష్క్రమించును.)

బస:—పురాతయ్యా! పురాతయ్యా! నీవు పోయి మడివాలు మాచయ్యను, శివనాగుమయ్యను, బడగర బ్రహ్మయ్యను, కదరి రెమ్మయ్యను, గోడలమల్లయ్యను బిలుచుకొనిరమ్ము. నేడు జగదేవునియింట విందారగింపవలయునఁట. మిమ్మందఱను బసవఁడు రమ్మనుచుండెనని చెప్పుము.

పురాతయ్య:—(ప్రవేశించి) భోజనమున కక్కడికి! జగదేవునియింటికా! నేను బిలుచుకొనిరాను.

బస:—ఎందుచేతనయ్యా!

పురా:—ఎందుచేతనా? అతఁడు బ్రాహ్మణుఁడు; శైవములు కానివారిని శైవము లని పూజించువాఁడు. వారు వారిదేవతలకు నివేదన చేసిన యుచ్ఛిష్టము ప్రాణలింగమున కారగింపఁబెట్టెదవా?

బస:—అతఁ డట్లేల చేయును?

పురా:—అట్లేల చేయును? బ్రాహ్మణుఁడు గనుక చేయును. జగదేవునకు నీమీఁద భక్తియున్నది గాని శివభక్తులమీఁద లేదు.

బస:—పురాతయ్యా! అతనికి శివభక్తులమీఁదఁ గూడ భక్తి కలదు. మాచయ్య మీఁద శివనాగుమయ్య మీఁద నోట్టుపెట్టినవానికి శివభక్తులమీఁద భక్తిలేదా?

పురా:—మాచయ్యమీఁద, శివనాగుమయ్య మీఁదను గలదు. అందఱు శివభక్తులమీఁద లేదు. అతఁడు నేఁడు మీ ప్రాణలింగముల కుచ్ఛిష్టము నైవేద్య మిప్పింపఁ బోవుచున్నాఁడు.

బస:—పురాతయ్యా! జగదేవుని నీవెఱుఁగవు. అతఁడు నన్ను రమ్మని పిలిచినప్పుడు నీవు లేవు. ఉన్నచో నీ కాతనిభక్తి తెలిసెడిది.

పురా:—అతనిభక్తి నాకు నిన్నుఁ బిలువరాకముందే తెలిసినది.

బస:—పురాతయ్యా! నీవు పొరపాటు పడుచుంటివి.

పురా:—నా చెవులతో విన్నమాటలలో నేమి పొరపాటుండును?

బస:—ఏమి వింటివి? అవి యెవరన్నమాటలు?

పురా:—జగదేవుఁడును మఱికొందఱు బ్రాహ్మణులును గలసి యాలోచించుచుండిరి. ముందర బ్రాహ్మణులు దేవతానివేదన చేసి యారగింతురఁట. తరువాత మీ పంక్తిని గూర్చుండి యారగించుట కభ్యంతరము లేనివారు మీతోఁ గలసి యారగింతురఁట.

బస:—నీ వెప్పుడు వింటివి?

పురా:—జగదేవుఁ డిచ్చటికి రాకముందే వా రనుకొనుచున్న మాటలు వింటిని.

బస:—జగదేవుఁడు న న్నవమానించుటకా యీ పిలిచినది?

పురా:—కాదు, కాదు. జగదేవునకు మీ యందు మహాభక్తి కలదు. మీ రెట్లయినను దన యింట భోజనము చేసినఁ జాలునని యాయన యూహ. కాని యితరబ్రాహ్మణుల కది యసహిష్ణువుగా నుండకుండుట కిది యిట్లు చేసినాఁడు.

బస:—ఈ మాటలు నీవు నీచెవులార వింటివా?

పురా:—విన్నాను.

బస:—ఛీ! నేను జగదేవునియింటికిఁ బోను. నీవు పోయి మాచయ్యను బడగర బ్రహ్మయ్యను బిలుచుకొని రమ్ము.

(పురాతయ్య నిష్క్రమించును.)

జగ:—ప్రవేశించి బసవేశ్వరా! అంతయు సిద్ధముగా నున్నది. మీ రింక బయలుదేరి వచ్చుటయే యాలస్యము.

బస:—జగదేవా! బ్రాహ్మణు లందఱు మాతోఁ గలసి భోజనము చేయుదురా?

జగ:—అందఱును జేయరు. కొందఱే చేయుదురు.

బస:—తక్కినవారు మనభోజనము లైన తరువాతఁ జేయుదురా?

జగ:—కాదు. వారిదివఱకే చేసిరి.

బస:—అయినచో వారు దేవతానివేదనములు చేసిరికదా! ఆయుచ్ఛిష్టము మాప్రాణలింగములకు నైవేద్యము పెట్టుమందువా?

(మాచయ్యయు బ్రహ్మయ్యయు బ్రవేశింతురు.)

జగ:—బసవేశ్వరా! మీకట్టుచ్ఛిష్టము పెట్టింతునా? వేఱేవంట చేయించితిని.

బస:—జగదేవా! నీవు ముందు బ్రాహ్మణుల కారగింపించి తరువాత మమ్ముఁబిలుచుటకు, నాతోఁ దరువాత మీరుకొందఱు కలసిభుజించుటకు నీవుపన్ని వచ్చితివా, లేదా?

జగ:—బసవేశ్వరా! నిజము చెప్పుచున్నాను వినుము. నీవు నాయింట నారగించుటయే నాకోర్కి. తక్కినవానితో నాకుఁ బనిలేదు.

బస:—ఛీఛీ! నీమొగముచూడను. పురాతయ్యా! నడుమ తెరపట్టించుము. ఈభవిమొగము నేఁ జూడఁజాలను.

(బ్రహ్మయ్యయుఁ బురాతయ్యయుఁ దెర యడ్డను పట్టుదురు.)

బస:—

ముల్లోకనాథుని ముట్టఁ గొల్చియును గల్లరిలోకుల కుణియింపఁదగునె
హరునకు మజ్జనం బార్చుచేతులను నరకవిప్రులకాళ్లు సరికడ్గ దగునె
శివపాదజలములఁ శిరమునఁదాల్చి భవులకాళ్లలనీళ్లు పైవల్కఁదగునె
శ్రీమహాదేవుఁబూజించుచేతులను నామాలకుక్కల నర్చింపఁదగునె
కర్మచండాలురఁగలసికుడ్చుటయుఁ గర్మంబునుడుచుటకాదయట్లయిన
కలకంఠపద్ధ నిష్కళభక్తియుక్తి జరభుల కదియేల సమకూఱుఁ జెపుమ.

దర్శనాదపి పాపదా యన్నట్లు భవుల సంపర్క భోజనాసనదానములు భక్తులకుఁ బనికిరావు. పొమ్ము పొమ్ము.

జగ:—బసవేశ్వరా! అనుగ్రహింపు మనుగ్రహింపుము. నేనుగర్మబద్ధుఁడనైతిని, కష్టుఁడనైతిని, దుర్మదోపేతుఁడనైతిని, దుష్కృతాలయుఁడనైతిని. దీనికింకఁ బ్రాయశ్చిత్తమేదియులేదు. మాచయ్యా! నీకు నమస్కారము. బ్రహ్మయ్యా! నీకువందనములు. పురాతయ్యా! నీకుమోడ్పుఁగేలు. ఇతర భక్తులారా! మీకు నాప్రణామములు. బసవేశ్వరుఁడు నాయింట నారగించునన్న సంతోషములో నీయుపచారము నాకు గోచరింపలేదు. వేఱువంట నైనను ముందు బ్రాహ్మణుల నారగింపించుట నాదేదోషము. బసవా! ఈపాపమునకు నిష్కృతియేమో చెప్పుము. (కత్తి దూసి) బసవా! ఈపాపమునకు నాప్రాణములతో బ్రాయశ్చిత్తము చేసికొనెదను మీయాజ్ఞయిండు. నాతల తరిగి మీపాదములయందుంచుచున్నాఁడను.

బస:—(తెరలాగి) జగదేవా, సాహసమువలదు. నీవు నిజముగాఁ బ్రాయశ్చిత్తమును వాంఛించెదవేని నది నీశిరముతోఁ గాదు. శివద్రోహులశిరములతో నా ప్రాయశ్చిత్తము చేసికొనవలయును. అట్లు వాగ్దానమిమ్ము.

జగ:— ఇదిగో, కత్తి ముట్టి ప్రతిజ్ఞ చేయుచున్నాను.

బస:—ఇంకఁ గొలఁది దినములలోఁగల్యాణకటకమున శివద్రోహము పుట్టఁగలదు. నీవా ద్రోహిశిరస్సు ద్రొలఁగించెదవేని శివుఁడు నీకుఁ బ్రసన్నుఁడగును.

జగ:—తప్పకుండఁ జేసెదను.

బస:—శివద్రోహము పుట్టినపుడు నేను నిన్నడిగెదను. ఆద్రోహియెవఁడైననునీవు చంపవలసియుండును.

జగ:—ఎవఁడైనను జంపెదను.

బస:—నీకుమారుఁడైనచోఁ జంపెదవా?

జగ:—తండ్రి యైనను సరే, కుమారుఁడైనను సరే, చంపెదను.

బస:—నీగురువైనను జంపెదవా?

జగ:—గురువైననుసరే, నాదైవమైనను సరే చంపెదను.

బస:—నీరాజైనను జంపెదవా?

జగ:—రాజైనను సరే, రాజాధిరాజైనను సరే చంపెదను.

బస:—జగదేవా! మాట తిరిగిపోరాదు. ఈనిర్ణయమున కీశానుఁడు, ప్రమథగణములు సాక్షులు.

జగ:—ఈనిర్ణయమున కీశానుఁడు, ప్రమథ గణములు సాక్షులు.

బస:—ఈనిర్ణయమునకు మాచయ్యయు, బ్రహ్మయ్యయు సాక్షులు.

జగ:—ఈనిర్ణయమునకుమాచయ్యయు, బ్రహ్మయ్యయు సాక్షులు.

బస:—ఈనిర్ణయమునకు నీవు తిరిగిపోయినచో శివభక్తులు నీప్రాణములు గొందురు.

జగ:—ఈనిర్ణయమునకు నేను దిరిగిపోయినచో శివభక్తులకు మున్నె నేనే నా ప్రాణములు తీసికొందును.

బస:— పురాతయ్యా! ఈమహాద్రోహికంటకచ్ఛేదమహాకార్యారంభమునకు జగదేవునకు వీరతాంబూల మిప్పింపుము.

(పురాతయ్య తాంబూలము తెచ్చియిచ్చును.)

జగ:—

సాంబుండుఁ బ్రముఖుల్ గణేశ్వరుఁడునాసాక్ష్యంబు బ్రహ్మయ్య సాక్ష్యంబౌ మాచయ సాక్ష్యమా బసవఁడే సాక్ష్యంబు నిక్కంబుగాఁ
దాంబూలంబు గ్రహించితిఁ శివదురంత ద్రోహికంఠాద్రిర
క్తంబుఁ దాఁ జవిమాపఁ జేసెదనుమత్ఖడ్గాహిజిహ్వాగ్రముస్.

(తాంబూలము గ్రహించును.)

బస:—జగదేవా!, ఇంక నీవు పోవచ్చును.

జగ:—నీవు నా యింటికి భోజనమునకు రావలయును.

బస:—ఒక పూట భోజనమున కొక శివద్రోహికంఠము వెలపెట్టెదవా?

జగ:—బసవేశ్వరా! వాఁడు వట్టి శివద్రోహి కాకపోవచ్చును. ఎవఁడో, నా పుత్రుఁడో, నా గురువో, నారాజో.

బస:—జగదేవా! ఒక పూట భోజనమునకు నీ ప్రాణము వెలకట్టితివి.

జగ:—బసవా! నాయొక్క ప్రాణమేకాదు; నా గౌరవము, నా భక్తి, నా జన్మలోని పరమార్థ మంతయు వెలకట్టితిని.

బస:—నే నింత యూహింపలేదు.

జగ:—నే నంతయు నూహించియే ప్రతిజ్ఞకై కొంటిని.

బస:—శివద్రోహభయముచేత నిట్లు చేయించితిని.

జగ:—బసవఁడు నాయింట నారగించునని నే నిట్లు చేసితిని.

బస:—శివద్రోహమేమైనను సరే. నీమాటనీవు తీసికొనుము.

జగ:—శివద్రోహ విషయముకాదు. నామాట యిచ్చినతరువాత మరలఁ దీసికోను.

బస:—ఇంక భోజనమేమి రుచించును?

జగ:—బసవా! నీకా? నాకా?

బస:—నాకు శివద్రోహివధయే ముఖ్యము.

జగ:—నాకు బసవఁడు నా యింట భోజనము చేయుట ముఖ్యము. నా కిపుడు భోజనము మిక్కిలియు రుచించును.

గీ. ఇదివఱకు వట్టి భక్తుఁడై యెలమికాఁడు
నై బసవఁ డేఁగుదెంచి తా నారగించు
నిప్పుడు నా ప్రాణలింగమై యీ మదీయ
మఖిల జన్మలతాత్పర్యమై యారగించు.
ఇదివఱకు వట్టి బసవఁడై యేఁగుదెంచు
నిదివఱ కమాత్యుఁడైమాత్ర యేఁగుదెంచు
నిపుడు నా ప్రాణలింగమై యేఁగుదెంచు
నిపుడు శివపరతత్త్వమై యేఁగుదెంచు.

బస:—జగదేవా! బాహిరలింగధారణమునందు నేను మిక్కిలి విశ్వాసిని. నీవు న న్నావిశ్వాసమునుండి కదలించుచున్నావు.

జగ:—గురూ! బసవేశ్వరా!

ఏతేరవయ్య నందీశ్వరస్వచ్ఛావతార జగత్త్రయాధార వీర!
అరుదెంచవయ్య శివానందచిత్కళాసార మహాకృపాపార వీర!
వేంచేయవయ్య విష్ఫురితశివతత్త్వపార! సుభక్తిసంభార! వీర!
విచ్చేయుమయ్య సంపచ్ఛయప్రారంభకార! బుతాధ్వప్రకార! వీర!
నడచిరావయ్య! బసవయ్య! నాథనాథ!
కదలిరావయ్య బసవయ్య గరళకంఠ

యంటిరా వయ్య బసవయ్య! యాభవమూర్తి
తోడం వయ్య శివమత ద్రోహి చంప!

బస:— జగదేవా! నీవు పదమా! నేను వెనుక వచ్చు చుంటిని.

జగ:—రా! రా!

పరిక్రమించును. వెనుక తెరపడి బసవాదులు తిరోహితులగుదురు.

జగ:—ఓహో! ఇదియేమిటి? నేత్రములయెదుట సాక్షాత్కరించుచున్నది. మొట్టమొదట సర్వము నీలాకాశముగాఁ గనిపించి క్రమక్రమముగా మూఁడుకొనల తోడిబల్లెము నేత్రములకుఁ గనిపించుచున్నది. కైలాసశిఖరము వెనుక నీ ముమ్మొనవాలు,

గీ. నడుమ నీలమండలమ్ము నాయెసమగించి
దక్షిణ మండల మాపైని శ్యామలోగ్ర
మండలము మూఁడుగాఁదోఁచి మంచుకొండ
స్వచ్ఛశిఖరమ్ము వెన్క సాక్షాత్కరించు.

ప్రత్యంతధాత్రి యంతయు నల్లనై శిఖర మాకాశపథమునఁ బెరుగుకొలఁది క్రమక్రమముగ నలుపు విరిగి తెల్లనై శిఖరోర్ధ్వభాగము క్షీరపాథోధి తరంగడిండీర శకలమువోలె గొగ్గిగొగ్గిమై కనిపించుచున్నది. ఈనీలాకాశము నీత్రిశూలముయొక్క యర్థమేమి? త్రిశూలము పరమేశ్వరుని సంహారచిహ్నము. ఓహో నేను సంహారనాయకమునైతిని. త్రిశూలాంశ నాలోఁ జొచ్చుచున్నది. ఈబరువు నేను బట్టలేను. కాదు, కాదు, బసవేశ్వరుఁడు నాయింటికి విందారగింపవచ్చుచున్నాడు. ఏఁడీ! బసవేశ్వరుఁడు. నేను తొందరగా నడచితిని కాఁబోలు. వారు వెనుక పడినారు.

(మరల తెరయెత్తఁగా బసవేశ్వరాదులు కనిపింతురు.)

జగ:—బసవేశ్వరా! మఱికొంచెము తొందరగా రెండడుగులు వేయవలయును. పదార్థములు చల్లారిపోవునేమో! రుచితప్పిపోవునేమో! రా! రా! నాగృహ ద్వారమందు ముత్తయిదువ లారతులతో నెదురు చూచుచున్నారు. నీదర్శనమైనంతనే మంగళ వాద్యములు ప్రయోగించుటకు వాద్యకులు ప్రతిలిప్తను నిరీక్షించుచున్నారు. బ్రాహ్మణులు నీకై వేదఘోషలతో నీవడుగుపెట్టునిముసమునకు స్వరితము ప్రయోగించుటకు శబ్దమయలోకమును జాగ్రత్తతోఁ బరీక్షించుచున్నారు. రా! బసవా! రా!

## అష్టమాంకము

[ప్రవేశము : అల్లయ్య మధుపయ్యలు.]

అల్లయ్య:—మధుపయ్యా! రాజు మన్నెందుకు పిలిపించాడంటావు?

మధు:—ఆరోజున మనం బసవయ్యయింటికి భోజనానికి పోతూ రాజదివాణం ముందరగా రాజునేవో కొన్నిమాట లన్నాం. ఆయన వెళుతూ, పోయే వాళ్లందరినీ చూస్తూనేవున్నాడు. మనమాటలు వినుంటాడేమో అనుకున్నాను.

అల్ల:—అపుడు మన మేమన్నామంటావు?

మధు:—ఏమన్నాం? చాలా అన్నాం. మాకు బసవడే దేవుడుగాని బిజ్జలుడి లెఖ్ఖేమి టన్నాం.

అల్ల:—నే నామాట లనలేదు.

మధు:— నీ వామాట లనలేదేమో కాని రాజును కావలిస్తే చంపేస్తా నన్నావు.

అల్ల:—మధుపయ్యా! అబద్ధాలు చెప్పకు. కొంపముంచి యెవ్వరైనా వింటారేమో? బిజ్జలు డంటే నాకు చాలా గౌరవం; భక్తీన్నీ.

మధు:—నాకుమాత్రం లేదా భక్తీ గౌరవమున్నూ. ఆరోజున ఉత్సాహంలో అన్నాముగాని.

అల్ల:—ఆమాటలు రాజు విన్నా డంటావా? వినియుండడు.

మధు:—విన్నా డనే నా అనుమానం! అయినా తినబోతూ రుచులెందుకు? అక్కడికే వెళుతున్నాంగా. విన్నాడో లేదో నిమిషంలో తెలుస్తుంది.

అల్ల:—వింటే ప్రాణంమీదికి వస్తుందిగదా!

మధు:—రా జేమి చేస్తాడు?

అల్ల:—ఏంచేస్తాడేమిటి? రాజు యేం చెయ్యలేడు? తల నరికిస్తాడు. చాలునా?

మధు:—తల నరికిస్తే నష్టమేముందీ. నిమిషంలో చస్తాం. వెంటనే శివసన్నిధానానికి పోతాం.

అల్ల:—కాదు. తల నరికించకుండా యేదో బాధపెడతాడు. ఉదాహరణకి - కళ్లు పీకిస్తా డనుకో. దాంతో యెంత బాధపడాలి?

మధు:—ఓయీ అల్లయ్యా! బసవణ్ణి దాటి రాజు యేమీ చెయ్యేలేడు. బసవడంటే రాజుకు చాలా భయం. మనం బసవడి పరివారంలోవాళ్లం. మనమీద చెయ్యివేసి రాజు బతుకుతాడా? రాజుదగ్గిరికి పోదాం పద.

అల్ల:— బసవడూ రాజూ మాట్లాడుతున్నారట గదా! బసవ డక్కడేవున్నాడు గనుక భయంలేదు.

(నిష్క్రమింతురు.)

[ఇది విష్కంభము.]

[తరువాత బిజ్జలుఁడును బసవామాత్యుఁడును ప్రవేశింతురు.]

బిజ్జ:—బసవా! ఇంక నీచేతఁ గాదన్నమాట నేను వినను. హనుమకొండ సైన్యమును గెలిపించి తీరవలయును. ఇది నీ చేతిలోని పని. హనుమకొండ సైనికులమీఁద మహామారిని ప్రయోగింపుము. మీకాలభైరవుని బంపి వారిసైన్యములను విఱువఁబాడిపింపుము. మఱల సైన్యములు సిద్ధము చేసితిని. ఈసారి బిజ్జదేవుడనే యుద్ధమునకుఁ బంపుచున్నాను. వెళ్లినచో నీవుకూడ వెళ్లుము.

బస:—రాజా! వెళ్లుటకు నా కేమియు నభ్యంతరములేదు. నేను వారిమీఁదికి మహామారిని ప్రయోగింపఁజాలను. నేను భూతవైద్యుఁడనుగాదు. శాక్తేయుఁడను గాదు.

బిజ్జ:— భూతవైద్యుఁ డొకరిద్దఱి మీఁదనే ప్రయోగము చేయఁగలఁడు. శాక్తేయుఁ డొకకొంప కొంప నాశనము చేయవచ్చును. నీ వట్లు కాదు. ఒక్క పెట్ట ముప్పదివేలమంది చేత విషము త్రాగింపఁగలవు, వారిని జావకుండను జేయఁగలవు; చంపనుగలవు.

బస.—రాజా! ఈపని నాచేతఁగాదు.

బిజ్జ:—నీచేతఁగాదా! కాదా! నీవు శివభక్తుఁడవుకాదా? గరళము త్రాగలేదా? నీవు చేసినయద్భుత కార్యము లన్నియు నెట్లుచేసితివి? ఆకార్యములు చేయుటకు నీ కున్నశక్తి యీపనులుచేయుట కేల లేదు? బసవా! ద్రోహచింత మానుము. నేను సామ్రాజ్య మేలుట నీ కిష్టములేదా? నేను జక్రవర్తినైనచో నీవు సామ్రాజ్యమునకంతయు మహామాత్యుడవు కావా బసవా? నీకంత యాశకలదేని సగముధాత్రి యంతయు నీవు తీసికొనుము. మిగిలినసగమే నా కిమ్ము.

బస:—రాజా! నా చేతఁగానిపనికి నన్నేందు కిబ్బంది పెట్టెదవు?

బిజ్జ:—బసవా! రాజ్యమంతయు నీవే యేలుము. పేరునకుమాత్రము నన్ను సార్వభౌముఁ డని యనుము.

బస:—బిజ్జలా! కొన్ని సమయములయందు శివుఁడు నన్ను రక్షించుట నాకొంపమీఁదకుఁ దెచ్చినది. నా కీయమాత్యపద మక్కఱలేదు. నాదారిని నన్నుఁ బోనిమ్ము.

బిజ్జ:—బసవా! నామాటలధోరణినిబట్టి నీవు నన్ను దురాశాపరుఁ డనుకొనుచున్నావు. నేను దురాశాపరుఁడనుగాదు. ఈధాత్రియంతయు నొక్కగొడుగుక్రిందికి వచ్చుటయే నాయుద్దేశము. నీవు సర్వభారతదేశము నొక్కగొడుగుక్రిందికిఁ దెమ్ము. నన్నుఁజంపి నీయిష్టము వచ్చినవానికిఁ బట్టము కట్టుము. ఉత్తరహిందూస్థానమున మొగలులదాడు లెక్కువగుచున్నవి. వారు క్రమక్రమముగా దక్షిణాపథము నొత్తుకొనివత్తురు. నీవంటి మహాపురుషుఁడు మరల జన్మింపఁడు. నీమాట కెదురాడలేక శివుఁ డే దైనను జేయును. బసవా! నీవు పట్టి బికారి శివభక్తుఁడవైనచో నిన్ను నేనడగను. నీవు మహామాత్యుఁడవు. నీతిబుద్ధితో నాలోచింపుము. ఇక్కడ మనరాజ్యము. హనుమకొండలోఁ బ్రోలరాజురాజ్యము. ఆపైని నోఁడ్రులది. ద్వారసముద్రమున హోయసాలులు. దేవగిరిలో యాదవులు. దక్షిణమునఁ జోళపాండ్యులు. కనిన మొక్కదక్షిణాపథమంతయు నొక్కగొడుగుక్రిందికిఁ దెమ్ము. శైవమో, వైష్ణవమో, బ్రాహ్మణ్యమో, యీగడ్డమీఁదఁ బుట్టినవారిచేత నీయిలమెల్ల నేలింపుము. ఇట్లు మౌనభావము వహింపరాదు. నీవు బదులు చెప్పుము.

(బసవఁడు నిష్క్రమించును.)

బిజ్జ:—ఎవఁడురా? అక్కడ?

దౌవారికుఁడు. (ప్రవేశించి) ప్రభూ! ఆజ్ఞ.

బిజ్జ:—అల్లయ్యమధుపయ్యలు వచ్చిరా?

దౌవా:—వచ్చి సిద్ధముగానున్నారు మహాప్రభూ!

బిజ్జ:—లోనికిఁ దీసికొనిరమ్ము.

(దౌవా:—నిష్క్రమించును. అల్లయ్య, మధువయ్యలు ప్రవేశింతురు.)

మధు:—మమ్మిరువురి నేలకో మహారాజులు పిలిపించినారఁట.

బిజ్జ:—మధువయ్యా! నే నెక్కువా, బసవఁ డెక్కువా?

మధు:—ప్రభూ! మహారాజులు గనుక మీరెక్కువ. మహాభక్తుఁడు గనుక బసవయ్య యెక్కువ.

బిజ్జ:—అల్లయ్యా! నీవు చెప్పుము. నీవు నన్ను గౌరవింతువా, బసవేశ్వరుని గౌరవింతువా?

అల్లు:—ప్రభూ! మహారాజులని మిమ్ము గౌరవింతును. మహాభక్తుఁడని బసవేశ్వరుని గౌరవింతును.

బిజ్జ:—అల్లయ్యా! మధువయ్య నేర్పిన మాటలు పలుకుచుంటివి. మిమ్మిద్దఱ నడుగుచున్నాను. మీరు రాజద్రోహు లవునా, కాదా?

మధు:—మే మేమి రాజద్రోహము చేసితిమి? రాజద్రోహ మనఁగా నేమి?

బిజ్జ:—బిజ్జలునియాజ్ఞకన్న బసవేశ్వరునియాజ్ఞ నెక్కువగా మన్నించుట రాజద్రోహము.

అల్లు:—మహారాజా! ఆలెక్కను వీరశైవు లందఱును రాజద్రోహులే.

బిజ్జ:—తక్కినవారిమాట నాకుఁ దెలియదు. మీ రిద్దఱును రాజద్రోహులని నే నెఱుఁగుదును.

అల్లు:—ప్రభూ! మేము చేసిన రాజద్రోహ మేదియో మాకుఁ దెలియదు.

బిజ్జ:—నీకుఁ దెలియదా? మధువయ్యకైనను దెలియు ననుకొందును.

మధు:—మహారాజా! ఆనాఁడు మే మనిన మాటలు ప్రభువులు విని యిట్లనుచున్నారు.

బిజ్జ:—నేను వినవలయుననియే శివభక్తు లట్లన్నారు.

---

మధు:—తగినశిక్షవిధించినచో ననుభవించుటకు సిద్ధముగా నున్నాము.

బిజ్జ:—ఆశిక్షమాట తరువాత. మీతో నే నొకమాట చెప్పఁబోవుచున్నాను. ఒకకార్యము సాధించిపెట్టుఁడని యడుగుచున్నాను. మీ శివభక్తులలో మీ యిద్దఱ నిట్లడుగుటకు నాకుఁ గలిగినంత వీలు మఱి యింకొకరితోఁ గలుగలేదు.

మధు:—ప్రభూ! ఆకార్య మేదియో చెప్పుఁడు. చేతనైనచోఁ దప్పకుండఁ జేసెదను.

బిజ్జ:—నాకోసము చేయనక్కఱలేదు. మీ ప్రాణములకోసమే చేయవలయును.

అల్లు:—ప్రభూ! ఆకార్య మేదియో సెలవిండు.

బిజ్జ:—అల్లయ్య మధువయ్యలారా! బసవేశ్వరుఁడు మహాభక్తుఁడుకదా!

ఇద్దఱు:—అందుకు సందేహము లేదు.

బిజ్జ:—మాచయ్య యేనుఁగును జంపెనుగదా!

ఇద్దఱు:—చంపెను.

బిజ్జ:—అట్లే యొకవేయి యేనుఁగులను జంపలేఁడనఁగలమా?

ఇద్దఱు:—అనలేము.

బిజ్జ:—బసవఁడు చెప్పినచో మాచయ్య యేపనినైనను జేయునుగదా!

ఇద్దఱు:—తప్పకుండఁ జేయును.

బిజ్జ:—బసవయ్య ముప్పది నలువదివేలమంది శివభక్తులచేత విషము త్రాగించెనుగదా!

ఇద్దఱు:—త్రాగించినాఁడు.

బిజ్జ:—ఇటు చూడుఁడు! బసవని దయ లేనిచో నంతమందియు విషము త్రాగి యానాఁడు చావవలసినదే.

ఇద్దఱు:—చిత్తము, చిత్తము.

బిజ్జ:—అతఁడు చంపఁదలఁచుకొన్నచో నింతమందియు బ్రదికెడువారా?

ఇద్దఱు:—బ్రతుకరు, బ్రతుకరు.

బిజ్జ:—మధువయ్యా! బిజ్జలుఁడు వృషభావతారము. ఆయన యిది చేయఁగలఁడు; ఇది చేయలేఁడని లేదు. మీ రిద్దఱును బోయి రాజిట్లు చెప్పెనని బసవేశ్వరునితోఁ జెప్పుఁడు.

మధు:—ఏమని చెప్పవలయును?

బిజ్జ:—మూఢుఁడా! భక్తిలో నున్న మూఢత్వము; భక్తిలో వివేకమో, సామాన్య విషయములందది మూఢత్వమే యగుచున్నది.

అల్ల:—వేదపాఠి జడుఁడు; భక్తుఁడు మూఢుఁడు. మాకు దయచేసి విప్పిచెప్పుఁడు.

బిజ్జ:—మి మ్మిచ్చటి కెందుకుఁ బిలిపించితిమి?

మధు:—మేము రాజద్రోహుల మని.

బిజ్జ:—నేను బసవేశ్వరుని గుఱించి యేమి చెప్పితిని?

మధు:—ఆయన మహాభక్తుఁ డని. ఆయన మహాద్భుతకార్యములు చేసెనని.

బిజ్జ:—చేయఁగలఁడనికూడఁ జెప్పితిని.

మధు:—చిత్తము.

బిజ్జ:—బసవేశ్వరునితో నిదే పోయి చెప్పుఁడు.

అల్ల:—చిత్తము, చిత్తము.

బిజ్జ:—ఇంక మీరు పోవచ్చును. మీరు త్రేపుదయమున నిచ్చటికి వచ్చి బసవేశ్వరుఁ డేమనునో నాతోఁ జెప్పవలయును.

(ఇరువురును నిష్క్రమింతురు.)

బిజ్జ:—ఎవఁడురా! అక్కడ?

దౌవారికుఁడు:—(ప్రవేశించి) ప్రభూ! ఆజ్ఞ.

బిజ్జ:—త్రిపురాంతకభట్టారకుని దీసికొనిరమ్ము.

దౌవా:—చిత్తము.

(నిష్క్రమించును.)

బిజ్జ:—భట్టారకుఁడు వచ్చెనా?

త్రిపు:—(ప్రవేశించి) బల్లహా! వచ్చితిని.

బిజ్జ:—భట్టారకా! గొల్లకళియంబను బసవఁడు చేతులతో నెత్తినప్పుడు మీ రొక యుక్తివాదమును జెప్పితిరి. జ్ఞాపక మున్నదా?

త్రిపు:—జ్ఞాపకమే కాదు; కొంతవఱకు విశ్వాసముకూడ నున్నది.

బిజ్జ:—బసవేశ్వరుఁడు శివభక్తు లందఱకు విసముపోసి తానుగూడఁ ద్రాగినపుడు నేను, జగదేవుఁడు, మాచయ్య మొదలగు శివభక్తులు బసవనికిఁ గైవారము పట్టితిమి. అప్పుడు భట్టారకులుగూడఁ గైవారము పట్టిరి. జ్ఞాపక మున్నదా?

త్రిపు:—ప్రభూ! జ్ఞాపక మున్నది. అప్పుడు నేనును విశ్వసించితిని.

బిజ్జ:—మాయందఱవలె సంపూర్ణముగా విశ్వసించితిరా? మీరు బ్రాహ్మణులుకావున బ్రాహ్మణపద్ధతిగా విశ్వసించితిరా?

త్రిపు:—ఆయుత్సాహములో నెవ్వరికి నొడలు తెలియలేదు. నాకును దెలియలేదు.

బిజ్జ:—తెలిసిన తరువాత యుక్తివాదము కుదిరినదా?

త్రిపు:—కుదుర్చవచ్చును.

బిజ్జ:—కుదుర్చుఁడు.

త్రిపు:—మహారాజా! మన మెవ్వరమును బోయి యాగంగాళములలోనిది నిజముగా విసమో, కాదో చూడలేదు. దూరమునకు విషపువాసన వేసినది. ఆవాసన గుడిలోపలఁ గొందఱు పొగలుపెట్టి చేటలతో విసరి ప్రవర్తింపఁజేయవచ్చును. వారు త్రాగినది భోజ్యవస్తువే కావచ్చును. మనము పోవునప్పటికే ముంతపొగవలె శృంగి, కాలకూటాదులు తగులఁబెట్టి యాపొగఁ బఱపింప వచ్చును.

బిజ్జ:—మనము పోయి గంగాళములలోనిది విషమో, కాదో చూడకపోవుట మనదే లోపము.

త్రిపు:- అప్పు డావాసనమూలముగా మనకందఱకు విశ్వాసము కుదిరినది. అప్పు డాయూహ మనకుఁ దోఁచలేదు.

బిజ్జ:—అది నిజముగా విసమేనేమో?

త్రిపు:—మహాప్రభూ! ముప్పది నలువదివేలమంది శైవులలోఁ బ్రతివాఁడును నంతశ్శుద్ధి కలవాఁడనుటకు వీలు లేదు. కామక్రోధాదు లంతర్మలములు. అవి బసవేశ్వరునకే పోలేదు. భక్తిపారవశ్యమునఁగొన్ని గడియలలో భక్తునకు మహత్త్వప్రాప్తి కలుగవచ్చును. అందఱకు నెల్లప్పు డట్లు కలుగదు.

బిజ్జ:—భట్టారకా! శివనాగుమయ్యచేతఁ బాలు పిండెనుకదా బసవఁడు. దాని కేమందురు?

(త్రిపురాంతక భట్టారకుండు నవ్వును.)

బిజ్జ:—నేను గనులార చూచితిని; మీరును జూచితిరి.

త్రిపు:—బల్లహా! భక్తి వేఱు. ఇట్టి మ్రుక్కిడి పనులు వేఱు. విప్రవినోది మనము చూచుచుండఁగాఁ బాములను జేయును. ఎడమచేతి గుప్పిటిలోఁ బ్రప్వ తిమ్మక్కను బెట్టి కూయించును. అది వాని యఱచేతి కండరములలోని మెలకువ. గొంతులోని కండరములు కదపకుండఁ బెదవులు మెదపకుండ ధ్వని పుట్టించుటకు సాధనచేసిన నేర్పు.

బిజ్జ:—పా లెచ్చటనుండి వచ్చెనయ్యా?

త్రిపు:—విప్రవినోది పెద్దపామును మన యొడి లోనుండి తెప్పించును. వానియొద్ద నున్న చిన్న సంచి లో నంతపాము పట్టదు. వాఁ డెచ్చటనుండి తెచ్చెను?

బిజ్జ:—భట్టారకా! మాచయ్య బ్రాహ్మణుని జంపెను, ఏన్గును జంపెను. దాని కేమందువు?

త్రిపు:—ప్రభూ! చంపుట యనఁగా మొండెము నకు మొండెమును దలకుఁ దలయు విడిగాఁ బడియుండుట. మరల బ్రతుకుట లేదు. దానితో వాని కర్మదేహమునకు సరి. బ్రాహ్మణుని తలయు నేన్గుతలయు నెగిరిపోయి నవి. అవి క్రిందఁ బడలేదు. ఏన్గుశరీరము కన్పించలేదు. మాలకు మాంసమును, గొడరికిఁ దోలును లేకుండ నేనుఁగు శరీరము మాయమగుట యేమి? తల క్రిందఁబడ కుండుటయేమి? గారడివాఁడు లేని మామిడి మొక్కను జూపించును. చేత నాణె మిడుకొని గుప్పిట మూసి తెఱచి వట్టిచేయి చూపించును. మరల మూసి మరల దెఱచినచో నాణె మందే యుండును. ఇది కనుకట్టు.

బిజ్జ:— భట్టారకా! బసవేశ్వరాదులయందు భక్తివలనఁ గలిగిన మహత్తు లేదందువా?

త్రిపు:—కొంత యున్నది. అంతయును గాదు.

బిజ్జ:—భట్టారకా! తమరి కేదైనఁ బని యుండ వచ్చును.

త్రిపు:—చిత్తము సెలవు తీసికొందును.

(నిష్క్రమించును.)

బిజ్జ:—ఎవఁడురా అక్కడ

దౌవా:—ప్రభూ! ఆజ్ఞ.

బిజ్జ:—జగదేవ దండనాథుని నేను బిలుచుచుంటి నని తీసికొనిరమ్ము.

దౌవా:—చిత్తము.

(నిష్క్రమించును.)

బిజ్జ:—ఈ భక్తియంతయు నిట్టి మృష్కరపుఁ బనులకే కాని సామ్రాజ్య నిర్మాణమునకుఁ బనికిరాదు. పనికిరాదా?

నీల:—(ప్రవేశించి)

ఉమా ప్రాణనాథా, మహోరూపధారీ,
ప్రమాణత్వవేదీ, పరంధామ శూలీ,
జగన్నేత సాంబా, దృగంతాగ్నికుండా,
సమస్తాగమాంభోనిధీ! సర్వభూషా;
జగంతావృతాంశుజ్వలద్దీప్తమూర్తీ
నిరాకార! యాశా నిరస్తాఘపాతా!

బిజ్జ:—నీలా! పోపో! నాకుఁ బనియున్నది. నీపాట లింకొకచోటికిఁ బోయి పాడుకొనుము.

నీల:—

అనంతప్రకాశా, హరా, చిన్మయూర్తీ
ఘృణా క్షప్తమూర్తీ, పరాత్పారదృశ్యా,
సుధాధామమాళీ, విశుద్ధాంకరాత్మా,
ప్రధా శ్రేణీమూర్తీ! శుభప్రాప్తిహేతూ.

(నిష్క్రమించును.)

జగదేవుఁడు—(ప్రవేశించి) మహారాజా! వచ్చితిని.

బిజ్జ:—జగదేవా! నీవు నిన్న బసవేశ్వరుని భోజనమునకుఁ బిలచితివటగదా! బసవేశ్వరుఁ డెవరి యింటికిని రాడు; మీయింటి కెట్లు వచ్చెను?

జగ:-ఆమహాప్రభువుదయ నామీఁద దొరలినది.

బిజ్జ:—జగదేవా! రాజులు చారచక్షువులుగదా!

జగ:—ప్రభూ! నేనేమిదోష మాచరించితిని?

బిజ్జ:—బసవేశ్వరుఁడు నేఁడు నీరాజును జంపు మనును.

జగ:—మహాప్రభూ! అట్లనఁడు.

బిజ్జ:—అనినచో.

జగ:—నారాజు నాచేతిలోఁ జావఁడు. నారాజు చేతిలో వేయిగుణము లెక్కువ నైపుణ్యము గల ఖడ్గ మున్నది.

బిజ్జ:—నీ వాగ్దానమునందు రాజును వదలిపెట్టుట నీ విధియైయుండెను. నీ వట్లు చేయలేదు. జగదేవా! వృథావేశము భక్తి కాదు. భక్తి జ్ఞానముతోఁ గూడియుండవలయును. దివ్యమైన తర్కముమీఁద నాధారపడియున్న మతమును వదలి గణాచారుల మత మవలంబింపకుము. అవలంబించితివేని, రాజద్రోహము పందులలో నిముడ్చుకుము. నేను చనిపోయినచో నా కొడుకులు రాజులగుదురు. నీవు కావు. బసవేశ్వరుఁడు కాఁడు. నా కొడుకులు బలహీనులైనచోఁ జైలపదేవుని సంతతివాఁడు సోమేశ్వరుఁడు రాజగును. బసవేశ్వరుఁడును గాఁడు. జగదేవుడును కాఁడు. నీ వాగ్దానమునుండి నీ విప్పుడు మరలలేవు. జగదేవుని నే నెఱుఁగుదును. అందుచేత వాగ్దాన ముపసంహరింపుమని నేను జగదేవు నడుగను. కాని నీ రా జెవరో యాలోచించుకొనుము. ఏరాజు ఉప్పు నీవు తింటివో యారాజును జంపి నీవు శివలోకమునకుఁ బోలేవు. పోదువుపో, ప్రమథులలో నొక ప్రమథుఁడవై సూకరముఖుఁడవో, యుష్ట్రముఖుఁడవో శునీముఖుఁడవో యొక డయ్యెదవు. అప్పుడు నీకేమి కన్పించినది?

జగ:—మహారాజా, త్రిశూలము కన్పించినది.

బిజ్జ:—సరిగా నిన్న యీవేళకు నాకును త్రిశూలము కన్పించినది. నాకిది మూఁడవసారి కన్పించుట. మొదటిసారి నేను జైలపదేవుని సంహరించినప్పుడు కన్పించినది.

కపురంపుఁగదళుల్ సెలార్చు గిరినెన్కన్ దీప్తిమన్మూర్తియై
విపులాకాశము నావరించుచుఁ ద్రిధావిర్భూతరోచిశ్ఛటా
కృపమై సత్త్వరజస్తమోవివరణక్రీడాప్రచండంబు తై
లపదేవుం డెటు చూచె నేను ద్రిశూలం బట్టులే చూచితిన్.

జగ:—మహారాజా! త్రిశూలము నేనును నట్లే చూచితినిగాని తమవలె నింత సువిస్పష్టముగా దానిని నిర్ణయించుకొనలేదు. తద్వర్ణనమునందు మీ వాక్కునకుఁ గలిగిన ప్రసాదము నాకుఁ గలుగలేదు.

బిజ్జ:—జగదేవా! నీ మనస్సునందు రాజనీతిశోభ జ్ఞానము పోయి కవితాసౌందర్యజ్ఞాన మెక్కువైనది. నీనుండి యమాత్యత్వశక్తి పోయినది.

జగ:—ప్రభూ! నా యమాత్యఖడ్గము నిందు వదలి పోయెదను.

బిజ్జ:—ఓయీ! ఖడ్గవిసర్జనము సేయకుము. వాగ్దానముమాట చూచుకొమ్ము. ఖడ్గరహితుఁడైన శత్రువునుమాత్రము తాఁకకుము. పొమ్ము.

(జగదేవుఁ డధోముఖుఁడై నిష్క్రమించును.)

బిజ్జ:—అదిగో! త్రిశూలము!

నడుమ సితమండలమ్ము నారయుడను గించి
దరుణమండల మాపైని శ్యామలోగ్ర
మండలమ్ము ముమ్మొనవాలు మంచుఁగొండ
స్వచ్ఛశిఖరమ్ము పైని సాక్షాత్కరించు.

నేనో, జగదేవుఁడో!

[తెర]

---

# తిక్కన గద్యరచన

క్రొవ్విడి రామం
భళ్లమూడి నరసింహశాస్త్రి

"గద్యం కవీనాం నికషం వదంతి." మానవ జీవితమునందలి వివిధ ప్రవృత్తులను ఆహ్లాదకరముగా నిరూపించడమే సారస్వతముయొక్క పరమావధి. మహాకావ్యములన్నీ జీవితనాటకమందలి వివిధభాగములను యథార్థముగా చిత్రించి, ధర్మసమన్వయము చేసినవి. "రసో వై సః" యని కీర్తింపబడు పరమాత్మతత్త్వమును రసాత్మకములైన కావ్యములయందు విజృంభింపచేసి మహాకవీశ్వరులు కవితా సామ్రాజ్యమును సృష్టించినారు. సమస్తమైన మానవులకును నిత్యమై, సత్యమైన హృదయధర్మములను, మానసికప్రవృత్తులను ప్రదర్శించుటచేతనే కావ్యములకు స్థిరత్వము సిద్ధించినది. ఏడవశతాబ్దమునందు భవభూతి ఉత్తరరామచరిత్రమునందు చిత్రించిన విషాదఘట్టములు నేడుకూడ పాఠకులహృదయములను ద్రవింపచేయుటయే సాహితీపటిమకు ప్రబల నిదర్శనము. మహత్తరమైన అనుభవములు, గంభీరమైనభావములు, ఉత్కృష్టమైన కళానైపుణ్యము గల కావ్యములే రసవంతములై చిరస్థాయిగా యుండగలవు.

భారతీయవిజ్ఞానమును విజృంభింపచేసి, ప్రాచ్యనాగరికతను వ్యక్తీకరించుటలో భారతం అగ్రస్థానాన్ని అలంకరించినది. ఈ మహాగ్రంథమును ఆంధ్రభాషలోనికి అనువదించుటలో తిక్కన మాతృకకు మెరుగుపెట్టినాడు. సంస్కృతభాషా సంప్రదాయమును గాని, ఆంగ్లభాషా సంప్రదాయమునుగాని చూచినట్టయితే, ఆయా భాషలలోని యాదిగ్రంథములు పద్యరూపములుగనే వున్నాయి. కాని ఆంధ్ర సారస్వతములోని ఆదిగ్రంథమైన మహాభారతమునందు నిశిత ప్రతిభావంతమైన గద్య పద్యరచనలు అహమహమికా భావంతో శోభిస్తున్నవి. తిక్కన పద్యమునందు యెటువంటి కళానైపుణ్యము ప్రదర్శించినాడో, గద్యమునందుకూడా అటువంటి కళానైపుణ్యమునే ప్రదర్శించి, ఉత్కృష్టమైన సంఘటనలన్నిటిలోనూ గద్యమునుకూడా ప్రయోగించినాడని నిరూపించడమే యీవ్యాసముయొక్క యుద్దేశము.

సహృదయులు విమర్శన దృష్టితో తిక్కన వచనమును పరిశీలించినప్పుడు అప్రతిహతమైన కళాచాతుర్యము వ్యక్తమవుతుందని వేరే చెప్పనక్కరలేదు. వివిధములైనవర్ణనలూ, నర్మగర్భితంగాయున్న గంభీరమైన భావములు, యీ మహాకవి గద్యములోకూడా విశదీకరించినాడు. యింతేకాకుండా వివిధ పాత్రల హావభావనిరూపణ, మానసిక ప్రవృత్తుల వర్ణనకూడా గద్యమునందు కనపడుతున్నది. విశ్వరూప సందర్శనము, వ్యూహనిర్మాణము, మొదలైన ఉత్కృష్టఘట్టములు వచనములలోనే వివరింపబడ్డాయి. యిదిగాక వివిధములైన అలంకారములు, ధ్వని వ్యంగ్యము మొదలైనవి తిక్కనవచనములో పుంఖానుపుంఖాలుగా కనపడుతున్నవి. ఈకవీశ్వరుని వచనమును జాగ్రత్తగా పరిశీలించినట్లయితే నాలుగువిధములైన గద్యము మనకు వ్యక్తమవుతుంది. మొదటిది హృదయావేశముతో కూడిన వచనము (**emotional prose**). యిది యుద్ధ వర్ణనయందు, భయానక బీభత్సరసములను విజృంభింప చేయవలసివచ్చినప్పుడు ప్రయోగించినాడు. రెండవది భావావేశముతో కూడిన గద్యము (**Descriptive and imaginative prose**). ప్రభాతకాలము సంధ్యాసమయము మొదలైనవి వర్ణించినప్పుడు యిటువంటి గద్యమును ఉపయోగించినాడు. మూడవది రాజనీతి ప్రయోగించినప్పుడు, కళాప్రపూర్ణమైన ఘట్టములను చిత్రించవలసి వచ్చినప్పుడు ఉపయోగించిన వచనము. దీనినే **Diplomatic and artistic prose** అని అంటారు. నాలుగవది పాత్రలు పరస్పరంగా సంభాషించినప్పుడు ఉపయోగించిన వచనము (**Dialogue prose**). యిది అలంకార వివర్జితమై సామాన్యంగా ఉంటుంది. ఈవివిధములైన గద్యరచనలలోనూ తిక్కన ప్రదర్శించిన కళానైపుణ్యను, పద్యములయందు ప్రదర్శించినదానికంటె యెంతమాత్రము తీసిపోలేదని ముందుముందు రుజువు చేస్తాము.

ఈమహాకవి అప్రతిహతంగా ప్రదర్శించిన కళావిశేషములలో భావశ్లేష (**Dramatic Iromy**) ఒకటి. దీనిని తిక్కన పద్యములలోనే కాకుండా గద్యమునందుకూడా ప్రయోగించినాడు. సుదేష్ణతో ద్రౌపది స్వవిషయంగురించి చెబుతూ, "పురుషపంచకసనాథనై యుండుదు, నొక్కకారణంబున నద్ధకులకు విరోధులచేతం బకులపన్నిధిం దలపట్టియాద్యంబకి వనంబున కరిగి వ్రతంబుపై వల్లభసహితంబుగా వన్యాహారంబులం గాలంబు గడపుచు బ్రహ్మచర్యంబు నడిపితి నికమీద నియమాచరణంబునకు నొక్కసంవత్సరంబు గొరంత గలదు" అని అంటుంది. పైవాక్యములయొక్క భావం పాఠకులకు ఒకలాగ, సుదేష్ణకు మరొకలాగ అర్థమవుతుంది. ఈవృత్తాంతం వినగానే పాఠకులకు ద్రౌపది పూర్వచరిత్రమంతా స్ఫురిస్తుంగ కాని సుదేష్ణకుమాత్రం యీవిషయం అవలతం కాలేదు. ఆమె ద్రౌపదిని కష్టముదిపాలైన గృహిణిగా మాత్రమే తెలుసుకోగలిగింది. యీవిధమైన భావశ్లేష పద్యంలో ఉంటే ఆలంకారికులు దానిని లక్ష్యంగా యిచ్చి యెంతో వ్యాఖ్యానం వ్రాస్తారు. కాని గద్యంలో యెంతప్రతిభను ప్రదర్శించినా తగినశ్రద్ధ తీసుకోరు.

విరాటపర్వం ద్వితీయాశ్వాసంలో మల్లయుద్ధ ప్రారంభాన్ని తిక్కన యెంతో సొగసుగా వర్ణించేడు. స్వభావోక్త్యలంకారానికి యిది నిదర్శనమైన ఉదాహరణము. యిదిగాక మల్లయుద్ధంలో ఆనాటికి ఉండే కొన్ని విచిత్రమైన సంప్రదాయములను కూడా యిక్కడ వర్ణించినాడు. "యుద్ధరంగంబుమన్ను ఫాలప్రదేశంబుల ధరియించి శిరంబులపై జల్లుకొని రెండుచేతుల మునివ్రేళ్లను గొండొకవుచ్చికొని యొండొరుల

దపకు వైచి'' మొదలైన వాక్యములు యుద్ధారంభమునందు మల్లవీరుల చేష్టలను మనోహరముగా వ్యక్తీకరిస్తున్నవి.

గద్యభాగంలో ఉండే వర్ణనలలో రెండు విధములైన విచిత్రములు కనపడుతున్నవి. ఒక సంఘట్టనను యథార్థంగాను, మనోహరంగాను వర్ణించి స్వభావోక్తియందలి ప్రావీణ్యమును తిక్కన యేవిధంగా నిరూపించినాడో యిదివరకే మనవి చేసినాము. సంఘట్టన యొక్క యథార్థస్వరూపమును యేమాత్రం వర్ణించకుండా శ్లిష్టోపమల చేతనే ఆసంఘట్టనను పాఠకుల మనోనేత్రంయెదుట చిత్రించడం రెండవ విధమైన చమత్కారం. యిటువంటి వర్ణనాచమత్కృతి కీచకుని నర్తనశాల వర్ణనలో మనకు కనపడుతుంది. ఈ నర్తనాగారం తాలూకు స్వరూపం 'ఇదమిత్థం' అని కవి యెక్కడా చెప్పలేదు. కాని "ఘోరాటవీభాగంబునుం బోలె నిర్మనుష్యంబును, అనభ్యస్త శాస్త్రంబునుం బోలె దుర్గమంబును, స్వప్నలబ్ధ పదార్థంబునుం బోలె నదృష్టిగోచరంబును, విషమకావ్యంబునుం బోలె నస్పష్టాలంకారంబును'' మొదలైన శ్లిష్టోపమల చేత కలుషితమైన నర్తనాగార స్వరూపం పాఠకులకు స్ఫురింపచేసినాడు. యీవిధమైన కళానైపుణ్యం కాదంబరివంటి సంస్కృతకావ్యాలలో మనకు వ్యక్తమవుతుంది.

కేవల వర్ణనావిషయంలోనే కాకుండా రాజనీతి ప్రయోగించినప్పుడు నర్మగర్భంగా గంభీరమైన భావములను వ్యక్తీకరించవలసి వచ్చినప్పుడుకూడా, తిక్కన నిశితప్రతిభావంతమైన గద్యమును ప్రయోగించినాడు. కీచకునిచేత పరాభవింపబడి ద్రౌపది కుంగిపోతున్నప్పుడు, ధర్మరాజు ఆమె పరాభవమునకు తగిన ప్రతీకారం చేయకపోవడమే కాకుండా ద్రౌపదినే మందలించి సభను విడచి వెళ్లిపొమ్మని చెప్పినాడు. అప్పుడు ద్రౌపదికి ధర్మరాజుపైన అపరిమితమైన కోపం వచ్చి, "మత్పతి శైలూషుండు కాడు, కితవుండునుం గావున జూదరియాలికి గరువతనం బెక్కడియది'' అని అంటుంది. ఈ నర్మగర్భితమైన నిందావాక్యములవల్ల ద్రౌపది ప్రౌఢత్వము మనకు వ్యక్తమవుతున్నది. తన ఆత్మగౌరవమునకు భంగం కలిగినప్పుడు ఆధునిక నాగరక స్త్రీలవలెనే భర్తనుకూడా మందలించుటకు వెరవని ధీరనారీశిరోమణి ద్రౌపది. ధర్మరాజుయొక్క జూదమునందలి వ్యామోహమే ద్రౌపదీభంగపాటునకు కారణమని "జూదరియాలికి గరువతనం బెక్కడియది" అనే వాక్యంలో ధ్వనిస్తున్నది. యింతేకాకుండా మనోహరమైన సంఘట్టనలను చిత్రించడంలో ఆరితేరిన శిల్పి తిక్కన. అనేకమంది మనుష్యులున్నప్పుడు వారిలో యిద్దరు యితరులకు యేవిధమైన అనుమానం కలిగించకుండా, ప్రత్యేకంగా మాట్లాడుకునే విధానాన్ని యీయన రెండుచోట్ల అతిరమ్యంగా నిరూపించినాడు. యీఘట్టములో, ద్రౌపది బహిరంగసభలో క్రోధపూరితమైన మాటలతో ధర్మరాజును నిందిస్తున్నప్పటికీ వీరిద్దరకుగల ప్రత్యేకసంబంధాన్ని గాని ద్రౌపది తాలూకు నిజమైన భావములనుగాని, విరటుని సభలో యెవరూ గుర్తించలేకపోయినారు. యిటువంటి చమత్కారమైన ఘట్టములను పూర్వకవీశ్వరులు సాధారణంగా పద్యములలోనే చిత్రించేవారు. ఉత్కృష్టమైన వచనంలో కూడా యిటువంటి ఘట్టములను రచించిన మహాకవియొక్క కళాప్రపూర్ణతను పాఠకులే ఊహింతురుగాక.

తిక్కన అమాత్యుడైనందుకు తన రాజనీతి కౌశలాన్ని భారతమంతటా అప్రతిహతంగా ప్రదర్శించినాడు. శస్త్రాస్త్రములను సంధించి సేనాసముద్రాన్ని యెదుర్కొనవలసి వచ్చినప్పుడు యెటువంటి కళానైపుణ్యాన్ని ప్రదర్శించవలసి యుంటుందో, సౌధాంతరాళములందు రాజనీతిజ్ఞులతో ప్రసంగించినప్పుడు యెటువంటి ప్రజ్ఞను విజృంభింపచేయవలసి యుంటుందో తిక్కన బాగా గ్రహించినాడు. యిటువంటి సంఘట్టనలలో సాధారణంగా వ్యక్తమయే హావభావ విలాసములనుకూడా యెంతో ఉచితముగా నిరూపింపగల మేధావి తిక్కన. గోగ్రహణసమయంలో కౌరవసేనాసముద్రాన్ని యెదుర్కొనడానికి ఒంటరిగా వస్తున్న అర్జునుని చూచి ద్రోణుడు అబ్బురపడతాడు. తన శిష్యునికి నిష్కారణంగా సమయభంగం అవుతుందేమోనని భయపడి తన సందేహనివారణంకోసం భీష్ముని ప్రశ్నిస్తాడు. ప్రతికక్షులనుగురించి బహిరంగంగా ప్రసంగించడం యుక్తం కాదుగనక "సురనదీసూను వదనంబు వీక్షించి సన్నవార నిట్లనియె". యీవిధంగా యుద్ధరంగంలోని సేనానాయకుల ఆంగికచేష్టలనుకూడా యుక్తంగా యీకవి వర్ణించినాడు. ద్రోణుని సందేహాన్ని భీష్ముడు గ్రహించినాడు గాని వెంటనే ప్రత్యుత్తర మిచ్చినట్టయితే వీరిద్దరు ప్రత్యేకంగా మాట్లాడుకోవడం చూచి దుర్యోధనుడు అనుమానిస్తాడేమోనని, ద్రోణునికి కావలసిన విషయమును నిగూఢంగా వుంచి దుర్యోధనునితో ప్రసంగిస్తాడు. ద్రోణుడు అవహితుడు కాబట్టి సంతోషకరమైనవార్తను విన్నప్పటికీ తన సంతోషమును యెంతమాత్రము పైకి వ్యక్తీకరించలేదు. "సమయభంగంబువలని సంకటంబు లేకునికి మనంబున ప్రియంబంది మొగంబున దోపనీక'' అని అవసరమైనప్పుడు బహుసూక్ష్మమైన హావభావములనుకూడా యథార్థముగా వర్ణించి పాత్రను రమ్యంగా మనోనేత్రంయెదుట సృష్టిస్తాడు.

తిక్కన భారతంలో ప్రదర్శించిన రాజకీయ విజ్ఞానాన్ని పరిశీలించినట్టయితే యీ మేధావి ఉత్కృష్టమైన ఆధునికరాజకీయవేత్తలతో సమానమైనవాడుగా కనపడతాడు. సంజయరాయబారఘట్టంలో యీ అమాత్యుడు రాజనీతిని అత్యద్భుతంగా ప్రయోగించినాడు. సంజయుడు కౌరవులపక్షమున రాయబారిగా వచ్చినప్పుడు, ధర్మరాజు యీ రాయబారిని గౌరవించి కుశలప్రశ్నలు చేస్తూ "కార్యమునకు ఖడ్గమునకు కర్ణుని ఆచార్యత్వము'' చెల్లుతున్నదా? అని ప్రశ్నిస్తాడు. దీనికి ప్రత్యుత్తరంగా సంజయుడు, "కురురాజునొద్ద నవినీతులు, నీతిమంతులు, సత్త్వసంపన్నులు, దురహంకారులు, మరియు వివిధ ప్రకారులయి వెరసియుండుదురు'' అని చెబుతాడు. పైప్రశ్నకు సంజయుని ప్రత్యుత్తరమునకు పరస్పరసంబంధం లేకపోవడంచేత పాఠకుడు అబ్బురపడతాడు. కాని ధర్మరాజు

కర్ణుని నర్మగర్భంగా యెత్తిపొడుస్తున్నాడని గ్రహించి, మహారాజులను వివిధ ప్రవృత్తులు గలవ్యక్తులు ఆశ్రయిస్తారనిన్నీ, ప్రత్యేకంగా దుష్టులనే నిరూపించ వక్కరలేదనేభావంతో ధనంజయుడు మిక్కిలి వినయంగా జవాబు చెప్పేడు. ఈవిధమైన రాజనీతి కౌశల ప్రయోగము అమాత్యశేఖరుడైన తిక్కనకే చెల్లింది.

వివిధ గద్యరచనలను అతిరమ్యంగా వ్యక్తీకరించడంలో తిక్కనది సిద్ధహస్తం. సందర్భానుసారముగా చమత్కారమైన వాక్యములను వ్రాయుటలో తిక్కన గొప్పతనమును గురించి యిదివరకే మనవిచేసినాము. యిప్పుడు అలంకారభూయిష్ఠమై, భావావేశముతోనూ, వర్ణనలతోనూ కూడినగద్యమును పరిశీలిస్తాము. ప్రకృతియొక్క గాంభీర్యము, వైచిత్ర్యము, ప్రభాతకాలమునందు, సాయంసమయమందు యెక్కువగా వ్యక్తమవుతుంది. కాబట్టి ప్రకృతిని వర్ణించవలసి వచ్చినప్పుడు కవులు సాధారణంగా యీరెండుసంధ్యలనే వర్ణిస్తారు. తిక్కన ప్రభాతకాలవర్ణన యెక్కువభావావేశముతో కూడుకొని వుంటుంది. దీనినే ఆంగ్లభాషలో (Poetic imagery) అని అంటారు. యిటువంటి గద్యరచన మహాకావ్యముల ఉత్కృష్టతను (epic dignity) యెక్కువగా వ్యక్తీకరిస్తున్నది.

విరాటపర్వం ద్వితీయాశ్వాసంలోయున్న ప్రభాతకాలవర్ణనలో తిక్కన అమోఘమైన కళానైపుణ్యాన్ని వ్యక్తీకరించినాడు. సాధారణంగా ప్రభాతకాలాన్ని వర్ణించవలసివస్తే కవులు, సూర్యోదయాన్ని, పక్షులకిలకిలారవములను, పద్మసముదాయాన్ని క్రమంగా వర్ణిస్తారు. కాని ఉత్కృష్టమైన కళారాధకుడు చేయవలసినపని అంతమాత్రమే కాదు. రాత్రి అంతా చైతన్యవిహీనంగా పడియున్న లోకమునకు ప్రభాతము యెటువంటి చైతన్యము, ఉత్తేజము కలిగించినదో చెప్పి, అటువంటిసంచలనము, ఉత్తేజము కలిగించిన ప్రభాతముయొక్క గొప్పతనమును పాఠకుల ఊహకుమాత్రమే అందజేయకలిగినప్పుడే కళారాధకునిప్రతిభ వ్యక్తమవుతుంది. తిక్కన ప్రభాతకాలవర్ణనలో యిటువంటి చమత్కారమే మనకు కనపడుతుంది.

ఉదయంకాగానే చెట్లు తమశాఖలపై ఉండేపక్షుల రవములచేత ఒకదానిని ఒకటి పలకరించు చున్నాయి అనిన్నీ, గతరాత్రి నిద్రలేక పోవడంచేత కామినీజనం యొక్క కళ్లు కెంపుబారినా, తెల్లవారుజామున మందమారుతం వారిని లేపలేదనే కోపంచేతనే కళ్లు ఎరుపెక్కినవనిన్నీ, వర్ణించుటచేత, రాత్రి జడమయంగావున్న ప్రకృతికి ప్రభాతం యెటువంటిచైతన్యమును కలిగించినదో పాఠకులే సులువుగా గ్రహించగలరు. యిదిగాక ఆలంకారికులు నిర్దేశించిన ఉపమ, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి మొదలైన అలంకారములు పుంఖానుపుంఖములుగా యిటువంటివర్ణనలలో కనపడతాయి.

భారతయుద్ధంలో ఆనాటివీరుల పరాక్రమాలు, యుద్ధసంవిధానమే కాకుండా, యుద్ధమునందు అవలంబించే కొన్ని సంప్రదాయములు, వ్యూహనిర్మాణవిధానము మొదలైనవికూడా తిక్కన యెంతోచక్కగా వచనములో వివరించినాడు. అర్జునుడు, గురువర్యులైన ద్రోణునితో యుద్ధముచేయవలసి వచ్చినప్పుడు, తాను ముందు ద్రోణునిపాదముల దగ్గరగా పడేటట్టు రెండుబాణములును, భుజములకు సమీపంగా వెళ్లేటట్టు రెండుబాణములను విడిచిపెట్టినాడు. మొదటిరెండుబాణములు ప్రణామమును, తరువాతి రెండుబాణములు కుశలప్రశ్నను సూచిస్తాయి. క్షాత్రధర్మప్రకారము యుద్ధముచేసినా, శిష్యధర్మానుసారంగా భక్తిప్రపత్తిని చూపించే ఆయోధుని ధర్మనియతిని మనం యెంతైనా మెచ్చుకోవలసియున్నది. ఈవిషయమునుగురించి తిక్కన విరాటపర్వం చతుర్థాశ్వాసంలో సరసమైన వచనంలోనే వివరించినాడు.

ప్రతికక్షులకు అభేద్యంగా ఉండగలందులకు పూర్వం యుద్ధరంగంలో వ్యూహనిర్మాణం చేసేవారు. ఈ వ్యూహంయొక్క పటిమ నిర్మాతయైన సేనానాయకుని దీక్షశక్తినిబట్టి ఉంటుంది. "తానును ద్రోణుండును ముందర నిలచి, వలపట కృపాశ్వత్థామలును, దాపట కృతవర్మమద్రేశ్వరులు, వెనుక బాహ్లికసోమదత్త భూరిశ్రవులును, నడుమను కురుకుమార సహితంబుగా మహీనాథుండును, అతని అగ్రభాగంబున సంశప్తకులైన సుశర్మ మొదలుగాగల పదివేవురు రథికముఖ్యులును, నిలువ నట్లుగా నియమించి, తగ వర్మోపేతంబుల కేనుంగులు, వీనుంగుల కరదంబులు, అరదంబులకు దురంగంబులు, దురంగంబులకు బిండ్లవారు, బిండ్లవారికి సద్ధాయుధులునడ్డంబుగ తెరంగున నిలువ నియోగించి" భీష్ముడు అప్రతిహతమైన మానుష వ్యూహమును నిర్మించినాడనిన్నీ యిటువంటి వ్యూహమును కని, విని యుండలేదనిన్నీ భీష్మపర్వం ప్రథమాశ్వాసంలో యున్నది.

బీభత్సభయానకరసజనకము లైన యుద్ధభూమిని పాఠకులకు యేమాత్రం జుగుప్స కలిగించకుండా యీకవి వర్ణించినాడు. యీ సందర్భంలో ఉపయోగించేవచనం యెక్కువ హృదయావేశంతో కూడుకొని వుంటుంది. మచ్చుకు ఒకటిచూడండి. "నిలునిలుమని యదల్చిన ఘోషంబుతోడన వెడలు నిశితశరపరంపరల, దట్టంపుబరపున నంబరంబు నీరంధ్రం బగుటయు దదంధకారంబున భయతిమిరంబు నం గలిసి గుండియ లవిసి కురుబలంబు యెదురునడువను, మరలం బరవను మరచి, వెరచరిచి, హరితనయ హస్తలాఘవ ప్రశస్తిం దక్కం దక్కిన చేష్టలు దక్కియుండె" యీ విధమైన (emotional prose) హృదయోద్వేగాన్ని కలిగించేగద్యము, యుద్ధభూమియొక్క సహజస్వరూపాన్ని యెంతో చక్కగా పాఠకులకుస్ఫురింపచేస్తుంది. ఇంతే కాకుండా వీరాధివీరులను వర్ణించినప్పుడు, రూపకాది అలంకారములచేత వారిధైర్యస్థయిర్యములను, శౌర్యప్రతాపములను నిరూపించినాడు. విరాటపర్వం చతుర్థాశ్వాసంలో అర్జునుడు చిత్రాంగద ప్రభృతి కుమారులను యెదుర్కొన్నప్పుడు వారి ప్రతాపమును వర్ణిస్తూ "గుణధ్వనితంత్రీ నాదంబుగా, గాండీవంబు వీణగా వినోదంబు సలిపె" అని చెప్పినాడు. వీరప్రదర్శనాన్ని సంగీతప్రదర్శనంతో యెంతచక్కగా సరిపోల్చినాడో చూడండి!

తిక్కన యీ మహాకావ్యరచనారంభమున "శ్రీ విభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వదీక్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్" అని కవి ప్రతిజ్ఞను చేసినాడు. పద్యకవిత్వమునందు యెటువంటి ఉత్కృష్టతను విజృంభింప చేసినాడో గద్యకవిత్వమునందు కూడ అటువంటి ప్రతిభనే ప్రదర్శిస్తానని తానే ముక్తకంఠముగా చెప్పినాడు. తిక్కన గద్యకవితామాధుర్యమును పాఠకులకు యథాశక్తిగా మనవి చేసినాము. ఇది గద్యయుగము. నేడు చాలామంది మహాకవీశ్వరులు గద్యకావ్యములకే యెక్కువ ప్రాధాన్యము నిచ్చుచున్నారు. కనుక ఆంధ్రులుకూడ కళాదృష్టితో ఉత్కృష్టమైన గద్యకావ్యములను వ్రాయాలి. ఆంధ్రుల భాగ్యవశమున వారి ఆది గ్రంథమందే గద్యపద్యరచనలు అహమహమికాభావంతో శోభిస్తున్నవి. కనుక ఆధునిక కవీశ్వరులు తిక్కనాది కవుల రచనలను పరిశీలించి, నిశితప్రతిభావంతములైన గద్యకావ్యములను సృష్టించవలసి యున్నది. పుస్తకమును వల్లెవేయించి, పట్టప్రదానము చేయుటకంటె ఉత్కృష్టమైన సాహిత్యసృష్టికిని, సాహిత్య పరిశోధనకును తగిన ప్రాధాన్యము ప్రోత్సాహము యిచ్చినప్పుడే విద్యాసంస్థలు నిజమైన భారతసేవ చేయుగలవు.

---

# 'గీతాలు'

విద్వాన్ విశ్వం

ఆవినూతనభావనిశాంతమందు
పాడుకొనుచుంటి నొక్కయభాగ్యగీతి;
ఎవరు చెవియొగ్గి యిటుపరికించువారు ?
ఎవ్వ రందలిరస మారగించువారు ?

కట్టఁ దెగఁగొట్టుకొని యిరుగట్టులొరసి
పాఱుచున్నది మాసెలయేఱొకండు
చవుల నలరునానిర్మలజలమునందు
అలతినడకలఁ దిరుగ రాయంచ యేది ?

పలురకమ్ములపటములు పరిఢవిల్ల
జిలుగునగిషీ లొనర్చితి చిన్నియింట;
మినమినలఁ దేలిపోవునామేడయందు
తిరుగులాడి యానందించు తెఱవ యేది ?

రకరకాలసుమాలచీరల ధరించి
చివురుమేల్ముసుంగుల సరిచేసుకొన్న
లేగులాబీల నలరుమాలేతపూల
తోట;లోవిహారించునాథుం డెవండు

పులుకుపులుకునఁ దేనియ లొలుకుతొక్కు
పల్కులంబల్కు మాచిటిపాపకూన;
చిలిపిచేతల నర్థముఁ జేసుకొంచు
మురిసిపోయెడుదాత యెవ్వరుడు గలడు ?

ఆమనోహరదివ్యరుతాంతరమున
మలయుచున్నవి కప్రపుపలుకు లెన్నొ ?
వానివలపులు తీవియవాఱుచుండె
భూనభోంతరమును దాటిపోవుచుండె

హృదయము ద్రవించి ప్రకృతిదారిద్ర్య మెంచి
దివ్యవాణీవిలాసమ్ము తేజరిల్ల
పలుకుపలుకున కన్నీరు చిలుకరించి
ఆలపించినా నెన్నొగీతాల నిట్లు

కడుపుదహియించుకొనిపోయి కనుల నీరు
గోటమీటుచు పాడు నీపాటలందు
అబ్బ ? మంటల నెగయుచు సంతరమ్ము
గాల్చివేయునగ్నిని నార్పఁగల డెవండు ?

---

# వింత పోకడలు

వెంపటి నాగభూషణం

మన్మథుడు మంచీ చెడ్డలు విచారించడానికి అవకాశం ఇవ్వకుండా—

మన్మథుడు బాణాలమీద బాణాలు కురిపిస్తూ ముందుకు దూకిస్తూ ఉన్న పదును పదను వయసులో మెరిసిపోతూన్న నాదముని—

భోజనం చేయగానే గోపాలపురం నుంచి అడ్డదోవను అంతదూరమూ నడిచివచ్చేవాడు—శ్రద్ధగా నాదగ్గర "కుసుమాంజలి" చదువుకునేందుకు!

స్వరాజోద్యమ ప్రారంభాన ఆవేశంతో ఆనర్సు పూర్తిచేయకుండా వదిలేసి మైసూరులో పరిభాషల దాకా వ్యాకరణం వల్లెవేసి అభ్యాస దీక్ష కాలు నిలువనీయనందువల్ల మదరాసు తిరిగివచ్చేశాడు.

—లైబ్రరీలో ఆరంభమైన ఎరిక బీచ్ సావాసాన పరిచయంగా ముదిరింది. చూసినప్పటి నుంచీవాత్సల్య-ప్రణయం రెచ్చగొట్టే సౌమ్యవైఖరి ఆతన్ని నా అంతేవాసినిగా చేసింది.

ఉదయం నేను అడయారు వెళ్లి వచ్చేవాణ్ణి. మధ్యాహ్నమంతా నాదమునికి ఉదయన ప్రజ్ఞావివరణంతో ఖులాసాగా గడిచిపోయేది. ఎంతబలవంతం చేసినా వినదందువల్ల నేనుకూడా, విధిలేక, కులపతి దర్జాతో ఆతని సరదా మన్నిస్తూ పరిచర్యలు అందుకోవలసివచ్చేది. అంటే పాద సంవాహనాదికములు కావు! మన కామితములు కాఫీ - సిగరెట్టు గణములో నివేకదూ!

చూసేవారు—అంటే, మామూలుపరిచయంమాత్రం ఉన్నవారు—నాదముని శాస్త్రనిష్ణాతుడని కలలోనైనా తలచేందుకు వీలులేదు. ఆకారం, భాషణ, రంగేలీ కాలేజీవాలాఎవడో అనిపించేది. మనతో జోస్తీకుదిరిన తరువాత కావ్య-నగిషీ మనసుకు అనుభవ - శృంగారంమెరుగురావడం ఎంతసేపు! ప్రత్యక్షప్రమాణాన్ని లక్షించే వారిలో అగ్రపూజ మనదే, అందువల్ల! కాని, ఇంతవరకూ ఆతను ఎక్కడా స్వతంత్రించలేదు. నేను చూస్తూ ఉండేవాడిని—త్రోవను వచ్చేటప్పుడు గుమ్మాలలోను, కిటికీల దగ్గరా వయ్యారాలు తేలిపోతూ కనిపించే ద్రావిడకన్యలు నాదముని సందుమలుపుతిరగగానే దగ్గరకు వచ్చేదాకా తనివిదీరా వాలుచూపులు విసిరి ప్రక్కకో, లోపలికో తప్పుకుని మళ్లా కనపడీకనపడకుండా మాయింటిగుమ్మం ఎక్కేదాకా మనసులో మాటలు చూపులతో వెంటరాయబారములు పంపేవాళ్లు! కాని, ఏమనుకునేవాడో బయటకి తొణకడు నావద్ద. ఆప్రస్తావనే తీసుకువచ్చేవాడుకాదు. నేను వేయికన్నులతో కనిపెట్టిచూసేవాడిని మావీధినిఉన్న ఏఅప్సరనోమైనా ఫలిస్తుందేమోనని! కాని ఉహుఁ.

ఎవరికైనా మాత్రం నిదానం ఎన్నాళ్లు?

ఇక మనసునిలుపలేక సాహసించి పిలిచారు. కబురులంపారు. త్రోవకాశారు. కాని ఏంప్రయోజనం? ఏఒకరసికురాలి మనోరథమూ ఈడేరలేదు. పైగా వాళ్ల ఎత్తులు కనిపెట్టి నాదముని దోవమార్చి తిరిగివచ్చేశాడు! అంతాగమనించి నేను కొంచెం హెచ్చరికగా ఒకటి రెండుసారులు కదిలించిచూశాను. 'ఏమిటోయ్-విశేషాలు-అని మాటలధోరణిలో పురికొల్పి హుషారిచ్చి హితము ఉపదేశించాను. నాశిష్యుడు అమాయిక ప్రవరభూమికను నిర్వహించడం నాకు తలవంపుగా ఉన్నది. తెలియనివాడా? కాగలపని గురుగంధర్వుడు చేయలేడని సాగరరాజు ఆపుణ్యము కట్టుకున్నాడు.

ఓనాడు మేము బీచ్ వొడ్డున తరగల ఒరవడికి బరాబరిగా కూర్చుండగా ఆఅందకత్తె మాముందునుంచి పమ్మల్ని లక్ష్యంచేయకుండా నడిచి వెళ్లింది. ఆమెవెంటను పసిపాప తప్పటడుగులకు ఊతయిస్తూ బహుశః వాళ్లతండ్రో, మామగారో ఓపండు వంటిఆయన ఉన్నాడు.

చూడగానే నాదముని కొంచెం ఉలికిపడ్డాడు. ఉబికిపోయిన ఉత్సాహంతో ముఖం వెన్నెలచందమామలాగా కళలుతేలిపోయింది. లేవబోయినాడు. కాని, అంతలో కుదుటబడి కదలకుండా ఆమెపోయినవేపు చూస్తూ నాధ్యాస మరిచేపోయినాడు.

రేడియోపాట రాక్షసంగా ఉండటంచేత వెనుదిరిగి నేనూ ఈవాలకమంతా గమనించగలిగాను కార్యశూరునిగా చేదామని. సాక్షిగా చెపితే అపహసించానని, నేను కనిపెట్టానని, బిడియపడతాడేమోనని ఏమీ తెలి


# "హిస్ మాస్టర్స్ వాయ్స్"

## రేడియో రిసీవరు

మాడల్ నెం. 469 A. C.

వెల రూ. 400/-




మాడల్ నెం. 469 A. C.

| | | |
|---|---|---|
| 50-100 సైకిల్సు | : : | 195-250 వోల్టులు |

ఈ రేడియో రిసీవరునందు 11-2000 మీటర్లలోని సర్వదేశవార్తలనే గాక అఖిలభారత రేడియో స్టేషనులను కూడ శుద్ధముగా విన వీలగును.

ముఖ్యాంశములు

- విశాలమైన డయల్
- అతి సున్నితమైన పరికరములు
- అధికమైన శబ్దప్రసారము
- పిక్కప్ ఉపయోగింపనగును.

★ ఈ A. C. మాడలును D. C కరెంటుతో నుపయోగింప కన్వెర్టరులు సరసమైన వెలకు దొరకును.

నేడే మా యనుమతిపొందిన రేడియో వ్యాపారియొద్ద ఈ మాడలును, తదితరములను చూడుడు.

# ది గ్రామఫోన్ కంపెని, లిమిటెడ్.,

45 సౌత్ పెరేడ్, బెంగుళూరు

యనివాడిలాగా మామూలుగా వెళ్లి ఐస్‌క్రీమ్‌పట్టుకురమ్మని మేలుకొలిపాను. స్పెన్సరుబండి దూరాన గుంపుదగ్గర ఉన్నది. జనం చాటు అవడంమూలాన ఆ అమ్మాయి మాకు కనుచాటు అయింది. ఆ మాత్రం అందిచ్చినతరువాతకూడా ఇక, అల్లుకుపోకపోతే అంతటితో క్రాపూ, జోకులూ మానిపించి బ్రహ్మజిజ్ఞాసలోకి దింపవలసిందే!

కూర్చునేఉన్నాను. నాదముని తిరిగిరావడానికి ఎందుకో అంత ఆలస్యము చేస్తున్నాడు. ఎవరితోనన్నా బాతాఖానీ వేసుకున్నాడో ఏమన్నా చూస్తున్నాడో, ఏమైతేనేం, నా మాట మరచిపోయినాడు. ఇక లాభంలేదనుకొని ఎనిమిదికొట్టినతరువాత ఒంటరిగా యింటికి వెళ్లాను.

—వరాండాలో కుర్చీనిఅంటి పడుకుని నిద్రపోతూన్న వాడిలాగా ఉన్నాడు —నాదముని. మెట్లమీద అడుగులచప్పుడు విని కలవరంపడుతూ లేవబోవడం కటకటాలగుండా కనపడ్డది, నాకు.

నేను ఎదురు అవగానే లేచి తల వంచుకొని నిలుచున్నాడు నవోఢలాగా. మెల్లగా ముఖం ఎత్తి కళ్లల్లోకి చూపుతో ప్రశ్నించాను. అర్థం చేసుకుని మరీసిగ్గుపడిపోయినాడు!

ఒకనిమిషం ఇద్దరమూ మాట్లాడకుండా నిలుచునేఉన్నాము. మనసు దిటవుపరచుకునేందుకు కొంచెం వ్యవధి యిద్దామని లోపలికి వెళ్లి, దుస్తులు తీసి, స్నానం చేసి లుంగీ, బనియనుతో తల దువ్వుకుంటూ బయటికి వచ్చి ఇంకా పూర్వపు పోజులోనే ఆతడు ఒదిగి కూర్చుని ఉండటం చూసి—

"సిగరెట్ ఛాయీ" అని, మూగనోము మానిపిద్దామని, పలుకరించాను. లేచి తీసుకువచ్చి ఇచ్చి అంగారసంస్కారం స్వయంగా చేసి పన్నె అందుకుని లోపల వేసి వచ్చాడు. పచారుచేస్తూన్నవాడి నల్లా నాదముని రావడం చూసి ఆగిపోయి దగ్గరగా వెళ్లి...

"ఎవరోయ్... ఆ అమ్మాయి!" అని ఏకఘాటిని అడిగేశాను. తెల్లబోతాడని తెలుసును. కాని...అంతటితో వదిలేస్తానా? రెట్టించాను. తెలియదా ... ఇంతేనామరి—అని, మాటలతో గిలిగింతపెట్టాను.

ఇక తప్పనిసరి అయిపోయింది. ముందుకు రెండుఅడుగులు వేశాడు. ఇద్దరమూ వరాండాచివరకు చేరుకుని నిల్చుని ఉండగా ఆర్చిలోనుంచి వాళ్ల ఇల్లు చూపించాడు! మాలాడ్జికి వెనుక రోడ్డుమీదనే మాకు చాలాసమీపంలో—రెండు ఆవరణలూ కలిసే ఉన్నవనవచ్చును —ఆ అమ్మాయి ఉన్నది. ఉన్నదనుకోవడమేమిటి ఎదురుగుండా గదిలో వెలుతురున వాళ్లందరూ శుభ్రంగా కనబడుతూంటేను! ఆయన కూర్చుని పిల్లవాడితో చెలగాటూ లాడుతున్నాడు- ఆ అమ్మాయి...ఫోనుదగ్గర నిలుచుని ఏ రికార్డు మొదలువేదామా అని ఆయనను సంప్రదిస్తూన్నట్టు తోచింది.

అక్కడే...నిలబడి పోయినాము. మొదట ఆ అమ్మాయి మా యింటివేపు చూడలేదు. తరువాత చూసింది కాని గుర్తించలేదు. మరికొంతసేపటికి ఎవరో నిలుచుని తనవైపు చూస్తూన్నారని-గుర్తించినట్టున్నది. కాని, మేమేనని ఎరుగున్నదో లేదో పోల్చుకో లేదు. ఏమనుకున్నదో ఏమో తలుపు వేసుకుని మాకు కనపడకుండా మాత్రం పోలేదు.

—ఫోను రకరకాల పాటలు పలికింది. మధ్యమధ్య వాళ్లమాటలు నవ్వూ అస్పష్టంగా—ఎంతో దూరంలేక పోవడంవల్ల—చూచాయగా వినిపించినవి. వాళ్లు దీపం వేసేసుకునేటంతవరకూ ఆలాగా నిలుచుని ఉండిపోయినాము.

నాదముని రాత్రికి నావద్దనే ఉండిపోయినాడు. భోజనం చేయలేదు. కామగ్రీష్మంమహిమ! మరి ముఖమంతా కంది వాడి జేవురించిపోయింది! కనుమూయకుండా మసిలి తెల్లవారకముందే లేచి వెళ్లిపోయినాడు.

— ఆరోజునుంచీ పాఠాలకు ఆటవిడుపు. సాయంకాలము నాతో రోజూ బీచికి వచ్చేవాడు నలుమూలలా తిరిగేవాడు; తిరిగి యింటికి వచ్చి మామూలు స్థానాన వసారా చివర నిలబడి కిటికీలోకి చూసి చూసి మరునాడు పగలంతా మాయమయ్యేవాడు.

—నేను జోక్యంకలిగించుకుని ఫలరూపానికి తీసుకువద్దామనుకున్నాను. కాని, ముందుకు మంచిది, జీవితంలో ఈలాటి విషయాలలో స్వతంత్ర - అనుభవమే అక్కరకు వస్తుందికదా అని రసరూపకమునకు

ఏకైక ప్రేక్షకస్థానాన్ని మాత్రమే వాంఛించి ఊరుకున్నాను.

వాళ్లు ఇరువురూ దోవకువచ్చేస్తున్నారు. నిర్భయంగా ఒకరినొకరు చూసుకుంటున్నారు. నాదమునిచే సన్నలకు బదులు సైగలు లేకపోయినా, అభిమతం లేకపోయినా ఆ అమ్మాయి కంటగించుకోకుండా లక్ష్యము చేస్తూన్నది. కాని అంత కన్న ఏమీ అవకాశము ఇవ్వడం లేదు. మాశిష్యుడుకూడా చొరవ చేద్దామనే ఊహతో ఉన్నట్లు సూచనలు లేవు.

—చాలాతమాషాగా ఉన్నది. ఆ అమ్మాయివిషయము! వివరాలు తెలిసినమీద తత్వం ఏమో బోధపడకుండా మరిన్ని ఆశ్చర్యముగా ఉన్నది. వారిద్దరూ దంపతులు. అపసి పాప సంసారఫలము. అంతఅందగత్తె యావనవిలాసశోభలు తరితీపులు చేస్తూన్న మోహిని అవయసు మళ్లిన అరసికమూర్తితో అమిత ప్రేమతో పొరపొచ్చెములు లేకుండా కాపురము చేస్తూన్నది. రతిమన్మథుల ఆనుకూల్యాన్ని మించిపోయింది వారి దాంపత్యమని ఇంటియజమాని రూఢిగా చెప్పాడు. అది నేను అంతగా నమ్మలేకపోయినా ఒకటి మాత్రం నిజం. ఇంతవరకూ అక్కడకు వాళ్లువచ్చిన మూడుసంవత్సరములలోనూ ఆమె పెడదారితీసిందని పుకారైనా లేదు.

—అయితే, యిటీవలిచర్యను బట్టి సుముఖురాలు కాదనడానికి ఏలాఏలు? ఒకవేళ ఏమీఎరుగని అమాయకురాలి నిష్కపటవర్తనము మావాడు, తనకుగా అన్వయించుకుని ఆశలూరుతున్నాడా? లేక కనబడుతూన్నంత ముద్దరాలుకాకుండా జీవిత - ఇంద్రచాప కాంతులు తరళించిన చంద్రకాంతమా? ఎగతాళికి కిసురించడమునకు ఆడుతూన్న కపటనాటకమా?

ఏమీ తేల్చుకోలేకుండా ఉన్నాను. అందమైనవయసుపిల్ల సామాన్య వర్తనలో ఇంత అర్థంకానితనము ఎన్నడూ నాకు తారసిల్లలేదు! పరోక్షాన రకరకాలుగా ఆ అమ్మాయినిగురించి ఆలోచనలు పోనిచ్చి సిద్ధాంతీకరించుకునేవాడిని. ఎంతకైనా తగినజాణ అని నమ్మేవాడిని. కాని, ఆలజ్జావతిని చూడగానే మళ్లా మనసులో రాద్ధాంతము ప్రారంభమయ్యేది.

నేనే ఒకనిర్ణయమునకు రానప్పుడు నాదమునికి ఏమనిసలహాయిచ్చి కొండ నడిపించగలను? ఏమీ పాలుపోవడం లేదు. కాని ఒకటిమాత్రం నికరం. ఆమెఆహ్వానించనిదీమావాడు చేయిచేసుకోవడంమాత్రము భావ్యముకాదు. చెడిపోనివాళ్లను, చెడిపోవాలనిఏమాత్రము ఉద్దేశ్యము లేనివాళ్లను, వంచించి వలలో వేసుకోవడం సుతరామూకలలోగూడా నాకు గిట్టదు.

—రోజూ బీచ్ దగ్గర తారసిల్లుతూనే ఉన్నాము. ఇతర వ్యాసంగాలూ, వినోదాలూ అన్నీ కట్టిపెట్టి నాదముని వెంటనే నేనూ అనుసరించడం అవసరమైనందువల్ల ఇంకొకచోటికి పోవడంలేదు. స్నేహితులను ఎవరినీ కలుసుకోవడం లేదు.

ఎప్పుడు సంజె పడుతుందా అని కాచుకుని ఉండటం యకాయకీని బీచ్ కి వెళ్లి ఆదంపతులను చూపు మేరలో ఉంచుకుని తిరగడం, చూసి చూసి యింటికి వచ్చి ఎప్పుడు తెల్లవారుతుందా ప్రొద్దు గుంకుతుందా ఎప్పుడు ఆమెనమీపంగా కనబడుతుందా అని ఉవ్విళ్లూరడం! ఈ వేదన అంతా నాకు లేదు కాని నాదముని మీదిమమకారాన 'మమ' అనుకోవలసివచ్చింది.

ఇద్దరు విలాసవంతులు తమను అనుసరించి తిరుగుతున్నారని వారు ఏనాడో గమనించారు. బీచ్ లో ఏమూలకు వెళ్లినా మేమే ప్రత్యక్షమౌతున్నాము, మరి. కాని, ఏమీ చలించలేదు. క్రమంగా ముసలాయనతో మాటలు కలుపుకుని పలుకరించడానికికూడా మొదలుపెట్టాము. ఆయన ఏమీ సంకోచించకుండా కులాసాగానే మాట్లాడుతున్నాడు. నేను సంభాషణలోకి దించి నిలవేసి ఆ పరాకులో నాదమునికి అవకాశం కలిగించాను అనేకసార్లు. ఆతడు ఆమెను నిర్భయంగా కోర్కెతో అర్థం చేసుకునేటట్టుగా చూడడం గమనించాను.

—పసివాడిని దగ్గరకు తీసికోవడం, ఏమన్నా కొనిపెట్టడందాకా వచ్చింది. ఒకటి రెండుసార్లు బీచ్ 'రెస్టరాంట్'లో కలిసి కాఫీ పుచ్చుకున్నాము. అప్పుడప్పుడు వాళ్లయింటికి వస్తూండమని—ఇరుగూపొరుగూ అని తెలిసిపోయిందిగనుక—పిలిచారు కూడాను. మాకుమాత్రం ఆఆహ్వానం అందుకునేందుకు ముఖం చెల్లిందికాదు. అప్పటికి ఆ అమ్మాయితో ఆయనఎదుటనే మాటలాడే జోస్తీమాత్రమే కుదిరింది.

ఆవేళ 'పేవ్ మెంట్' మీదనే ఆమె కనబడ్డది. పలుకరించడానికి

మాకు ఎప్పటికప్పుడు బెరుకుగానే ఉండేది; సందేహించాము. కాని, ఆమె నవ్వుతూ ఎదురుగా వచ్చి 'ఇంత ఆలస్యమైంది. ఇక మీరురారేమోనని తిరిగివచ్చేస్తున్నాను. ఆయన కంచి వెళ్లారు. ఉదయంకాని రారు. చీకటిపడినతరువాత ఒంటరిగా వెళ్లవలసివస్తుందేమో నని' అన్నది. ఇంతకన్న ఏలాటిపరకీయ అయినా చేయి పట్టుకుని లాగుతుందా?

నాదముని నందనవనానికి ఎగిసిపోయినాడు. ఎగిరి గంతు వేసేవాడేమో కాని నేను చేయిపట్టుకుని ఆమెవెంట నడిచివెళ్లి ముగ్గురమూ ఒకచోట కూర్చున్నాము, కబుర్లు చెప్పుకుంటూ.

వెన్నెల విరియ బూచింది. గాలి కెరటాలతో హాయిగా సరసాలాడుతున్న రేడియోపాట తెలియకుండానే ఆగిపోయింది. లేచి, తిరుగుముఖమై పసివాడికి పిప్పరమెంట్లు లంచమిచ్చి చంకను ఎక్కించుకున్నాను. 'మా... మా' అని పనసచదువుతూ క్రిందికి దిగాలని మెలికలుతిరుగుతూ అల్లరిచేస్తున్నాడు. నేను సంబాళించుతూ కొంచెం ముందుకు తొందరగా అడుగులు వేస్తున్నాను. వాళ్లిద్దరూ కొంచెం వెనుకఅయి మెల్లగా సాగివస్తున్నారు.

నాదముని కొంటెగా పిల్లవాడిని తనదగ్గరకు తీసుకుందామని చేతులు జాచే వ్యవధానంగా 'మామ' అంటూ వాడు మీదికి వాలబోయినాడు. నేను వదలలేదు. ఆమె నవ్వుతూ "అందరూ మామలేనా?' అని ఆ పసికూనచెక్కిలి పుణికింది. ఇంకా సందేహ మేమున్నది. నాదముని తపస్సు ఫలించినదన్న మాటేకదూ?

మారోడ్డుకు వచ్చినతరువాత పిల్లవాడిని నావద్దనుంచి తీసుకుని వెళ్లివస్తానని నాతో మాటతోనూ, నాదమునికి చూపులతోనూ చెప్పింది. నేను వినిపించుకోకుండా వచ్చేసి వాయుపుత్రుడిఉత్సాహంతో క్రింద నుంచి మెట్లమీదుగా రెండుఅంగలలో పైకిఎగిరి తలుపుతీసుకుని కుర్చీలోపడి 'ఇన్నాళ్ళకు నాదముని... అమ్మయ్య' అంటూ సంతోషతరంగాలలో మునిగి తేలుతూండగా...

మెట్లమీద అడుగుల చప్పుడు...

నాదముని అయిఉండడు. వాళ్లు ఇద్దరూ కలిసివెళ్లి పావుగంట అయిందేమో తిరిగివస్తాడా, రాగలడా? పక్కగదిలో ఉన్న కాలేజీకుర్రవాడేమో? పాలుతెచ్చే మునుస్వామి ఏమో? ఏమో?

—ఎవడూ కాదు! నాదముని తలుపు తోసుకుని వచ్చి అవతల గుమ్మంలో పోయి కూర్చున్నాడు. అతనివెంట ఆమె!

వచ్చింది! రావడమేమిటి అని ఆశ్చర్యపడటానికీ నివ్వెరపోవడానికీ అవకాశం ఏదీ? అమాంతంగా లేచి నిల్చుని కుర్చీలో కూర్చోమని చూపించాను. వద్దని తలత్రిప్పి, క్రింద చాపమీద ఆసీనురాలైంది. నేను అలాగే నిలువబడిపోయినాను.

సంకోచించలేదు తడబడలేదు! కథచెప్తూన్నట్లు మాట్లాడేసింది:

"ఇద్దరు అన్నలతో మాట్లాడడానికి నాకు చనువూ... స్వాతంత్ర్యం ఉన్నది కాదూ? అందుకనే ఇక్కడికి రావడానికి సందేహించలేదు. అలాఅయితే మీతో మొదలు మాటడేదాన్నే కాదు. ఆయనను పరిచయం చేసుకోనిచ్చేదాన్నే కాదు.

మీరు ఇద్దరూ నావంక చూడటం మొదలు పెట్టినప్పటినుంచీ నేను గమనిస్తూనే ఉన్నాను. నాకు ఏమీ కోపం రాలేదు.

"పరాయివాళ్లు వాంఛతో నన్ను చూడటం అంటే నాకు ఏమిటో తెలియకకాదు. అందమైనదాని నని తెలుసును. కాని, ఈ జన్మకు నేను ప్రేమించేది ఆయన ఒకర్నే.

"వివరిస్తేనేకాని మీకు బోధపడదు. నేను అబద్ధమాడుతున్నానని మీరు అనుకోవచ్చు. కాని, మిమ్మల్ని మోసంచేయవలసిన అగత్యం ఏమున్నదీ?

"నేను ఎవరి ఆడపడుచునో ఏమిటో మొదలైన విషయాలు చెప్పనవసరంలేదు, అప్రస్తుతంగనుక. సంపన్నుల యింట్లో పుట్టాను. కవిగాయక బాంధవ్యంవల్ల కళామాధుర్యారోచులు యౌవనోదయంతో విరిసినందువల్ల లోకవృత్తం తెలియని అమాయికపు ఆవేశంతో మాయమాటలునమ్మి మోసపోయినాను.

"ఎవరికీ తెలియకుండా ఆమాయగానివెంట (పేరుతలవను) వెళ్లిపోయి కలలాగా కొంతకైతవ ప్రణయంలో లోగిపోయినాను.

"నెలమసలింది! ఒంటరిదానను చేసి నన్ను వదలివేసి అతడు మాయమైనాడు. ఏంచేయగలను అర్భకురాలను? బంధువులు రానిస్తారా? ఎవరు తోడవుతారు?

"కాలవలో పడిపోదామని బయలుదేరి వెళ్లి పడిపోయినాను. స్పృహ తప్పి మునక వేశాను....

"అప్పుడు నాపాలిటిదైవం ఈ వృద్ధమూర్తి నన్ను ఉద్ధరించారు! బ్రతుకుదామని నాకు లేదు. కాని, బ్రతికించారు. నాదీనగాథ విని అభయమిచ్చి వెంట తీసుకువెళ్లి జనానా ఆస్పత్రిలో చేరిపించి రాజవైభవంగా ఉపచారములు జరిగేఏర్పాటు చేశారు. పసిపాపను తీసుకుని బాలెంతను, వారియింటికి వచ్చేశాను.

"పిల్లవాడిని ఆయనకు వప్పగించి జీవితం గంగకు అర్పించి పాపవిమోచనం చేసుకుందామని తలచాను; ప్రయత్నించాను. నాముక్తిదాత వదలలేదు. నన్ను వివాహం చేసుకున్నారు! ఎంతో దయతో ఎన్నోవిధముల నన్ను సంతోషపెట్టి వెనుకటి కష్టస్మృతులను మరిపిస్తున్నారు. పసిపాపను- కన్నవానికంటె ఎక్కువ లాలనతో ఆపేక్షతో చూస్తున్నారు. ఎంతఅదృష్టవంతులం? ఆయనకు ఎంత సేవచేసినా ఋణం తీరుతుందా మీరేచెప్పండి?

"పారబడినారని మీమీద నాకు లేశమున్నా ఆగ్రహం రాలేదు. నాచేతలకు మీరు అపార్థము కలిపించుకునేందుకు అమాయికంగా నేను దోహదం చేశానేమో?

"యౌవన సామాన్యమైన ఆవేశంతో నాదముని అన్నగారు అన్యథాగా నన్ను అనుసరించివచ్చి చెరవజేయబోయినారు. తెలియనిదోషం, మరేమీ పరవాలేదు. కాని బంధువులకు పరితపించేయీప్రాణికి ఆప్తులు దొరికినపుడు వారిదగ్గర దాపరికమెందుకూ?..."

—చలనము లేకుండావిన్నాము. ఇద్దరమూ యథాస్థానాలచిత్రప్రతిమలమైపోయినాము! ఆమెమెల్లగాలేచి నాదమునివద్దకు వెళ్లి వాత్సల్యంతో మీద చెయివేసి "మీరు చిన్నబోయినారంటే నాకు ఏడుపు వస్తుంది. ఏదీ నవ్వండి! అన్నయ్యా!' అని, చక్కిలిగిలి చేసింది. ఆతడు వెక్కి-వెక్కిళ్లుకడవలైజరిగిపోగా, సంబాళించుకుని నవ్వి ... నవ్వుతూఉండేటంతవరకూ వదిలిందికాదు ఆమె.

నన్ను సమీపించింది. అడుగడుగుకీ జఘన - వలగ్న - వక్షోభారరమ్య అయిన దేవీమూర్తిని నిర్మలంగా సాన్నిధ్యంచేసుకునే ఉపాసకుని వినమ్రభావం నన్ను ఆవరించింది.

'వెళ్లివస్తాను' అన్నది.

అప్రయత్నంగా చేతులు ముకుళించాను. ఆమె రెండుచేతులతో ముకుళకరాంజలిని సన్మానించి 'ధన్యురాలను' అని గమనోన్ముఖ అయి హంసమాలికలతో: "మీ బావగారు పిలిచినప్పుడు మీరు మొగమాటపడి భోజనానికి రాకపోయినారో మేనల్లుడిని పంపుతాను. బొమ్మలబండీఎక్కి బూరామేళంతో ఊరేగుతూ రాకతప్పదు సుమండీ!" అని, పిలుపు అందించి మెట్లుదిగి మాయమైపోయింది.

—మేము విశేషం పొద్దుపోకపోయినా ఒళ్లుతెలియని నిదురలో అలావాలిపోయినాము.

# భాషా విశేషములు

**చల్లపిళ్ల వెంకటశాస్త్రి**

శ్రీ కనుపర్తి ఫలానా భాషనుగూర్చి అని తేలకపోయినను తెలుగుదేశస్థుడు వ్రాసేదవుటచేతనున్నూ, తెలుగుపత్రికలో ప్రకటించబడేదగుటచేతనున్నూ యీ వ్యాసంలో తెలుగునుగూర్చిన విశేషాలే వుదాహరింపబడతాయి. సంస్కృతంలో యీ సందర్భాన్ని తెలిపే పుస్తకాలెన్నో ఉన్నాయి కాని అవి గురుశుశ్రూషాపాధ్యాలేకాని యెవరంతట వారు చదువుకొని అవగతం చేసుకోతగ్గవి కావు. నే నిప్పుడు వ్రాసే వ్రాతకుకూడా ఆ సంస్కృతంలో ఉన్నవిశేషాలే మార్గప్రదర్శకాలు. గ్రాంథిక భాషలో మాత్రమే కాక సర్వసామాన్యంగా మన మందరమూ మాట్లాడుకొనే మాటలలో కూడా కొన్ని ప్రయోగాలు లాక్షణికాలుగానూ కొన్ని వ్యంగ్య ప్రధానాలుగానూ గ్రహించుకోవలసివుంటాయి. కొన్నిమాత్రమే అభిధాప్రధానాలుగా వుంటాయి. దాశరథి అంటే, దశరథుని కొడుకు. జానకి అంటే, జనకుని కూతురు. యీలాటి శబ్దాలకు లాక్షణికార్థప్రసక్తితో అవసరం ఉండదు. అవయవార్థంవల్ల అవగతం అవుతుంది. దీర్ఘుడు, వృద్ధుడు, దవిద్ధుకుః యీశబ్దాలను పైదానికి ఉదాహరణగా చూచుకోవాలి. లాక్షణిక శబ్దాలు చాలా వున్నాయి. 'పరవశుడు' అనేశబ్దం పరులకు వశమైనవాడు అనే అర్థాన్ని యివ్వవలసివున్నా యితరశబ్ద సాన్నిధ్యమందు ఆలాటి అర్థాన్ని యివ్వక — తన్మయుడు — అనే అర్థాన్ని మాత్రమే యిస్తుంది. ఆ తన్మయత్వంలో అసలర్థం పరవశత్వంకూడా అంతో యింతో యిమిడి వుందని తెలుసుకుంటారు విజ్ఞులు. లక్షణచెప్పిన ప్రతిచోటానున్నూ యీ సందర్భం వుంటూనే వుంటుంది. కొన్నిచోట్ల అనగా— ప్రవీణుడు మొదలైన స్థలాల్లోమాత్రం అవయవార్థం బొత్తిగా దూరీకృత మయినట్టు వుంటుంది. “ప్రకృష్టా వీణాయస్య సః” అని దాని విగ్రహవాక్యం కదా! మంచి వీణకలవాడని సరియైన అర్థం. దీన్నిబట్టి యేగాయకుడు మంచి విలువగల వీణ పట్టుకుని సభకు వస్తాడో ఆసదం ఆ గాయకుణ్ణి చెప్పవలసివస్తుంది. అతడికి వీణలో అంత పాండిత్యం లేకపోయినా అభ్యంతరం వుండదు. కాని అసలు ప్రయోక్తతాత్పర్యం మాత్రం వీణయొక్క యోగ్యతను వర్ణించేదిగావుండదు. కాబట్టి వీణలో మంచినేర్పుకలవాన్నే మనం గమనించాలి. కాని లోకంలో ఆశబ్దాన్ని వీణలో నేర్పుకలవాన్ని తెలిపే సందర్భంలో యెప్పుడోగాని ప్రయోగించడమే లేదు. యేవిద్యలో నేనాసరే, తుదకు యేపనిలో నేనా సరే చక్కనినేర్పువుంటే సరి, వాణ్ణి చెప్పేటప్పుడు వాడుతూవున్నారు—

‘కృషిప్రవీణుడు, యుద్ధ ప్రవీణుడు, ద్యూతప్రవీణుడు’ యిత్యాదులు వుదాహరణంగా చూచుకోండి. ఆయీ ప్రయోగాల్లో ప్రధానంగావుండే వీణ యెక్కడికోపోయింది, నేర్పుమాత్రమే మిగిలింది. కొన్ని ప్రయోగాలు మతీచిత్రంగా వుంటాయి. మచ్చుచూపుతాను.

“గ్రామసింహం”

దీన్ని కుక్కనుగూర్చి సర్వసామాన్యంగా వాడుతూవుంటారు. అడవిలోవుండే సింహానికి వుండే పరాక్రమాదులు దీనియందు వున్నాయనే వుద్దేశంతో వాడుతూ వున్నారేమో అనుకుంటే, ప్రయోక్తలు ఆలాటి తాత్పర్యంతో వాడుతూవున్నట్టు లేనేలేదు. కేవలమూ నీచత్వాన్ని మనస్సులో పెట్టుకునిమాత్రమే వాడుతూవున్నారు. ఆకారసామ్యాన్ని పట్టి వాడినట్టున్నూ కనపడదు. గ్రాంథికంగా లేదేమో అనుకుంటే కూచిమంచి జగ్గకవిగారు చంద్రరేఖావిలాపంలో—

“కొప్పాక గ్రామసింహాసనాధ్యక్షుండు”

అంటూ దురర్థాన్ని మనస్సులో పెట్టుకుని వాడివున్నారు. తెలుగులోమాత్రమే దీన్ని వాడివున్నారేమో అంటే శ్రీమద్భాగవతంలో (1) “గ్రామసింహా స్తతస్తతః (2) మృగయే గ్రామసింహకాః” అంటూ తృతీయస్కంధంలో వ్యాసులవారుకూడా ప్రయోగించి వున్నారు— “గ్రామసింహాః శ్వానః” అని వ్యాఖ్యాత వ్రాసియున్నాడు. యీ అర్థం అన్యశబ్దసాన్నిధ్యంవల్ల వచ్చిందనుకోవాలి. దీన్నిబట్టి “గ్రామగజం” అంటే దున్నపోతు కావచ్చునని యెవరేనా అభిప్రాయపడతారేమో, ఆలా అభిప్రాయపడకూడదు. వ్యవహారంలో వుంటేతప్ప లేనిదాన్ని యే కవిగాని ప్రయోగించినచో ప్రయోజనం వుండదు. కవిత్వం చెప్పడం యెందుకు? తన అభిప్రాయాన్ని లోకానికి తెల్పడానికేకదా! ఆలా తెల్పడం తనకిమాత్రమే తెలిసి యితరులకు యేయేసాధనాలవల్లాకూడా తెలియని సాంకేతికపదాలవల్ల నెఱవేఱదు కదా! అందుకే-“సంకేతితశ్చప్రసిద్ధ మేవ పదమ్” అని భట్టారకుడు శాసించి వున్నాడు. “పూర్వసువాసిని” “ఇంద్రాణి” వగైరా పదాలుకొన్ని “గ్రామసింహాలు” పదంవంటివే వున్నాయి. ఆపదాలు కవులు వాడినట్టుమాత్రం లేదు. “ఇంద్రాణి” పదం శచీపరంగా గ్రాంథికులు వాడివున్నారు. అది నిరాక్షేపణీయమే. విధవాపరంగా వైదికులు వేదపరిభాషనుబట్టి వ్యవహరిస్తూ వున్నారు. అది దాన్ని బాధించదు. శాస్త్రసంప్రదాయజ్ఞులు కానివారు కొందరు-‘ఇంద్రాణి’పదాన్ని పట్టి-“శక్రాణి” అనికూడా వాడుతూ వున్నారు. అది ప్రామాదికం. సూత్రంలో-ఇంద్ర పదాన్నిమాత్రమే యెత్తుకున్నారు-దానివల్ల యింద్రపర్యాయాలకు ఆ కార్యం రాదు. దీన్నిగూర్చి అన్యత్ర విస్తరించి వున్నాను — గ్రామశబ్దసాన్నిధ్యం వల్ల సింహశబ్దం “కుక్క” అనే అర్థాన్ని యిచ్చినట్టే, నిద్రాశబ్దసాన్నిధ్యంవల్ల “పోవు” ధాతువు “అనుభవార్థాన్ని” యిస్తూవుంది. దీన్నికూడా అన్యత్ర విస్తరించే వున్నాను-‘నిద్రపోయెను’ ఇత్యాదికం చూచుకోవాలి-కొన్నిచోట్ల అవయవార్థం వదులుకోవలసి వుంటుందని, ప్రవీణశబ్ద విషయంలో వ్రాసివున్నాను-గరుత్మంతుడుతల్లిని గూర్చి— “చెప్పుము నాకుం బయోరుహానన!” అనిన్నీ, యముడు సావిత్రినిగూర్చి — “తనులతాంగి! భవదుదారవాగ్భంగికి” అనిన్నీ వాడివుండడాన్నిగూర్చి అన్యత్ర వ్రాసేవున్నాను—

ఆయీ ప్రయోగాలు రెండున్నూ ఒకటి భట్టారకపండితుడిదిన్నీ వేఱొకటి శంభుదాసుగారిదిన్నీ కాని సామాన్యులవి కావు. ఒకచోట, 'అమ్మా!' అనిన్నీ, వేఱొకచోట 'అమ్మయా!' అనే తాత్పర్యమే కాని అవయవ వర్ణనా తాత్పర్యం సుతరామున్నూ ప్రయోక్తకు లేనేలేదు. యీ సందర్భం గమనించక కొందఱు ఔచిత్యభంగం వచ్చిం దంటూ వ్రాస్తూవుంటారు. క్షేమేంద్రుడు ఔచిత్యభంగాన్ని సుతరామూ ఒప్పుకోలేదని దానికి కారణం చూపుతారు. క్షేమేంద్రుడికి తెలిసినంత ఔచిత్యవిషయం నన్నయ్యయెఱ్ఱన్నలకు తెలియదా? తెలుసును; తెలిసే ఆలా ప్రయోగించడానికి కారణం? అక్కడ ప్రాజ్ఞులెవరుగాని అవయవార్థాన్ని వివక్షించుకోరనియ్యేవే. వ్యాసవాల్మీకులేమి కాళిదాసాదులేమి యీ విషయంలో యీలాటి అభిప్రాయాన్నే పొందినట్టు వారివారి ప్రయోగాలు శతశస్సహస్రశః, సాక్ష్యమిస్తూ వున్నాయి. విస్తరభీతిచేత వుదాహరించలేదు— "ఈ చపలాక్షీ మజ్జననీ" అని ఆంజనేయులు సీతను గూర్చి వాడినట్టున్నూ అది కాముకత్వద్యోతకంగా వున్నట్టున్నూ వొకరు వ్రాశారు. ఆ ప్రయోగం అయ్యలరాజు రామభద్రకవిగారి రామాభ్యుదయంలోనిది. అయ్యో! దైవమా! ఆ మహాకవికిమాత్రమూ తెలియదా? అతనికి తెలియకపోతే అతఁడేమహావిద్వత్కవిరాజసార్వభౌముని ఆస్థానకవిగా వున్నాఁడో, ఆ కృష్ణరాయలకుఁగాని, ఆ రాజసభలో అష్టదిగ్గజాలుగావుండే యితరకవులకుఁగాని తెలియదా? మనం యెవరిప్రయోగాన్నిగూర్చి వ్రాస్తామో వారికి యివ్వఁదగ్గ గౌరవాన్నియిస్తూ వ్రాయవలసి వుంటుంది గాని తోఁచినట్లల్లా వ్రాయఁగూడదు. అట్లు వ్రాయడం మహాపరాధమేను. యేదో శ్రీనాథుని ప్రయోగాన్నికూడా చూపి యీలాగే వ్రాసి అంతతో విరమించక- 'క. యరలవ మదనసయనుచుక' అన్న పద్యాన్ని లేదా, ఆలాటిపద్యాన్ని వ్రాసి యీపద్యంలోయెక్కడా ఔచిత్యం చెడలేదంటూ వ్రాయడం కూడా జరిగింది. అది మిక్కిలీ ఆశ్చర్యజనకంగా వుంది. యీపద్యం వ్రాసినకవి పైపద్యనిర్మాతలకన్న మిన్నసుమీ అని చెప్పడానికి చేసినప్రయత్నం తుదకు యీలా పరిణమించినట్లు స్పష్టమవుతూవుంది. పోనీ క్షేమేంద్రుఁడు యేదో త్రోవ త్రొక్కి చాలామంది ప్రాచీనకవులను ఆక్షేపించి వున్నాఁడా, లేదా? అంటారేమో! ఆ క్షేమేంద్రుఁడు వ్రాసినవిన్నీ కొన్ని కావ్యాలు లేకపోలేదు గదా! వాట్లల్లో అతఁడు చూపిన మాదిరి ఔచిత్యభంగాలు లేకుండానే వున్నాయా- అనేవిషయం ముఖ్యంగా గమనించవలసి వుంటుంది. యిట్టి దూరాలోచన లేకుండా పెద్దపెద్దలను స్వల్పజ్ఞానంతో పరిహసించడం మహాపరాధం. యీకర్మం తెలియక యేదో వ్రాఁతకు వుపక్రమిస్తే-నానారూపాలు కలుగుతాయనుకోవడం ప్రమాదం. యీకాలస్వభావమేమోకాని ప్రతీ విషయంలోనూకూడా పూర్వులంటే యీసడించడం ఆచారంగా వుంది. వారున్నూ మనుష్యులే కనక యెక్కడేనా భ్రాంతివశంవల్ల యేదేనా అపప్రయోగం పడితే దాన్నిగూర్చి వ్రాస్తే అది యుక్తమే. వ్యాసులు, వాల్మీకులు, కాళిదాసాదులు త్రొక్కి- మార్గప్రదర్శకులైన విషయాలనుకూడా యెత్తుకుని ఆక్షేపణకి దిగితే గతేమిటి? అర్థాత్తూ వారివారి జ్ఞానంకంటే ఆక్షేపకునిజ్ఞానం యెక్కువది అనుకోవలసిందేనా? ఆవ్రాఁతకు వచ్చే యీతాత్పర్యానికి సమ్మతించేయెడల అది లోకం సమ్మతించినా సమ్మతించకపోయినా కొంత సమంజసంగా కనపడుతుంది. అసలు అభిప్రాయం అది కాదాయె. యెవరినో పైకి తెద్దామనేప్రయత్నమాయె. అందుకోసం ప్రత్యేకించి వ్రాసే వ్రాఁత చాలదా? ఆలాటి మహాకవులను అధఃకరించడం యెందుకంటాను. "యరలవ మదనస" పద్యం యే గ్రంథంలోదో, ఆ గ్రంథంలో వెదికితే క్షేమేంద్రుఁడు చూపినమాదిరివి యెన్ని అనౌచిత్యాలేనా కనపడక పోతాయా?

ఈమధ్య యెవరో నన్నయ్యగారి కవిత్వం శ్రోత్రియకవిత్వ మన్నారని శ్రీకాశీభట్ట సుబ్బయ్యశాస్త్రుల్లుగారు తిక్కన్నగారి కవిత్వాన్ని నిరసించి చూపుతూ వున్నారు. అది అంత మీలైనపనికాదు. అందుచేత తద్ద్వారాగా మహాకవులను అధఃకరించడం అనాలోచనప్పని.—అనౌచిత్యాలను గుణించినిన్నీ అపార్థాలు లేక గ్రామ్యాలనుగుణించినిన్నీ లాక్షణికులు చేసిన పరిశ్రమకు ఫలితం కనపడడంలేదు. సంధివశంవల్ల చారులు జారులుగానూ, తనుజుఁడు దనుజుఁడుగానూ మాఱడానికేం గాని అసలుపదంలోనే వున్న అశ్లీలాలగతేమిటి? చూడండి 'కేశవ' అనే పరమపవిత్రమైన శబ్దంలో అశ్లీలవర్ణశ్రవణం తీయవచ్చునా? 'శేఫాలికా' శబ్దంలోకూడా డిటో. ఆపద్ధతిని ఆయీ శబ్దాలు భాషలోనుంచి తొలఁగించవలనే వచ్చునేమో? సంధ్యావందనంలో మొట్టమొదట ఆచమనం చేయడమే తప్పవుతుంది కదా! అందుచేత లాక్షణికుల తాత్పర్యాన్ని దుర్వినియోగించని పద్ధతిని వ్యాఖ్యాతలేమి, విమర్శకులేమి ప్రవర్తింపవలసివుంటుంది. లోకంలో అజ్ఞులవ్యవహారం కొన్ని శబ్దాలకు ముప్పతెస్తూవుంది. విరోచన శబ్దానికి మాఱ్యుఁదర్థం. విరేచనశబ్దానికి బదులు యెందఱో "విరోచనాలు" వెడుతూ వున్నాయంటూ వాడతారు. ఆవాడుకాన్నిపట్టి విరోచనశబ్దం కవులు వదులుకోవలసి వస్తూవుంది. దీనివల్ల అజ్ఞులు విజ్ఞుల కొట్టచిక్కులు కలిగిస్తున్నారో! యితరవిషయాలుకూడా గమనించాలి—

"శ్రీరఘువర! కరుణాలయా !
సరసిజలోచన విరోచనాభ,"

అనే త్యాగరాయకృతి పాడుతూవుంటే పామరులకున్నూ వాళ్లనిపట్టి పండితులకున్నూ యెంతో హేయంగా తోఁచవలసి వస్తుంది. ఆయీ సందర్భాలు విచారిస్తే క్రమప్రకారం అన్వయించుకోవలసిందే కాని యీలాటి వెఱ్ఱిమొఱ్ఱి శంకలకు అలవాటుపడకూడదనియ్యేవే తోస్తుంది. అయితే లాక్షణికులు ఆలాటిమార్గం యెందుకు త్రొక్కివున్నారనే ప్రశ్నకు నాకు తోఁచినజవాబు వినండి. లాక్షణికులు ప్రతివిషయమున్నూ చాలాకఠినంగా శాసించవలసివుంటుంది. అందులో విశాలహృదయులైన మహాకవులు వేట్లను అతిక్రమిస్తారో, యేకవాక్యతగా అవి అమలు జరగనిఖిలసంహితాశ్రుతులకింద జమకట్టవలసి వుంటుంది. కాదు, అమల్లోకి తెస్తామంటారా?

అనండి కాని ఆడోపం చేయనివాణ్ణి వకణ్ణేనా మహాకవులలో వేలుమడిచి చూపండి. చూప లేనప్పుడు అట్టి ఆక్షేపణలు యేం ప్రయోజనం? కనక అట్టిశంకలు చేయడం సహృదయత్వ భంజకంగా కనపడవలసి వస్తుంది-యింక యీ విషయం విరమించి యతులవిషయం కొంత ప్రస్తావిస్తాను. యతిప్రాసలు తెలుఁగులో యెందుకు పుట్టినా తుట్టతుదకు నిర్బంధంగా వుంచవలసినట్టు సిద్ధాంతమైపోయి చాలాకాల మయింది. కాని ప్రాసవిషయంలో యేకవు లున్నా యేలాగో వకలాగ "గంధార్థం అక్షతాం స్సమర్పయామి" అన్నట్టు చేయడం లేదుగాని యతివిషయంలో యేలాగో వాలా యిత తీర్చుకుంటూవున్నారు.—

శా. "కేదారేశు భజించితిన్ శిరమునన్
గీలించితిన్ హింగుళా
పాదాంభోజములన్ ప్రయాగ నిలయుం
బద్మాక్షు సేవించితిన్
యాదోనాథసుతాకళత్రు బదరీ
నారాయణున్ గంటి"

యీపద్యం మూఁడోచరణంలో యతి వున్నప్పటికీ అది వున్నట్టే వుండదు—యా- అన్నదే శ్రుత మవుతుందిగాని దానికి పూర్వ భాగమందు సంశ్లేషించిన నకారం శ్రుతం కాదు. కొన్ని యింతకన్నా వాలాయిత తీర్చుకున్నట్టు కనపడతాయి. తెలుఁగుభాషకు సహజాలంకారులుగా అనాదిగా యేర్పడ్డ యతులు యేదో నిర్బంధం తొలఁగించుకోవ డానికి వాలాయిత తీర్చడం దగ్గిఱికి వచ్చి నట్టు పైమాదిరి యతులవల్ల తేలుతుంది - ద్విత్వాక్షరస్థలాల్లో మొదటిహల్లుకు కాక తక్కినహల్లులకు పెట్టే విశ్రమవిషయం కూడా యీలాగే వుంటుంది - ఏకశబ్దవద్భా సమానాలుగా వుండే "ద్వార"శబ్దం మొద లైన కొన్ని శబ్దాలల్లో స్వరానికి సంబంధించిన- "ద్వారవిహారులై సిరుల నందక నందకపాణిఁ గొల్వరో?"

ఆనేమాదిరి యతులుకూడా వాలాయిత తీర్చుకోవడానికి పెట్టినట్టే కనపడతాయి. పద్యకవిత్వంలోకన్న పదకవిత్వాలల్లో వాడే యతులు హృదయంగమంగా వుంటాయి. యెందుచేత? ఆకవులు విశేషించి లాక్షణికులు కాకపోవడంచేత ఆట్టే లోఁతుకుపోక తేలికగావుండే వర్గయతివగయిరా సుప్రసిద్ధయతులనే వాడతారు.

"ఈ సంశయము వారింపవే పరమేశ! నన్ను మన్నింపవే! శ్రీ సదాశివ! ప్రశ్నచేసెద వివరింపు, వాసుదేవతత్త్వము,-మహత్త్వము, భాసమానవిలాస నేనిది నీసత్కృపావలోకనమున నీసమయమునఁ దెలియవలసినదే సమస్త మిదే ప్రశస్తము—ఈశం."


యిది అధ్యాత్మకీర్తనలలోది. దీన్ని రచించినకవి పద్యకవులవంటివాఁడే కనక కొంత మట్టుకైనా విశేషయతులదాఁకా వెడుతూ వుంటాఁడు. రామదాసుగారికీర్తనలూ, త్యాగరాయలవారికృతులూ చాలా ప్రసిద్ధయతుల తోటే వుంటాయి.—శాస్త్రీయమైన యతులలో కొన్ని హృదయంగమంగా వుండని వున్నాయి. అందులో వకటి ఋకారానికి ఇ-ఈ-ఎ-ఏలు పెట్టేది. ఆయీ యతిమైత్రిని పూర్వులు యెందుకు సమ్మతించారో? తెలియదు. స్థానసామ్యాన్ని పట్టి కొన్నియతులు కనపడతాయి. యీయతికి ఆలాటి సామ్యమున్నా కనపడదు. శ్రవణసుఖంమాత్రం, ఋకారానికి ఉ-ఊ-ఒ-ఓలతో మైత్రికల్పితే వున్నట్టు తోస్తుంది. "అపురూపదర్శనం బాయెఁగదా! నేఁడు కృపగలదా? మాముద్దుగోపాలబాల!"

యీగేయంలో 'కృప' అనేపదంలోవున్న 'కృ' అనే అక్షరానికి గోపాలపదంలోవున్న- 'గో' యతిగా వుండడమే శ్రవణసుఖాన్ని కలిగిస్తూ వుందో? ఇ - ఈ - ఎ - ఏ - లతో కూడిన మఱివకపదం యతిస్థానంలో లగిస్తేనే సుఖంగా వుంటుందో, బాగా గమనించాలి. లాక్షణికులు— "ఇ-ఈలు ఋకారసహిత మె-ఏలకునా" అని వ్రాసిన సంగతి యీ క్షేత్రయ్యకు తెలియదనుకోవడానికి యిది యేమంత పెద్ద విషయమో? పరిశీలించవలసి వుంటుంది- యెఱిఁగిన్నీ శ్రవణసుఖాన్నే ప్రధానంగా ఆలోచించి క్షేత్రయ్య పైవిధంగా వుపయోగించినట్టు నేను తలుస్తాను. యెన్నో యతులు శాస్త్రీయాలుగా వున్ననూ శ్రవణసుఖాన్ని కలిగించినవిగా వున్నాయి. యతిప్రాసలు సహజాలంకారాలుగా తెలుఁగు భాషలో కవిత్వం పుట్టడానికి చాలా పూర్వకాలాన్నుంచి వాడుతూవున్నారనే సిద్ధాంతానికి యిటీవల మహాకవులు వాడే మాఱుమూలయతులు బొత్తిగా వుపయోగించవు. యేవో జంగంపాటలు వగయిరాల కవిత్వాలల్లో యీ మాఱుమూలయతులు వాడినట్టు లేదు— "మాఁగు నూఁగు మీసాలవారయా! నూటికెలమదోరలు" లోనైనవి చూచుకోండి. ఆ యీరచనలు ప్రబంధకవులవి కాకపోవడం చేత సాధారణంగా యీవత్తూ వర్గయతుల తోటే తెల్లవాఱుతుంది- ఆంధ్రకవిత్వం ప్రబలినతరవాత మాఱుమూలయతులు వాడఁబడుతూ వచ్చాయి. కాని శ్రవణసుఖం అంతరించింది. దీని కెన్నో వుదాహరణాలు చూపవచ్చును. కొన్ని విషయాలు నాగరికత హెచ్చినకొలఁది సొగసుగా వుండడమున్నా కొన్ని అవకతవకగా మాఱడమున్నా అనుభూతంగా కనపడుతుంది. అందులో యిది వకటిగా తోస్తుంది. మఱివకటి వివాహవిషయం — యే జాతిలో పిల్లను ఆ జాతి వరుఁడు వివాహం చేసుకొనేరోజులకున్నా కలగాపులగంగా వివాహాలు చేసుకొనేరోజులకున్నా వున్న భేదం కూడా యీలాటిదే అని నాకు తోస్తుంది. పాండిత్యం ప్రబలడం వల్ల విశ్రమస్థానాలల్లో సొగసుచెడినట్టే నాగరికత ప్రబలడంవల్ల వివాహాలలోకూడాసొగసు చెడుతూ వుండంటే యెవరో గాని వప్పుకపోరు. యతులు శ్రవణసుఖానికి కావనేవారికి నేను వ్రాసినది బొత్తిగా నచ్చదు. సంస్కృత భాష ననుసరించిన భాషలలో కర్ణాటభాష కొంచెంగానున్నా తెలుఁగుభాష విశేషంగా నున్నా యీయతివిషయాన్ని అవలంబిస్తూ వుంది. అఱవంలో ప్రాసవిషయం నిర్బంధంగా వున్నట్టు వకపద్యంవల్ల అవగత మయింది. ఆపద్యం 'అట్టావదానిగళ్ సెయ్య వల్లమేన్' అని యెత్తుకొని 'తట్టామలే' అని రెండో చరణంలోనూ మూడునాల్గుచరణాలల్లోనూ ఆలాగే టకారద్విత్వాన్ని వుంచినది యెవరో మా అవధానాన్ని ప్రశంసిస్తూ చెప్పినది. దానివల్ల ఆభాషలోకూడా ప్రాసనియ

మం వున్నట్టుగా నే నభిప్రాయపడ్డాను. ఆంధ్రకర్ణాటభాషలవలె అటువం విశేషించి సంస్కృతాపేక్ష కలది కాదనిన్నీ స్వతంత్ర భాష అనిన్నీ చెప్పఁగా విని వున్నాను. యింతెందుకు? సంస్కృతభాషకు యతిప్రాస నిర్బంధం లేకపోయినా యాదృచ్ఛికంగా యెక్కడేనా యీయతిప్రాసలు పెట్టి చెపితే ఆపద్యం యెక్కువ శ్రవణసుఖంగా వుంటుంది. అట్టిశ్లోకాలు కొన్ని యిటీవల మహాకవుల కవిత్వాలలోనే కాక పూర్వఋషుల కవిత్వాలలోకూడా కనపడతాయి. భాగవతంలో వుండే గోపికాగీతలు వగయిరా ప్రస్తుతవిషయానికి వుదాహరణంగా చూచుకోవచ్చును. విస్తరభీతిచేత వుదాహరించ లేదు. యిప్పుడెందఱో యతిప్రాస నియమాన్ని తొలఁగిద్దామంటూ పెద్దపెద్ద వ్యాసాలు వ్రాస్తూవున్నారు. తొలఁగిస్తే వచ్చే హాని అంతగా వుండదు—నన్నడిగితే ఆలా తొలఁగించేవారు వక్క యతిప్రాసలనే కాదు కొన్ని సంధులనుకూడా తొలఁగించడం ఆవశ్యక మనుకుంటాను. ఆసంధులు అజ్ఞానావస్థలో వున్న విద్యార్థులకు మిక్కిలీ చిక్కుగా వుండి వొకవిధంగా అర్థం కావడానికి బదులు మఱివొకవిధంగాఅర్థమవడానికి దారితీస్తాయి. అట్టిస్థలాల్లో గురువు ఆసంధిసూత్రాన్ని వుదాహరించి 'అబ్బాయీ! దీన్ని యీలా విఱుచుకొని అర్థం చెప్పుకోవలసి వుంటుం'దని బోధించవలసి వస్తుంది. యిప్పటికాలపు నాగరికత ఆమాత్రంకూడా పరాపేక్షకు సహించేస్థితిలో వున్నట్టు తోఁచదు. అందుచేత కొందఱు పూర్వమహాకవుల గ్రంథాలుమాని జంగంకథల మాదిరివాటికి ప్రాధాన్యం యివ్వాలంటూ వున్నారు. అట్టివారికి నేను వ్రాసిన సంగతి మిక్కిలీ అనుకూలం. వ్యావహారికభాషలోనే గ్రంథాలు వ్రాయవలసిం దనిన్నీ వాట్లను విద్యాశాఖవారు విద్యార్థులకు పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించాలనిన్నీ కొన్ని సంవత్సరాల కిందటినుంచిన్నీ కొంత కోలాహలం బయలుదేఱింది కాని దాన్ని కొందఱుపెద్దలు ప్రయత్నించి "బ్రహ్మాస్త్రబ్రహ్మ"మీఁద ఆఁపుచేశారు కాని యిప్పుడు ఆలా ఆఁపుచేసిన జన్నో మళ్లా అమల్లోకి వస్తూవున్నా యికనక కొద్దిరోజుల్లో యిదిన్నీ అమల్లోకి వస్తుందనే నాతలఁపు. అంతమాత్రంచేత గ్రాంథికభాష మాత్రం నశించదు. యేకాలమందున్నూ ఆయా భాషాభ్యాసకులలో దానిపారాన్ని చూడాలనే కోరిక కలవాళ్లు విరళంగానే వుంటారు. వాళ్లుమాత్రం యావజ్జీవమున్నూ కృషి చేస్తూనే వుంటారు. యితరులో అంతంత లోనే తృప్తిపడి విరమిస్తూ వుంటారు. మురారినిగూర్చి యెవరో ప్రశంసిస్తూ—

"దేశీంవాచ ముపాసతేహి బహవ
స్సారంతు సారస్వతం,
జానీతే నితరా మసౌ గురుకుల .
క్లిష్టో మురారిః కవిః,
అబ్ధిర్లంఘిత ఏవ వానరభటైః
కింతస్య గంభీరతా
మాపాతాళనిమగ్నపీవరతను
ర్జానాతి మంథాచలః."

అని సిద్ధాంతీకరించారు. అందుచేత సామాన్యులకు తేటతెల్లంగా తెలియడానికి కొన్ని వచనాలు వ్రాయడం ఆవశ్యకమే అనుకుంటాను. ఆలా వ్రాసే కవులకు యిహలోకంలోఁ గాని పరలోకంలోఁ గాని వచ్చే హాని లేదనే నాతలంపు. అట్టి పుస్తకాలు ఛందోబద్ధంగా వ్రాసేవారు మాఱుమూల యతులు వదులుకొని సుప్రసిద్ధంగా వుండే వర్గయతులు వగయిరాలవఱకేనా గేయాల్లోనున్నూ పద్యాలల్లోనూ వాడుకుంటూవుంటే అవి శ్రవణసుఖానికి అనుకూలిస్తాయి. అసలే యతులు మానేస్తేనో శ్రవణసుఖానికి కొంత లోటు కలుగుతుంది. యీ భాషావిశేషాలనేవి యెంత వ్రాసినా తేలవు. చూడండీ, అమ్మగారు. అమ్మవారు అనే మాటలలో స్వల్పంలో యెంత భేదం కనపడుతూ వుందోను. ఆలాగే, అయ్యగారు, అయ్యవారు అనేవికూడా చూచుకోండి. వ్యావహారికభాషలకు విశేషించి లోకవ్యవహారం అనుసరణీయం. అట్లని సంస్కృతానికి అది అనుసరణీయం కా దనుకోకూడదు—ఆ భాషావిషయంలో శాబ్దబోధోపకరణాలలో- "వ్యవహారతశ్చ"అని వ్రాయడమే పైవిషయాన్ని తెలుపుతూ వుంది—మఱొకప్పుడు యింకా వ్రాస్తాను. యిప్పుడు యింతతో ముగిస్తాను.



# గిడుగు కాదు పిడుగు

నండూరి బంగారయ్య



నేను శ్రీ గిడుగు రామమూర్తి పంతులవారి శిష్యుడను కాను; అనుచరుడ నంతకంటెను కాను. "వారి భాషావాదములవలన ఆంధ్రవాఙ్మయమునకు మేలు చేకూరినది" అని విశ్వసించువారిలో కూడ ఒకడను కాను. అందుచేతనే ఈ వ్యాసమునకు విలువ మరింత హెచ్చవలసియున్నది.

ఈవ్యాసశీర్షిక చూడగనే, "మనవాడు క్రమముగ గిడుగువారిమతము పుచ్చుకొనుచున్నాడా" యని గ్రాంథిక భాషావాదులును, "ఈయనకి బహుశా మా బృందంలోకి రావాలనుంది కాబోలు" అని వ్యావహారిక భాషావాదులును సందేహించుటకవకాశ మున్నది. తత్త్వాన్వేషియగు రసపిపాసువునకు వాదభేదములతో నిమిత్తము లేదు. వాదము లెప్పుడును పూర్ణముగ సత్యమును ప్రకటింపజాలవు. పట్టుదల, ఉద్రేకము మున్నగు గుణములను బురస్కరించుకొని వాదములలో కొంతవరకు సత్యగోపన మనివార్యము. "గుణాః పూజాస్థానం గుణిషు నచ లింగం నచ వయః" అను నార్యోక్తికి "నచవాదం నచ వయః" అను పాఠాంతరమును గల్పించుకొని యూనందించు నావంటివానికి వాదభేదములవలన నేమి ప్రయోజనము?

౧

ఫాల్గున శుద్ధవిదియ గురువారము నాడు ఇంకను పూర్తిగ తెల్లవారకుండగనే బ్రహ్మశ్రీ వడ్డాది సుబ్బారాయడుగారు పరమపదించినట్లు కబురువచ్చినది. నే నింకను మంచము నుండి లేవలేదు. దానికి క్రితము రోజున లంఘనము. ఎట్లో ఓపిక తెచ్చుకొని కాల్యములను దీర్చికొని సుబ్బారాయడుగారియింటికి బయలుదేరితిని. సుబ్బారాయడుగారి యింటి కెదురుగ నున్న ట్రయినింగు కాలేజీ హాస్టలు అరుగుమీద చిలకమర్తి లక్ష్మీనరసింహముగారును, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారును, నిడమర్తి దుర్గయ్యగారును, శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారును, ఇంకను మరికొందరు పెద్దలును కూర్చుండియుండిరి. "నాకు డెబ్బదిరెండు, మీకు డెబ్బదిమూడు" అని యీలీరుగ వారిలోవారు వయో

నిర్ణయ మొనర్చుకొనుచు ఇకతరువాత నెవరివంతు వచ్చునా యని యెదురుచూచు చున్నట్లుగ గనవచ్చిరి. సాధింపదగిన యర్థములెల్ల సాధించిఆరముగ్గినవారికి మరణమనిన పెండ్లివలె నుండునుకాబోలును !

నిడమర్తి దుర్గయ్యగారు గిడుగు రామమూర్తిగారి నుద్దేశించి, "పైకెంత భీకరముగ గనవచ్చునో లోపలనాయన అంత అమృతమయుడు. వాదభేదములను బురస్కరించుకొని వ్యక్తులను ద్వేషింపడు" అని తక్కినవారితో చెప్పుచుండిరి. "నిజము నిజము" అని నా హృదయము ప్రతిధ్వనించినది. దుర్గయ్యగారి మాటలు ముఖస్తుతికొర కుద్దేశింపబడిన వనుకొనుట కెంతమాత్రమునువీలు లేదు. దుర్గయ్యగారి కావిద్య పూర్ణముగ నపరిచితమగుట మొదటికారణము. ఎంత బిగ్గరగ మాటాడినను రామమూర్తి గారికి వినబడదనుట రెండవ కారణము.

రామమూర్తిగారి విశాలహృదయమునకు వ. సు. రాయకవిగారి మరణదినమే ప్రత్యక్షసాక్ష్యము. బ్రదికియున్న దినములలో వడ్డాది సుబ్బారాయుడుగారు వీరగ్రాంథికులు గదా !

"గిడుగు రామమూర్తి
నుడుగు నిల్వకపోమె
నొగి జయంతి
రామమోర్తి గెలిచె"

అని గ్రాంథికభాషావాద జయస్తంభముపయి శాసనము లిఖించినవారు. సరి. రామమూర్తిగారు వీరవ్యావహారికు లనుట జగత్ప్రసిద్ధమే. అట్టిచో తమ వెనుకటిభేదములను విస్మరించి కూర్చున్నచోటునుండి లేచినచో ఆయాసము వచ్చుచున్న డెబ్బదియారవవత్సరమున — దృష్టి సరిగ కనబడక, చెవులు సరిగ వినబడక, కర్రనూతగొనిగాని నడువలేక అవస్థపడుచున్న వయస్సులో మూడు ఫర్లాంగులు నడచి సుబ్బారాయుడు గారియింటికి వచ్చి అంతలో నాగకసుబ్బారాయుడుగారి శవము వెనుక వారియింటినుండి ఒక మైలుదూరమున నున్న ప్రేతభూమివంక చెంగు చెంగున కుర్రవానివలె పరుగిడుచున్నారు. తరుణవయస్కుడనయ్యును నేను వారితో నడువలేక లోలోపల సిగ్గుపడుచు కొంతదూరమయినవెనుక ఇంటికి మరలితిని.

౨

పర్లాకిమిడినుండి రామమూర్తి గారు రాజమండ్రి వచ్చినసందర్భములో వారికి స్వాగతపత్రము సమర్పించుట కొకసభ హిందూసమాజ భవనమున జరగినది. ఆ సభకు నేను హాజరయితిని. పర్లాకిమిడి ఆంధ్ర దేశములో చేరవలెనని రామమూర్తి గారి వాదన. అది యోఢ్రదేశములో చేరవలెనని పర్లాకిమిడి రాజావారి పట్టుదల. రామమూర్తిగారి యాజ్ఞ ననుసరించి వారి కుమారుడును మరికొందరు పర్లాకిమిడి వాసులును ఖండాంతరములకు పోయి సలిపిన ఆందోళనము——దానిని బురస్కరించుకొని గిడుగువారి కుటుంబమునకు ప్రాప్తించిన కష్టములు రామమూర్తిగారి ముఖతః ఆనాటిసభలో విని శత్రువులుకూడ కంట తడిపెట్టిరి. ఆంధ్రాభిమానముచేతను, అంతరాత్మకు వ్యతిరేకముగ వర్తింపకూడదని దృఢవ్రతము వహించుటచేతగదా చిరకాలమునుండి నివసించుచున్న పర్లాకిమిడి వదలి స్వగృహమును పాడుపరచుకొని వయసుకాని వయసున, "తలదాచుకొనుటకయి తావు దొరకునా" యని యల్లాడవలసి వచ్చినది? అదివరలో తమపట్ల భక్తి ప్రపత్తులు చూపు ప్రభువు విముఖుడయినాడు. వినయ గౌరవములు చూపు పురవాసులు విరోధు లయినారు. తుదకు శరీరమునకు దెబ్బలు తగిలి పర్లాకిమిడిలో కాపురము దుర్భరమయినది. ఈ వీరచరిత్రము చరిత్రగాథలలో చేరకపోవునా ?

౩

ఒక్క ఈ యుదంతమునందే కాదు; ఏ యంశమునందైనను అట్టి పట్టుదల—అట్టి దీక్ష—అట్టి స్వార్థత్యాగమును గిడుగువారి చారిత్రమున ప్రకాశించుచుండును. వారి భాషావాదమునే తీసికొనుడు. అది సారవంతమయినదా కాదా యను ప్రశ్నతో మన కిచట నిమిత్తము లేదు. కాని తాను భాషకు శ్రేయస్కరమని నమ్మిన వాదమునిమిత్తమయి వారు జీవితమును ధారపోసిరి. ఇంకను పోయుచున్నారు. అహోరాత్రము లేకదీక్షతో ఇంకను భాషాజిజ్ఞాస సలుపుచునే యుందురు.

సభలో గిడుగు రామమూర్తి పంతులుగారు గ్రాంథికవాదులగు పండితులను ప్రతిఘటించి వాదించుచుండగ చూడవలయును. వారియుపన్యాసములలో స్వరూపసౌష్ఠవ ముండ దను మాట నిజమే. ఎన్నిగంటలు మాటాడినను అంగోపాంగ విభజనముగాని, ఏ యంశమున కెంత ప్రాధాన్యము నిచ్చి మాటాడవలెనో గ్రహించి

మాటాడుట కాని సాధారణముగ కానరావు. సభ్యులు తమ యుపన్యాసమునకు సుముఖులా విముఖులా యను విషయమునుకూడ వారు గుర్తింపరు. ఆవేశపూరితులయి బిగ్గరగ చెవులలో గింగురుమనునట్లు మాటాడుదురు. అగ్నిపర్వత మొకటి గ్రమ్మున బ్రద్దలయి 'లావా' వర్షించుచున్నదా యనిపించును. ముసలితన మంతయు నెక్కడకు పలాయన మగునో తెలియదు కాని తరుణ యోధుడు అశ్వము నెక్కి కత్తి ఝుళిపించుచు కదనరంగమున వీరవిహార మొనర్చుచున్నట్లుండును. వేయేల? పిడుగులు వర్షించుచున్నట్లుండును.

౪

నేను అప్పుడప్పుడు పంతులవారి దర్శనార్థమయి వారియింటికి పోవుచుండును. పోయినప్పుడెల్ల అయిదారు గంటలకు తక్కువగాకుండ గూర్చుండవలసినదే. ఒకదినము పగలు పది గంటలకు పోయి సాయంత్ర మూరు గంటలకు ఇంటికి వచ్చితిని. మనము మాటాడినచో వారికి వినబడదు గావున వారు మాటాడగా వినవలసినదేగాని ఉక్తిప్రత్యుక్తుల కవకాశము లేదు. అప్పుడు వారు వర్షించు నను రాగరసము అమూల్యము. నా ప్రాక్టీసునుగురించి, నా కష్టసుఖములను గురించి, నా పిల్లలనుగూర్చి పుంఖానుపుంఖములుగ ప్రశ్నలు. ఆ వాత్సల్యమునకు మేరలేదు. క్రమముగ సంభాషణము భాషావాదమునకు పరుగెత్తును గదా? ఇక నా పాండిత్యమునకు హద్దులేదు. ఒక్కొక్కశబ్దమునే తీసికొని దాని కేశాలమున నెట్టి స్వరూప మున్నదియు, ఎట్టి యర్థ మున్నదియు వివరింప మొదలిడినచో నిశ్చేష్టుల మయి కూర్చుండి వినుచుండవలసినదే. ఒక్క తెనుగు భాషాచారిత్రము నుండియే గాక ఆంగ్ల భాషాచారిత్రమునుండియు, సంస్కృత భాషా చారిత్రమునుండియు, ఇతర భాషా చారిత్రములనుండియు నుదాహరణములను గైకొనుచు భాషాపరిణామమును గూర్చి వారు ముచ్చటించుచుండగా వినుచున్నపుడు "తెనుగు భాష నా మాతృభాష గదా! దానిలో నేదో పాండిత్యప్రకర్ష చేయుచు పుస్తకములు వ్రాయుచున్నాను. నిజముగ నా భాషను గూర్చి నా కేమియు తెలియనే తెలియదా" అనుభావములు మనస్సును కలతపెట్టును. వారి పాండిత్యమును చూడగా చూడగా ఆశ్చర్యము—వెరపు—దిగ్భ్రమము ఉదయించును. శబ్దస్వరూప నిర్ణయమున వారి సిద్ధాంతము లన్నియు ప్రామాణికములు గాకపోవచ్చును. కాని వారు సలిపిన కృషి యపారము. ఆధునిక గ్రంథములనుండి గ్రంథకర్తల నెదుట బెట్టుకొని కృతకభాష కుదాహరణములుగ తప్పులు చూపుచున్నపు డెంతటివారయిన మారు మాటలేక మౌనముద్ర వహింపవలసినదే. ఆంధ్రదేశమున సుప్రసిద్ధపండితులు పెక్కుమందితో నాకు పరిచయ మున్నది. కాని ఆంధ్రభాషా తత్త్వవేత్తృత్వమున నీయనతో తుల్యులు నాకు గానరాలేదనుట అతిశయోక్తి గాదు.

ఇంకొక విశేషము. భాషావాదమును బురస్కరించుకొని ఎదుటి వారి గ్రంథములను విమర్శించుచున్నపుడు గ్రంథములను దాటి వ్యక్తిదూషణ కెన్నడును వారు పోరు. ఎంతసేపును గ్రంథములో నున్న వ్యాకరణదోషములనే వారు విశదీకరించి తమ వాదమును పునః పునః ప్రతిష్ఠించుచుందురు.

౫

ఇట్టి మహాపండితునికి చేయదగిన సేవ చేసి ఆంధ్రదేశము పొందదగిన లాభము పొందినదా? వారిచే సమగ్రమగు వ్యాకరణము వ్రాయించుకొనవచ్చునే? లేదా నిఘంటువు వ్రాయించుకొనవచ్చునే? లేదా; భాషాచరిత్రము వ్రాయించుకొనవచ్చునే? లేదా పరిశుద్ధమైన భారత ప్రతి తయారుచేయించుకొనవచ్చునే? వీనికిని వారితో మనకున్న వాదభేదమునకును ఎట్టి సంబంధము లేదే?

అట్టి భాగ్యమునకు మనము నోచి పుట్టలేదు. వాదభేదములను బురస్కరించుకొని పండితప్రభువులకు వారు అస్పృశ్యు లయిపోయినారు. అందుచే ఆనకట్టకు పూర్వము గోదావరీప్రవాహమువలె ఆ పాండిత్యమంతయు వ్యర్థము కావలసినదే కాబోలును. వారికేమి? వా రెప్పుడును సుకృతులే. అపురూపమైన పాండిత్యసౌందర్యముతో, నైతిక సౌందర్యముతో—ఆ ముఖారవిందమాంధ్రదేశమున్నంతకాలము నిత్యయౌవనముతో నాంధ్రదేశ చారిత్రము నలంకరింపవలసినదే! అట్టి సౌందర్యమునకు విలువగట్టలేని కళంకముకూడ ఆంధ్రజాతికి శాశ్వతముగ నిలువవలసినదే కాబోలును!!!

# ‘బ్రాహ్మణీకం’

వల్లమన్నాటి కుటుంబరావు

★

నవ్యాంధ్ర కథకుల్లో అగ్రస్థానానికి అర్హులైన వెంకటచలంగారి రచనలు ౧౯౩౦ ప్రాంతాల అందరూ నిరసిస్తూవుండేవారు. అయినప్పటికీ సనాతన-అధునాతనులందరూ ఆప్యాయంగాచదివి, తిరిగీ చదివి ఆనందపడుతూనేవుండేవారు. వారికథలు వ్యభిచారాన్ని ప్రోత్సహించేవనీ, అవినీతివర్ణనలు జాస్తిఅనీ, సంఘశ్రేయానికి అట్టివి మంచివికావనీ ఒక అభిప్రాయం బహుమందికి యేర్పడిపోయింది. వెంకటచలంగారి కథలన్నీ నీతిబాహ్యాలా అని పరిశీలనచేస్తే పొరపాటుపడ్డామని నాలిక కరుచుకోవలసివస్తుంది. వారి రచనలన్నీ నీతిబాహ్యాలక్రింద జమకట్టడానికి వీలు లేదు. సంఘశ్రేయాన్ని అభిలషించి రచింపబడినవిగూడ కొన్ని వున్నయి. సంఘంలో వుండే దురాచారాల్ని, అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని రూపుమాపుటకు ప్రయోజనపడే “బ్రాహ్మణీకం” లాటికథలుకూడా రచించారు వెంకటచలంగారు.

ప్రాచీనంగా మనలో కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు పాతుకుపోయినై. ఈ నాటి దేశకాల పరిస్థితులకు అవి పనికిరావు. మన వేదాలు, పురాణాలు, స్మృతులు మొదలైనవన్నీ కొన్నివేలయేండ్ల క్రిందట ఆనాటి సంఘ జీవితాన్ని ఆధారంగా చేసుకొని కల్పింపబడినవి. ఇప్పుడింకా వాటినే పట్టుకు వ్రేలాడతా మనటంకంటె వెర్రితనం యింకొటి లేదు. ఊఁహుఁ అన్నాకూడా కాలం అంగీకరించదు. కాలశక్తియందు మనశక్తి తృణం వంటిది. భగవంతుడిచ్చిన బుద్ధిప్రాభవంచేత యేవో కొన్ని వింత దృశ్యాల్ని మనుష్యుడు కల్పించ గలిగినంతమాత్రాన యీ తనశక్తి అంతా స్వశక్తి, స్వప్రయోజకత్వమే అనుకోవటం అహంకారమనిపించుకుంటుంది. ప్రపంచంలో జనించిన ప్రతిజీవిలోను అనుదినం జరిగే మార్పుల్ని గమనిస్తూనేవున్నాం. ఒకజీవి పుట్టి, పెరిగి, అనుభవాలు పొంది, పెద్ద అయి, యెలా హరింపు చెందుతున్నదో అదేవిధంగా కాలమనేదికూడ. ప్రతిజీవీ దానికి దాసుడు కావలసిందే. జీవియొక్క హితము, అహితములతో దానికి నిమిత్తం లేదు. జీవియొక్క శ్రేయము, అశ్రేయములను గూడ గమనించదు. జీవి తనను అంటివస్తున్నాడా లేదా అనే ఆదుర్దా, వెనుకచూపు గూడ లేదు. ఒకే నడక. జీవుడు దాని ననుసరించవలసినదే. దాని తీవ్రతక్రింద జీవి నలిగిపోవుతున్నాడేమో ననే జాలి యీషణ్మాత్రం లేదు. కాలము యొక్క దృష్టిలో ప్రపంచజీవి ఒక తుచ్ఛ కీటకము. ఆ వేదకాలంనాటికీ యీ నాటికి అనంత విధాలైన మార్పులతో ప్రపంచజీవి కూడ మార్పు చెందకతప్పదు.

అనూచానంగా వస్తూన్న మన ఆచారాల్ని, సంప్రదాయాల్ని కొంచెం సూక్ష్మదృష్టితో, యీనాటి ప్రపంచపరిస్థితుల్తో సమన్వయపరచి చూస్తే అవి కేవలం సైంటిఫిక్ అని తట్టకపోదు. అవన్నీ సుఖమైన, ఆనందమయమైన జీవితం గడపటానికి మానవునకేర్పడ్డ కొన్ని సూచనలు, కొన్ని హెచ్చరికలు. ఇక దుఃఖాలు, కష్టాలు అనేవి ఆకాలప్రవాహానికి యెదురీత సాగించిన ప్రయత్న ఫలితం. ఈ స్వల్పమాత్రాంశాన్ని అవగాహన చేసికొనకుండా సంచరించేజీవి క్షుద్రుడైపోతున్నాడు. వెంకటచలంగారు తమ ‘బ్రాహ్మణీకం’ మనేరచనలో ఋజుపరచేది యీ రహస్యాన్నే.

సుందరమ్మ పల్లెటూరి బ్రాహ్మణపిల్ల. సంప్రదాయంగావస్తున్న నికారసైన పూర్వాచారపరాయణకుటుంబంలో పుట్టిన కారణంచేత మడి, ఆచారం, దేవుళ్లు, దయ్యాలు, జ్యోతిషాలు, సోదెలు మొదలైన మూఢనమ్మకాలుగల అమాయక ప్రవృత్తి కలిగింది. బహు చిన్నివయస్సు అయినా పెద్ద ఆచారాలు, పెద్దమడులు, పెద్దవూహలు. ఎనిమిదోయేటనే మేనత్తకొడుక్కిచ్చి పెళ్లిచేశారు. పెళ్లికాగానే సంస్కృత విద్యాభ్యాసంకోసం పరదేశాలకు పోయి ఆరేళ్లు గడచివచ్చి కార్యం చేసుకుని భార్యతో కాపురం సాగించాడు. సుందరమ్మ యితని రసికతకు దీటైన సౌందర్యరాశి అవటంచేత రెండు సంవత్సరాలపాటు యథేచ్ఛగా ప్రవర్తించారు. ఇంతలో దేవుడికి కన్ను కుట్టిందికాబోలు దాంపత్యాన్ని త్రుంచివేశాడు. తీవ్రజాడ్యం యేర్పడి భూశయనం చేయబడ్డాడు అతడు. దీపం కునికిపోయే సమయంలో సుందరమ్మను, మామగార్ని దగ్గరకుపిలిచి “నేనుపోయినా దానిలో నివసించబోతున్నాను. దాని అందాన్ని అమితంగా ప్రేమిస్తున్నాను. దానిని వికారం చెయ్యొద్దు” అనిచెప్పి ప్రాణాలు విడిచాడు. మూడుసంవత్సరాలు గడిచాయి. భర్తకుచేసిన వాగ్దానంప్రకారం యేయితరజోక్యం కలుగచేసికోకుండా తొణుకూడని గాంభీర్యంతో తపశ్శాలినిలా నుందే అనుకునేటట్టు తోప చేస్తోంది. ఇంతలో తండ్రికూడా మరణించాడు. దిక్కు శూన్య మయ్యేసరికి మేనమామ చేరదీశాడు. మేనమామ వెంకట్రామయ్య యింట్లో చంద్రశేఖరమనే బీదకుర్రాడు చదువుకుంటూ వెంకట్రామయ్యగారి కుమార్తెకు పాఠాలు సంగీతం చెబుతున్నాడు. సుందరమ్మనుకూడా వానిదగ్గరపాఠం,సంగీతం వగైరా నేర్చుకోవలసిందిగా మేనమామ ఆజ్ఞాపించాడు. చంద్రశేఖరం అగర్భదరిద్రుడు. ఈ స్థానం తప్పితే ఆదరించేందుకు ఒక్క పురుగుకూడలేదు. ఏమంత పెద్దచదువూ అబ్బలేదు. రూపమా అదీ అంతంతమాత్రమే. వీనికి సుందరమ్మమీద మనసు పారింది. కొంతకాలం వీనిచేష్టలు ఆమె గుర్తించనేలేదు. సుందరమ్మకు ఆ గొడవే లేదు. చంద్రశేఖరం తాపన అంతకంతకు జాస్తి అవుతోంది. తన ఉపాయాలన్నీ విఫలమవుతాయి. కొంతకాలానికి వానిదురూహ సుందరమ్మకు కొంచెం అర్థమవుతుంది. అయినా తొణకదు. అతడో ఆమెమీద త్రాచుపగ పట్టాడు. ద్వేషం, మోహం రెండూ పెనవేసుకుని బాధిస్తున్నయి అతన్ని. ఇక సాహసమే శరణ్య మనుకుని యింటిలోనుంచి వెళ్లగొట్టినాసరే, చంపినాసరే, తన ఉత్తర జీవితం బుగ్గి అయినాసరే ఆమెను పొందనిదే జన్మసార్థకత కాదనే మూర్ఖపుపట్టు పట్టి ధైర్యం చేసి సఫలుడైనాడు. సుందరమ్మ పొత్తికడుపు పెద్దదై నునుపెక్కుతోంది. చంద్రశేఖరం గయిర్వాలియా అయినాడు. ఈ

గర్భధారణాన్ని గురించి యింట్లో ఆమూలా ఆమూలా చెవులు కొరుక్కుంటున్నారు. ఈ విషయం వెంకట్రామయ్యగారి నోటీసులోకి వెళ్లింది. సుందరమ్మను చంద్రశేఖరానికిచ్చి వివాహంచేయడం తప్ప వేరే ఉపాయమేమీ తోచక వానినిపట్టి తీసుకువచ్చి వివాహంజరిపించి యిరవై అయిదు రూపాయల బ్యాంకు గుమాస్తాపనికూడా కుదిర్చి వేరే కాపురం పెట్టించి చేతులు కడిగేసుకున్నాడు. ఈ వివాహ విషయంలో చంద్రశేఖరం సుందరమ్మల యిష్ట - అయిష్టాలను తెలుసుకోవటానికి యెవ్వరూ ప్రయత్నించలేదు. సుందరమ్మ చంద్రశేఖరాన్ని ప్రేమించలేదు. పైగా తన జీవితాన్ని ధ్వంసంచేసినాడనీ, తాను తన పూర్వపుభర్తకు చేసినవాగ్దానం భంగంచేసినదనీ, యీవితంతువివాహం మహాపాపకార్యమనీ చంద్రశేఖరాన్ని ద్వేషంగా చూడటం మొదలెట్టింది. సుందరమ్మయొక్క సరియైన ప్రకృతిని తెలుసుకోకుండా తనుఅంటే ఆమె విముఖురాలుగా వుండటం ఆమెకు పరపురుష సంబంధ మున్నదని చంద్రశేఖరం అనుమానపడి యిద్దరకూ ఒకరినిచూస్తే ఒకరికి ఏమాత్రం పడకుండావచ్చింది. భర్త అంటే ఆడదానిమీద సర్వాధికారి అని చంద్రశేఖరం భావన. సుందరమ్మను కేవలం దాసీకన్నా కనాకష్టంగా చూస్తున్నాడు. సంసారంలో భర్తకు యెక్కుడు ఆధిక్యము కలదా, భార్యకు యెక్కువ కలదా? అనే జిజ్ఞాస సుందరమ్మకు లేదు. ఆమె దంతా అదోక అడవిగోడు. కాని చంద్రశేఖరం ప్రవర్తన, అతడు తనకు చేసిన మోసంవల్ల అతన్ని మనసా ద్వేషిస్తోంది. సంసారం చేస్తున్నారన్న మాటేగాని ఒక్కనాడుగూడ తృప్తికరంగా సుఖంగా గడపిందిలేదు. ప్రసవించింది. ఏముచ్చటాలేదు. బిడ్డఅవసరానికి యేదైనా స్వల్పమాత్రపుడబ్బు కావలిస్తే సుందరమ్మ అతనిదగ్గర వేశ్యాతత్వం అవలంబించవలసిన అవసరం యేర్పడటం ఆమెకు మరింత అసహ్యంగా తోస్తావుంది. ఈ వివాహం వితంతువివాహం కావటంచేత చుట్టుప్రక్కల యిండ్లవాళ్లెవరూ పలుకరించరు. విరిగినవ్రేలికి సున్నముగూడా పెట్టమంటారు. దేవుడుగుళ్లోకి కొబ్బరికాయ తీసుకుపోతే అక్కడ పూజారికూడా స్వీకరించడు. బిడ్డకు జబ్బు అంతకంతకు ముంచుకువస్తోంది. చంద్రశేఖరం యేమాత్రం శ్రద్ధ చూపటంలేదు. ఆబిడ్డకు ఆజబ్బుచేయటం తానుచేసిన పాపకర్మఫలం అని ఆమె విశ్వాసం. శ్రమపడి డాక్టరును పిలుచుకువస్తుంది. చూచి నూదిమందు యెక్కించవలె నంటాడు. సుందరమ్మ తొంటిచెయ్యి బయటపెడితే యీమెపిచ్చిదని అతడు వెళ్లిపోతాడు. మందుకోరకు తనే మందులషాపుకు వెళ్లుతుంది. డబ్బుయియ్యనిదే షాపువాళ్లు మందియ్యమన్నారు. ఈమె వాలకంఅంతా షాపులో ఒక గుమాస్తా కనిపెట్టి ఆమెవెంటబడి యింటికివస్తాడు. ఈతడు ప్రథమంనుంచీ బ్రహ్మద్వేషిగా పెరిగాడు. సుందరమ్మ అసమాన సౌందర్యానికి తోడు బ్రాహ్మణజాతిదికూడా కావడం వాని సంకల్పం యీడేరేయోగం పట్టినట్లు భావించాడు. తను డాక్టరు నని చెప్పుకుంటాడు. సహజ- అమాయకత్వంచేత యీ అయాచితుడయిన మనిషి తనపాలిట దైవమని భావిస్తుంది సుందరమ్మ. మందిస్తే దానికి ప్రతిఫలం ఆమెపొందు నభిలషిస్తాడు. ఆమెమౌనం సంపూర్ణాంగీకారంగా భావించి తనజీవితాశయం నెరవేర్చుకుంటాడు. మందియ్యమంటే తను వైద్యుడు కానని అంటే తిరగబడింది. రాక్షసి, దెయ్యం, మహిషాసురమర్దని, శక్తి అయింది ఆమె. ఆమెధాటికి తప్పించుకోవలెనని ప్రయత్నించటంలో వానిబట్టకు అక్కడ మండుతూవున్న కిరసనాయిలుదీపం అంటుకొని భస్మమైపోతాడు. సుందరమ్మ పిల్లమీద పడి చచ్చిపోతుంది.

ఈరచన్ని పూర్తిచేయటంలో వెంకటచలంగారు కొంచెం గందరగోళపడ్డా రని అనక తప్పటం లేదు. కథ ముప్పాతిక నడచిన తరువాత ముగింపుదగ్గర అవసరపడినట్టున్నది. గవళ్ల రామయ్య వచ్చి మీ రెవరని అడిగితే "బ్రాహ్మలం"అంటుంది సుందరమ్మ. ఈముక్కనే ఆధారంగాగ్రహించి రామయ్యకేదో వెర్రియెత్తించి కథను సమాప్తి చేశారు. మనదేశం ఒక్కదేశంగా, ఒక్కజాతిగా మెలగటం లేదు. వివిధదేశాలు, వివిధజాతులు, వివిధమతాలు, జాతులలో తిరిగీ అంతర్జాతులు భిన్నభావాలు కలిగివుంది. సుందరమ్మ "బ్రాహ్మలం" అనటంలో గల ఊహ యేమిటో వెంకటచలంగారి బుద్ధికి తట్టలేదట. తమరెవ్వరని యెవ్వరైనా అడగటం 'మేము బ్రాహ్మలం, కోమట్లం, మొదలియార్లు' అనటం యీదేశంలో సహజమైన సంప్రదాయమై పోయింది. ఇది గర్వంతో చెప్పుకునేది యే మాత్రమూ కాదు. రామయ్యతో బ్రాహ్మలం అనటం కాకపోతే ఆవూర్లో ఆమె ప్రఖ్యాతి చెందినది గనక వేరేవిధంగా చెప్పుకుంటుందా? సుందరమ్మ బ్రాహ్మణి అనేసంగతి సగర్వంగా చెప్పిం దనుకుందాం. బ్రాహ్మణజాతి చాలా గొప్పది, మడి ఆచారవంతులు, మిగతవారంతా తక్కువ వర్ణస్థులు అనేభావమే అనే గర్వమే వుండివుంటే రామయ్యను తగినట్టే తిరిగీ ప్రశ్నించివుండేది "మీరెవ్వరు" అని. "మేము గవళ్లకులం, నాపేరు రామయ్య, ఈ తాలూకాబోర్డు ప్రెసిడెంటును" అని జవాబిస్తే మం దియ్యటానికి అంగీకరించదు. అమాయకత్వంచేత, అజ్ఞానంచేత, మూఢనమ్మకాలచేత సంసారమే ధ్వంసం అయిపోయినా లక్ష్యం చెయ్యనిది గవళ్లవాడి చేతిమందు తన బిడ్డగొంతులో పోయనిస్తుందా? పోనీ ఆచారాలు పనికిమాలినవి, దేవుడు దెయ్యాలు వున్నవో లేవో యింతవిశ్వాసంతో సేవిస్తున్నా కనిపించక ఆదరించనప్పుడు వాటిని కొలిచే దేమిటని మనసు మారిందేమో నను కుంటే కథ ప్రారంభంమొదలు యింతవరకు ఒకేవిధంగా నడచిందే ఆమెజీవిత మంతా. సుందరమ్మ బ్రాహ్మలం అనటం మనదేశానికి సహజం. "బ్రాహ్మలం" అనటం గర్వమనే పక్షంలో సుందరమ్మ యేబ్రిటిషుజాతిస్త్రీ అయ్యేవుండాలి. ఇంగ్లీషువారికి పెంకితనం జాస్తి. తమజాతి అంటే చాలా గర్వపడతారు. ఈ గర్వంచేతనే యే యింగ్లండు యువకుడికీ అమెరికా, జర్మనీ, ఇటలీ, రష్యావంటిదేశాల్లో నౌకరీలు లభించవు. ఇంతేకాకుండా "Wanted" Columns లో ప్రకటనలకు **"No Englishmen need apply"** అనికూడా అంటారు.

పై విషయంలో వెంకటచలంగారు "ఆ వొక్కమాట! ఆ మాట ఆమె అసమయాన అనితీరవలసిందేనా? ప్రపంచచరిత్రలో అది తప్పనిసరి అయిందా? ఇదివరకే ప్రపంచ సృష్టిలోనే యిది నిర్ధారణ అయిపోయిందా? లేక సుందరమ్మ రామయ్యల పూర్వజన్మ కార్య ఫలిత సంఘటనలవల్లా? లేక భూలోక వ్యవహారాన్ని కనిపెడుతూ వసించే దేవతలు అట్లా నిశ్చయించి ఆ నిమిషాన-నే నీ కథని ఎట్లా అంతంచేయాల్లో యీ నిమిషాన నిర్ణయించినట్లా? లేక ఆమాట అవసరం సుందరమ్మ **heridity** వల్ల నిర్ణయింపబడ్డదా? బ్రాహ్మలం అనే గర్వపు పలుకు యుగ యుగాల బ్రాహ్మణరక్తం బ్రహ్మజ్ఞానల అధికారయోగ్యత ఆమెనోటిలోనించి పలికిందా? ఊరుకన్న, పేరుకన్న, ఉద్యోగం కన్న, వంశంకన్న ముందు కులంసంగతి వెల్లడి చేసేయీ దేశాచారమే ఆమెని ప్రోద్బలం చేసి వుండొచ్చు"అని జిజ్ఞాసపడ్డారు. 'బ్రాహ్మలం' అని ఆమెనోటివెంట రావడం కేవలం **Automatic.** 'మీ రెవరు' అని ప్రశ్నిస్తే 'నేను మీ సోదరుణ్ణి, లేక మీ సోదరిని' 'మీ దేశాతి'కి బదులు 'మాది భారతజాతి' అని అన తగినంత సంస్కారం, ఏకీభావం మనదేశీయుల కింకా అలవడలేదు. సుందరమ్మ గడుసుదే అయినట్లయితే, కార్యసఫలతే ప్రయోజనంగా పెట్టుకున్నట్లయితే రామయ్యతో "యెవ్వరమయితే యేం నాయనా! మాపాపం పండి యిలా అనుభవిస్తున్నాం, మీ అప్ప చెల్లెండ్రవంటిదానినే నేనూనూ" అని అండకుండా అంటుంది. ఆమె అమాయకత్వమే నిజం పలకమని ప్రేరేపించింది. సుందరమ్మ మాయలు మర్మాలు నేర్చినదిట్ట కాదు; ఉత్త బోళాది.

"ముండిస్తే నా కేమిస్తావు?" అంటాడు రామయ్య. "ఏముంది, ఏంలేదు నాకు, దిక్కులేనిపక్షిని" అంటే "నువ్వేకావాలి" అంటాడు. ఎంత సాహసం! ముందుగతి చూమకోకుండా బ్రహ్మదేవ్వుంచేతనే అన్నాడను కుందాం, స్త్రీ అంగీకరిస్తుందా? మౌనం వహించింది. దీనిని అంగీకారంగా భావించి ఆచచ్చిపోతూన్న పిల్లపక్కన, ఆకిరసనా యిలుబుడ్డి ముందు కదిలేవికారినీడల్లో సుందరమ్మని కౌగిలించుకున్నాడు. సుందరమ్మ మనసా యిందుకు అంగీకరిస్తుందా? నీవుకావాలి అనటంతో ఆమె కొయ్యఅయి పోయింది. బిడ్డ యొక్క ఆశ వదలుకుంది; తనకష్టాలన్నీ పాపఫలమని హృదయంలో ఆవేదనపడుతోంది. తిరుగబోతుదికాదు. చంద్రశేఖరంతో పోయి సందుకే మొదటిభర్తకు ఆగ్రహంవచ్చి యీ విసంగా చికాకులు పెడుతున్నట్టు నమ్మ చుండే సందర్భంలో రామయ్యను అంగీకరిస్తుందా? సుందరమ్మ కిది సుతరామూ యిష్టం లేదు. వెంకటచలంగారే యింకో చోట "స్త్రీ అంగీకారంలేందీ ఎంతబలవంతుడయిన పురుషుడూ నిస్సహాయుడవే సృష్టినిర్ణయం వ్యక్తమయింది" అంటున్నారు. సుందరమ్మ రామయ్యను ప్రేమించలేదు. నీవే కావాలి అన్నవానికి తగిన శాస్తిచేయటానికి సుందరమ్మకు రామయ్య తగినంత అవకాశమియ్యలేదు. సుందరమ్మకు సమాప్తిలో వెంకటచలంగా రీగతి కల్పించటం స్త్రీప్రకృతికి విరుద్ధం

ఈకథ ట్రాజెడీగా అంతమయింది. వెంకటచలంగా రీకథ యేకాలంనాటికో యెక్కడా వుదాహరించలేదు. ఈనాడు జరుగుతూన్న విషయాల్నే వస్తువుగా గ్రహించి అల్లినప్పుడు ట్రాజెడీగా, అంతంచేస్తే ముందింకా యెంతో తదంగం జరగాలిసి వుంటుందే! పై విషయాల్నిపట్టి చూస్తే చివర చివర భారతసంప్రదాయం మరచి పోయినట్టు తోస్తోంది వెంకటచలంగారు. భారతసంప్రదాయంతో ప్రారంభంచేసి పాశ్చాత్యసంప్రదాయపు సమాప్తిని తెచ్చే సరికి యీ అల్లికలో వెంకటచలంగారు కొంచెం గందరగోళపడ్డా రనే వూహించవలసివస్తోంది. ఇంతవర కిది 'ఉత్తర బ్రాహ్మణీకం.'

గవళ్ల రామయ్య ప్రవేశపెట్టబడేనంతవరకు కథ సరసంగానూ, సహజంగానూ నడిచింది. అనుదినం మనకళ్ల యెదుట కేవలం అజ్ఞానమే కారణభూతంగా యెన్నో సంసారాలు కూలి పోతున్నవి. ఏనాడో యేర్పడ్డ ధర్మశాస్త్రాలు, మతసిద్ధాంతాలు యుగయుగాంతరాల అనంతరం పాశ్చాత్య సంపర్కంవల్ల, నాగరకతా ప్రభావంమూలాన, తత్వశాస్త్ర ప్రయోగంచేత, ప్రత్యక్షాను భవంవలన అనుమానగ్రస్తాలై మూడిపింజలమాదిరిగా ఎగిరి పోతున్నాయి. విశేష గ్రంథపఠన పరిశీలనాదులవలన గూడా ఆనాటి కట్టుబాట్లీనాడు పటాపంచ లవుతున్నాయి. ఒకప్పుడు భారతదేశంలో బ్రాహ్మణుడు మొదలుకొని శూద్రునివరకు కొన్ని సంస్కారాలకు అధికారులై వున్నారు. ఆశ్వలాయనాది గృహ్యసూత్రాలు, మనుస్మృతి వగైరాల్లో చెప్పబడిన సంస్కారాలు కాలక్రమేణ మనలో నూటిలో నాలుగవవంతుకూడా ఆచరించటం లేదు. ఆచరిస్తున్నవారైనా అర్థంలేకుండా, ప్రయోజనం గ్రహించకుండా "మా పెద్దలు చేస్తుండేవారు, ఆ ఆనువాయితీ తప్పడమెందుకని మేమూ చేయాలి, తప్పదు"అని సమాధానమిస్తున్నారు యెవ్వరైనా ప్రశ్నిస్తే. ధర్మసిద్ధాంతాలనిగూర్చి ప్రశ్నించటానికి యిష్టపడరు మరికొందరు. కారణం కర్మిష్ఠులకే తెలీదు వాటి పరమార్థం, ప్రయోజనం. తర్కశక్తి, సంస్కారావబోధం, విజ్ఞానసముపార్జనోద్యోగం విరివైన యీ దినాల్లో ప్రతి పూర్వ పద్ధతికీ 'యిది ఎందుకు, అది యెలాగు' అని శంకలు ఉదయిస్తున్నాయి. ఏకోపక్రమమైన ఋజువులను పరుస్తేనే కాని ధర్మశాస్త్రాలలోని నియమాలు, ఆంక్షలు, ఆజ్ఞలు అవలంబించకున్నారు. ధర్మశాస్త్రాలు సంఘకట్టుబాటుకు, సంఘనీతికి, సంఘక్షేమానికీ యేర్పడినవై యున్నాయి. కాని మనదేశం పరరాజులదాడి, ఆక్రమణ, ఆధిపత్యం మొదలైనవాటికి గురి అయినప్పటి నుంచీ పూర్వసంప్రదాయాలు, ఆచారాలు ఒకటివెనుక ఒకటి నిష్క్రమణంలోకి దిగి నూతనరాజుల, సంప్రదాయాలు ఆచారాలు తల యెత్తటం మొదలుపెట్టినవి. అశోకుని కాలంనాటి ఆచారాలు మధ్యయుగంలో లేవు. ఈ నాటివి మరి రెండువందల సంవత్సరాలకు పూర్తిగా మారిపోవచ్చు. కాలగర్భం యొక్క మహాత్వమట్టిది.

సుందరమ్మ పుట్టింటివైపువారు గాని, అత్తింటివైపువారు గాని సంఘసంస్కారులు కారు. బ్రాహ్మణీకం యొక్క యథార్థత వారింట్లోనే వుంది. నూటికినూరుఛాందస ప్రవృత్తి కావటంచేత సౌఖ్యమంటే యేమిటో, లోకజ్ఞాన మేమిటో, ప్రపంచ మెట్లా నడుస్తోందో అనే మీమాంస వారి కెప్పుడూ తట్టని కారణాన సుందరమ్మ కాపురం యిలా కాలిపోవలసి వచ్చింది. సుందరమ్మకు కొంచెం చదువు, స్వల్పంగా సంగీతం, మధ్యేమధ్యే బస్తీలకు షికార్లు కొట్టి నాగరక పోకలు, నాటకాలు సినీమాలుచూడటం, కొంచెం **Sex knowledge**, సంసారం నడుపుకునే నేర్పు, బిడ్డల పోషణ మొదలైనవి కొన్ని యేకొద్దిగానైనా తెలిసిఉంటే ఆమెచరిత్ర యింత దీనంగా ఉండివుండదు. సుందరమ్మ ఛాందసానికి తోడు చంద్రశేఖరం లభ్యమయ్యాడు. సుందరమ్మ చంద్రశేఖరాల మనోగతం తెలిసి కోకుండా పెండ్లిచేసిన వేంకట్రామయ్య వాళ్లసంసారం యీ విధంగా బుగ్గికావటానికి బాధ్యుడు. అయినా భార్యాభర్తలు ఐకమత్యంతో వుండవలదని వెంకట్రామయ్య మతంకాదుగా! అసలు వీరిపెండ్లికి కారణమే వేరుగా.

భారతదేశం పారతంత్ర్యదేశం. ఏది జరగవలెనన్నా ప్రభువుల అనుమతికావలె. మన పాఠశాలల్లో పనికిమాలిన, సేవకావృత్తికి మాత్రమే పనికివచ్చే చదువు నేర్పుతున్నారు. గృహస్థు అయినపిమ్మట సంసారం ఆనందమయంగా చేసికొనేనేర్పును చెప్పకున్నారు. **Sex education**, బిడ్డలపోషణ, గృహాలంకరణను, పాకకళ, అతిథిసత్కారం, **economy**, మొదలైనవి కొన్ని మన పాఠశాలల్లో చెప్పినట్లయితే కొన్ని సంసారాలలో భార్యాభర్తల నడుమ సంభవించే తగాయిదాలు అంతరింపచేసికోవచ్చు. పైవిషయాలమీద మన దేశపు పాఠ్యనిర్ణేతలు, ఉపాధ్యాయులు కొంచెం శ్రద్ధచూపుతే సంసారాలు ఆనందసామ్రాజ్యాలుగా చేసికోవచ్చు. ఈవిషయంలో బ్రిటీషువారికంటె జర్మనీ వారు ముందంజవేసి స్త్రీలను చక్కని గృహిణులుగా తయారుచేయటానికి ఒకపాఠశాలను స్థాపించారు. త్వరలోనే జర్మనీ నలుమూలలా యీపాఠశాలలు స్థాపింపబడతాయని తెలుస్తోంది.

మొత్తంమీద వెంకటచలంగారీ కథను రచించటంలో సంఘసంస్కారాన్నభిలషించే వ్రాసినా రనటంలో యేలాటిఆక్షేపము లేదు. సుందరమ్మ చంద్రశేఖరుల పాత్రలు చక్కగ పోషింపబడినవి. అవినీతి ప్రసంగాలు, జిజ్ఞాసలు అనుకున్నంత ప్రమాదకరంగా యేమీ లేవు. కొన్ని సిద్ధాంతరూపంగాను, మరి కొన్ని సలహాలుగాను కొన్నిచోట్ల సంప్రదాయ విరుద్ధంగాను కనబడతాయి. ఉదాహరణాని కొకటి రెండు—

మొదటిభర్త చనిపోయినపిమ్మట సుందరమ్మ "కొత్తలో శ్మశానానికిపోయి తెల్లార్లూ బిగ్గరిగా అతన్ని పిలుస్తోయేడ్చేదిట." మనలో ఒకశాస్త్రంవుంది. 'ఉన్నవూరివాడికి కాటి భయం, బయటివూరివాడికి నీటిభయం' అని. ఇందులో యథార్థం లేకపోలేదు. ఇది కాకపోయినా శ్మశానంలోకి వెళ్ళటం, చచ్చినవారిని పిలుస్తోయేడవటం పాశ్చాత్యపద్ధతికాని మన పద్ధతి కాదు.

"పురుషుణ్ణిచూసి కలవరపడి పిస్తపడి రొండంగా పోయే ప్రతిస్త్రీ హృదయంలోను వ్యభిచారం దాక్కునేవుంది." ఇది స్త్రీలోకం అంగీకరిస్తుందా?

"స్త్రీ నిజంగానే కళ్ళుతెరిచి పరీక్షించి పేరుకునేట్లయితే యీ మొగవాళ్ల కెవరికైనా వివాహయోగ్యత వుంటుందా?" ఈకారణం చేతనే కాబోలు పూర్వికులు రజస్వలానంతర వివాహాల్ని నిషేధించింది.

"తినాలంటే వంటా, తిరగాలంటే కట్లూ, మాట్లాడాలంటే భాషా, బతకాలంటే నీతీ, ముందు నేర్చుకోడంయెంతఅవసరమో పిల్లల్ని పెంచే విధంకూడా నేర్చుకోడం అంతే అవసరమేనని గుర్తించరు. భర్తని ఆకర్షించాలన్నా స్త్రీ మృగాలకన్న ఎక్కువనేర్పు కలిగివుండాలని వొప్పుకోరు."

"ప్రస్తుత హిందూప్రపంచంలో వుత్తమంత్రపుశబ్దాలూ, వాటితోచేసే అర్థంలేని కలాపాలూ మిగిలాయి. శారసాలలూ పెళ్లిళ్ళూ చాలాకర్మలూ, వీటికి మతసంబంధమైన అర్థం పూడిపోయింది. మర్యాదకోసం, క్షేమంకోసం, తక్కువవారి అమర్యాదకు జడిసీ ఆ తంతులు నడుపుతున్నారు."

[ఈకథంతా మునకలుమునకలుగా కొంత కాలం క్రిందట పత్రికలో పడిందే. ఇప్పుడు యువకార్యాలయం (తెనాలి)వారు గ్రంథరూపంలోకి తెచ్చారు. ఖరీదు 4 అణాలు.]

# సినీమా కళ ౨

పద్మరాజు

ఏదైనా ఒక భావాన్ని కవి వ్యక్తపరచదలచుకొన్నప్పుడు కవి దాన్ని మాటల్లో వ్యక్తపరుస్తాడు. ఆ భావం, కవిభావనలో కొన్ని మాటలస్వరూపం దాలుస్తుంది. ఆ భావమే చిత్రకారుని భావనలో కొన్ని గీతల్లోనో, రంగుల్లోనో స్వరూపం దాలుస్తుంది. ఏకళలోనైనా, ఒక భావాన్ని కళాకారుడు, వ్యక్తపరచదలుచుకొన్నప్పుడు ఆకళకి అనువైన అంగాలలో, దాన్ని భావనలో గోచరం కావించుకుంటాడు. అల్లాగే సినీమాకి కథ వ్రాయదలచుకొన్న కవి దాన్ని తెర మీద కనబడేకొన్ని బొమ్మలవరసలో నిర్మించుకోవాలి. కవికి మాటలెల్లాగో, చిత్రకారుడికి గీతలెల్లాగో, సినేరియో వ్రాతగాడికి బొమ్మ లటువంటివి.

నాటకానికీ సినీమాకీ సంబంధం లేకపోలేదు. అన్నిభావాలూ కూడా నటనలో వ్యక్తంగా వారి రెండింటిలోనూ కూడా, అయితే ఇంక వ్రాతలో ఈ రెండింటికీ భేదం ఎంతవరకు?


నాటక రంగంమీదికి ప్రకృతిదృశ్యాలు చూపడంకోసం, చెట్లుచేమలు తీసుకుని రావడం సభ్యతగా చాలాకాలంనుంచి పరిగణించడటంలేదు. అల్లాగే జంతువులు కూడానూ. అంచేత నాటకం వ్రాసేటప్పుడు, ఆయా ప్రకృతి దృశ్యాల స్వభావ సౌందర్యాలు పాత్రలద్వారా కవి అనిపిస్తాడు. అది స్వాభావికం కాదుగాని, ఆదృశ్యాలు రంగస్థలం మీదికి తీసుకురావడంకంటె పాత్రచేత అనిపించడమే బాగుంటుం దని వెనుకటి నాటకకారులు కనుక్కున్నారు. ఒక కుక్కని తెర ముందుకు తీసుకునివస్తే, అది, ఆహాడా విడి అంతా చూసి, ఖంగారుపడి, నానా అల్లరీ చేస్తుంది. దానితో దాని ప్రదర్శనంవల్ల కలగవలసిన సహజత్వం కలగకపోవడమే కాకుండా, నాటకం హాస్యాస్పదమైపోయి, గాంభీర్యమంతా చెడిపోతుంది. అందువల్ల, ఒక పాత్ర ఒక మంచి అందమైన వనంలో తిరుగుతున్నట్టు చూపించవలసివస్తే, కవి, ఆ పాత్రచేత 'ఆహా! ఈవన మెంత మనోహరంగా ఉంది! ఏమి ఈ రంగుల పువ్వులు,...' మొదలైన మాటలు అనిపిస్తాడు. ఏదైనా జంతువుల సంభాషణ వచ్చినప్పుడు, పాత్ర తెరవెనక ఎక్కడో ఆ జంతు వున్నట్టుగా భావించుకుని దాన్ని వర్ణిస్తాడు. సినీమాలో ఒక వనంయొక్క సౌందర్యంగాని, ఒక జంతువుయొక్క లక్షణాలు గాని పాత్రచేత అనిపించడం అనవసరం. ఎందుచేతనంటే ఆ వనంలో సౌందర్యం, ఆ జంతువు లక్షణాలు అన్నీ ఆ ఆ దృశ్యాలని చూపడంతో మనకి వ్యక్తమయిపోతాయి. తెలుగు సినీమాలలో ఆహా! ఈవనమూ, మనోహరమూ! మొదలయిన పాటలు చాలాచోట్ల కనిపిస్తాయి. ఇటువంటి పాటలవల్ల, ఆ దృశ్యాలు కలగజేసే ఆనందం ఎంతవరకు తరిగిపోతుందో తెలుగు సినీమాడైరెక్టర్లు గ్రహించినట్టు కనబడదు.

సినీమాలు నాటకాలకంటె స్వాభావికానికి దగ్గిర అనడం, ఒక్కనటనలోనే కాదు, తక్కిన అంగాలన్నిటిలోనూ అంతే. సినీమాలో సంభాషణ నాటకంలో వ్రాసినట్టు వ్రాయడం చాలాతప్పు. ముఖ్యంగా వ్యక్తపరచ దలచుకున్న భావం, మాటల్లోతప్ప వ్యక్తంగాదని కవికి తోచినప్పుడే అది సంభాషణలో వ్రాయాలి. ఇది సినీమాకి ప్రత్యేకించిన విధానం. అంచేత, సినేరియో వ్రాతగాడు, కథనంతనీ తెరమీద కనబడేకొన్ని బొమ్మలవరసలో జరిగినట్టుగా భావించుకోవాలి. సంభాషణ, మామూలుగా జీవితంలో ఏ విధంగాఅయితే ఉంటుందో అంతకిమించి ఉండకూడదు. సాధ్య మయినంతమట్టుకు ప్రతీభావం కొన్ని బొమ్మలయొక్క చలనంలో వ్యక్తమయేటట్టుగా భావించుకోవాలి. ఇద్దరు ప్రియులు, ఒక తోటలో నడుస్తూఉంటారు. వారి మనస్సులో ఆతోట అంతా ప్రేమయొక్క ప్రతిబింబంలా ఉంటుంది. గోరింకలు మాట్లాడుకుంటూ ఉంటాయి. తుమ్మెద పువ్వుమీద వాలుతుంది. ఈ మోస్తరుగా వనం అంతా ద్వంద్వమయంగా వారు భావించుకుంటారు. ఈ భావం వ్యక్తపరచ దలుచుకొన్నప్పుడు, వారిచేత మాట్లాడించడంకంటే, వ్యంగ్యంగా దాన్ని వ్యక్తపరుస్తే చాలా హృదయంగమంగా ఉంటుంది. మొదట ఆ ప్రియు లిద్దరూ వనంలో నడుస్తూ ఉన్న దృశ్యం. వారిచూపు లీ ప్రక్కనించి ఆపక్కకీ, ఆ పక్కనించి ఈ పక్కకి తిరుగుతూ ఉంటాయి. తరువాత చిన్న చిన్న ముక్కలలో ఒక గోరింకలజంట, తుమ్మెద పువ్వుమీద వ్రాలడం మొదలయిన దృశ్యాలు. తరవాత ప్రియులిద్దరూ ఆగి ఒకరి మొగం ఒకరు చూసుకుంటారు. ఇద్దరికీ చిరునవ్వువస్తుంది. ఈ కూర్పులో ఒకమాటయినా అవసరం లేకుండా వ్యక్తపరచ దలచుకొన్న భావం వ్యక్త మవుతోంది.

అయితే ఈవిధానంలో సంభాషణలో వ్యక్తపరచడంలోకంటే ఉన్న ఉత్కృష్టత ఏమిటి?

కళ వ్యంగ్యప్రధానమైనది. ఒకభావాన్ని సూచించడం కళయొక్క ఆదర్శం. కాని ఆసూచనలో అనుమానం ఏమీ ఉండకూడదు. ప్రేక్షకుడియొక్క భావనని మేలుకొలిపి కొన్ని సూచన లిచ్చి వాటిమూలాన్ని ఆభావం దానంతటదే ప్రేక్షకుడిమనస్సులో పూర్తి అయేటట్టు చెయ్యడమే కళ చేసేపని. కాని ఆసూచనలు అసంపూర్తిగా ఎంతమాత్రం ఉండకూడదు. వాటిద్వారా అట్టే ప్రయాస లేకుండా ప్రేక్షకుడు భావం గ్రహించగలిగి ఉండాలి. అటువంటి సూచనలు నిర్మించుకోడంలోనే కళాకారుడి ప్రజ్ఞ తెలుస్తుంది. దీనివల్ల ప్రేక్షకుడికి కళలో ఒకసజీవస్థానం ఏర్పడుతుంది. ప్రేక్షకుడు కళ్లు చెవులు ఉన్న ఒకయంత్రం గాదు. అతనికికూడా హృదయం ఉంది. సినీమాకి విశిష్టమయిన ఆసూచనలయొక్క తత్వమేమిటో సినేరియో వ్రాతగాడు కనుక్కోవాలి. అప్పుడుగాని సినీమా కళ అనిపించుకోదు.

సినీమాకి ఒకకథ రాసేటప్పుడు, ఆకథా వస్తువుని సినీమాలో ప్రదర్శించడానికి వీలయిన విధంగా తయారుచెయ్యాలి. అంటే



శివపార్వతులు



కమలాలయ

ఏమిటి ? కవి మొట్టమొదటే సినీమాలో వరసగా తను రాసినకథ ఏవిధంగా డైరెక్టరు ప్రదర్శిస్తాడో పూర్తిగా తెలుసుకోవలసిన అవసరం లేదు. కాని కొంతవరకూ, ఇంచుమించుగానయినా అది తెలియకుండా కథ వ్రాయడం అసంభవం. సినీమాలో రంగాల వరస ముందు కవి సూచిస్తే తరువాత డైరెక్టరు దాన్ని దిద్దిసరిచేసి, ఒకవిధమయిన కూర్పుని తయారుచేస్తాడు. ముఖ్యంగా సినీమాలో, కవిపని ఇంతటితో అయిపోతుంది. డైరెక్టరు పని ఇక్కడినుంచి మొదలు అని చెప్పడానికి వీలులేదు. డైరెక్టరుచేసేపనిలో కొంతభాగం కవి ముందే చేస్తాడు. కవిచేసేదానిలో కొంత పని డైరెక్టరుచేస్తాడు. ఇల్లాగ కొన్నికొన్ని అంగాల పరస్పరసంయోగంచేత సినీమా ఏర్పడుతుంది. అల్లాకాకపోయి నట్టయితే సినీమా కొన్ని పరస్పరసంబంధం లేనిభాగాల సంయోగంలా కనిపిస్తుంది.

ఒకరంగంలో ఒక అల్లరిపిల్లవాడు వస్తాడు. అక్కడ పిల్లవాడల్లరిచేస్తాడని కవివ్రాస్తే చాలదు. తెరమీద అల్లరి ఏ విధంగా బాగా కనిపిస్తుందో అది కవి ఊహించుకోవాలి. పిల్లవాడికి తల్లి అన్నంపెడుతూఉంటుంది. పిల్లవాడు అన్నంతినడు. తల్లి ఎన్నోవిధాల బతిమాలుతుంది. దీనిమీదా, దానిమీదా వంక పెట్టి తల్లి అన్నంపెట్టడానికి ప్రయత్నిస్తుంది పిల్లవాడు తినడు. తల్లికి విసుగువచ్చి పిల్లవాణ్ణి కొడుతుంది. పిల్లవాడు ఏడుస్తూ అన్నంకంచం తన్నివేస్తాడు. ఈ విధంగా వ్రాయడంవల్ల డైరెక్టరుకి ప్రదర్శించడానికి అనువైన అంగాలు కొన్ని దొరుకుతాయి. వీటిలో ఏది తెరమీద ఎక్కువ బాగుంటుందో, దాన్ని ఏ వరసలో ప్రదర్శించినట్టయితే భావానికి పుష్టివస్తుందో అది డైరెక్టరు చూసుకుంటాడు. కవి ప్రతిఅంగానికి తగినంత అనువైన వస్తువు తయారుచేసి డైరెక్టరుకి ఇవ్వాలి. ఈ అనువైన అనేదాంట్లో చాలా అర్థం ఉంది. ఫలానివస్తువు ఎఱ్ఱగా ఉంది, ఈ విధమయిన సువాసన దానిలోనుంచి వస్తూంది, అని వ్రాయకూడదు. ఆ ఎఱ్ఱదనం, ఆ వాసన, ఆ వస్తువుకి ముఖ్యలక్షణాలలోవే కావచ్చుగాని వాటిని తెరమీద కొన్నిబొమ్మలవరుసలో చూపడంసాధ్యంగాదు. అవి ముఖ్యమైన వయినా సినీమాకి అనువయినవి యెంతమాత్రం కావు. అల్లా వ్యక్తం కానిభావాలు సంభాషణలో వ్రాసుకోవచ్చు. కాని సాధ్యమైనంతవరకూ, అటువంటి భావాలు, చిత్రం యొక్క నడకకీ ఐక్యానికి అంత ఎక్కువ ముఖ్యంగాకపోతే వాటిని వదలివేస్తేమంచిది.

నాటకంలో అన్నిటికంటే ముఖ్యమైనది సంభాషణ. నటుడికి ఆ ఆంగికచలనాలకి సరిపోయిన భాష ఉపయోగించి వ్రాయడం నాటకంలో తప్పనిసరి. లేకపోతే ఆభావం ఏమీ వ్యక్తంగాదు. సినీమాలో సంభాషణ ఏమీ అక్కఱలేకుండాకూడా భావం వ్యక్తమవుతూంది. మాట్లాడని సినీమాలలో భావప్రకటనకి కొరత ఏమీ లేదు. కాని మాట్లాడని నాటకాలు ఉండడం అసంభవం. ఎందుచేత నంటే సినీమాలో మన దృష్టిలోనుంచి ఏ చిన్న విషయాన్నికూడా దాటిపోనీయకుండా చూపడానికి అవకాశం ఉది నాటకంలో ఒకపాత్రనటనలో పూర్తిగా ఏభావం వ్యక్తంగాదు. అతడు మాట్లాడితేనే గాని ప్రేక్షకుల దృష్టి అతనిమీదికి పోదు. అందులో ఒకరంగంలో నలుగురయిదుగురు పాత్రలున్నట్టయితే అది మరీ కష్టం. అంచేత నాటకంలో సంభాషణ అన్నింటికంటె ముఖ్యమైన స్థానం ఆక్రమిస్తుంది. భావప్రకటన పూర్తిగావడం కోసమని, ఆ సంభాషణని స్వాభావికపు సరిహద్దులను అతిక్రమించి వ్రాయవలసి వస్తుంది. సినీమాలో మాత్రం సంభాషణ స్వాభావికపు సరిహద్దులను దాటి ఎప్పుడూ పోకూడదు. సంభాషణ వ్రాయడం చాలాకష్టం. ప్రతీవ్యక్తికి ఒకొక్క పరిస్థితిలో ఒకొక్క విధమయిన అనుభవం కలుగుతుంది. దాన్ని ప్రతీవాడు తన తత్వానికి అనుగుణమయిన విధంగా అర్థం చేసుకుంటాడు. అతని మనస్సులో పరిపరి విధాలయిన ఆలోచనలు బయలుదేరతాయి. కాని ప్రపంచకంలో ఏమనిషీకూడా తన మనస్సులోని మూలసూత్రాన్ని పైకి చెప్పివెయ్యడు. ఒక మంచివయసులో ఉన్న యువతి ఒక ముసలిమొగుణ్ణి పెళ్లిచేసుకుంటుంది. జీవితంమీద ఆమెకు నిరాశ ప్రబలిపోతుంది. తననీచస్థితికి, తన అసంతృప్తికి, తనబాధకీ తనమొగుడే కారణమని ఆమెకు తెలుసును. కాని ఆసంగతి ఎప్పుడూ ఆమె పైకి చెప్పదు. తన అసంతృప్తిని పిల్లిమీదా ఎలకమీదా పెట్టి చెప్పుతుంది. తనమనస్సులో ఉండే దంతా పైకి కక్కయ్యడానికి ఏదో సాకు వెదుక్కుంటుంది. ఆముసలి మొగుడు కూడా అంతే. తన అనుమానాన్ని అతడెప్పుడూ నూటిగా చెప్పివెయ్యడు. అతడల్లా చేసినట్టయితే ఒక అగ్నిపర్వతం పేలిపోతుం దని అతనికి తెలుసును. కాబట్టి అతడు మాట్లాడేదాంట్లో తనఅనుమానాన్ని చూచాయగా వెల్లడిచేస్తాడు. ఇల్లాగే ప్రతీజీవిలోనూ, లోపలఉండే ఆలోచనలు ఉన్నవి ఉన్నట్టుగా పైకి ఎప్పుడూరావు. అతడుమాట్లాడేమాటలే అంతముఖ్యమైనవిగావు. మాట్లాడే విధానం, చూపులు, ఆంగికచలనం, అన్నీచేరి అతనిసంభాషణకి ఒకవిలక్షణమయిన, ఆమాటలలో ఇమిడిలేని, అతనిమనస్సుని విప్పిచెప్పే ఒకఅర్థాన్ని మనకి స్ఫురింపజేస్తాయి. కవి ఆమాట లేవో గ్రహించాలి ఏపాత్ర ఎల్లా అనుకుంటే అల్లా వ్రాసివేయడం కళగాదు. ఆపాత్రయొక్క మూర్తిని భావనలో నిర్మించుకుని, అతనిచేత మాట్లాడించి ఆమాటలే సంభాషణగా వ్రాయాలి. ఆమాటలు మాట్లాడేటప్పుడు ఆపాత్రయొక్క అంగాంగిచలనాలన్నీకూడా పూర్తిగా కవికి దృగ్గోచరంగావాలి. అప్పుడే కవి సరియైనసంభాషణ వ్రాయగలడు.

సినీమాలో కొన్నికొన్ని పరిస్థితుల్లో సంభాషణ ఏమీ అక్కఱలేకుండా అత్యద్భుతంగా భావాలు వ్యక్తమవుతాయి. పాల్ముని నటించిన 'ఎమిలీజోలా' అనేచిత్రంలో ఒక రంగం ఉంది. జోలా చాలా పేదపరిస్థితులలో ఉన్నవాడు. అతి డొక్కనవల వ్రాసి ఒక ప్రకాశకుడికి ఇచ్చాడు. కొంచెండబ్బేమన్నా ఇస్తాడేమో అడుగుదామని ఆ ప్రకాశకుడిదగ్గరకి వెడతాడు. ప్రకాశకుడొక ఉత్తరం ఇస్తాడు. అందులో జోలానవల కొన్నివేలప్రతులు అమ్ముడుపోయిం దని ఉంది. జోలాకి ఏం మాట్లాడాలో తెలియలేదు. ఖంగారుపడిపోతాడు. ఏదో మాట్లాడబోయి మాట్లా

పలేకపోతాడు. నవ్వబోయి నవ్వలేకపోతాడు. ప్రకాశకుడి ముఖంకేసి తిరిగి కొంచెం తల ఊపుతాడు. ప్రకాశకుడు చిరునవ్వునవ్వి జోలా ఊపినట్టుగానే తనూ తల ఊపుతాడు. జోలా కొంచెం అడ్డంగా తల ఊపుతాడు. ప్రకాశకుడు అనుకరిస్తాడు. మళ్లీ జోలానిలువుగా తలఊపుతాడు. ప్రకాశకుడు మళ్లీఅనుకరిస్తాడు. జోలా మనస్సులో పొంగిపోయేఆనందం, ఏ మాటలూ వ్యక్తం చెయ్యలేని ఆనందం, ఈ కూర్పులో అత్యద్భుతంగా వ్యక్తమయింది. ఇటువంటి పరిస్థితులన్నీ కవి ఊహించి వ్రాయవలసినవే. ఈ పరిస్థితులన్నీ నటుడికి బోధించినతరవాత తన నటనని పోతపోసుకోడం నటుడివిధి.

నాటకంలో రంగానికీ రంగానికీ ఉండే ఆంతరంగికసంబంధం చాలా తక్కువ. ఏమైనా ఉన్నప్పటికీ, ప్రదర్శనలో రంగానికీ రంగానికీ ఉండే విలంబనమూలాన్ని అది ప్రేక్షకుడికి గ్రాహ్యం గాదు. కాని సినీమాలో ఒకరంగం ఇంకొకరంగాన్ని అనుసరించి ఉంటుంది. కాబట్టి రెంటికీఉన్న ఐక్యము బాగా వ్యక్తమవుతుంది. సినీమాకూర్పు అంతటిలోనూ ఈ ఐక్యము లేకపోయినట్టయితే సినీమాగాంభీర్యం అంతా చెడిపోతుంది. ఒకొక్కసారి, సంభాషణలోని ఐక్యమును బట్టి ఈ కూర్పు ఏర్పడుతుంది. ఒక చిన్న ఉదాహరణ. 'ఎమిలీజోలా' లో, జోలాకి ప్రభుత్వం దగ్గరనుంచి ఉత్తరంవస్తుంది.ఆతడు నేరస్థుడనీ, న్యాయస్థానంలో విచారించబడతాడని ఉంటుంది. ఒక రంగము. జోలా ఉత్తరం చదువుతూ ఉంటాడు......'నీమీద మోపబడిననేరం ఏమిటంటే', రంగం ఆఖరు రెండవరంగము. న్యాయస్థానం. ప్రభుత్వపక్షపు న్యాయవాది నిలబడి మాట్లాడుతూ ఉంటాడు. 'నేర మేమిటంటే......' ఈ మాటతో ఈ రంగం ప్రారంభమవుతుంది. ఈ రెండు రంగాలనీ కలిపేది సంభాషణ. 'నేర మేమిటంటే' అనేమాట. సంభాషణలోని సంబంధాన్ని బట్టి ఈ మోస్తరుగా కొంతవరకు సినీమాలో కూర్పు ఏర్పడుతుంది. సినీమాలో అన్నిటికంటే ముఖ్యమయింది కూర్పుగాబట్టి సంభాషణ దాని ఐక్యానికి కొంతవరకు తోడుపడకపోతే వీలులేదు.

సినేరియో వ్రాతగాడు, ఈ సంగతుల నన్నింటినీ మనస్సులో ఉంచుకోవాలి. ఒక కథకి సినేరియో వ్రాయడం తేలికయిన పని గాదు. నాటకకళలోకంటె ఎక్కువగా సినీమాలో, కవికీ, డైరెక్టరుకీ, నటకుడికీ ఉండవలసిన పరస్పరసంబంధం చాలా ఎక్కువ. అందరిసహకారం ఉంటేనేకాని సినీమా నిర్దోషంగా తయారుకాదు.



# అంటుజాడ్యం

★

సాయంత్రం ఏడుగంటలయింది. బాగా చీకటిపడింది. రామన్నపాలెం గ్రామకరణం వీథిఅరుగుమీద దీపం పెట్టుకొని ఇంకా ఆఫీసు పని చేసుకొంటూనే వున్నాడు.

"ఏమయ్యోయ్! కొంపమునిగిందే!" అని గ్రామమునసబు అయ్యవారప్ప వగర్చుకొంటూ పరుగుమీద వచ్చి అరుగుమీద కూలబడ్డాడు.

కరణానికి ఏభయ్యో, ఏభయ్యయిదు సంవత్సరాల వయస్సు ఉంటుంది. మునసబు షైఖరి చూచేవరకు అతనికి గుండె గుభేల్లుమనింది.

"ఏమి, ఏమి" అని వంచినతల పైకెత్తి మునసబు నడిగాడు కరణం.

"ఇంకేముంది? కొంప మునిగిందయ్యా! యానాదివాడు నన్ను నట్టేట ముంచేశాడు" అని అన్నాడు మునసబు.

"ఏ యానాదివాడయ్యా?" అని కంటి అద్దాలు చేతికి తీసుకొని ఆత్రంతో అడిగాడు కరణం.

"ఆయానాదివాడేనయ్యా!"

"ఏయానాదివాడయ్యా అంటేను?"

"వాడి దేవూరో నాకు తెలియదయ్యా."

"అయితే ఇప్పుడేం వచ్చిందీ?"

"వాడు కలరాతగిలి చచ్చాడు."

కలరాఅనే టప్పటికి కరణానికిగూడా గాబరా పుట్టింది.

"కలరాఅని ఎవరన్నారయ్యా? అంతా లేని పోనిఖంగారు నీది: ఇప్పుడు కలరా ఎక్కడ నించి వచ్చిందయ్యా?" అని కరణం విసుక్కున్నాడు.

"సడేలే: నేను స్వయంగా కళ్లారా చూశాను — వాడికి పొద్దున్న కలరాతగిలి వుండంగాను."

"ఎక్కడ చూశావయ్యా?"

"రోడ్డుమీద చూశాను: ఉవయాన్న నే నాతట్టు పొయ్యేవరకు వాడు గవళ్లపాలెం దగ్గర రోడ్డుమీద వేపచెట్టుకింద పడిపోయి ఉన్నాడు."

"ఇస్సు: అబ్బబ్బ: నీతో ఒకటిగాదయ్యా చరా! ఎవడయ్యా వాడూ?" అని ఇంకా విసుక్కున్నాడు కరణం.

"వాడిది అదేదో వూరని చెప్పాడు: పేరు జ్ఞాపకం లేదు. వారంరోజులకిందట ఆవూరు కాపు సుబ్బారెడ్డికయ్యల్లో నారువేతకేమో వచ్చాడట: మొన్న పగటి వేళ వాడికి కలరాతగిలేవరకు వాణ్ణి బయటికి వెళ్ల తరిమాడట ఆరెడ్డి! పోయినవాడు విరగడై పోకుండా మనపొలిమేరలోనే పడి చచ్చాడు —".

"వాడి దేవూరోకూడా అడిగి తెలుసుకోలేదటయ్యా? నువ్వొసరే."

"అడిగానయ్యా: ఉత్తరాదో దక్షిణాదో అని చెప్పాడు - పిడిల్లు వల్లకాడుగానూ."

"అయితే వాడెక్కడ చచ్చాడు?"

"గవళ్లపాలేనికి దక్షిణంగా చెర్లోకి పొయ్యే డొంకలో పడి చచ్చాడట!"

"నువ్వు చూడలేదా ఏమిటి?"

"నే నెప్పుడు చూశానయ్యా? ఇప్పుడు ముతరాచు లక్షుంగాడు చెప్పతుంటే నాకు తెలిసింది."

"ఏ లక్షుంగాడయ్యా?"

"అదేందయ్యా; గూనివాడి కొడుకు లక్షుంగాడిని ఎరగవు? వాడూ వాడి మేనల్లుడు వెంకటసుబ్బడూ చీకటిపడి చెర్లో పల్లెనుండి డొంకన వస్తుంటే వాడు చచ్చి డొంకలో పడి ఉన్నాడట."

"ఏ డొంకలోనయ్యా?" అని కరణం ఇంకా విసుక్కుంటూనే వున్నాడు.

"నీ దంతా మరీవిడ్డూరం. గవళ్లపాలేనికి దక్షిణంగా చెర్లోకిపోయే డొంక ఎరగవూ?"

"ఆ ముతరాచువాళ్లు సరిగ్గా చూశారో లేదో, వాళ్ల నిట్లా పిలిపించవయ్యా ఒక్కసారి" అన్నాడు కరణం.

గ్రామమునసబు తలారి నర్సిగాడిని పంపి లక్షుంగాణ్ణి, వెంకటసుబ్బణ్ణి పిలిపించాడు.

"ఏందిరా! మీరు వాణ్ణి చూశారట్రా?" అని దబాయించాడు కరణం.

"మేము కళ్లారా చూశాము సామీ! అబద్ధం చెప్పేదాక మాకేమి సాయ్యమా?" అన్నారు ముతరాచులు.

"ఎక్కడ పడిచచ్చాడురా వాడు?" అని కరణం మళ్లా క్రాసు చేశాడు.

"గవళ్లపాలేనికి దక్షిణంగా పదిపగ్గాదూరంలో డొంకలో మనుష్యులు వచ్చీపోయే దారికి తూర్పుగా కొంచెంఎడంగా తుమ్మల్లో పడిఉండాడు. ఒంటికి గుడ్డ కూడా లేదు."

"వాడి దేవూరో మీకు తెలుసా?"

"వాడి పేరూ వూరూ తెలియదుగాని వాణ్ణిమాత్రం మేము మొన్న ఊళ్లో చూశాం. ఈవేళపొద్దున మేము చెర్లోపల్లెకు పోతుంటే వాడు రోడ్డుమీద చెట్టుకిందమాత్రం పడి ఉండాడు. వాడు మాకు బాగా గుర్తే" అన్నారు ముతరాచులు

"అయితే ఇప్పుడు పోయిచూస్తే శవం అక్కడ ఉంటుందట్రా?" అని అడిగాడు కరణం.

"ఉండక ఏడకు బోతుందీ? అంటూ ముతరాచు లిద్దరూ "మేంపోతామయ్యా"అని ఇళ్లకు చక్కా పోయారు.

"ఇప్పు డెట్లానయ్యా చేసేది?" అని మునసబు కరణాన్ని సలహా అడిగాడు.

"ఎట్లనా నాపీకకీ నీపీకకీ ఉరివేసుకొని భావిలో దిగుదాం పద —" అని కసురుకొన్నాడు కరణం.

"నామీద కసురుకుంటావు - నే నేంచేశానయ్యా?" అని దీనంగా అడిగాడు మునసబు అయ్యవారప్ప.

"ఒకవేళ ఆముతరాచువాళ్లు ఇప్పుడీసంగతి నీతో చెప్పిలేమట్టుకు నువ్వు ఊరూవాడా యాగీ చేసుకొంటూ ఇట్టా ఎందుకు పరుగెత్తుకొనిరావడం? ఈసంగతి అసలు ఊళ్లో రెండోవాడిచెవికి ఎందుకుపోవాలి?" అని గొంతు ధ్వని కొంత తగ్గించి కోపంగానే మాట్లాడాడు కరణం.

★

'కరుణకుమార'

"నే నేమి యోగీచేశానయ్యా? నీతో తప్ప నే నెవరితోనూ అనలేదే ఈసంగతి?" అని అయ్యవారప్ప నెమ్మదిగానే జవాబిచ్చాడు.

"ఇంతటనైనా పలక్కుండా ఊరుకో" అని రహస్యంగా సలహా ఇచ్చాడు కరణం.

"ఊరుకుంటే!" అని ఆశ్చర్యపోయి అడిగాడు మునసబు.

కరణం జవాబు చెప్పలేదు.

"అదికాదయ్యా! ఊరుకుంటే ఎట్లా నయ్యా?" అని మళ్లా రెట్టించాడు మునసబు.

"తెల్లవారి ఊరేగవచ్చును లేవయ్యా: నీదంతా ఒక చేతోందరా, ఒక చేహడావుడీని" అన్నాడు కరణం.

"తెల్లవార్లూ ఆశవానికి కాపలాఅయినా లేకుండా ఆవోయిన అడివిలో పడేఉంటే, రాత్రి ఏనక్కలయినా పెరుక్కునితింటే ఎట్లా?" అని మునసబుకు సందేహం కలిగి అడిగాడు.

"ఎట్లనా? నా కెందుకు ఉరివేయక య్యా! నీకు అన్నీ లేనిపోని సందేహాలూ, శంకలూను..." అన్నాడు కరణం.

"కోపం చేయవోకయ్యా! నాకు తెలియక అడుగుతాను. మనం ఆశవానికి ఈరాత్రి కాబ్దారీ చేయించవద్దా అంటాను" అన్నాడు మునసబు.

"నీచేతనయితే చేయించు. ఇప్పుడు అర్ధరాత్రివేళ ఆ అడవిలో ఎవడు పోయి శవజాగరణం చేస్తాడు?"

"అయితే శవాన్ని నక్కలు పీకవా అంటాను."

"పీక్కునితింటే తిన్నాయిలే నీకేమో?"

"మనం పోలీసులకే మేస్త్రీటుకే రిపోర్టు చేయవద్దా?"

"ఉదయాన్న చేయవచ్చునులే."

"శవాన్ని నక్కలు పెకుక్కునితింటే మనం కాబ్దారీ చేయించలేదని ఆ పోలీసువాళ్లు మనమీద పడతారేమో?"

"పడరులేవయ్యా! నీకు అసలీసంగతి ఉదయాన్నే తెలిసినట్టూ, వెంటనేపోయి చూచేవరకు శవం ఫలానాఫలానా స్థితిలో ఉండినట్టూ రిపోర్టులో రాయవచ్చునులే—".

"మురారాచువాండ్లు మన కీ సాయంత్రమే చెప్పినప్పుడు, రేపుపొద్దున్న తెలిసిందని తప్పుడుమాట ఎట్లా కూసేదయ్యా?"

"మురారాచువాండ్లు మనకు ఇప్పుడే చెప్పినట్లు దాఖలా మకాబూ ఏ ముందీ?"

"అమ్మో! రేపు పోలీసువాండ్లు వచ్చి అడిగితే ఈమురానట్టువాండ్లు నిజం చెప్పరూ?"

"అట్లా చెప్పకుండా వాండ్లని మనం లోగట్టుకోందాంలే."

"ఏమోనయ్యా! నాకుమాత్రం ధైర్యం లేదు. ఏమో! మనకి ఇప్పటికి ఈ ఇద్దరే అగుపడుతున్నారు. గ్రామంలో ఇంకా ఎంత మందిచూశారో ఆశవాన్ని. నిజాన్ని అట్లా కప్పిపుచ్చడానికి ఎంతమాత్రమూ వీల్లేదు సుమా!"

"అయితే ఇప్పు డేంచేస్తావంటావయ్యా?"

"ఒకవేళ పోలీసువాండ్లకి రిపోర్టు ఉదయాన్నే పంపినా, ఈ రాత్రి ఎవర్నయినా శవందగ్గర కాబ్దారీ పెట్టిస్తాను—."

"ఇప్పుడు ఎవరు కాబ్దారీచేస్తారు నీకు?"

"తలారి నర్సిగాణ్ణి పంపిస్తాను."

నర్సిగాడు సమక్షంలోనే వున్నాడు. మునసబూ, కరణమూ అంటే వాడి కసలు లక్ష్యమే లేదు.

"పోతే నానౌకరీ పోయింది లెండయ్యా: నేనూ మనిషినేకాని గొడ్డును కాను. వారం దరూ ఇళ్లకాడ లక్షణంగా పండుకోవలసిందీని, నేనూ నాబిడ్డలూ అన్యాయం అయిపోవలసిందీనా?— నావల్లకాదు— దీనితల్లి సిగ్గోసిన ఉద్యోగం. మీరేంచేసినా సరే!" అన్నాడు నర్సిగాడు.

"వాడు చెప్పేది నిజమేమరి. వాడు మాత్రం మనిషికాడూ పాపం!" అన్నాడు కరణం.

"అయితే మాలవాడకి పోయి ఇద్దరు వంతు వెట్టివాళ్లనయినా పిలుచుకొని పంపించరా?" అన్నాడు మునసబు.

"వెట్టివాళ్లెవరూ పిలిస్తే పలకడంలేదు. పరినాటు అకునుకు ఒక్క పురుగుకూడా చిక్కడంలేదు. వాళ్లకేమైనా జీతాలా భత్యాలా? మన కెందుకు చేస్తారు — వెట్టిచాకిరీ?" అన్నాడు తలారి.

"అయితే — ఏంగతి చెప్పవయ్యా? కరణం గారూ!"

"..................."

"ఇస్సు......... అబ్బబ్బ......... నే నెన్నడూ ఇట్లాంటి అగచాట్లు పడ్డవాణ్ణి కానయ్యా! ఆభగవంతుడు నాకే తెచ్చి పెట్టుతూ ఉంటాడు ఈకొసగళ్ల న్నీని."

కరణం పలకలేదు

తలారి గడ్డంకింద కర్ర ఆనించుకొని అరుగు దగ్గరే నిలబడిఉన్నాడు.

"పలకవేమిటినయ్యా కరణంగారూ! ఏదోవిధంగా తగలబెట్టవయ్యా స్వామీ!... ......ఇస్సు......నాకు కాళ్లూ చేతులూ పీక్కునిపోతున్నవి. జాంపొద్దు పోయింది: ఇంకా నేను అవశిష్టం తీర్చుకోవాలి. సంధ్యావందనం వార్చుకోవాలి.........పీడితల్లి కడుపు పీడిలోనే కాల — చచ్చినవాడు నా పొలిమేరలోనే పడిచావాలా?" అనినిట్టూరుస్తున్నాడు మునసబు.

కరణం కళ్లకు అద్దాలుతలిగించుకొని చేతికి కలం తీసుకొన్నాడు.

"లేచి పోయినాడయ్యా! రోడ్డుమీద పండుకొన్నవాడు లేచి దక్షిణంగా డొంకన పడిపోయాడు. పీడ విరగడైపోయిందిగదా అనుకొని, ఎండబడి ఆమైన ఇంటికి వచ్చేశాను. వా డింకా పొలిమేరలోనే తారట్లాడుతూ ఉండినసంగతి తెలిస్తే, అప్పుడే ఎవరినో ఒకరిని పంపి పొలిమేర దాటిపోయ్యే వరకూ వెళ్లతరిమించేవాణ్ణి. వా డిట్లా మోసం చేస్తాడని అనుకోలేదు."

"వాణ్ణి రోడ్డుమీద చూసినప్పుడే అనుకొన్నాను వాడికి ఆయువు మూడిందని: నే నక్కడ నిలబడి ఉండంగనే వాడికి పదిసార్లయినట్లు అయింది. అందులో కలరాజాడ్యం— తిరుగులేనివ్యాధి — ఇంతకీ ఖర్మ: వాడిది

కాదు — ప్రారబ్ధం మనదీ: ఏపూర్వజన్మం లోనో చేసుకున్నసంచితం ఈజన్మలో గ్రామమునసబు నౌకరీరూపంగా పట్టివేధి స్తోంది."

అని ఈవిధంగా ఏమేమిటో చదువు తున్నాడు మునసబు. ఏసమాధానం చెప్ప డానికీ పాలుపోక కరణం అడంగలులో పొగుబడి చెల్లువేసుకొంటున్నాడు.

"దీనిమూండావెూసినవౌకరీ - రాజీనామా గీకిపారేదామని ఎన్నిసార్లో అనుకొన్నా నయ్యా: కాని అన్నోదకరుణానుబంధం తెగనిస్తాడా ఆపాపిష్టిదేవుడు? ఛీ! ఛీ! ఈనౌకరీచేసుకుని బ్రదికేదానికన్నా,పదికూళ్లు ముష్టెత్తుకొని బ్రతకడం మేలు" అన్నాడు మునసబు.

"అట్లాఅనుకొన్నవాడివి రాజీనామా ఇచ్చి లేచిపోరాదూ?" అనిఅడిగాడు కరణం.

"ఏమయ్యా ఇస్తే? ఈముండానౌకరీతోనే బ్రతుకుతున్నా ననుకొన్నావు గాబోలు. బ్రాహ్మడికి ఏవృత్తి చేసుకొన్నాతప్పలేదు" అని పౌరుషంతో జవాబిచ్చాడు మునసబు.

"అసలువిషయంఏమిటో వగదెంచకుండా ఈముచ్చట్లు పెట్టుకొని కూర్చున్నా రేం దయ్యా?" అని హెచ్చరించాడు తలారి.

"శవానికి కాబ్దారీ ఉంటే ఉంది లేకపోతే లేకపోయింది. మనచెవికి వచ్చినసంగతి ఆల స్యంచేయకుండా పోలీసులికి వెంటనే రిపోర్టు పంపకుండామాత్రం వీల్లేదయ్యా!" అన్నాడు మునసబు.

"సరే: అయితే రిపోర్టురాసి పంపించు" అన్నాడు కరణం.

"నువ్వే నాలుగుముక్కలు రాసేస్తూ. నేను సంతకంపెట్టుతాను."

"ఏ మని రాయమంటావు?"

"ఈసంగతే! జరిగినసంగతి నీకు తెలియని దేముంది?"

ఎవరో పరాయి గ్రామ యూనాదివా డొకడు ఈ వూరు కూలిపనికిగాను వచ్చి అక స్మాత్తుగా కలరాతగిలి చచ్చిపోయాడనీ, వాడిపేరూ, ఊరూ తెలియదనీ, ఈ లేవా రసుశవాన్ని కాబ్దారీ చేయించడం కష్టంగా ఉన్నదనీ, పోలీసువారు తక్షణం వచ్చి శవానికి పంచాయతీ జరిపించి పోవలసిందనీ పోలీసు స్టేషనుహౌసు కొకరిపోర్టు రాశాడు కరణం. గ్రామమునసబు సంతకం పెట్టాడు.

"కలరాతగిలి మనిషి చచ్చిపోతే మనం హెల్తుఇన్‌స్పెక్టరుకి తాలూకాకూ కూడా రిపోర్టులు పంపాలికాబోలునే—పంపవద్దూ?" అని అడిగాడు కరణం.

"తెల్లవారి పంచాయతీ జరిగినతర్వాత పంపవచ్చునులే. ముందు పోలీసువాండ్లబద నాయం తప్పించుకోనీ" అంటూ రిపో ర్టును తలారి నర్సిగాడి కిచ్చి స్టేషనుకు ఎత్తు కొని పొమ్మన్నాడు మునసబు.

"అర్ధరాత్రి నేను ఒంటరిగా ఎట్లాగయ్యా పొయేదీ?" అని అడిగాడు తలారి.

"అన్నిటికీ అన్నిసాకులూ చెప్పితే ఎట్లరా? ఈ వూరికి నువ్వొక్కడవే నౌకరు వయిపోతివి. అక్కరపడ్డపుడు కాస్త ఒళ్లు వంచి పనిచేసుకొని రాకుంటే ఎట్లా చెప్పూ నర్సయ్యా? శవానికి కాబ్దారీ చేయలే నన్నావు—సరే. రిపోర్టుఅయినా ఎత్తుకొని పోకుంటే ఎట్లా? మూడుమైళ్లు స్టేషను ఇక్క డికి. ఇంటికి పోయి అన్నంతిని వెళ్లావంటే ఎంతసేపట్లో తిరిగివస్తావు- మళ్లా ఊరుమాటు మడిగేవరకు తిరిగి రావొచ్చు; వెళ్లు. నామాట విని వెళ్లిరా" అని మునసబు తలారిని బ్రతిమ లాడుతున్నాడు.

"కూడా యూనాదివాణ్ణయినా పిలుచు కొని పోరా! ఉన్ననౌకరువు నువ్వొక్క డవూ కాదంటే ఎట్లా?" అని కరణంకూడా హెచ్చరించాడు.

"సరే! ఇటు పారేయండయ్యా ఆరి పోర్టు: ఎక్కణ్ణుంచో వచ్చి ఈడ నాకోస రమే చచ్చినట్టుందాడు — ఆపాపిష్టి నా కొడుకు" అన్నాడు తలారి.

"ఏం చేస్తాంరా నాయనా! నీ ఒక్కడి కోసరమే కాదు; మన అందరికోసరమూ చచ్చాడు— ఆ ముతసప్పపాడు. ఇంతాచేస్తే తెల్లవారి పోలీసువాళ్లు వచ్చేలోపల ఏనక్క లయినా శవాన్ని పెరుక్కొని తింటే వాడి చావు అబద్ధమూ, మనచావు నిబద్ధమూ అవు తుంది" అన్నాడు మునసబు.

"ఇ దెక్కడి చట్టమయ్యా—ఈచట్టము? మనిషిబ్రతికి ఉండంగా వాడిగొంతుకలో ఊపిరిఉన్నంతమట్టుకు వాడు చచ్చాడా, బతి కాడా, తిన్నాడా, పస్తుపండుకున్నాడా అనే యోచన ఏమారాజుకీ కాబట్టదు. తీరా చచ్చిన తర్వాత ఈరిపోర్టు లెందుకు? ఈకాబ్దారీ లెం దుకు? మనల్ని ఇట్లా ఏడిపించడం ఎందుకు? ఏదిపట్టినా దిక్కూ దీమా ఉన్నట్టు గోచరిం చదే!" అన్నాడు తలారి.

"మనచట్టాలన్నీ ఇట్లానే ఉంటాయనుకో. మనమంతా చచ్చినవాళ్లని కాబ్దారీచేయడా నికేగాని బ్రతికినవాళ్లని పోషించడానికి గాదు. పొద్దుపోయింది - తొందరగా పోయిరా" అన్నాడు మునసబు.

కరణం చిరునవ్వు నవ్వుతున్నాడు.

"అదికాదయ్యా! వా డెవడో బతకలేక కూలిపనిచేసుకోను ఏడనుంచో ఈడకి వచ్చి అమ్మవారిజాడ్యం తగిలితే, వాడి కింతమందూ, మాకూ పోసే దిక్కు లేకపోవడం సరిగదా, వాణ్ణి ఆఖరుకు ఊళ్లోనయినా ఉండకుండా బయటికి వెళ్లతరిమితిరి. వా డెట్టాగా చచ్చాడు గదా- ఇక ఇప్పు డీరచ్చఅంతా దేనికయ్యా? తెండి:ఇట్టా పారెయ్యండి ఆకాగితం. నాలిప్ప లు నావి. చచ్చో బతికో ఆపోలీసువాళ్ల మొఖాన్న కొట్టివస్తా." అని రిపోర్టుతీసుకొని విసుక్కుంటూ వెళ్లిపోయాడు తలారి.

"శివశివా! ఏంఖర్మం తెచ్చిపెట్టావురా భగవంతుడా!" అని పెద్దనిట్టూర్పువిడిచి గ్రామమునసబు భోజనానికి ఇంటికి లేచి పోయాడు.

## ౨

రామన్నపాలెం సర్కారు శ్రోత్రియం గ్రామం. ఆ శ్రోత్రియానికి ఒకకరణమూ, గ్రామమునసబూ, ఒకతలారినౌకరూ ఉన్నా రు. కరణమూ, మునసబూ ఇద్దరూకూడా వైదీకబ్రాహ్మణులే. కరణానికి ఆరురూపా యలూ, మునసబుకి అయిదురూపాయలూ, తలారికి మూడురూపాయలూ సర్కారు

వారు నెలజీతా లిస్తారు. కరణం మిస్సల్ కరణమేగాని మునసబుమాత్రం రిజిస్టర్డు మైనరు తరఫున వత్తాసిగా పనిచేస్తున్న ఆక్టింగు మునసబు. గ్రామాధికార్లిద్దరిలోనూ మునసబుదే చాలా నీరసమైనసంసారం. పైగా ఆయనగారికి ఇంటినిండా గంపెడుపిల్లలు, పెద్ద సంసారం. నెలజీతం అయిదురూపాయలతోనూ ఆయనగారికి సంసారం గడవడం చాలా కష్టంగా ఉంది: అందువల్ల ఆయన అచ్చం నెలజీతాన్నే నమ్ముకోకుండా, సమీపగ్రామాల్లో శుభాశుభకార్యాలకి బ్రాహ్మణార్థాలు చేసుకొంటూ కొంతసంసారపోషణ చేసుకొంటున్నాడు. అదిగాక వాళ్ల గ్రామానికి మూడుమైళ్లదూరంలోవున్న పట్నవాసానికి ప్రతిరోజూ పోయి ప్లీడర్లఆఫీసుల్లో పార్టీలవకాల్తునామాలు వగైరాలు ధృవపరుస్తూ తద్వారా ఒక్కొక్కవకాల్తునామాకు ఒకబేడడబ్బులు చేతిలో వేసుకొంటూ పొట్ట పోసుకుంటూవస్తున్నాడు.

ఆ బ్రాహ్మడికి కలరాజాడ్యంఅంటే తగని భయం. తనగ్రామంలో కాదుకదా, ఆచుట్టుపక్కల ఏగ్రామంలో నయినాసరే, అమ్మవారిజాడ్యం అనే అలికిడి చెవిని పడిందంటే ఇంటిదగ్గర గంపెడుసంసారాన్నీ ఇంటిదగ్గరనే విడిపించి, అంగవస్త్రం చంకనపెట్టుకొని పలాయనమైపోతూ ఉండే అలవాటు. ఆరంభదశలో ఈవిధంగా పారిపోతూ వచ్చాడుకాని, అమున్య రెండుసంవత్సరాల క్రిందట ఇట్లానే ఆతాలూకాలో ఇంకో గ్రామమునసబు కలరాజాడ్యానికి భయపడి పారిపోయి, పై అధికార్లకి సకాలంలో రిపోర్టు చేయలేదన్న కారణంతో, ఆగ్రామ మునసబును సర్కారువారు నౌకరీనుండి మర్తరబు చేసినప్పటినుండీ ఈ శ్రోత్రియం గ్రామమునసబు అయ్యవారప్ప, ఊరు విడిచి పారిపోయే పద్ధతి చాలించుకొని ఏమయినప్పటికీ గ్రామంలోనే నిలబడి పైవారికి రిపోర్టు వగైరాలు పంపి తనధర్మం యథావిధిగా నిర్వర్తించుకోవాలని నిశ్చయపరచుకొన్నాడు. ఏం చేయగలడు? పాపం! విధిలేదు: కలరాకు భయపడి ఆ అయిదు రూపాయల నౌకరీ పోగొట్టుకుంటే ఆనౌకరీని ఆధారంచేసుకొని తెచ్చుకొనే ఇతరసంపాదన ఎంతో నష్టమైపోతుంది.

కలరాజాడ్యానికి భయపడి పారిపోకుండా యింటిదగ్గరనే నిలబడవలెనని తాను తీర్మానం చేసుకున్నతర్వాత ఆగ్రామంలో కలరా కనపడడానికి ఇదే మొదటిపర్యాయం.

సందేహాలు నివర్తిచేసుకొని మునసబుగారు భోజనానికి లేచారు. కాని ఆయనగారి మనస్సంతా డొంకలో పడివుండిన శవంమీదనే ఉన్నది. అందులోనూ కలరాతగిలి చచ్చిన మనిషి: కలరా అంటువ్యాధి. తగిలితే మళ్లా తిరుగుముఖంలేదు ఆ జాడ్యానికి. ఆ ఉదయం ఆ మనిషికి కలరాతగిలిఉండగా తాను రోడ్డుమీద వానిని స్వయంగా చూచాడు కూడాను. మునసబుకు గుండెలు పీచుపీచుమంటున్నవి. నోటికి అన్నం హితవుగాలేదు. నాలుగుమెతుకులు ఎంగిలిపడి లేచి మంచం యెక్కి ముసుగుతన్ని పండుకున్నాడు.

రాత్రి పొద్దుపోయింది: పదకొండుగంటలయింది: ఊరంతా మాటుమణిగి నిశ్శబ్దంగా ఉన్నది. కాని మునసబుకు నిద్రపట్టలేదు. కళ్లుమూసినపుడల్లా ఉదయాన్న తాను రోడ్డుమీద చూచినమనిషి కళ్లయెదుట ప్రత్యక్షమవుతూనే వున్నాడు. మనిషికి భయం వేసింది: ఉదయం కలరా తొలగడమూ సాయంత్రానికి చచ్చిపోవడమూనా! ప్రాణం యెంత బుద్బుదప్రాయమైనదో! ఒకవేళ తనకే కలరాతగిలితేనో! అని లోపల హఠాత్తుగా ఒక సందేహం కలిగింది. ఆ వెంటనే మనస్సులో ఇంకోఆలోచన యేదోబయల్దేరింది. దానివెంట మరొకఆలోచన!

మనిషికి ఖంగారుపుట్టింది: కప్పుకున్న ముసుగు తీసి మంచంమీదనే లేచి కూర్చున్నాడు: గుండెలు కొట్టుకొంటున్నవి: చేత్తో పొట్టమీద వాయించుకున్నాడు. డబడబ గాలిబంతిమీద కొట్టినట్లు చప్పుడయింది. పొట్ట ఉబ్బరించినట్టు అనుమానం కలిగింది. తిన్నతిండి జీర్ణానికి రాలేదా అనుకొన్నాడు. భోజనంలో తిన్నపదార్థాలు ఏమిటని జ్ఞాపకం చేసుకొన్నాడు. కందిపచ్చడీ, మినుములు వేసిన చింతపండుపచ్చడీ జ్ఞాపకానికి వచ్చినై: అదిగాక ఆరోజు ఇంట్లో వండినబియ్యం కొత్తబియ్యం. పొట్టమీద చెయ్యివేసి నిమురుకున్నాడు. కడుపుకూసినట్లు చేతికి తగిలింది: పొట్ట అక్కళించుకొన్నాడు. బొడ్డుదగ్గర నొప్పిగా ఉన్నట్టు తోచింది. మనిషికి భయం జాస్తి అవుతూవచ్చింది. దానికితోడు కడుపులో వికారంగా ఉండినట్టుకూడా అనుమానం బయల్దేరింది. అల్పశంకకు పోవలసిన అవసరం కనబడింది. కాని మంచం దిగలేకపోయాడు: ఒంటరిగా బయటికి పోవడానికి భయం. నిద్రలో ఉండిన భార్యను లేపాడు. ఆమెసహాయంతో తలుపు తీసి వాకిట్లోకి వెళ్లాడు: అవసరంతీర్చుకొని లోపలికి తిరిగివచ్చాడు. మంచంమీదనే కూర్చున్నాడు. కడుపులో మలినొప్పిగా ఉన్నట్టు తోచింది. లేవవలసిన అవసరమేమో! భయపడ్డాడు. ఏదో ఆయాసంగా ఉన్న దతనికి. రోడ్డుమీది యానాదివాడుఎదురుగా నిలబడ్డాడు. తనబాధఅంతా కలరా చిహ్నాలు కాదుగదా అని అతనికి అనుమానం వృద్ధి అవుతోంది.

గుండె దడదడమన్నది. నిద్రపోతూ వుండిన భార్యవైపూ పిల్లలవైపూ ఒకసారి చూచుకున్నాడు. తనకి తెల్లవారుతుందో లేదో అనుకొన్నాడు. కడుపులో బుడబుడమని చప్పుడయింది. గబగబా భార్యనులేపి పెరటిలోనికి పోయాడు, మళ్లా వచ్చి పండుకున్నాడు.

మంచంమీద వెల్లకిలా పండుకుని చేతులు రెండూ గుండెలమీద చేర్చుకొని కళ్లుమూసుకొన్నాడు. ఏవో వికారస్వరూపాలు గోచరిస్తూఉన్నవి. రాత్రి రెండుజాములు దాటింది. ఎక్కడనో బయట నక్కలు కూస్తున్నట్టు చెవికి వినవస్తోంది. యానాదివాడి శవాన్ని నక్కలు పీక్కొని తింటున్నాయో ఏమోనని సందేహం కలిగింది. తానుచేసిన అజాగ్రత్తకి పోలీసువాండ్లు తనమీద పైవారికి రిపోర్టుచేస్తారేమో? ఇట్లాంటి విషయంలోనే అజాగ్రత్తగా ప్రవర్తించినందుకు ఒకగ్రామ మునసబును ఇదివరలో సర్కారువారు

నౌకరీనుండి నిలుపుదలచేశారు కూడాను: తన గతి ఎట్లా ఉన్నదో! అతనికి భయంవేసింది: మళ్లా కడుపులో ఏదో బాధగా ఉన్నట్టుగా ఉంది: మళ్లా భార్యను లేపి వీధిలోకిపోయాడు. మూలుగుతూ ముక్కుతూ రెండుచేతులూ నడుము కానించి లోపలికి వచ్చి పండుకొన్నాడు: కాళ్లు లాగుతూఉండినట్టు ఉన్నదతనికి. శరీరం చిరుచెమ్మటపోసింది: ఒళ్లంతా నీరసంగా ఉన్నది: దాహం అని ఒకలోటా నీళ్లు తాగాడు. అన్నీ కలరాలక్షణాలే! భార్యతో చెప్పనా వద్దా అని సందేహంకలిగింది. అట్టే ఆలోచించాడు. 'సంసారం గుట్టూ, వ్యాధి రట్టూ' అన్నసామెత స్ఫురణకువచ్చింది.

"ఏమే" అని భార్యను పిలిచాడు.

ఆమె దగ్గరగా వచ్చి నిలబడింది.

"నా కేమో కడుపులో సంకటంగా వున్నది చూడు: ఒక్కసారి కరణాన్ని ఇట్లా పిలుచుకొనిరా" అన్నాడు మునసబు.

"ఇప్పుడు కరణం ఎందుకు ?"

"అతగాడిదగ్గర ఏమాత్ర అయినా ఉంటుంది. ఏదో కడుపులోకి ఇంతమందు పడితేనేగాని ఈబాధ తగ్గేటట్టు లేదు. చుట్టుపక్కల ఊళ్లలో అమ్మవారి జాడ్యాలవల్ల బాగాలేదని అంటున్నారు" అన్నాడు.

భార్యగుండెల్లో రాయిపడింది. దీపం దగ్గరగా తీసుకొనివచ్చి భర్త నట్టే పరీక్షించి చూసింది. ఆయన వైఖరి చూచేవరకు ఆమెకు కూడా ఖంగారు పుట్టింది. రాత్రి నట్ట నడిజాము. ఆమె కేమీ తోచలేదు.

లాంతరుదీపం చేతపట్టుకొని ఆమె తిన్నగా కరణంగారి ఇంటికి పోయింది. ఆయన్ని నిద్ర లేపింది.

"ఆయన కడుపులో ఏదో సంకటమంటున్నాడయ్యా! రెండుసార్లు వీధిలోకి పోయివచ్చాడు; నిద్రపట్టలేదు; ఒళ్లంతా తపనగా ఉన్నదని మంచంమీద పడి ఈ ఆకోటా, ఈకోటా పడి కొట్టుకొంటున్నాడు. దప్పిక దప్పిక అని నీళ్లు తాగుతున్నాడు. నా కేమీ పాలుపోక ఇట్లా వచ్చా అన్నా!" అని కరణంతో చెప్పింది.

కరణానికి అనుమానం వేసింది.

"ఊళ్లో ఏమో బాగులేదని అంటున్నారు. ఆ సంబంధం కాదుగదా అన్నా!" అని అడిగింది.

"ఊరుకోవమ్మా నువ్వు! అంతా లేని పోని అనుమానాలూ, కలగకొక్కుకోవడాలూను. అన్నం జీర్ణానికి రాలేదు కాబోలు. అందువల్ల మనిషి అట్లా ఆయాసపడుతున్నాడు" అని కరణం ధైర్యం చెప్పాడు.

"ఏమో అన్నా! బిడ్డల అదృష్టం ఎట్లా ఉన్నదో ?" అని కంట నీరు తుడుచుకొంది.

"నీకేమైనా మతిపోయిందా ఏందమ్మా! ఏం దీ పిచ్చిచేష్టాలు ?" అని కరణం కసురుకొన్నాడు.

మునసబుభార్య ముక్కు తుడుచుకొని,

"నిన్నొక్కసారి పిలుచుకొని రమన్నాడయ్యా. నే నెంత చెప్పినా ఊరుకోలేదు. ఒక్కఅడుగు ఇంటిదాకా వస్తూ. నీకోసరం ఆరాటించిపోతున్నాడూ" అని అడిగింది.

రొంటిని ఉన్న నశ్యంపట్టు ముక్కులోనికి జర్రున జ్యూరి కాళ్లకు చెప్పులు తొడుక్కొని ఆమెతోకూడా మునసబుగారింటికి వెళ్లాడు కరణం.

కరణాన్ని చూచీచూడడంతోనే మంచం మీద పండుకున్న మునసబు దిగ్గున లేచి కూర్చుని,

"నేను బతకనయ్యో! బిడ్డల్ని నీ కప్పగించి పోతున్నానయ్యో!" అని కరణాన్ని ఘట్టిగా కౌగలించుకొని బారుమన్నాడు.

భర్తస్థితిచూచేవరకు భార్యకు దుఃఖం ఆగలేదు. "నాగ తేంచేస్తావు,అన్నా!" అని ఆమె ఏడిచింది. ఈరోదనవల్ల పండుకొని నిద్ర పోతూండిన బిడ్డలు లేచి గీ, గా అని గోల ఆరంభించారు.

కరణంగారు గుండె నిబ్బరంచేసుకొని వీళ్ల నందరినీ సముదాయించ లేకపోతున్నాడు. మునసబుగారింట్లో గలభాకు చుట్టుపక్కల వాళ్లందరూ లేచి ఏమిటో విచారించివద్దామని గుంపుకూడారు.అందరూ తలొక్కమాటా చెప్పి వాళ్లకు ధైర్యంచెప్పారు. వారిలో ఒకపెద్ద ముత్తయిదువ ఇంత కొంతి, వాముపొయ్యా తీసుకొనివచ్చి నూరి, ఉండచేసి మునసబు గొంతులో వేసింది. ఒకఅరగంటకి చేరినజనం అంతా వెళ్లిపోయారు. అక్కడచేరినవాళ్లల్లో చాలామంది అది కలరాజాడ్యమే నని తీర్మానం చేసుకొన్నారు.

కరణంమాత్రం మునసబుఇంటనే నిలిచాడు. మాత్ర మింగినప్పటికీ మునసబుకి ఆయాసమూ, వికారమూ తగ్గలేదు. ఏదో బయటికి చెప్పలేనట్టుగా ఉన్నది ఆయనగారి బాధ: పిల్లల్ని పండుకోబెట్టి భర్తమంచాని కానుకొనే కూర్చున్నది భార్య.

ఎదురుగ్గా మంచంమీద కూర్చున్నాడు కరణం. రాత్రి రెండుగంటలయింది. మూడయింది. నాలుగయింది. కరణానికీ మునసబుకీ ఆయనభార్యకీ నిద్రలేదు. ఊఁ, ఊఁ, అని తెగమూలుగుతూనే ఉన్నాడు మునసబు:భార్య కాళ్లు పిసుకుతూనే కూర్చున్నది, పాపం.

"ఏమయ్యా! అశవం అక్కడనే ఉన్నదో ఏనక్కలయినా పెరుక్కొని తిన్నావో! ఆపోలీసు సబిన్స్పెక్టరు నన్ను బ్రతకనివ్వడు ఎట్లానయ్యా?" అని కరణాన్ని అడిగాడు మునసబు.

"నీకాభయం ఏమీ పనిలేదు లేవయ్యా: నేను ఆయనతో మాట్లాడి నీకేమీమాట రాకుండా చేస్తానులే:" అని ధైర్యంచెప్పతూ 'నీకు వంట్లో ఎట్లా ఉంది?' అని అడిగాడు కరణం!

"కడుపులో ఊఁ వికారంగా ఉన్నదయ్యా! వాంతి వచ్చేటట్టుగాఉన్నది" అని అన్నాడు మునసబు.

"అన్నా! ఇట్లారా! కాళ్లు చేతికి చల్లంగా ఉన్నట్టుగా ఉన్నవే! నాచేతులకేనా, నీకూడా అట్లనే ఉన్నాయా?" అని కరణంతో చెప్పింది, మునసబుభార్య.

"అయ్యో! అయ్యో!—"రామ హరే,కృష్ణ హరే! తవ నామ వదామి........." అని మూలుగుతున్నాడు—మునసబు. కరణం లేచి వచ్చి మునసబువంటిమీద చెయ్యి వేసి పరీక్షించి చూచి—

"లేనిపోని సందేహాలు పెట్టుకొని మనస్సు కలగచేసుకోకండి;" అని వాళ్ల నిద్దరినీ మందలించాడు.—

బయట కోడి కొక్కొరోకోయని కూసింది—. ఒక్క అరగంట వడుచు వాలుస్తానని కరణం ఆ మంచంమీదనే ఒరిగాడు. మునసబుభార్య చీరపరుచుకొని భర్తమంచాని కానుకొని నేలమీదనే పండుకున్నది. మునసబు కళ్లు మూసుకొన్నాడు.

## 3

ఉదయం అయిదుగంట లయింది. ఇంకా కనిచీకటిగానే ఉన్నది. పోలీసుస్టేషనుకు రిపోర్టు దొత్తుకొనిపోయిన తలారి వచ్చి,

"సబిన్‌స్పెక్టరు వచ్చాడు: పిలుస్తుండాడు—"అని కరణంతోనూ, మునసబుతోనూ చెప్పాడు.

ఈ మాట చెవిని పడేసరకు ఉలిక్కిపడి లేచి మునసబు మంచంమీదనే ఈ తట్టూ ఆ తట్టూ కొట్టుకొంటూ,

"నేను రాలేనయ్యోౘ! నా కిక నూకల రుణం తీరిపోయిందయ్యోౘ! నాకాళ్లూ చేతులూ కొంకర్లు పోతున్నాయయ్యోౘ! నన్నవతలకి ఈడ్చి పారేయండయ్యోౘ" అని పెద్ద పెట్టున గోల ఆరంభించాడు.

భార్య లేచి వచ్చి భర్తమంచంమీద కూర్చుని ఏడుస్తూనే ఆయన్ని సముదాయిస్తోంది. కరణంగారు దగ్గరకి వచ్చి చూచేవరకు మునసబుకు దవడలు రెండూ కరుచుకొనిపోయి, మిడిగ్రుడ్లువేసి కొయ్యఅయిపోతున్నాడు.

ఇదేమీ అర్థం కావడంలేదు తలారివాడికి:

కరణంమాత్రం బలవంతాన్న ధైర్యం తెచ్చుకొని మునసబుకీ భార్యకీ ధైర్యంచెప్పి తలారివాణ్ణి తీసుకొని సబిన్‌స్పెక్టరు దగ్గరకు వెళ్లిపోయాడు.

"మునసబుకి రాత్రి చాలా జబ్బు చేసిందండి. ఆయన లేచివచ్చేస్థితిలో లేడు" అని కరణం సబిన్‌స్పెక్టరుతో చెప్పాడు.

"ఎక్కడనయ్యా— శవం పడిఉన్నదీ ?" అని కరణాన్ని అడిగాడు సబిన్‌స్పెక్టరు.

"ఒరే గమళ్లపాలేనికి దక్షిణంగా చెర్లోకి పోయే డొంకలోకి దారితీయరా" అని తలారివాడికి ఉత్తర్వుచేస్తూ, ఇంకోమనిషిని సుబ్బరాము లక్ష్మంగాడినీ, వెంకటసుబ్బణ్ణీ పిలుచుకొని రమ్మని పంపాడు కరణం.

"చాలా చీకటి ఉండంగనే లేచి వచ్చారే నాయుడుగారు: తెల్లవారినతర్వాత నిదానంగా రాలేకపోయినారా?" అని సబిన్‌స్పెక్టరుతో అన్నాడు కరణం.

"అసలు నేను అచ్చం ఈ డ్యూటీమీదనే రాలేదయ్యా! వేకువజామునే లేచి చెర్లోపల్లెకి పోవాలని ప్రయాణమై ఉన్నాను! రాత్రి పదకొండుగంటలకి తెచ్చియిచ్చాడు మీ రిపోర్టు. పోయేదారిగదా, ఈ పంచాయతీ పూర్తిచేసుకొని మరీ పోదామని వేకువనే లేచి వచ్చా" నన్నాడు సబిన్‌స్పెక్టరు:

ఇంతలో సుబ్బరామువాం డ్లిద్దరూ పిండ్లని కలుసుకొని డొంకలోనికి ముందుగా దారి తీస్తున్నారు.

తూర్పురేఖలు బాగా అలినవి. రాత్రి తెల్లవార్లూ కళ్లని కప్పిన అంధకారం తొలగి ప్రజలకు జ్ఞానోదయం కలిగినట్లు సూర్యోదయం కాబోతోంది. కరణమూ, సబిన్‌స్పెక్టరూ, తలారీ, సుబ్బరాముడాండ్లూ గమళ్లపాలెం దాటి ఒకఫర్లాంగుమారం వెళ్లారు—.

సుబ్బరాముడాండ్లు చూపినస్థలంలో డొంకకి తూర్పుగా తుమ్మచెట్టుకింద పడిఉన్నాడు — యానాదివాడు. ఈ జనసమూహాన్ని జూచి ఆ యానాదివాడు నోటితో ఏమీ మాటాడలేక, చెయ్యి ఎత్తి మూతిదగ్గర పెట్టుకొని దాహ మవుతూవుందని సంజ్ఞ చేశాడు.

అందరికీ ఆశ్చర్యం వేసింది.

"వీడు చావలేదయ్యా! బ్రతికేఉన్నాడు. భలేపని చేశారు కదయ్యా! వీడి కిన్ని గంజినీళ్లు పోయించి ఊళ్లోకి తీసుకొనిపోండి" అంటూ సబిన్‌స్పెక్టరు ఒంటెద్దుబండెక్కి అక్కణ్ణుంచే చెర్లోపల్లెకు పోయాడు.

"అరే, రాత్రిపొద్దు మాస్తే చచ్చినట్టే ఉండాడయ్యా. ఎంతపని జరిగిందో చూశావా?" అన్నారు సుబ్బరాములు.

కరణానికి ఒళ్లు తెలియలేదు. ఒక్కపరుగున ఊళ్లోకి పేరం తీశాడు.

మునసబుకి మన స్మారకం లేనేలేదు. పిలిస్తే పలకడు. భార్య ఏడుస్తూ అతని ప్రక్కలోనే కూర్చుని ఉన్నది.

పరుగులుతీస్తూ కరణం మునసబు ఇంటికి పోయి "ఏమయ్యోౘ! వాడు చావలేదయ్యా! బ్రతికే ఉన్నాడు. వాడికి కలరా కాదయ్యా పాపం! జ్వరంతగిలి పడిపోయాడట. వాడితో వచ్చిన కూలివా ళ్లంటున్నారు" అని వగర్చుకొంటూ చెప్పాడు కరణం.

"ఆ! ఆ! ఏమిటీ, వాడు చావలేదూ? నిజమే! నిజమే!" అని ఎగిరి ఒక్కగంతు వేశాడు—మునసబు.





యువతులారా
మీ బాధను
తుదముట్టింపుడు!

# కారణామును తొలగింపుడు

మీ రిక ఋతుసంబంధమైన నొప్పులను పోగొట్టుకొనవచ్చును. ఎందువల్ల ననగా దానికి గల అసలు కారణము తెలిసినది - మీరు కల్జానా సేవించిన యెడల ఆ కారణము తొలగిపోవును.

మీ దేహములో కొన్ని ముఖ్యమైన ఖనిజములు లోపించుట వల్ల మీరు బాధ, అసౌకర్యము ననుభవించుచున్నారు. ఈ ఖనిజములు చాలినంత లేకపోవుటచేత, రక్తము బలహీనతచెంది దేహతత్వము సరిగా పనిచేయదు. కల్జానా మీకు అవసరమైన ముఖ్య ఖనిజముల నొసంగును. అది తీసికొనుటకు సులభముగను ఆహ్లాదముగా నుండును. మీరు కల్జానా సేవించునప్పుడు, రక్తము బాగుపడిన కారణమున దేహతత్వము సరిగా పనిచేసి మీకు బాధ కలిగింపదు. ఇక యేమాత్రము బాధ పడకుద్దు.

నేను కల్జానా తెచ్చి వాడెదను. పాండువు, బలహీనత గల బిడ్డలకు వగైరాలకు నుపకరించును.

పాండువు
చికాకు
బలహీనత
స్త్రీల సం॥ మైన
జబ్బులు వగైరా
ఖనిజములు
లోపించుటచే
కలుగును

# KALZANA

ఆరోగ్యాభివృద్ధికి ఖనిజాహారము

ప్రతి మందులదుకాణములోను బజారులోను దొరకును.

చేతిలో తాకబడనిది.

# హంపి

గుఱ్ఱము వెంకటసుబ్రహ్మణ్యము

మహానీయరాజన్యవహనవారణవారవిహరణభూము లీవీథులట్టె
భగవత్పదధ్యాననిగమానుగతి జనుల్ సేవింతురట్టె యీ దేవళముల
నగరయావతమజ్జనప్రక్రియోత్థసౌరభ్యపూర్ణాంబు లీ హ్రదములట్టె
స్వైరధీరవిహారవనితాసహస్రసంవాసవేశ్మములట్టె మహాళు లివియు
బహుళగోత్రసమావృత వప్రమైన, యీవిశాలప్రదేశ మహీనరాజ్య
కటకమై త్రిశతాబ్దులు క్రాలెనట్టె, కాలగతి మాఱిపోయె నాకార మెల్ల.

స్తంభంబు లున్నవి కుంభికుంభస్తనల్ భోగించినవిశాంతభాగములకు
శకలంబు లున్నవి సమధికశిల్పుల లలితసృష్టికిఁ గొంత లక్ష్యమగుచు
మట్టిలోఁ గూడిన మంటపంబులచాలు తలపించు విప్రసంతర్పణముల
మిగిలె సీరాకట్టు భువనవిజయమన్న కొలువుకూటము నూహఁ గొలుచుకొనఁగ
మిట్టలును గుట్టలును మేలికట్టడముల, జాడలం దెల్పఁ గొల్పఁ గన్గడత నేఁడు
పురవిభవమెల్ల పాలివోయి, పొంతనొక్క, పేదపల్లియ యున్న దా పేరు దాల్చి.

అరుణాస్పదము దీని నొరవడిగా నుంచుకొనియె పెద్దన్న వర్ణనము సేసె
గిరినదీప్రణయమ్ము గీల్కొల్పె భట్టుమూర్తియుఁ బంప యొరగిల్తీరు జూచి
సిద్ధయక్షాదులఁ జిత్రించె నిచ్చటితీర్థాధ్వగులఁ గాంచి తిమ్మనకవి
ఋశ్యమూక మతంగ హేమకూటసమీక్ష రామాభ్యుదయకర్త వ్రాసెఁ గృతిని
రామలింగన నిగమశర్మను దదీయ, సోదరిని జుట్టుపట్లన చూడఁబోలు
కావ్యలోకమునకుఁ దాన కారణముగఁ, బరిఢవిల్లినపుర మిది పాడువడియె.

ద్వారపాలికల సుందరమూర్తి చెడిపోయెఁ బాలిండ్లు ఛేదింప వాడిమొనలు
శిలకొక్క యేనుఁగు చెక్కినశిల్పముల్ మొండయ్యెఁ దుండముల్ ఖండితములు
గుళ్లుగోపురములు గోడలున్నవిగాని బింబంబులు తిరోహితంబు లయ్యె
ప్రాకారమును దాటి పద్మసద్మం బెక్కఁ బూర్వకాలస్మృతి పొంగిపొరలు.
ఒక్కరాజనహంకార మొక్కయుద్ధమునఁ బరాజయ, మొకపలాయనముతోడ
తిరుగులేని విహతివొందె దేశదేశ, సంస్తుతాద్భుతవైభవాశ్రయము పురము.

---

ఒకనాఁడు వేటాడ నుగ్రాటవిం జొచ్చి అన్నదమ్ములు విస్మయంపడుటయు
అంత విద్యారణ్యు లత్యంతసంప్రీతిఁ బురనిర్మితిం బల్కి పుచ్చుటయును
అమరావతి ధరిత్రి నావిర్భవిల్లెనాఁ బంపాదరిం బురి వఱలుటయును
రాయలరాజ్యమ్ము ప్రాక్పశ్చిమాబ్ధులు మేరలుగా విక్రమించుటయును

వేదవిద్య, ధర్మపరత, విహితవృత్తి, సరసకవిత, లలితకళ విరివిగాంచి
ఖ్యాతిమించి హఠాత్తు నిష్క్రమింతిగనుట,యుఁ దలపోయ నీరమ్యోడు నుల్ల మిపుడు.

తుల నెక్కి యిచట రాయలు నిస్తులంబైన దానాభిరతిఁ బంచె ద్రవ్యవితతి
లక్ష్మీనృసింహవిగ్రహము దీనిని జెక్కె అగ్రహారముఁ గాంచె నగ్రశిల్పి
జినగవేషణుల విచిత్రాలయము లివి సోపానచతురస్రగోపురములు
రామగాథను దీర్చి రాళ్ళపైఁ గట్టె రీ రామాలయము హజారమ్ముకడను
శిల్పమునకుఁ బరాకాష్ఠ స్నిగ్ధముగ్ధ, మధుర మీవిఠ్ఠలాలయమంటపమ్ము
జీర్ణదశయందు నద్భుతోత్సేకము లివి, విభవవేళ నెట్లుండెనో వేద్యమగునె?

పూచినకాన చిచ్చేచి కాల్చినయట్లు తుఱకలు పురలక్ష్మిఁ జెఱచినైవ
పెనుగాలి ఘనపాళి విరిసిపోయినయట్లు పరువేది పరువెత్తెఁ బారకోటి ;
కలుషీకృతాలయోద్గమనసంరంభులై స్వర్గంబుదారి దేవతలు సనిరి
మొక్కవోవఁగ విప్రవాక్కు రాజులటెక్కు మహిమగోల్పడియె సన్మతముగూడ
గ్రక్కదలె సర్వ మొకత్రుటి, దిక్కులేని, దయ్యె దక్షిణఖండరాజ్యమ్ము సకట
గ్రావములుమాత్ర మున్నలై కదలకుండె, రాతిగుండెలుగాన నరాతిధాటి.

ఆంధ్రప్రశస్తి యట్లంతరించెను నాఁడు నాల్గుశతాబ్దులు నడచిపోయె
అప్పటికిప్పటి కణుమాత్రసాపత్న్యమును లేదు, యుగము నూతనము పుట్టె
మతసాంఘికార్థపద్ధతు లెల్ల వేర్పడెఁ గ్రొత్తలక్ష్యంబులు హత్తు నెదల
వెనుబడినారము వివిధప్రవృత్తులఁ బాశ్చాత్యదృష్టిలో బర్బరులము
జీర్ణపురిచిహ్న మియ్యది జీర్ణజాతి, కైన నుజ్జీవనముగల్గు టరిదిగాదు.
ఆకృతులుమాఱు శాశ్వతప్రకృతియందు, ఆత్మశక్తి యఖండ మత్యాయతమ్ము.

ఆత్మశక్తియ భారతావనిం బ్రాచీనసంస్కృతికి నవీనసంస్కృతికిని
దానమై, యవికల్పధర్మకారణమై, జగన్నుత జ్ఞానవిజ్ఞానఖనియు
నై, భగవత్ప్రకాశాంశమై, యవతార లీలావిశేషమై, వేలలేని
సాగరమై, యోగభోగనిశ్శ్రేయమై యున్కి నెల్లరకు విద్యోతితంబు
గానఁ దల్లక్ష్యబింబమక్షతములైన, యివ్విరూపాక్షునాలయ మీక్ష సేయఁ
గమలవనముపై వీతెంచు గాలిపగిది, ప్రత్యయము మానసమ్మునఁ బరిమళించు.

---

# భాషాభివృద్ధి - బడిపుస్తకములు

కె. వి. సుబ్బరాయశాస్త్రి

భాషాభివృద్ధివలనగాని దేశాభివృద్ధికానేరదని పలువురు పలుకుచుందురు. దేశస్థుల నాగరకత యాదేశమందలి వాఙ్మయమువలన దెలిసిన ట్లితరసాధనములవలన దెలియరాదు. కావుననే యెట్టి కష్టసమయములందైనను భాషాభివృద్ధి యుపేక్షింపబడక నిరాఘాటముగా సాగింపబడుచుండెను. సంస్కృతాది సార్వదేశికభాషలయందు ప్రజలకు భక్తిభావము ఎంత యధికముగానున్నను దమతమ మాతృభాషలవలె నాభాషలుసంతతాశ్రయణీయములు గానేరవు. సంస్కృతభాష యెన్నడేని వ్యావహారికముగా నున్నదోలేదో నిర్ణయించుట దుష్కరముగాని కొన్నికొన్ని కాలములం దాయాప్రభువులయాలంబమున నాభాషయందు సమస్తజ్ఞానవిజ్ఞానదాయకములగు గ్రంథము లనేకములు వెలువడినవి. నవీనముగా గనిపెట్టబడిన కొన్ని విషయములందుదక్క ప్రాచీన విజ్ఞానవిశేషములం దెలుపుటలో సంస్కృతభాష కేభాషయు నీడుగాదు. ఆసంస్కృతభాష మనహిందూదేశమునం దన్నిప్రాంతములవారికిని గలధనమై యలరారుట వాస్తవము. అట్లయ్యును నాయాప్రాంతములవారు ఓపినంతవరకు సంస్కృతభాషను వృద్ధినొందించుచు దమతమప్రాంతీయదేశభాషలకుగూడ నభివృద్ధినాపాదించుట కత్యధికముగ కృషిచేయుచుండిరి. మహాభక్త తులసీదాసగోస్వామికి సంస్కృతభాషయందు పాండిత్యాభిమానములు లేకపోలేదు. ఐన నాతడు తనరామాయణమును హిందీభాషలో రచించెను. హిందీభాష కౌన్నత్యము గలిగించెను. కాకతీయులు చాళుక్యులు విజయనగరప్రభువులు మొదలగువారికి సంస్కృతభాష దురవగాహముగా నుండలేదు. ఆయాప్రభువులు వారికవులునుగూడ వేదవేదాంగాదిసమస్తవిద్యలను సంస్కృతభాషామూలమున నెఱింగినవారయ్యు దమదేశభాషలందుగూడ సంస్కృతభాషాసార ముండవలయు ననునూహతోడనే యాయాయాగ్రంథముల నాంధ్రీకరింపించిరి; ఆంధ్రీకరించిరి కూడను. బిడ్డలకుండపుష్టికి తల్లిపా లెట్లుపకరించునో వారిజ్ఞానాభివృద్ధికి మాతృభాషయట్లుపకరించును. దాదిపాలవలె సంస్కృతభాషయు విదేశములనుండి దిగబడిన డబ్బాపాలవలెనే విదేశభాషలును నంత పుష్టికరములు గావు. చాళుక్యకాకతీయవిజయనగరరాజులకాలమందు నాంధ్రభాష మహోన్నతస్థితినొందుటంజేసియే యాకాలమం దాంధ్రతేజము దుర్నిరీక్ష్యమై దురావారమై దిగంతములందు దాండవించినది. విజయనగరపతనానంతరము భాషయు దేశమునుగూడ నొకదానిని మించి యొకటిహైన్యము నొందినవి.

విదేశీయులు విమతస్థులు నగుప్రభువుల పాలనమున దేశముగాని యందలిభాషలుగాని యభివృద్ధి నొందకుండుటలో వింతలేదు. తురుష్కులపాలనమునకంటెనుగూడ నాంగ్లేయుల పాలనమున దేశభాషలకు మరువరానిదెబ్బ తగిలినది. మిషనరీలు తమస్కూళ్లను ఆసుపత్రులను దమ మతప్రచారమునకై యెట్లు సాధనములుగా నుపయోగించుకొనుచున్నారో యట్లే ఆంగ్లప్రభుత్వముగూడ దమపాలనమును విద్యావిధానముమూలమున గొనసాగించుకొనుచు వచ్చినది కాని వాస్తవముగ భాషలయభివృద్ధికై యేమియు జేసినది కాదు. ఐనను కాలక్రమమున దొరతనమువారుగూడ దేశభాషలను గౌరవింపకతీరినదికాదు.

19-వ శతాబ్దమున రాజ్యాంగనిర్వాహణము పూర్తిగ ప్రజాయత్తము గాకున్నను కీ॥శే॥ దాదాభాయినౌరోజీ, ఫిరోజిషామెహతా, గోపాలకృష్ణగోఖలే మున్నగునాంగ్లవిద్యాధికులగుభారతీయనాయకుల అఖండపరిశ్రమవలన దేశీయులకు దొరతనమునందు గొంత పలుకుబడియు, తన్మూలమున దేశీయులకు గొన్నిస్వల్పలాభములు ప్రాప్తించినవి. ఈసమయమున దేశీయులగువిద్యాధికులు దేశభాషలయభివృద్ధికి పాటుపడిరి. వారినిరంతరకృషివలన దేశభాషలందు నూతనశక మారంభమై భాషలు దినదినాభివృద్ధి నొందుచున్నవి.

ఆంధ్రదేశమున కిరుగుపొరుగులనున్న వంగద్రావిడ కర్ణాటాదిభాషలును, వానితో సమానముగగాకున్న గొంచెమెక్కువతక్కువగ నాంధ్రభాషయు నీకాలముననే యున్నతి నొందిన దనుటలో సాహసము లేదు.

ఈయున్నతి యెట్టిది? గ్రంథము లనేకములుత్పన్నములగుటయా? లేక వాఙ్మయమునందలి విషయగౌరవమా? యని ప్రశ్నించుట కవకాశము గలదు. రెండునౌన్నత్యసూచకములేయని సమాధానము. వంగాంగ్లాదిభాషలందున్నగ్రంథముల ననుకరించియు, ననువదించియు రచించిననవలలు, నాటకములు, కథలును బరశ్శతములుగ వెలువడినవి. అంతకుమున్న సూర్యాంపశ్యములగుప్రాచీనతాళపత్రగ్రంథము లనేకము ముద్రింపబడి నలుదెసల వ్యాపించెను. ఈదేశమందే జనించినప్రాచీననవీనమతములను దెలుపుగ్రంథములును, వివిధశాస్త్రగ్రంథములును అనువదింపబడినవి. స్వతంత్రరచనము లనేకములు బయలువెడలినవి. ఆంధ్రవాల్మీకులు, వ్యాసులు, కాళిదాసులు, షేక్స్పియరులు, టెన్నిసన్నులు నున్నారు. ఆంధ్రధన్వంతరి గోపాలాచార్యులు నిన్నచే యస్తమించినను నాయనస్థాన మాక్రమింపగలవారున్నారు. చరిత్రచతురాననులు, గ్రాంథికభాషోద్ధారకులును గలరు. వేయేల ? శ్రీరావుసాహెబ్ గిడుగు వేంకటరామమూర్తిపంతులుగారు విరజల్లుచున్న భాషావిమర్శలహరి యేభాషలయందైనగలదా? ఇట్టిసాధనసామగ్రియుండుటవలననే దేశభాషలందే విద్యగఱపవచ్చును; కఱపవలయును- అనునభిప్రాయ మెల్లరకు నుదయించినది. ఇప్పుడుగాకున్న మరికొంతకాలమునకైన దేశభాషలకు ప్రాధాన్యము ఆంగ్లభాషకు అప్రాధాన్యము నవశ్యంభావులు కాకతప్పవు.

రాజకీయవ్యవహారములకు దూరప్రాంతములవారు ఇతరేతరము జరుపువర్తకవ్యాపార

ములకు సుకరమైనసామాన్యభాష యొకటి దేశమున నుండకతీరదు. ఈ దేశమందేకాక యితరదేశములందుగూడ జరుపువ్యవహారము లన్నియు నిప్పు డాంగ్ల భాషామూలమున జరుగుచున్నను మనదేశమున నాంగ్లభాష సామాన్యభాష కాజాలదు.

ఒకటిముక్కాలు శతాబ్దము నుండియు కోట్లకొలది ధనమును దిగ్రమించుచున్న ఆంగ్లభాష యింతవరకు నూటికి పదివంతునకైనను వ్యాపింపనప్పు డింక నాకబంధ కళేబరము దేశమంతటను ముప్పదిమూడుకోట్లకు మించిన మించుచున్న భారతీయులలో సంపూర్ణముగా వ్యాపించుట కెన్ని శతాబ్దములు పట్టునో? కావున నాంగ్లభాష సామాన్యభాష యగుట దుర్ఘటము.

ఐనచో సామాన్యభాష యేది? హిందీ భాషయు దాని సన్నిహిత సంబంధము గల శ్రీ మరాటీ మున్నగుభాషలును కేరి మొత్తము దేశమున మూడుభాగములందు బూర్వకాలము నుండియు వ్యాపించియున్నవి. గాంధీమహాత్ముని పరిశ్రమమువలన హిందీ సత్వర దినదినాక్రమణము గావించుచున్నది. భారతజాతీయసభ తన వ్యవహారములన్నియు హిందీమూలమున నెరవేర్చుచున్నది. ప్రకృతము పెక్కు రాష్ట్రములందు జాతీయవాదులు ప్రభుత్వము నెఱపుచు దేశాభివృద్ధి కనుకూలములగు సంస్కరణము లన్నిటితో పాటు హిందీ ప్రచారముగూడ ప్రధానలక్ష్యముగా నెంచుచున్నారు. అచిరకాలమునవే పాఠశాలలలో హిందీ నేర్పుట నిర్బంధము గావించెదరు. శ్రీ పరమేశ్వరు డనుగ్రహించినచో నొక్కదశలోనే హిందీ సర్వసామాన్య భాష యగు శుభలక్షణము లెన్నియేని గలవు.

హిందీ సామాన్య భాషగా నున్నను విద్యావిధానముమాత్రము ఆయా దేశభాషలయందే జరుగవలయును. ఇతరభాషలో నెంతమాత్రము పనికిరాదు. ఇప్పు డింగ్లీషు భాష యాక్రమించిన స్థానమే హిందీ యాక్రమించినచో విద్యాభివృద్ధి యిప్పటివలెనే కాక తప్పదు. కావున మరికొంత కాలమునకైనను, దేశభాషల మూలమున విద్యావ్యాప్తి కలుగు నను నాశ కవకాశము గలదు. తక్కిన దేశములమాట యెట్లున్నను మన యాంధ్రదేశమునమాత్రము ప్రాథమికవిద్య మొదలు కళాశాలవిద్యవరకు యెల్ల విద్యలు దేశభాషలోనే నేర్పవలయు నను పట్టుదలయు నుత్సాహమును ఆంధ్రనాయకు లందరియందును దాండవించుచున్నది. తత్ఫలితముగ నాంధ్ర విశ్వవిద్యాలయ మేర్పడుటయు నాంగ్లాదిభాషలలోని వివిధశాస్త్ర గ్రంథము లాంధ్రభాషలోనికి పరివర్తింపబడుటయు గనుచు వినుచు నానందించుచున్నాము. అచిరకాలముననే మనభాషలో సమస్త శాస్త్రములు నేర్పబడుటయు మనము చూడగలము. అప్పుడే గదా మనభాషకు సర్వతోముఖాభివృద్ధి సిద్ధించును.

ఎప్పుడో యనూ్మలమునకో భాషాభివృద్ధి యగునని అంతవరకు నితరు లుపేక్షించుటయు నిరీక్షించుటయు గూడదు. ఎవరిచేతనైనంత సేవ వారు చేయుచుండుట స్వాభావికము. ఏప్రభుబలాశ్రయము లేకున్నను జిన్నయసూరి వచనరచనమునకు క్రొత్తపుంత నిర్మింపలేదా? వీరేశలింగముపంతులు నూతనశకము సృష్టింపలేదా? అప్పారావుపంతులు భాషాశృంఖలముల విచ్ఛేదముచేసి యెల్లరకు సులభము గావించలేదా? శ్రీరామమూర్తిపంతులు భాషాతత్వము విశదపఱచుచుండుటలేదా? రాయప్రోలు సుబ్బారావు, వంగూరిసుబ్బారావు, బసవరాజు అప్పారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రిప్రభృతులు జీవద్భాషామాధుర్యము చవిచూపుచుండుటలేదా? నూతనసంస్కరణ మభిప్రేతము గాకున్నను జయంతి రామయ్యపంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రిప్రముఖులుగూడ భాషాభివృద్ధికే కదా తమ శక్తినంతయు ధారవోయుచున్నారు. వీరిలో గొందర ప్రయత్నము కొంత వ్యుత్పత్తిగలవారియందే ఫలించును. ఇతరుల ప్రయత్నములు ఆబాలగోపాల మెల్లరయందును ఫలించును. కావున అభివృద్ధిప్రయత్నములుమాత్రము ఆరంభవిద్యయందే చేయుట సుకరమును, బహులాభప్రదమును అని పలువుర యభిప్రాయము.

తదనుసారముగనే భాషాసేవకు లెల్లరు ప్రకృతకాలమున నేతత్ప్రయత్నమునందే నిమగ్నులైయున్నారు. ఏయాంగ్లోపాధ్యాయు లైనను పండితులైనను బడిపుస్తకమును రచించుట యందే కాలము వినియోగించుచున్నారు. మార్చినెల మొదలుగ నెక్కడ జూచినను స్కూలుబుక్కు కంపెనీలయేజంట్లగపడుచుందురు. మొదటితరగతి మొదలు స్కూలుఫైనలు వరకు గావలసిన పుస్తకము లనేకవిధములవి యగపడుచుండును. ఈలక్షణము లన్నిటిని జూచి మనభాష మహోన్నతి నొందెనని యానందించువారును గలరు. ఐనను అభివృద్ధి మాత్రము ఆశించినంత, అనుకొన్నంతగా లేదు. కారణము విచారింప నీప్రకటనసంఘ బాహుళ్యమును గ్రంథబాహుళ్యమును భాషాభివృద్ధియే పరమప్రాప్యముగ నుదయించినది కాదనియు, ఒండొరులపోటీలకును స్వార్థపరులలాభమునకును బ్రకటించిన గ్రంథములే లెక్కకుమిక్కుటముగానున్నవనియు తెలియగలదు. ఉదారాశయరహితులగు కంపెనీలవారు అసమర్థములగుపుస్తకములను బ్రకటించి తాము స్వంతముగను ఏజంట్లమూలమునను బోర్డుప్రెసిడెంట్లను, స్కూల్ప్రధానోపాధ్యాయులను ఆశ్రయించి వారిదయ సంపాదించి తమపుస్తకములకు స్కూలుప్రవేశము కల్పించుకొనుచున్నారు. దీనివలన బాలురకు జ్ఞానముగాని, భాష కభివృద్ధిగాని లేకపోవుటయుండ ఏటేట పుస్తకములు మారుటవలన బాలురపోషకులకు మితిలేనికష్టనష్టములు గూడ కలుగుచున్నవి. ఈవిషయము స్కూలు అనుభవముగలవారికెల్లరకు విదితమే. ఆకారణముననేగదా ఒకసారినియమితమైనపుస్తకము ఐదేండ్లలోగా మార్పబడకూడదని దొరతనము వారు ప్రకటించిరి. ఐనను దానివలనగూడ నుపకారము గనబడకున్నది. ఏదో ఒక్క పుస్తకము అట్లు మార్పకున్నను అధికవాచకములనియు ఐచ్ఛికపఠనీయములనియు ఏవో పేర్లుపెట్టి పెక్కుపుస్తకములను ఏటేట మార్చివేయుచునేయున్నారు. ఇంతియకాక స్కూలుయజమానులుగూడ నిరంకుశులయి క్షుద్రమైన మోమోటములకును ఆశలకును లోనై పుస్తకములయుక్తాయుక్తతలను దాము

పరిశీలింపకయు నాయాయుపాధ్యాయుల యభిప్రాయములను తెలిసికొనకయునే పుస్తకములను నియమించుచుండుటయు గలదు.

ఇప్పుడు పెక్కురకముల వాచకపుస్తకము లున్నవి. ఆంధ్రవాచకములు ఆంధ్రనవీన వాచకములు, ఆనందవాచకములు, ఆర్య వాచకములు, శారదావాచకములు, సరస్వతీ వాచకములు, వివేకవాచకములు, కుమార వాచకములు, మారుతీవాచకములు, లాంగ్మన్సు వాచకములు, శ్రీకృష్ణవాచకములు, నాదెళ్ల వాచకములు, బాలవాచకములు, భాషావాచకములు మొదలగునవి యెన్నియో గలవు. ఆంధ్రవ్యాకరణములు ఆంధ్రవ్యాకరణ సంగ్రహములు, ఆంధ్రవ్యాకరణ సారములు, ఆంధ్రవ్యాకరణ పాఠములు, ఆంధ్రవ్యాకరణ బోధినులు, ఆంధ్రవ్యాకరణ సర్వస్వములు, ప్రశ్నోత్తర వ్యాకరణములు మొదలగు వ్యాకరణ గ్రంథములుగూడ నధికముగానున్నవి. ఐచ్ఛికముగా జదువదగుపుస్తకములు లెక్కింప తరముగాదు. కంపెనీ లంపినముద్రాపకులు భద్రపఱచుటకు బడులలో తావు చాలకే యున్న నతిశయోక్తి కానేరదు. ఇవియన్నియు గేవలము భాషాప్రధానములు మాత్రమే సుగృహీతనాములచే రచింపబడినవే. ఆప్రసిద్ధపుస్తకముల విషయమువలన మనకు గాలహరణమే యగును. కావున వానినివిడచి ప్రకృత మను సరింతము. సరిగా గన్పడదేని బాలుర విద్యావిషయమై యింతమంది యింతపోరాహోరిగా బోటీచేయుట వాస్తవముగ భాషా సేవచేయుటకో లేక తమపొట్ట నింపుకొనుటకో! గ్రంథకర్తలు సామాన్యముగా భాషాభివృద్ధియే లక్ష్యముగా రచింతురని యంగీకరింప వచ్చును. వారి కీరచనమువలన గలిగెడులాభ మల్పాల్పముకాన వారి ననుటకవకాశములేదు. ఇంక కంపెనీ లన్ననో చిరకాలమునుండి భాషాసేవచేయుచున్న ప్రసిద్ధసంస్థ లొకటి రెండు మాత్రము ఇష్టముగాకున్నను తమకీర్తి తమ నిలుపుకొనుటకు గత్యంతరములేక బడిపుస్తకములవ్యాపార మారంభించినవి. తక్కిన పెక్కుకంపెనీలు పొట్టసాటికై యిట్లు పోగ లాడుట నిక్కము. ఆ కుక్షింభర సంస్థలు ప్రకటించు పుస్తకములుగూడ ప్రసిద్ధగ్రంథముల ననుకరించియు, దలవిచికొనియు, మాఱువేషములు వేసికొనియు, తప్పులతడికలుగా నుండును. తమదర్శనమునకు వచ్చినదే చాలునను మోమోటమిచే కొన్ని బుక్కు కమిటీవారు కేపుస్తకమునైన అప్రూవు చేసి వేయుదురు. దొరతనమువారు గజెట్టులో ప్రకటించెదరు. ఆశంఖతీర్థ మందినపుస్తకము దేశాటన మారంభించి కలిగించెడి లాభనష్టములు దేవుని కెరుక.

బాలురకు ప్రారంభ విద్యాభ్యాసమందే భాషా పరిచయముతోపాటు నీతివినయము సత్పవర్తనము, మర్యాద, భక్తి మొదలగునవి కేర్పవలయును. దేశచరిత్రములు భూగోళ విషయములు జంతువృక్షశాస్త్రము ఆరోగ్య విషయములును వ్యావహారికములగు పోష్టు, టెలిగ్రాఫు, రైలు మొదలగు విషయములు నీసమయముననే యించించుక నేర్పుట మంచిది. వేయేల? బాలుర భావ్యభివృద్ధి కీసమయముననే బీజావాపము చేయుట యుత్తమపద్ధతి.

"నాతిసులభము నాతికఠినము కానిశక్కని వచనరచనము సేయబడినది.........నీతి, దేశాభిమానము, స్వార్థత్యాగము, భూతదయ, పరోపకారము, ప్రకృతిశాస్త్రజ్ఞానము, లోకానుభవము మొదలగు నుత్తమ గుణముల బోధించువిషయములే మిక్కిలి శ్రద్ధతో జేర్పబడినవి"—వివేకవాచకములు.

"ఈ తెనుగు వాచక పుస్తకములు బోధనపద్ధతుల ననుసరించి వ్రాయబడినవి. బాలురకు నూతనపదజాలము తెలుపుటకు, నిర్దుష్టమయిన శైలిని వ్రాయనేర్పు కలిగించుటకు, సత్తమసారస్వతముపై నభిరుచికల్గించుటకును......... లోకజ్ఞానము, దేశాభిమానము గల్గించుటకును స్వార్థత్యాగము, సజ్జనసేవ, ఆస్తిక బుద్ధి మొదలగునవి గల్గునట్లును, సర్వజన సమాదరణమును, మతసహనమును, ఉత్తమ శీలమును గల్గునట్లును నుద్దేశింపబడినవి."
—లాఙ్మన్సు తెనుగు వాచకపుస్తకములు.

పైనిజూపబడిన యభిప్రాయములతో రచింపబడిన వాచకములు నిక్కముగా నుత్తమములేయని తెలియగలము. ఆరీతిని కాక యితర విధముగ రచింపబడిన పుస్తకములయుద్దేశంబు లెట్లున్నవో పరికింపుడు.

"మారచనావిధాన మాఱవతరగతినుండి సంపూర్ణముగా మారినది. ఐదవతరగతివఱకు ప్రాథమిక విద్యాప్రపంచ మేమాదృష్టియందున్నది. కాని యీతరగతినుండి మాదృష్టిని ఉన్నత పాఠశాలావిద్యా ప్రపంచమునకు మఱల్చితిమి. ప్రాథమికవిద్యకంటె నున్నత పాఠశాలావిద్య కేవలము శబ్దమునుబట్టియే కాక విద్యాపరిమాణమును బట్టియు మిన్నయని చెప్పక తప్పదు. కావున దదీయానుగుణముగ మాశైలియు గొంతవఱకు సమాసశబ్దకాఠిన్యతను వహించినది. పాఠములను ముఖ్యవిషయ విపులీకరణముతో జోడింపబడినవి... కథలతోపాటు వ్యాసములును గల్పితకథలును, నాటకభాగములును జేర్చి...... భవిష్యద్రచనా పరిశ్రమమునకు బ్రథమసాధనము గాగలదని యేమాయాశయము" -ఆర్యవాచకములు.

పై నుద్ధృతములయి వాక్యముల వలన బాలుర విద్యాభ్యాస మెట్లుండవలయునో విశదపడుచున్నది. కాని యీ విషయమున గ్రంథకర్త లందఱును గ్రంథము లన్నియును గృతార్థత నందినట్లు తలంప వీలులేదు. పైని జేర్కొనబడిన వాచకములు మూడింటను మొదటి రెండును పూర్ణకృతార్థత నందినవి. మూడవది నిరర్థకతనందినది. ఆర్యవాచకముల యుద్దేశమే విపరీత మగుచున్నది. ఆఱవతరగతి పుస్తకము ౧౨౨ పుటలు, ఏడవతరగతి ౧౩౬ పుటలు. మొత్తము ౨౫౮ పుటలలో నొక్క పంక్తియందైనను బాలురకు లోకజ్ఞానము గలిగించువిషయ మించుకయు గానరాదు. వెఱ్ఱిమొఱ్ఱిసిద్ధాంతములు, తప్పులతడకచర్యలు, చెత్తాడు సమాసములు, వ్యర్థపద సంఘటనములు మొదలగు దుర్నిరీక్ష్యాకారముతో నున్న యీ వాచకములు బాలురకెంత యెట్లు ఉపకరించును? గ్రంథకర్తల పాండిత్య ప్రకర్షము నిరాఘాట రచనాపాటవము నిందు బ్రకటితమైనది.

సామాన్యముగా మూడవ ఫారమువఱకు బాలురకు నాతికఠినమగు భావములోనే లోక

జ్ఞానము గల్గించు విషయములబోధించుట ఉత్తమపద్ధతి. వారుచదువు వాచకములందేమి వారికిబోధించు వ్యాసవిషయములందేమి వన్యములు గ్రామ్యములగు జంతువులు, తరువులు గుల్మములు లతలు, కృషి పరిశ్రమలు, దేశీయోత్సవములు యానసాధనములు, తీర్థక్షేత్రములు, పోష్టు, టెలిగ్రాపులు, రక్షకభటులు, వార్తాపత్రికలు, దేశచరిత్రములు, మొదలగునవి ముఖ్యముగా బోధింపబడవలెను. మూడవ ఫారమువఱకును విద్య విషయ ప్రధానముగా నుండవలయుననే కాని భాషా ప్రాధాన్యమంతగా బనికిరాదు. విషయమున కంగముగా మాత్రమే చక్కని సులభశైలిని నిగ్గుష్టమగు భాషాజ్ఞానమును గలిగింపవలెను. ఈ విషయమున వావిళ్లవాచకములు, వివేకవాచకములు, లాక్ మన్సు వాచకములును జక్కని మార్గదర్శకములుగా నున్నవి. కాని యితరవాచకములు పెక్కులు విపరీతమార్గములంబట్టి మిక్కిలి యనర్థాపాదకములుగా నున్నవి మచ్చున కొకటి రెండు ఉదాహరణములు.

బాల కుశలవచరిత్ర : ఇది బాలకుల నుద్దేశించి వ్రాయబడినది. ఒకపాఠశాలలో నాల్గవ తరగతి కైచ్ఛి కపఠనీయముగా నిర్ణీతము. ఇందలి విషయము కుశలవులకథ.

భాష పాషాణపాకమున నున్నది. కొండవీటిచేంతాళ్ల సమాసములు, డొంకతిరుగుడు కల్పనములు, గచ్చకాయపాకములు నిండు తండోపతండములు. కథ మూడుపుటలది కల్పనావిశిష్టమై అఱువది నాల్గు పుటలు అచ్చులో నాక్రమించినది. కూడబలుకుకొని చదువుట చచ్చిచెడి చేయంగల విన్నపము లనుచున్నది బాలకులకు.

మచ్చు : "బాలుండయ్యును వీరాగ్రేసరుడై రౌహాధాగ్రగణ్యుల కభేద్యమగు పద్మవ్యూహము నొంటిరై యనాయాసముగ భేదించి యసమసమరక్రీడచే శాత్రవుల జిల్ల డిల్లపడజేసి."

"లక్ష్మణుడు క్రోధోద్రేక చిత్తుడై "రామచంద్రా ధర్మపదానువర్తివై బృందారకులు గూడ శ్లాఘింప, సర్వప్రజలను నాత్మసంజాతుల చందంబున సాకుదు సజ్జనరక్షణము దుష్టశిక్షణము గలిగి వసుంధరాపాలనం బొనర్చుచున్నని నీ్న్గతి బలికిన యాదురాత్ముని శిరము నాకరవాలమున కెరగా నిచ్చెదగాక."

"శత్రుఘ్నుడు దొలుత సందేహించుటకు బోరుసల్పెనుగాని లవునియస్త్ర సంధాన చాతుర్యము చూచి యద్భుతమందె."

"పావకజ్వాలల చందమున హృదయము దహించివేయుచున్న."

"మూడవకన్ను దెఱచి చేత త్రిశూలము దాల్చి మద్రుడు వచ్చినను సంగరంబున వెనుదీయక యద్వితీయ శౌర్యపరాక్రమము విరాజిల్ల."

ఇత్యాదులు దీనియం దపార పారావారములు. దీనికి తమ్ముడే బాలధ్రువ చరిత్రము. ఇందలి కొన్ని మచ్చులు:

"అరిషమూహమునకు భయంకర మొనవజేయు కార్ముకము సంధించి."

" యక్షు లింక నెట్టిమాయలు సలుపుటకు గదనభూమి విడచిరో యని సంశయించి ధ్రువుండు సారథింగాంచి సారథీ! దైత్యమాయలు బహువిధములుగ నుండును. వీరి కృత్యంబు లెఱుంగుట కెవ్వరును శక్తులు గారు. మనము వీరినగరంబు ప్రవేశింతమని."

"యక్షు లొనర్చిన మాయచేత ననేకాస్త్రములును మూత్రపురీషాదులును సర్పములును గుఱియదొడంగెను."

ఈపైని పేర్కొనబడిన రెండు గ్రంథరాజములు నెవ్వరిచేతను రచితములుగావు. ఇదివఱ కెవ్వరును గని విని యెఱుంగని క్రొత్తకీతి "అనామకితములు"

ఆర్యవాచకము—ఆఱవతరగతి:—

దీనియందు బాలుర పాఠ్యగ్రంథమున నుండవలసిన లక్షణములఛాయయే నొకింతయు లేదు. మొదటనే భీష్మస్తవము పద్యములు బాలురు నోటపట్టరానివి ఒక్కొక్క పాఠము పదేసిపుటలు దాటినవి. భాష బి. ఏ. లకు నేర్వదగినది. వారు బోధింప జేతకానిది.

"అమ్మహాస్త్ర ప్రభావంబునకోడి దశదిశా చక్రంబు వడంకెను. సాంద్రతమంబులు సర్వత్ర నిండుకొనెను. సకలలోక భూత వ్రాతంబులు మహాసంత్రాస సంక్షుభితములయ్యెను."

"వరమునబట్టి భరతవంశము చొచ్చి పాండుభూవరునకు గోడలనై భుజవీర్యసనాథులగు నాథులంబొంది నీతి విక్రమ ధీరులగు కుమారుల గాంచి యాతీరున దిక్కులేని దానవలె బరాభవంబున కోర్చి యుండవలసిన దేవాకి?"

"విదురసాత్యకి ప్రభృతులతో సభ కరుదెంచి ప్రత్యుత్థానాది కృత్యంబులు ముగిసిన వెనుక సభికు లందఱు విన."

"దారు దైత్యాంతకుని బొదువవలంచుట మహోపలంబు వసనంబున బంధింపంగడంగుటయే"

"పరిహాస వచోభాసురుం డయ్యును మితభాషి దారసుతాది సంసారుం డయ్యును నిత్యబ్రహ్మచారి."

ఆర్యవాచకము - ఏడవతరగతి : కృతికర్త పాండితీప్రకర్ష మెల్ల నిండగపడుచున్నది. పద్యభాగములు గజేంద్రునిమొఱ, దానపురందరుడు ధర్మజుని సంధిప్రయత్నము, రుక్మిణీసందేశము, మాల్యవంతునినీతిఅనునవి. గద్యభాగము గీతోపదేశము, జయదేవుడు, లక్ష్మణమూర్ఛ, బమ్మెరపోతరాజు; పద్మవ్యూహము, యుగంధరమంత్రిమిత్రలాభము, దేవాలయములు మాటకుమాట అనునవి. నాటకభాగము నామాక్షి. మొత్తము ౧౪ పాఠములు; ౧౩౬ పుటలు.

గీతోపదేశమున : "బాలకులారా! ఆనాటి మహాభారత సంగ్రామరంగము నొక్కమాఱు స్మృతికి దెచ్చుకొనుడు. వివిధ వర్ణశోభితంబులగు కేతనంబులమీది పసిడికింకిణులు మొఱయుచున్నవి. రథనేమిధ్వానము లెడతెగక వినబడుచున్నవి. కదనతురంగ హేషారవంబులు మిన్నులకు బ్రాకుచున్నవి. అవిగో యాదవసైన్యములు. అరుగో గాంధారులు. అరుగో మాత్స్యులు. అరుగో పాంచ్యులు అరుగో ఉత్తరకురుదేశీయులు. ఇరుగో ప్రాగ్జ్యోతిషపుర సైనికులు."

"జననస్థితిలయంబుల కీశ్వరుం డొక్కఁ డుండ కారణమని యెఱుంగుము. అవనిక పయి దోలుబొమ్మల నాడించునట్లు జగన్నాటకరంగమున సమస్తభూతములను బరమేశ్వరుఁడు దనయిచ్చవచ్చిన ట్లాడించుచున్నాఁడు."

ఈ మాటలు చదువుచున్నపుడు బాలకులు గోడమీఁది బీఁటలవలె నిశ్చలత్వమంది వెంటనే పాఠశాలామోక్షము నపేక్షించుట కభ్యంతర ముండునా?

యుగంధరమంత్రి: "విద్యానాథుని కృతిని బట్టి విచారించినచో నీతఁడు (యుగంధరుఁడు) కల్పిత వ్యక్తి కాఁడు, రాజ్యతంత్రజ్ఞుఁడై తన మేధాశక్తి సహాయమున సైనికసహాయము లేకుండ నంతటి ఢిల్లీచక్రవర్తిని సమూనిముగ జయించి ప్రతాపరుద్ర చక్రవర్తిని కారాగృహమునుండి తప్పించికొనివచ్చిన మహామాత్యుఁడు.

ఇప్పుడు మనకు ప్రమాణము మహాకవి రచించిన గ్రంథమా? సత్యదూరము గాని దేశచరిత్రమా? రెండును ప్రమాణములే. ఈ మహనీయుని చరిత్ర మెఱుంగదలచిన వారెల్లరు విద్యానాథవిరచితము ప్రతాపరుద్రీయ నాటకమునే ప్రబలాధారముగా గైకొనుచున్నారు. కావున ప్రస్తుతము మనకుఁగూడ నదియే శరణ్యము...

...విద్యానాథుని కృతికి సంబంధించిన తక్కుంగల కథయెల్లఁ జరిత్రకు సరిపోవుటయు నొక్క యుగంధరుని కథమాత్రము సరిపోకుండుటయు నెట్లో యూహింపనలవి గాకున్నది."

ఇవ్విమర్శన ముత్తమోత్తమము గానున్నది. విమర్శకుఁడు చూచిన విద్యానాథ విరచిత ప్రతాపరుద్రీయనాటక మేభాషలో ఏ లిపిలో ఏ ముద్రాలయమున ముద్రితమైనదో యెక్కడ లభించునో తెలిపిన నస్మదాది జిజ్ఞాసువుల కుపకారమగును. యుగంధర మంత్రియఁట! విద్యానాథుని ప్రతాపరుద్రీయ నాటకమఁట! అందు వర్ణితుఁడఁట! ఏమి విపరీతప్రవాతలు! తానేకథ వ్రాయదలఁచెనో దానికి సంబంధించిన, అచ్చుపడి సులభముగా

నుండిన గ్రంథములైన సరిగఁజూడక యే, గ్రంథ విషయమును గ్రంథకర్తలనైన సరిగఁ దెలిసికొనక యే అప్రమాణములగు నిట్టి యసత్యములను బాలురతలల రుద్దుట యెంతసాహసము! ఇట్టి సాహసములు విపరీతసిద్ధాంతములు 'తెలుగు కవులు' అను పుస్తకమున అసంఖ్యాకములుగా నున్నవి. ఇంకను గొన్ని పుస్తకములను పరిశీలింతము. విద్యార్ణవ బిరుదాంచితులు సాహిత్య సరస్వతులు నను యన్. పేరరాజు గారు స్కూలుఫైనలు ఏగ్రూపు తెలుగు పుస్తకమునకు నోట్సు వ్రాసిరి. దానిలో కొన్ని:—

ప్రేముసజ్జ (ప్రేము + సజ్జ). సూ. "ఆమ్రాది కమమ్వాదులకు సజ్ వర్ణక మాదేశమగును." ఈ లక్షణము, లక్ష్యసమన్వయము, ఉదాహరణములవలన బాలురకు ఎంతటి జ్ఞానము కలుగునో!

"ఈతఁడు (పోతన) రచించిన గ్రంథాంతరములు భోగినీదండకము, వీరభద్రవిజయము, నారాయణశతకము. (ఈతఁడు) నైజామురాజ్యమందలి ఓరుగల్లుపురవాస్తవ్యుఁడుకాని కడపమండలములోని ఒంటిమెట్టవాఁడుకాఁడు".

ఈసిద్ధాంతఫక్కి కేవలము అసాధారణమయినది. వాదోపవాదము లింకను ముగియలేదు. రెండుపక్షములకును ప్రబలప్రమాణములే యున్నవి. అట్టియెడ తాము నమ్మిన సిద్ధాంతమే యందఱు నమ్మవలెననుట యేటిమాట!

"ప్రశ్న:—రుద్రుఁడు భీష్మునకు ప్రసాదించినవర మేది? ఉత్తరము (ప్ర. 75) మొదటగూకురై పుట్టి పిమ్మట బురుషత్వమంది. యుద్ధరంగమున భీష్ముని జంపజాలు బిడ్డ నీకుఁ బుట్టును."

"నీటిరాశితో విహరించునట్టి నీళ్లతోడను, "క్రియ్యాట:—(క్రింద + ఊట) క్రొత్త శబ్దమున కాద్యక్షరశేషంబునకుం గొన్ని యెడల మగాగమంబును గొన్నియెడల మీఁదిహల్లునకు ద్విత్వంబు నగు; పరుషేతరంబులు పరంబులగునపుడు మగాగమప్రాప్తి లేమింజేసి వానికి ద్విత్వంబగు.

చూచితిరా: సూత్రంబునకు నుదాహరణమునకును గలసంబంధమును, సమన్వయచాతురియును. ఇట్టి విశేషంబు లీగ్రంథరాజమున ననంతములు.

ప్రశ్నోత్తరవ్యాకరణము: ఈపుస్తక మన్నివిధముల నెన్నదగినది. గ్రంథకర్తలు విద్వాన్ ఓలేటి సీతారామశాస్త్రి శిరోమణిగారు. పరిష్కర్తలు ఓలేటి వెంకటరామశాస్త్రిగారు-శతావధానులు. ఆస్థానవిద్వత్కవులు. గ్రంథము బాలురమన స్తత్వమున కనుకూలముగ...... యావద్వ్యాకరణమునకును బీజప్రాయమై..... చిన్నతరగతి బాలబాలికలకు బఠనీయముగా నొప్పుడును.

ఇందలి దొక్కటి:

షష్ఠీనిర్ధక్తి:—లోన్—గదిలోన్
లోపలన్—వనములోపలన్.

అని యుదాహరింపబడినది. "నిర్ధారణ షష్ఠికి లోపలవర్ణకం బగు" అని సూత్రించి బాలవ్యాకరణకర్త".....సముదాయమునుండి యేకదేశంబునకు పృథక్కరణంబు నిర్ధారణమనంబడును" అని వివరించి "గోవులలోపలఁగపిలబహుక్షీర; అశ్వసులలోపలఁ బౌఱువాఁడు శీఘ్రగామి ఇత్యాదు లుదాహరణములు చూపినాఁడు. బాలవ్యాకరణ కర్తపొరబడెనని యింతవఱ కెవ్వరు"ననలేదు. సంస్కృత వ్యాకరణమర్యాదనే యాతఁడు అనుసరించెను. ఈవిద్వచ్ఛిరోమణులు మాత్రము అవాలోచితముగ నెందఱోపాడినపాటలే గ్రహించుట శోచనీయము.

ఎట్లయిననేమి? బాలురకు సంబంధించిన పాఠ్యగ్రంథము లనేకములం దిట్టివిపరీతములు వేనవేలుగలవు. ఈగ్రంథములవలన ఎట్టిలాభము కలుగును? బాలురహృదయములు శిరీషకుసుమపేశలములు. ప్రణితోపస్థానీయముగా వానినుపచరించి యభివృద్ధినొందింపవలయును గాని కర్కశతర్కవాగ్వ్రజాఘాతములచే చదుపరాదు. మృదులమగు భాషతో నాతికఠినములగు వివిధవిషయములను బోధింపవలయును. అప్పుడు బాలురకు విజ్ఞానమును భాషాపరిచయమును గూడ కలుగును. సోపానక్రమమున విశేషముల బోధించినచో వారు విజ్ఞానధనులుఁ, భాషాకోవిదులు గూడ నగుదురు. అపుడె మనభాష సర్వతోముఖముగ సంపూర్ణాభివృద్ధి నందును. దేశముగూడ నర్హమైన యున్నతి నొంది వెలయును.

# 'లి'గాడు

కవికొండల వెంకటరావు

సర్వ సామాన్యంగా తెనుగు వారిచే నుపయోగింప బడుతూన్న "లిగాడు" శబ్దాన్నే విఱిచి "లి"గాడుగా మార్చి దానిని సార్థకంగావించే విధంగా ఈకథలో వాడుతూ వున్నాను. పాఠకులు పరామర్శింతురుగాక! లేరు మఱీ "వన్నెకాడు" "అందగాడు" "ఆటకాడు" "పాటగాడు" అని. అట్టివాడే "లి"గాడున్నా

"లి"గాడు అనగా—కొడవలి, గొడ్డలి, గుద్దలి, రోకలి, నాగలి, వీనిని పనిముట్లుగా గైకొని శ్రమపడే మగవ్యక్తి. ఎంత శ్రమపడ్డా వాడు సంపాదించే సంపాదన, కలి, అంబలి, ఈ రెండింటినీ మించిన ఆహారాన్ని సంబాళించుకోవడానికి చాలదు. వాడనేమాటల్లో "దాపలి" "వలపలి" అని వినబడేనిగాని ఆపదాలు "గిలక" పరంగా కాకుండా "గిత్త" పరంగా వాడేవి అని తెలుసుకోండి. అంతకంటె ఎక్కుడువిద్య వానికడ ఉండడాని కవకాశమేలేదు. వానికున్న కష్టాలన్నీ విభజిస్తే రెండింటి కిందకు వస్తాయి. ఒకటి ఆకలి. రెండోది చలి. సంఘంలో వానిఅవధి ఎల్లాగు వుంటుందంటే సంపెటపెట్టు తినే దాంగలియొక్క అవధిలాగుంటుంది, విన్నారా?

ఇటువంటి "లి"గాండ్రు వాళ్ల భార్యలు "లి"కత్తెలు ఒకకొందఱు కలిసి వున్నట్టాయినా వాళ్లందర్నీ మూకుమ్మడిగా మనం "లిగాడుప్రజ" అని అనవచ్చును.

అనవచ్చును ఏమిటి? వాళ్ల మొహాల్లోని దిగాలే చెబుతుంది చూడ్డంతోనే "పీళ్లు "లిగాడుప్రజ" అని. ఆనందం అనేది వాళ్లకళ్లల్లో మృగ్యం. ఎలావుంటుంది? వాళ్ల బ్రతుకూ, పట్నవాసపు రోడ్డుపక్కను నాటబడ్డ చెట్టుయొక్క బతుకూ వొక్కటాకీగా ఉన్నప్పుడు? ఆచెట్టు కిందే వాళ్ల విడిది అయినప్పుడు? ఆచెట్టుతప్పితే మఱిఆస్కారం ప్రపంచంలో - ఈ ప్రపంచంలో ఎక్కడా వాళ్లకు కానరానప్పుడు?


ఓసాయంత్రం అటువంటి జనసమూహం తాలూకు ఓ కుటుంబాన్ని చూచి వితర్కించడం నాలో జరిగింది కాబట్టె ఇంత బలవత్తర సాక్షిగా వాళ్లనుగురించి నొక్కివక్కాణింపగల్గుతున్నాను. నమ్మండి నామాట పాఠకులు!

ఆ కుటుంబానికి సంసారమన్నా వొక్కటే సన్యాసంఅన్నా వొక్కటే, ఆస్తినిగురించి జాబితా వ్రాయడం అంటూవస్తే — తవ్వేమట్టి నెత్తికెత్తుకునే రెండుతట్టలు, వట్టివి కావట్లో ఇటూ అటూ పన్నుకుని, ఆతట్టల్లో పెద్దకుండలు రెండూ, కూంతకూంత గంజి వద్దవున్న ముంతలు రెండూ, వుంచుకుని, బుజాన్ని గునపం గునపానికి పార తగుల్చుకొని మొగాడు ముందు వస్తూవుంటే, ఆవెనకనే ఆడది వోచంకను కుఱ్ఱాణ్ణి సముదాయించుకుంటూ, రెండోచేత మూఱు వొళ్లైతోల్లికా, పుచ్చుకు మగాణ్ణి అనుగమిస్తూ "ఈచెట్టుకింద దిగుదాంరా!" అనిపట్నంలో గోదావరి గట్టుప్రక్కను వోచెట్టుమొదట దిగారు, నడచినడచి ఎక్కణ్ణించో వచ్చినట్టు కనబడే దుమ్ముకాళ్లతో చెమ్మటతలకట్లతో—


సన్యాసి వస్తే ఎదురువెళ్లి పట్నంలోని గృహస్థులు అనేకమంది తమయిళ్లకూ తమయిళ్లకూ పిల్చి భిక్షలు పెడతారేగాని యిలాంటివాళ్లను ఎవరున్నూ ఆహ్వానించరు. వారి కెవరున్నూ ఆతిథ్యమివ్వరు. ఉతకాచిరతాలేని ఊరచెట్లు కాబట్టి అవి నిర్మొహమాటంగా వాళ్ళను తమ కిందకు రానిచ్చాయి. రానిచ్చాయి అన్నమాటేగాని కొంతసేపటివఱకూ వాళ్ళను ఆచెట్లున్నూ పలకరించలేదు. గాలికూనలు బయలుదేరి చెట్లచెవుల్లో వీళ్లునావాళ్లు సుమండీ అని ప్రేరేపించేదాకా లాతిగానే పూరుకున్నాయి.

నాడు గాలికి చెట్లుచలించడంలో వొక అపురూపమైన చలవ—ఆపని వాళ్ళమూలంగానో ప్రకృతిమూలంగానో ప్రపంచాని కంతకూ సోకింది. ఆకాశం చూసేసరికి వో అనుకోని మబ్బుతునక బంగారం వర్షించినట్టు సాయంకాలం నీరెండకాంతిలో వర్షిస్తూ, చేరికబడ్డదై, చెట్లనూ, చెట్లకింద దిగినవాళ్ళనేకాకుండా అపరి సరప్రాంతాన్నిఅంతనూ అతివినోదవంతంగా మార్చివేసింది. పెద్దవాన గాపడలేదు. గోరుసీళ్లు చల్లినట్టుగా పడింది. అంతేశాన. వెంటనే కష్టజీవులయొక్క కనురెప్పలమీది దుమ్ము, చెట్ల ఆకులయొక్క ధూళీ కూడా కడిగివేయబడి నట్టయింది. కమ్మనిశ్వాస భూదేవిదా, భూదేవి మీది ప్రాణికోటిదా అన్నట్టు వ్యాప్తమైంది. అంతేకాకుండా "అదివఱకెక్కడున్నవో యీపక్షులు" అని అనిపించేలాగు ఆకుపచ్చని చిలకలు, తెల్లని కొంగలు, నల్లని కాకులు, గోధుంవన్నె గోరింకలు, కొన్ని ఎగు

ఎలిఫేంటా గుహలలో



బ్రహ్మాండమైన త్రిమూర్తి విగ్రహశిల్పము



నటరాజశివుని విగ్రహము

రుతూ, కొన్ని నిశ్చింతగా కూర్చుని, కొన్ని అనుస్తూ, కొన్ని కులుకుతూ సందడించేశాయి.

దాంతో పట్నంలోనూ ప్రకృతి శోభకు తావు వుంది అని తట్టింది. మఱిన్నీ ప్రకృతితోపాటు పామర జనానికిన్నీ ఆశ్రయం వుంది అని తోచింది.

“లి”గాని అంగన తన అనుగు బిడ్డణ్ణి వెంటనే చెట్టుకు తన విడి పుట్టంతో వొక వుయ్యాలా వేసి ఆ వూయాల్లో పండబెట్టి—

“తొలుత బ్రహ్మాండంబు తొట్టి గావించీ, నాలుగు వేదాల గొలుసుల మరించీ” అని వ్రాచినట్టుగా అంతరాళమం దొక్కసారి వ్రాచి మగని కోసంగాను చూచింది.

మగ డక్కడ లేడు. “ఆరి వీడి జిమ్మడ! ఇంకా ఈ కొత్తవూళ్లో అడుగెట్టామో లేదో వీడి కళ్ళడే ఏ వొంక దానోసనకొట్టిందిరా బాబా! ఆకల్లోసన! ఆకల్లు పాకోసన! ఏతట్టుకు సచ్చాడని నెమకేదాన? ఆడు మళ్లీ తన తాగుబోతువాలకంతో యీపెద్ద మహానగరంలో దారీతెన్ను నాఅంకకు కనుక్కోగలడా! దేవుడా!” అని దీనంగా దిక్కులు చూచింది. చూచిచూచి నిరాశా భావోద్దీప్తమైంది. ఆభావంనుంచి తీవ్రమైన క్రోధభావం లోనికి మాఱింది. “వీడు! వీడు! మొగుడనుకోనా మొద్దులను కోనా? బువ్వ బూరికింద, గంజి పాయసంకింద గడుస్తూవున్న యీబతుకుని లాయిరు బందులుపెట్టేవాడు వీడా తాళిగట్టినోడు? రానియ్యి! రాడూ? నిసిరేత్రికైనారాడూ? వచ్చాడా వాణ్ణి అంతదూరంలో ఆచెట్టుకు రెక్కలు విరిచికట్టి చింతబరికెలతో బుద్ధిసెప్పి గడ్డెడతా!” అని నిశ్చయించుకుంది. నిశ్చయించుకుని బిడ్డడంతలోయేడిస్తే వాణ్ణి యుయ్యేలలోనుంచితీసి, నేలనే కూర్చుండబెట్టి, యుయ్యెలచీరవిప్పి, అదో తలగడాగా చేసుకు, దానిమీద తనకట్టుకొంగు పఱచుకొని, పక్కలో బిడ్డణ్ణిపరుండబెట్టుకు పట్టేపట్టనికునుకు వానితోపాటు పోతూవుంది.— మినుకుమినుకుమనే చుక్కల్లే, దీపం లేక, చీకటిలోనే కాలంవెళ్లబుచ్చుతూంది. విశ్వేతరమంతా అంధకార బంధురంగా వుంది.

రేత్రి పదకొండుఘంట లయింది. బిడ్డడు మంచి నిదరలో ఉన్నాడు. మగని అజా పజా ఏమీ కనిపించడం లేదు. ఏం చేస్తుంది ఆ ఇల్లాలు? “ఎక్కడికి పోయినాడో యీ దిక్కుమాలినపక్కణంలో” అని వెక్కువెక్కున యేడ్వసాగింది.

ఆలాఏడుస్తూండగానే ఆమెవీనులకు “బ్లైడీహుం” అని వొకశబ్దం వినిపించింది. అది మనిషిగొంతుక, మగవానిగొంతుకలాగు తోచింది. కళ్ళనీళ్లు తుడిచివేసికొని ఆమె “వస్తున్నాడు. వెఱ్ఱొలికించుకుంటూ వీడికీ రోజుతో బుద్ధి రావాలి” అని తన తాత్కాలికపు తలగడాచీర తీసి పొడుగ్గా విప్పింది. తిరిగి ఆవల వ్యక్తి “మేరీ! డార్లింగు! హాల్లో! బ్లైడీ! టారీ! లిలీ! బులీ! జోలీ!” అన్నాడు. —“నన్ను ఒంటిదాన్ని చేసి యింకా ఏడిపించాలని అనుకొంటూవున్నావురా. నేను జడిపిస్తే జడిసేదాన్ని కాదు. ఏడిపిస్తే ఏడ్చేదాన్ని కాదు” అని అమె ఏం చేసిందీ అంటే — ఆవలవ్యక్తి అంత దూరాన్ని వుండగానే తన తలగడ చీర వుచ్చుపోసి విసరినట్టు విసరి చెట్టుచెంత కమాంతంగా ఏనుగు నీడ్చినట్టు ఈడ్చి రెక్కలు విఱిచికట్టి “ఈరేత్రి తెల్లవార్లూ అలా మిడకవలసిందే నీవు” అంది. ఆవలివ్యక్తి ఎంచేతో కోరలుతీసిన పాములా కొంతసేపు నీరసస్థాయిలో పడ్డాడు. దీపం పెట్టి చూడ్డానికి స్త్రీ దగ్గఱా దీపంలేదు. వచ్చిన పురుష వ్యక్తి దగ్గఱా లేదు. కాని ఆ వచ్చిన వ్యక్తి శరీరచ్ఛాయ శరీరాచ్ఛాదనచ్ఛాయ సమస్తం నలుపురంగే. దాని మగని రంగూ దాని మగని గుడ్డలరంగూ అట్టిదే. పోనీ కళ్లు తెలుపేమో అని గుర్తించడానికి ఎఱ్ఱనికళ్లు తాగినప్పటి కళ్లు, ఎట్టివారి కళ్లైనా చీకట్లో నల్లగానే కనిపిస్తవి.

ఇంతకూ ఎవఱ్రా ఆ కొత్త వ్యక్తి అని మనకు జిజ్ఞాసగాని ఆమెకు లేనేలేదు ఆసమయాన్ని. ఆమెకు ఆ వచ్చినమనిషి, బాగా తాగి కైపెక్కివున్న తన మగడనే-నిస్సందేహంగా తన మగడనే-ఘట్టినమ్మకం.

దూరంగా ఠంగుఠంగుమని పండ్రెండుకొట్టారు తాలూకాలో. ఈ పామరాంగనకు దాని పరకాయింపే లేదు. ఆమెకు సూర్యచంద్రు లున్నప్పటికాలం తెలిసికొనే పాళపు విజ్ఞానమే కలదు గాని మఱిలేదు. చుక్కల్నిబట్టి సుంతా తెలీదు. ఆచెట్లకింద నుంచి చుక్కల్ని చూడ్డం అనేది కూడా దుస్సహము. చూడలేదో బ్రతికిపోయింది. చూచివున్నట్లాయినా బ్రహ్మరక్షస్సో, పిశాచమో ప్రాణం అడలించియుండేది.— “బ్లైడీహుం!” “బ్లైడీహుం”!—

ఈ "బ్లైడీహుం" అనే వాణ్ణిగురించి మనం రైట్‌రాయల్‌గా ఎరిగి వుండాలీ అంటే తఱుచు మెయిలు బండీ ఎక్కుతూవుండాలి. ఊరకే ఎక్కడమేకాకుండా మెయిలు బాగా పదినిమిషాలు పదేను నిమిషాలు ఆగుతూవుండే ప్రతీ స్టేషనలోనూదిగి ఇంజెన్‌దగ్గరకు వెళ్లి అతివిచిత్రంగా గమనిస్తూ రావాలి. అప్పుడు ఆ ఇంజెన్‌యొక్క జఠరాగ్నికి నిరంతరం రాక్షసిబొగ్గు సమకూర్చే తెల్లదొర వొకడు కాపిస్తాడు. అసలు తెల్లని చాయవాడైనా చేసేపనినిబట్టి నీగ్రోలా నల్లనివన్నె ప్రకటిస్తాడు. ఈ "బ్లైడీహుం!" అన్నది ఆదొర.— ఆదొర నామధేయం మిస్టర్ ఎలూఫ్. ఆయనకు వొకభార్యా వుంది. ఆవిడ పేరు మిసెస్సు ఎలూఫ్.

మిసెస్సుఎలూఫ్ మాంచి ఫాషనబుల్ లేడీ. క్లబ్బులో డ్యాన్సింగుకు ఎన్నికగన్న అమ్మలమిన్న. డ్రెస్సు వేసింది అంటే ఆమెడ్రెస్సు ఇతర లేడీస్‌కు అందఱికీ వరవడి. ఒకరవ్వ వుంగరం వేలికి, ఒకబంగరు గొలుసు మెళ్లో అంతే ఆమె పెట్టుకునే ఆభరణాలు. అవితేమాత్రం! మెడ తిప్పకోకుండా వున్నా గొలుసు అల్లాడ్డం వొసొగసు, మెడ తిప్పకొంటూవున్న గొలుసు అల్లాడకపోవడం వొసొగసు. ఇలాగ్గా వొకవస్తువును పుచ్చుకునే రెండువిధాల సొగసులు ఆమెచూపిస్తూవుంటే ఎవరైనా ఆమెను వింతవింతగా చూడవలసిందే. మడి వేలివుంగరం! అస్తమానం ఎవరినో వొకర్ని పిలుస్తూవున్నట్టే, ఎవరినో వొకర్ని తలుస్తూవున్నట్టే! ఏమూ అంటే అందఱూమాటాడుతూ, మాట కనుగుణ్యంగా అభినయిస్తే ఆమెఊహిస్తూ ఊహకేలనుగుణ్యంగా అభినయిస్తుంది. చూస్తే ఆమె వ్యూహిస్తూవుండని ఘటికే లేదు. కనుక ఆమెయొక్క తదంగుళీయకం నిరంతరాభినయంతో కూడుకున్నదై విశ్వమోహనంగా అగపించింది.

ఇటువంటిసరళ మిస్టర్ ఎలూఫ్‌ను వలచి పెళ్లాడిందీఅంటే అది సాంఘిక సమస్యల్లో మెట్టుసమస్యయే యగుగాక, మన కిచ్చట అప్రస్తుతం. అది కదపరాని సత్యము.

రోజూ మిస్టర్ ఎలూఫ్ రేత్రి పూట తప్పతాగి, ఒక్కొక్కప్పుడు రోడ్డునడాన్న, ఒక్కొక్కప్పుడు డస్టుబిన్నులకాడ, ఒక్కొక్కప్పుడు గట్టుకీవక్క, ఒక్కొక్కప్పుడో గట్టు కావక్క, ఒక్కొక్కప్పుడు గట్టుమీాద, ఎక్కడపడితే అక్కడే వొళ్లు తెలియక పడిపోవడం రివాజు. మిసెస్ ఎలూఫ్ డ్యాన్సుగీన్సు అయిపోయిన తరువాతను ఒకబాటరీలైటుచ్చుకు రోడ్లంటా రోడ్ల సైడ్లంటా వెతికి తన మగణ్ణి కనుక్కొని ఏకూలివాడి సాయాన్నో తనయింటికి జేరేసుకుంటూ ఉండడం రివాజు.

"లి"గాడు తన భార్యను విడిచిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయిన రేత్రి కూడా పై దంపతులకు తమతమ రివాజులు యథాప్రకారం జరిగినయి. మిస్టర్ ఎలూఫ్ తాగి మైమఱచి "బ్లైడీహుం" అని అరచుకుంటూ వచ్చివచ్చి చెట్టుకింద పూర్వోక్తప్రకారం బందీ అయినాడు. కాని అతగాడు "మిస్టర్ ఎలూఫ్" అని "లి" కత్తె కేం తెలుసును. ఆ తాగి తూలుతూ వచ్చిన మానవుడు తన మగడే అనుకొంది. అనుకొని చేయదలచుకొన్నంత పనీ చేసింది- చింతబరికతో బాజా వాయించడం ఒక్కటి మినహాగా!

ఇక అక్కడ "లి" గాడు.— వా డెక్కడికి పోతాడు? అసలు గట్టె వచ్చేటప్పుడే పసిపట్టి వుంటాడు దిశ. పసిపట్టి అనుకొని వుంటాడు. "ఒకగ్లాసుడు ఇద్ద తీర్కామందు" అని అనిపించే యీాకల్లు తాగకతప్పదని. తిన్నగా కల్లు అంగడి వున్న రోడ్డుచ్చుకు అంగడికేసి నడచేడు.

రోడ్డుమీాద విద్యుద్దీపాలు వెలిగిపోతున్నాయి. ఎడాపెడా, దుప్పదుప్ప చూచే కుక్కల్లే, కొట్టుకొట్టూ తొంగిచూచీవాడు. పట్నవాసాల్లో కల్లంగళ్లు ఊరిచివరకాక ఊరి మధ్యనే వుంటవికూడాను. దానివాసన రంయిని కొట్టింది వొచాయను. లోపల జనసంతులంయొక్క ధ్వని మిక్కుటంగా యివలకు వినబడుతూ వుంది. కాని జనం కనిపించడంలేదు. గుమ్మం వద్ద మాత్రం "దయ చెయ్యండి" అని ఆహ్వానం బోర్డు వ్రాసివుంది. "లి"గాడు ఈ జన్మలో చదువురానివాడైనా పూర్వజన్మసంస్కారం కలవాడేమో—ఆ అక్షరాలబోర్డు వాణ్ణి ఆహ్వానించినట్టయింది. తొంగిచూచేడు. "ఏం తొంగి చూస్తున్నావు? వస్తేరా! లోపలికి! లేకుంటే నీదారిని ఫో! అంతేగాని తొంగిచూడరాదు" అన్నాడు లోపలనున్న వొకవ్యక్తి. మరోవ్యక్తి "వె!వె! వెధవని లోనికి లాగిప—" అని వెనక్కి తానే పడిపోయినాడు. మూడోవ్యక్తి "డబ్బుల్లేని ముఖంలాగుంది నీది. నడువు. ఇక్కడ అరువుగిరువు జాంతానై" అన్నాడు.

ఈ కడమాటతో "లి"గాడు కొంచెం వెనక్కుతగ్గాడు. వాడిదగ్గఱ డబ్బేదీ? నాడసలేమున్న. రోజంతా ప్రయాణంతోనే చెల్లు. కొత్తవూరు పనికోసం రావడంలో.

అయితే డబ్బూగిబ్బూ లేకుండా తాగుడుకు బయలుదేరడంలో అర్థమేమి టంటారేమో. అర్థమేమీ లేదు. ఏమారి పరుగులెత్తడంతప్ప. ఓపర్యాయం అపొద్దు కల్లుపాక చుట్టూ తిరిగి దానోసనకు రంజిల్లడమే లోపలికుట్ర.

అయినా ఆశ పోలేదు. అకొట్టు కాకపోతే మఱోకొట్టుండదూ? మఱోకాడ! అని యింకా బాగా ముందుకు సాగాడు. రేత్రి ౧౦, ౧౧ అయింది. తిండితినలేదేమో ఆపొద్దు రోడ్డుపక్కన ఈతట్టు, దారిమఱచి చతికిలబడ్డాడు. రోడ్డు కాపక్కన ఆతట్టుఓమహాహర్మ్యం వాడిముందు కళ్లక్కట్టినట్టు రెండు అంతరువుల్లి కనిపిస్తూవుంది!

హర్మ్యంయొక్కదిగుభాగం వొక పెద్దహాలు,పైభాగంపదహారుగదులు. ప్రతిగదిలోను నిలువుటద్దాలు, చెల్వ సోఫాలు, చల్వరాళ్లు, హాల్వాతీపి మంచాలు, కల్వపూ మెత్తనిపరుపులు వున్నయి. అన్నిగదుల్లోను లైట్లు. లైట్లుకుషేడ్లు. ఆరిపేయబడేవి కొన్ని వెలిగించబడేవికొన్ని యిల్లా గావుంటూవున్నాయి.

"లి"గానిదృష్టి పైగదులమీదికి పోనేలేదు. అసలువానిదృష్టి ఆదిలోనేకిందిహాల్లో ఆగిపోయింది. అదే వాడికి పరమానందదాయకంగా వుండింది. రోడ్డుపక్కను చతికిలబడ్డ వాడల్లా "గుళ్లోగోవిందరాజుల విగ్రహం శయనించినట్టు ఓచేతిమీద తలానుకు ఆహాల్ను సూటిగా చూస్తూవున్నాడు.

హాల్లోనలభైజతలు, ఆడమగ జతలు, తెల్లనిశరీరాలవాళ్లు,మిలమిల ప్రకాశిస్తూ జిలజిలపాకేరోమాంచంతో నాట్యమాడుతూవున్నారు. కిటికీలన్నీ తెరవబడివున్నాయి. లైట్లన్నీ వెలిగించబడివున్నాయి. బ్యాండు వాయించబడుతూవుంది. ఆర్గన్ మోతబంయిమంటూవుంది. షేంపేన్ బాటిల్సు, కార్కులు వైపుపడేధార చాలక, అధోభాగాన్ని కొట్టబడ్డవై గ్లాసులోకివొంచబడుతూవున్నాయి.

"లి"గాడికి పైదృశ్యమేమిన్నీ అర్థంకాలేదు, ఒక్కవాళ్లు గ్లాసు పుచ్చుకుతాగేటప్పటిచేష్టతక్క. ఆ లోపల వాళ్ళలా ఎవరైనా గ్లాసెత్తి తాగుతూంటే తానుకూడా రోడ్డు పక్కని చీకట్లో నోరుతెరచీవాడు. పాపం! అలా ఎన్నిసార్లని తెరవ గలడు? ఎంతకాలం తెఱచి వుంచుకోగలడు. క్రమంగా ఆవలింతల్లోకి దిగి తనకు తెలియకుండానే నిదరోయాడు.

హాల్లో గడియారం రాత్రి ఒంటిగంట కొట్టింది. అంతా నిశ్శబ్దమంతంగా మారిపోయింది. దీపా లారిపేశారు హాల్లో. పైగదుల్లో అక్కడక్కడ కొందఱు స్త్రీలు కొందఱు పురుషులు దిగబడ్డ అవికూడా చీకటి కోణాలే. హాల్లోనివారు చాలామంది హర్మ్యం వెలువడి ఆలా ఈలా తమ తమ లోగిళ్ళకు వెళ్లిపోయినారు. అందరూ అనక చాలామంది ఎందుకు అనడం వచ్చిందీ అంటే ఒకామె తన యింటికేసి కాక "లి"గాడు పరుండియున్న రోడ్డుమీదకు వచ్చి యిటూ అటూ చూచి రోడ్డుసైడ్లే "లి"గాడు వున్నదెసకు వాణ్ణి చూడకుండా అడ్డంగా నడుస్తూవుంది.

నడుస్తూ ఆమె ఏమి చేసింది? తన పాదంతో తనకు తెలియకుండా "లి"గాణ్ణి తన్నింది. "లి" గాడు "చచ్చాను" అని కెవ్వున అరిచాడు. ఆమె తనచేతిలో తయారుగా వున్న బాటరీలైటు వేసింది. "హు ఆర్ యు బ్లడీ" అంది. "లి"గాడు మాట్లాడలే. ఆమె మఱిరవంత కీచుగా "కోన్ హై?" అంది. "మాలోణ్ణి కాదు తల్లీ" అన్నాడు. "లి" గాడు. "మాలోడీని కావు? కూలోడివా?" అంది. "ఊఁ" అన్నాడు. "స్టాండ్ అప్" అని జబ్బట్టుకు లేవదీసింది వాణ్ణి. "లి" గాడు తానా పూట తిండి తినలేదన్నట్టు కడుపు తప్పటగా చూపిస్తూ వంగివంగి సలాము పెట్టాడు. ఆమె "షరవా నై, ఈ రొట్టె తిను. ఈ నీళ్లు తాగు." అని ఫ్లాస్కులోను చేతిబుట్టలోను ఉన్నవాటి నిచ్చింది.

"లి"గాడు ఆరొట్టెగబగబ తిని గడ గడ ఆనీళ్లుతాగాడు. "నన్నుఫాలో" అని చేసంజ్ఞ చేసింది. "లి"గాడు ఆమెవెనుకనే బంటు అయి నడుస్తున్నాడు. ఆమె ముందు బారి తీస్తూ వుంది. నడుమనడుమ సైడ్లురోడ్లకు, సందుగొందుల్లోకి బ్యాటరీలైటు వేస్తూవుంది.

"నీవు తాగుతావా?" అంది ఊరికేనే "లి"గాణ్ణి పలకరిస్తూ ఆస్త్రీ వ్యక్తి ఒకచోట ఆనడకలో. "నేను తాగనమ్మా!" అని అప్రయత్నంగా బొంకేశాడు "లి"గాడు. ఆమె "నా

భర్త తాగుతాడు. ఈరోడ్డుపక్కనో ఆగట్టుకిందో పడిపోతూ వుంటాడు. కనిపెట్టిచూడు. నిప్పూవును" అంది. అంటూ బ్యాటరీలైటు ఆర్పివేసింది. ఆకాశంకేసి చూసింది. "ఓస్టార్సు! ఓక్లౌడ్సు!" అని కళ్లమ్మట నీళ్లెట్టుకుంది.

దూరాన్నే "బ్లెడీహుం! హం గర్" అని వినిపించింది. "అక్కడ నాపెనిమిటి వున్నాడురా! త్వరగా రా!" అని తాడిచెట్టు ప్రమాణానికి ఎగసే తన బ్యాటరీలైటు కాంతిని నేలబారుగా ఆమాట వినిపించిన దిక్కుకు వేసికుంటూ నడవసాగింది. వెళ్లినకొద్దీ చూపులో మనిషి, మనిషిలో తనమగనిపోలిక కనిపించింది. "ఓ మై గాడ్! అతడే నాడియర్ ఎలూఫ్" అని వేగంగా డాసి ఆచెట్టుకు నిర్బంధితుడైయున్న వానికట్టు విప్పింది. బ్యాటరీలైటు ముఖం మీదికి వేసి చూసింది. తనముఖం నికి చూపింది. వారిద్దరూ ఎలూఫ్ దంపతులు!

"ఈలా నిన్ను ఎవరు అవమానించినారు?" అనిఅడిగింది మిసెస్సు ఎలూఫ్—"నేను నామొగుణ్ణి! పోయే నాపేరతా!" అంది "లి"కత్తెసగం సగంలేస్తూ పక్కలో పండుకొన్న బిడ్డణ్ణి వో త్తిగించుకుంటూ.—మిసెస్సుఎలూఫ్ "నీమొగుడెవరు?" అని బ్యాటరీలైటు "లి"కత్తెముఖమ్మీదికి వేసింది. "అది నాపెళ్లాం" అన్నాడు "లి"గాడు. "ఆబిడ్డడు?" అంది మిసెస్సు ఎలూఫ్. "మాపిల్లడేనమ్మ!" అంది "లి"గాని అంగన.

"నీభర్త తాగడు మిక్కిలి మంచివాడు." అంది మిసెస్ఎలూఫ్. "ఏంరా? తాగుడికి కాదంట్రా పోయిందీపొద్దునివు?" అంది "లి"కత్తె. "లి"గాడు, "కమ్మనిరొట్టెట్టారే అమ్మగారు. కల్లులొట్ట యికనెల్లే!" అన్నాడు. మిస్టర్ ఎలూఫ్ తెలివిని బడ్డాడేమో ఊరికేనిగ్గుపోతున్నాడు. మిసెస్ఎలూఫ్ "లి"గానితో "కూలీ! నామగనిని నాతోకూడా ఇంటికి జాగర్తగా తీసికొస్తివా నీకోరూపాయఇస్తాను" అంది. "అక్కర్లేదమ్మా కుసంతగంజితాగితే దొరగారికి నడకబ్బుద్ది." అంటూ "లి"కత్తె తన మగనికోసమని ముంతలోనెట్టివుంచిన చప్పనిచలిగంజి తెచ్చి మిస్టర్ ఎలూఫ్ ముందుపెట్టింది. మిస్టర్ ఎలూఫ్ గడగడా బెస్ కాఫీలాగు ఆగంజి తాగి "థాంక్సు" అన్నాడు.

ఉషఃకాంతులు చిరునవ్వు నవ్వినాయి. పగటిపూటా అది? ఎవ్వాని జీవితగ్రంథంలోనూ క్రొత్తపుటా అది?



# సీజరుపెళ్లాం నేరం చెయ్యదు

మొసలికంటి సంజీవరావు

★

"సీజరుపెళ్లాం నేరం చెయ్యదు : సీజరుపెళ్లాన్ని శంకించకూడదు."— అని సీజరు చెప్పేడు. చాలా గంభీరంగా చెప్పేడు. కాని, విషయం తరిస్తే, చాలా జాలివేస్తుంది. సీజరు జగదేకవీరుడు; మహా మేధావి; మహాగర్వి. కాని, లోకాన్ని జయించి మనోహర కీర్తి రమాక్రాంతుడైన జగజ్జెట్టి తన కాంతచేత వంచింపబడ్డాడు. అతడు భార్యసంగతి వీరపురుషోచితంగా విస్మరించి చట్రాయిలాగ ఊరుకొన్నా, అతని మిత్రులు మాత్రం ఊరుకోలేదు. అతనిగౌరవ మర్యాదలు దక్కించాలని సీజరును రచ్చకీడ్చేరు. అప్పుడే చెప్పేడతడు గంభీరంగా— "సీజరుపెళ్లాం నేరంచెయ్యదు"...*అని

భర్తృ వంచనచేసిన సీజరు భార్యపేరు 'పాంపేయా.' ఈవిడ మూడో పెళ్లాం. సీజరు ప్రథమ వివాహం బాల్యాన్నే అయింది. కాబట్టి మోహంలేక, పునస్సంధానం కాకుండానే ఆపిల్లను వదలేసేడు సీజరు. ఒకపెద్దయింటి పడుచును వెంటనే అతను పెళ్లాడేడు. ఆమెపేరు కార్నీలియా; సాధ్వి. కాని, ఈ వివాహంవల్ల సీజరుకు చాలాచిక్కులు తటస్థించేయి. అప్పుడు రోమను సామ్రాజ్యాన్ని శాసిస్తూన్న 'సల్లా' అనే మహానీయునికి సీజరు వివాహం నచ్చలేదు. సీజరు అప్పటికి పిన్నవాడు: ఇరవై యేండ్లవాడు. కాని, ముందుముందు మహాపురుషుడౌతాడని సల్లా కనిపెట్టేడు. అలాంటివాడికి తన బంధువర్గంలో ఒకపిల్లను ఇద్దామని సంకల్పించి, సీజరుపెళ్లాడిన కాంతను వదలెయ్యమని పట్టుపట్టేడు సల్లా. కాని, సీజరు అంగీకరించలేదు. 'పాంపే' అనే మహావీరున్నికూడా ఇలాగే సల్లా నిర్బంధించేడు: అతను మానాభిమానాలు చంకొని అలాగే చేసేడు. పౌరుషవంతుడైన సీజరు మాత్రం నిర్భయంగా ధిక్కరించేడు. సామ్రాజ్యచక్రాన్ని తిప్పుచున్న సల్లా క్రుద్ధుడై సీజరును ఉద్యోగభ్రష్టున్ని చేసి, అతనిభాగ్యాన్ని, అతనిభార్యా భాగ్యాన్నికూడా అపహరించేడు. సీజరు దేశంలో ఉండలేక దేశాంతరంపోయి, సల్లా మరణించేక తిరిగి రాజధానికి వచ్చి, పోయిన ఉద్యోగభాగ్యాలు సంపాదించుకొని, కొంతకాలము పెళ్లాంతో సుఖంగా కాపురంచేసేడు. కాని, ఆ యిల్లాలు అర్ధాయుష్మంతురాలు. ఆమెకొఱకు సీజరు చాలా పరితపించేడు. బహిరంగ ప్రదేశాన్ని ఆవిడగుణాలు ప్రశంసించి, తనదురంత విషాదాన్ని వ్యక్తముచేసేడు. నిజంగా సీజరు ఎంత విచారించినా విచారించవలసిందే. ఏమంటే,— తరువాత కట్టుకొన్నభార్య గత కళత్ర శీలాన్నీ, సీజరువిషాదాన్నీ ఎంతన్నా వృద్ధిచేసింది.

సీజరు మంచికాలంలో ఉన్నాడు: నిత్యం మహావిజయాలు పొందుచూ, కీర్తి భాగ్యం, వైభవం గడిస్తున్నాడు. కాని, ఐహికసౌఖ్యానికి పరమావధి పెళ్లామేకదా. కనుక, చూసిచూసి, పాంపేయా అనేకాంతను వివాహమాడేడు. ఆమె దొడ్డయింటిబిడ్డ: సల్లామేనకోడలు. మంచి యౌవ్వనము: మంచి సౌందర్యము. తను చాలా సుఖపడుతానని మహామురిసిపోయేడు సీజరు. కాని, ఆ మోహనాంగి పాతివ్రత్యం అంటే యేమిటో యెరుగదనీ, స్వైరిణి అనీ తెలుసుకోలేకపోయేడు. ఎలా తెలుస్తుంది ?

ఆమె కటాక్షానికి పాత్రుడైన వారిలో ఒకడు 'క్లాడియసు.' ఇతడు కులీనుడు, పడుచువాడు, మంచి రూపురేఖ విలాసాలు కలవాడు; ఎదుటివారిని ఆకర్షించే—ముఖ్యంగా స్త్రీలని ఆకర్షించేతెలివి, మాటలలో నేర్పు, ప్రసంగంలో చాతుర్యం, సంభాషణలో ప్రావీణ్యం కలిగిన రసజ్ఞుడు, ఔదార్యం పరోపకారబుద్ధిలేనివాడుకాడు; కాని మనస్సుకట్టుకోలేని చపలుడు: స్త్రీలోలుడు, కామాంధుడు, ఏస్త్రీఐనా సరే— స్నేహం, బంధుత్వం, వావీ వరుసా పాటించని ఉన్మత్తుడు, అఘోరమైన అవినీతిపరుడు.

అలాంటి విట రాయణ్ణి మోహించింది సీజరుపెళ్లాం. కాని, ఆయిల్లాలికి గొప్పవిఘాతం దాపురించింది. మగనివల్ల ఇబ్బందికలగలేదు. అనర్గళమైన బాహుబలం చేత, నిర్వక్రమైన పరాక్రమంచేత, పరదేశాలు జయించి కీర్తికాంతను చేపట్టే నిత్యశోభనరాయడికి పెళ్లాన్ని కనిపెట్టడానికి అవకాశమెక్కడ? కాని సీజరుతల్లిమాత్రం నిప్పులాంటి మనిషి: అఖండమైన ధీమంతురాలు. తనకోడలి పోకడలు కనిపెట్టి సహస్ర

---

* cf. "Caesar's wife ought to be exempt not only from, crime but from suspicion also".

నయనాలతో కాచుకొని తిరగడం ఆరంభించింది. నీడలాగ, అంగరక్షకురాలులాగ, శృంఖలంలాగ నిత్యం అంటిపెట్టుకొని ఉండేది. తనమనోహరుని దగ్గరికి వెళ్లడానికిగాని,ఇంటికి అతన్ని రప్పించు కోడానికి గాని,వీలు లేకపోయింది. చివరకు, పరస్పరం చూసుకోడమే దుర్లభ మయింది. కాని,అంతమాత్రాన్ని అంతరించేది కాదు వారిమోహం. వారిమోహం పెన్ని సుబంతి లాంటిది: స్టీలుస్ప్రింగు లాంటిది.

కామదేవత కాముకులకి అవకాశాలు కల్పిస్తూఉంటుంది. అదృష్టవంతులైతే, తమ మనోరథాలు ఈడేర్చుకొని, కామదేవతనే పరమదైవంగా చూసుకొని, తమజన్మ తరించిందని బ్రహ్మానందం పొందుతారు. దురదృష్టవంతులైతే, భగ్నహృదయు లౌతారు.

రెండువేల సంవత్సరాలక్రిందట దిగంతాలపర్యంతం వ్యాపించిన మహాసామ్రాజ్యానికి రాజధాని రోమునగరము. నాడు పాశ్చాత్యులెఱింగిన ప్రపంచానికి రోముమహాపట్టణము రాజధానియైనట్లే సకల భోగభాగ్యాలకూ కూడా రాజధానియై, దేవేంద్రుని రాజధానితో తులతూగుతూ ఉంది. అనేకమైన ఉత్సవాలు, వేడుకలు, వైభవాలు, జాతర్లు, యజ్ఞాలు నిత్యం జరుగుతూ ఉండేవి.

ప్రతి సంవత్సరం ధర్మదేవతా యజ్ఞం జరిగేది. ఆ యజ్ఞం 'కన్సలు' అనే నగరాధ్యక్షుడు చెయ్యాలి. అతడు దేశాంతరాన్ని ఉంటే 'ప్రేటరు' అనే ఉపాధ్యక్షుడు అధ్వర్యం వహించాలి. అధ్యక్షుడైనా ఉపాధ్యక్షుడైనా తన భవనంలోనే ఆ యజ్ఞం చేయించాలి. నిజంగా చేసేది అధ్యక్షుడూ కాదు, ఉపాధ్యక్షుడూ కాదు: అతనిభార్యో, ఇతనిభార్యో చెయ్యాలి. ఉత్సవం చేసేవారు, చూసేవారు, ఆనందించేవారు స్త్రీలే. పురుషులకు ఎంతమాత్రం ప్రవేశం లేదు. పురుషులనే కాదు - పురుషుల్ని పోలిన స్త్రీలని కూడా రానివ్వరు. గృహమేధి కూడా ఆ రాత్రి యింట్లో ఉండడు.

ఆ యజ్ఞం మహా పవిత్రవంతమైంది. వైభవానికి లోపం లేదు. సామ్రాజ్యాధికారులు పూనుకొన్నప్పుడు వైభవానికి కొదవా? కాని, ఒక్క విశేషం. ఆ సమయాన్ని శృంగారానికి ఏమాత్రం అవకాశం లేదు. శృంగారరసం స్ఫురించే వస్త్రధారణమైనా స్త్రీలు చేసుకోకూడదు. కాని, మోహార్ణవంలో మునిగి సమయం నిరీక్షించే కాముకీకాముకులు నియమాలు పాటిస్తారా? ధూర్తమేకాని, అపాయం సంభవిస్తుందని సంశయిస్తారా?

సీజరు ఉపాధ్యక్షుడు.సీజరుభవనంలోనే యజ్ఞోత్సవం. రాత్రిఅయింది. సీజరుమందిరము స్వర్గంలాగ మెరిసిపోతున్నాది. స్త్రీలందరూ వచ్చేరు. కరదీపికా సహస్రాలతోటి భవనము దేదీప్యమానంగా ఉంది. మెరుపుల లాంటి మెరుగుబోడులు మన్మథ బాణాలలాగ చకచక తిరుగుతున్నారు. చుక్కలమధ్య చంద్రబింబము లాగ సీజరుభార్య యజ్ఞోత్సవాధ్వర్యం వహించి కూర్చుంది. కాని మనస్సుమాత్రం అక్కడలేదు. తన ప్రియుడువచ్చి చూడకపోతే ఆవైభవమంతా వ్యర్థ మనిపించింది. తన మనోహరుడు ఎప్పుడు వస్తాడో అని నిరీక్షిస్తున్నాది : నిరపాయంగా వస్తాడాఅని దిగులు పడుతున్నాది ; దాసీ చాలా తెలివయింది, ఏమీ ప్రమాదంలేదని అనునయించుకొంటుంది. యజ్ఞోత్సవం ఎప్పుడు ఐపోతుందా, చూడవచ్చినవాళ్లంతా ఎప్పుడు వదలిపోతారా, ఎప్పుడు ప్రియసమాగమమహానందం చూరకొంటానా అని ఆయిల్లాలు — పవిత్రయజ్ఞాని కధ్వర్యం వహించిన సీజరుపెళ్లాం ఉవ్విళ్లూరుతూంది.

పరిజను లందరూ యజ్ఞంగురించిన ప్రయత్నాలలో ఉంటే, సీజరు పెళ్లాం తనప్రయత్నంలో ఉంది. మగపురుగుకైనా ప్రవేశంలేని ఆ రాత్రే తనవిటుణ్ణి రప్పించాలని నిశ్చయించింది సీజరుపెళ్లాం. ఆమె ప్రియుడుకూడా తగినవాడే గనుక, వాడూ సిద్ధపడ్డాడు. పురుషులు రాకూడదంటే, స్త్రీవేషం వేసుకొని ప్రవేశించాలని సంసిద్ధు డయ్యేడు. యౌవనంలో ఉండడంచేతా, అందకాడు కావడంచేతా, పొడవరి కాకపోడంచేతా వేషం బాగా కుదిరింది. ఇలాంటి వ్యాపారాలకి సంధానం చేసేవారు కావాలి. తనదొరసాని మీద విశేషాభిమానంగల ఒకపరిచారిక ఇద్దరిమధ్య రహస్య రాయబారాలు నడిపి చాలాకష్టపడి ఇద్దరి కృతజ్ఞతకు పాత్రురాలయింది.ఆరసిక శిఖామణి వనితారూపంలో సీజరు భవనానికి వచ్చినప్పుడు ఆదూతిక హాజరంలో ఉండి, అతిథిస్త్రీని ఆహ్వానించినట్లే అతన్ని కూడా ఆహ్వానించి, తిన్నగా తనగదిలోకి తీసుకువెళ్లి, తనదొరసాని వచ్చేవరకూ అక్కడ ఉండమని ఉపదేశించి వెళ్లి

పోయింది. విటరాయడు చాలాసంతోషించేడు. ఆయిల్లాలుకూడా పరమానందం పొందింది.

అంతవరకు పన్నుగడ బాగానే సాగింది. యజ్ఞోత్సవం పూర్తి అయే లోపున తనప్రియుణ్ణి ఒక్కసారి చూసి పోదామని ప్రయత్నించింది సీజరు పెళ్లాం. కాని, ఎడతెరిపిలేని యజ్ఞోత్సవ కార్యకలాపము: నేల యీనినట్లు తండోపతండాలుగా వచ్చే అతిథి స్త్రీలు: — ఎలాగ వీలౌతుంది? అందరి స్త్రీలలాగ తను కూడా కొల్వుకూటానికి వెళ్లి, ఉత్సవాన్ని ఉత్సవాధ్వర్యం వహించిన ప్రియురాలిని చూడ్డానికి ధైర్యం చాలిందికాదు విటరాయడికి. కాని, గదిలో ఎంతసేపు కూర్చున్నా ప్రియురాలు రాదు: పరిచారికైనా రాలేదు. ఏమీ తోచింది కాదు. మనస్సు పరిపరివిధాల పోయింది. ఇక గదిలో ఉండ లేకపోయేడు. ఒక్క మాటు తిరిగి వద్దా మనుకున్నాడు. కాని, ఒక ఉద్దేశం లేదు, ఒక లక్ష్యం లేదు, ఒక గమ్యస్థానం లేదు. విటరాయడు చాలా తెలివైన వాడే, కాని, సమయానికి తెలివి తెల్లవారింది. మనస్సు ఒక్కమాటు ఆలోచనలతో సంకులమైపోయింది: తరువాత శూన్యం. గదిలోంచి పైకి వచ్చేడు. కాని నలుగురిలాగ ఛాటాగా చకచక తిరగలేకపోయేడు. ఎవ్వరైనా తారసిల్లుతే, తప్పుకుంటాడు. దీపకాంతిని తప్పించుకుంటాడు: నీడనే తిరుగుతాడు. ఆవైఖరి ఒక పరిచారిక కనిపెట్టింది. తన దొరసానికి అహితం చెయ్యాలని కాదు కాని ఆస్త్రీ ఎందుకలాగ తిరుగుతూందో కనుక్కోవాలని దగ్గరికి వెళ్లి, "అమ్మా! నువ్వెవరు? ఏమిటి కావాలి? ఎవరుకావాలి?" అని ప్రశ్నించింది ఆదాసి. విటరాయని గాంభీర్యం మంచులాగ మాయమయింది: గుండె జల్లుమంది: శరీరం సీరైపోయింది. మాట పెగలదు. "ఆబ్రా"* కోసం చూస్తున్నా"నని ఎలాగో చెప్పేడు గాబ్రాగాను. జబాబు చెప్పేడుకాని దొరికిపోయేడు. వెంటనే మాట్లాడక పోవడం, ఆ తొట్రుపాటూ చూడగానే ఆదాసి అనుమానించి, నిదానించి, చూసింది. కంఠం స్త్రీకంఠంకాదు: మూర్తి స్త్రీమూర్తి కంటె హెచ్చు. ఆడదికాదని గ్రహించి "ఎవ్వడో స్త్రీ వేషంతో చొరబడ్డాడు: రండి, రండి! పట్టుకోండి!" అని గగ్గోలు పెట్టింది. యజ్ఞోత్సవం ఆగిపోయింది: భవనంలో హాహాకారాలు పుట్టేయి: అందరూ కంగారుగా తిరుగుతున్నారు.

వెంటనే యథార్థము గ్రహించింది సీజరుపెళ్లాం. ఆమహాసందడిలో అందరిని తప్పించుకొని, కంగారుగా తిరుగుతూన్న ప్రియుణ్ణి పట్టుకొని, ఆబ్రా గదిలోకే మళ్లాతీసుకువెళ్లింది. ఆపాటి ఓర్పూ నేర్పూ వివేకమూ లేకుండా ఎందుకు తొందరపడ్డావని మందలించి, అంతరాయం కలిగినందుకు చాలా విచారించింది. కాని, అక్కడ అట్టేఉండడానికి వీలులేదు: ప్రమాదముకూడాను. కాబట్టి, జాగ్రత్తగా ఉండమని ప్రియుణ్ణిగట్టిగా హెచ్చరించి సీజరుదొరసాని వెళ్లిపోయింది.

యజ్ఞోత్సవం చూడవచ్చిన స్త్రీలంతా ఒకరిని ఒకరు చూసుకొన్నారు కోపంగా, పరిశీలనగాను. కాని, అందరూ స్త్రీలే. అందరూ కిలకిలనవ్వుకొన్నారు. పరిచారిక పొరపడిందని కొందరన్నారు. ఉత్సవం నిలిచిపోయినందుకు విచారించేరు. ఆ కలవరం చల్లారేక, చూడవచ్చినవాళ్లంతా వెళ్లిపోయేక, అత్తగారు పడుకొన్నాక, ప్రియుడి దగ్గరికి వద్దామనుకుంది సీజరుపెళ్లాం. ప్రియురాలు తప్పకుండా వస్తుందని ఆశోత్కంఠంతో కూర్చున్నాడు. కాని, విధి అన్యథా నిర్దేశిస్తే, విటుల ప్రయత్నాలు ఎలాగ సఫలమౌతాయి?

సీజరు తల్లికి ఎక్కడలేని కోపం వచ్చింది. పవిత్రమైన యజ్ఞోత్సవము భగ్నమైపోయిందని మండిపడింది. ఎవ్వడో మదనోన్మత్తుడలాగ ధూర్తంగా దుర్మార్గంగా మోసంచేయడంవల్ల ఆమహామానవతికి తలవంపు ఘటిల్లింది. కోడలు నిశ్చలంగా ఉండడం చూస్తే అనుమానం వేసింది. క్రోధానుమాన సంతప్తహృదయురాలైన సీజరుజనయిత్రి పరిచారికాసహస్రాన్ని వెంటనేపిలిచి, వీధితలుపులు మూయించి, కాగడాలు పట్టుకొని మూలమూలలు శోధించి ఆధూర్త ద్రోహిని పట్టితెమ్మని ఆజ్ఞాపించింది. ముందూ వెనకా కాగడాలు వేయించుకొని తనుకూడా పులిలాగ తిరిగింది. చివరకు ధూర్తవిటరాయడు దొరికిపోయేడు. సరసానికి వచ్చిన ధూర్తవిటరాయడు అఖిలసుందరీజన సమక్షాన దుర్భరమైన అవమానాన్ని పొంది, మానంపోయిన ప్రాణంతో ఇల్లుచేరుకొన్నాడు.

---

*ఆబ్రా:—సీజరుపెళ్లానికీ విటరాయడికీ సంధానం చేసిన దాసిపేరు.

మరునాడు రాజధానిఅంతా ఇదే ప్రసంగం. యజ్ఞోత్సవానికివెళ్లినకాంతలు ఇళ్లకు వెళ్లి తమకాంతులతో చెప్పేరు. సీజరుమందిరానికి వెళ్లని ఆడుది లేదు: విటరాయడు చేసిన ధూర్తద్రోహం తెలియని మగవాడు లేడు. తెల్లవారగానే ఊరంతా గుప్పుమంది.

విటరాయడు చేసింది మహాఘోరనేరం సీజరుకు జరిగిన అవమానం సీజరు అనే వ్యక్తికి కాదు. సామ్రాజ్యప్రభుత్వపక్షాన్ని ప్రతిసంవత్సరం నిరాఘాటంగా జరిగే పవిత్రయజ్ఞోత్సవము భంగపడిందంటే, ప్రభుత్వానికి ఘోరాపరాధం చేసేడన్నమాట విటరాయడు. అంతటిఘోరం ఎన్నడూ జరగలేదు. ఆపవిత్రోత్సవానికి ఎన్నడూ అంతరాయం రాలేదు. కాబట్టి విటరాయడు కులీనుడైనా ఎంతమాత్రం క్షంతవ్యుడు కాడని 'ట్రిబ్యూను' అనే ఉన్నతప్రభుత్వాధికారి పట్టుపట్టి విటరాయడిమీద అభియోగము తెచ్చేడు.

విటరాయడు అంతమాత్రాన్ని మెత్తపడలేదు. తను చేసింది మహాపరాధమనీ తెలుసును: తను తప్పకుండా శిక్షార్హుడనీ తెలుసును. కాబట్టి అపాయమునుండి తప్పించుకోడానికి విపరీతమైన ఉపాయమాలోచించేడు. తను ఆరోజున రాజధానిలో లేనని వాదించేడు. కాని సాక్ష్యం కిట్టింది కాదు. సాక్షిబలం చాలిందికాదు. అతడు రాజధానిలో ఉన్నాడని సాక్ష్యం ప్రబలంగా వచ్చింది. అందులో, సిసరో అనే మహానీయుని సాక్ష్యం విటరాయడికొంపముంచింది.

సామ్రాజ్యాన్ని శాసించే సెనేటు సభ్యులలో సిసరోఒకడు. అత్యున్నతమైన ఉద్యోగాలు కూడా చేసేడు. మహామేధావి: గొప్పవక్త: అనర్గళమైన వాగ్ధాటి కలవాడు: ధర్మజ్ఞుడని పేరుపడ్డాడు. ఇలాగ అనేకవిధాల ప్రతిష్ఠాగరిష్ఠుడైన సిసరోసాక్ష్యం విటరాయడి కొంపముంచింది. సిసిరో అంతద్రోహం చేస్తాడని అతడు అనుకోలేదు. ఏ మంటే, విటరాయడు అతనికి అనేకమైన ఉపకారాలు చేసేడు. అతడు మిత్రుడనీ కృతజ్ఞుడై ఉంటాడనీ విటరాయడు నమ్మేడు. కాని, ఇలాగ కృతఘ్నుడౌతాడని కలలోనూ అనుకోలేదు. తన మిత్రుడు సాక్ష్యానికి రాగానే తన పక్షమే చెప్పతాడని సంబరపడ్డాడు విటరాయడు. కాని, సిసరో యథార్థం చెప్పేసి విటరాయడికి మహాపకారం చేసేడు.

సిసరో సత్యసంధుడు కావచ్చును కాని, ఉపకారికి అపకారం చెయ్యడం శోచనీయం. ఉపకారం చెయ్యడం మానిపోయె: సాక్ష్యానికి రాకుండా తప్పకుంటే తీరిపోను. ఐతే, సాక్ష్యం ఇవ్వక తప్పిందికాదు: యథార్థం చెప్పక తప్పిందికాదు. ఇది కథలో చిత్రకథ.

విటరాయడికి ఒకసోదరి* ఉంది. ఆమెమగడు పేరుప్రతిష్ఠ లున్నవాడే. కాని, ఆవిడ రూపంలోను గుణాలలోను నిజంగా విటరాయనిసోదరే:- సోదరుడు విటరాయడు: సోదరి విటరాణి. సిసిరో యొక్క ప్రతిభావిశేషాన్ని, అతని అధికార గౌరవాన్ని, అతను సర్వజన మూర్ధాభిషిక్తుడై ఉండడంచూచి, వలచి, అతన్ని ఏకంగా పెళ్లాడుదామనే తలపెట్టింది విటరాయనిసోదరి. కాని, సిసరో బ్రహ్మచారి కాడు: భార్యారహితుడుకాడు. అతనిపెళ్లాం చడికట్టి మండిపడింది. తాచుపాములాగ కసితీర్చుకోవాలని కనిపెట్టుకొంది. విటరాయడు కామాంధుడై పవిత్రయజ్ఞోత్సవాన్ని కళంకపరిచి, అభియోగానికి పాత్రుడుకావడం తటస్థమయింది. వానిసోదరి తనకు మహాద్రోహం చెయ్యడానికి తలపెట్టినందుకు విటరాయణ్ణి హతమార్చెయ్యాలని సక్రోధంగా నిశ్చయించి. న్యాయస్థానానికి వెళ్లి యథార్థం చెప్పాలని మగణ్ణి బలాత్కారం చేసింది. ఆలిపోరు దుర్భరమైపోయింది. అనేకోపకారాలు చేసిన మిత్రుణ్ణి రక్షించలేకపోవడమే కాకుండా, అతనినేరాన్ని స్థిరపరిచేసాక్ష్యం చెప్పక తప్పిందికాదు. స్నేహం కృతజ్ఞతాపాటిస్తే, ఇంట్లో కాలుపెట్టే ఆస్కారంలేదు. కాబట్టి, ధర్మవేత్త యథార్థం చెప్పేడు. విటరాయడు నిర్ఘాంత పోయేడు.

విటరాయడికి విరుద్ధంగా సాక్ష్యం ఇచ్చింది ఈ మిత్రుడొక్కడే కాడు; అతడి బావమరది కూడా అలాగే చేసేడు. తనపెళ్లాంబాధ భరించలేక సిసరో సాక్ష్యమిస్తే, తనకు జరిగిన ఘోరావమానం భరింపలేక సాక్ష్యం ఇప్పించేడు విటరాయడిబావ. విటరాయడు వావీ వరసా లెక్కచేయని అధమాధమజారుడని ముందుచెప్పేం గదా. తన సోదరిశీలాన్ని కూడా ధ్వంసంచేసేడు. ఆమెమగడు దుర్భరమైన రోషావమానాలతో మండి

---

*ఆమెపేరు క్లాడియా: ఆమె మగనిపేరు లూసల్లసు.

పోతున్నాడు. సమయం వచ్చింది. తన పరిచారికచేత సాక్ష్యం చెప్పించేడు.

ఈవిధంగా విటరాయడినేరం సిద్ధ పడింది. శిక్షమాత్రం తప్పించు కొన్నాడు. విటరాయడు కులీనుడు. తమలాంటి కులీనుడు నేరంచేసినా శిక్షింపబడడం కొందఱు కులీనులు సహించలేకపోయేరు. వారందరిలోను అత్యంతధనవంతుడైన 'క్రాసస్సు' తనమిత్రుణ్ణి ఉద్ధరించాలని పట్టుఃపట్టి, సినేటుసభ్యులని, అధికారులని, విచారణకర్తలనీకూడా గుండకొట్టేడు. ధర్మం ధ్వంసమయింది: విటరాయడు విముక్తుడయేడు.

ఈ సందర్భంలో ఒకవిషయం ముఖ్యంగా గమనించాలి. ఘోరావమానం పొందినవాడు సీజరు అయినప్పటికీ, ఆ మహావీరుడేమీ మాటాడలేదు. చెయ్యవలసిన పనిమాత్రం చేసివేసి, అవమానం ఎవరికో అన్నట్టు గంభీరంగా ఊరుకొన్నాడు. తనభార్యసంగతి కనిపెడుతున్నాడు. ఈయజ్ఞోత్సవధర్మాన్ని ఇల్లాలిసంగతి గుప్పుమనగానే, విడాకులిచ్చి పంపించివేసేడు సీజరు. కాని, అతనిమిత్రులకి శాంతి లేకపోయింది. సీజరుయొక్క గౌరవాన్ని కాపాడాలని మిత్రులు పంతంపట్టేరు. ఇలాగ మిత్రులు ఒకప్పుడు మనకువిశేష బాధ కలిగిస్తారు-అమాయికంగాను. సీజరునిర్లక్ష్యంగా ఔదాసీన్యం వహించినా, అతన్ని సాక్ష్యానికి పిలిపించేరు. ఆ మహాపురుషుడేమిటి చెపుతాడో అని లక్షమంది ప్రేక్షకులు వెయ్యిమందిఉద్యోగులు రెప్పవాల్చకుండా చూస్తున్నారు. సీజరు నిశ్చలంగా, నిర్వికారంగా ఉన్నాడు. అతనిగాంభీర్యం చూసి విచారణకర్తలుకూడా చకితులైపోయేరు. ఐనా, వారు తమధర్మం నెరవేర్చుకోవాలికదా. కనుక, అతనిభార్యా వ్యభిచారంగురించి అతన్ని ప్రశ్నించేరు. తనకేమీ తెలియదని ప్రత్యుత్తరమిచ్చేడు. భార్యను ఎందుకువిసర్జించేవని తరువాత ప్రశ్నించేరు. అప్పుడే ఆ మహాసీయు డిలాగ గంభీరంగా జవాబుచెప్పేడు.—

"సీజరుపెళ్లం నేరంచెయ్యదు;
సీజరుపెళ్లాన్ని శంకించకూడదు."

సీజరుపలుకులు ఆచంద్రార్కం నిలిచిఉన్నాయి.

---

# తెనుగు రాణి

మండపాక పార్వతీశ్వరశాస్త్రి

పులిమీద పుట్రలాగు, ఈనాటికి తెలుగుకు హిందీభాష ఒకటి తగులుకొన్నది. ఈబాధ మింగడానికీ వీలు లేదు, కక్కడానికీ వీలులేదు అన్నట్లు ఉన్నది. చాళుక్యుల కాలమువరకూ సంస్కృతానికి లొంగిలొంగి, చివరకు సంస్కృతాన్నే లొంగదీసి, తలయెత్తుకొని సాటివారిలో నరజాణయై, కొంతకాలమునకుతరువాత హిందూస్థానీకి దాస్యముచేయ వలసివచ్చునేమో యని భయపడుతూ పడుతూ, చివరకు హిందూస్థానీనే స్వాధీనముచేసుకొని, తిరిగీ తలయెత్తి నాలుగుదేశాలలో రాణియై, స్వారాజ్యవై రాజ్యసామ్రాజ్యభోగాలన్నీ అనుభవించి, తెల్లవారి చేతిలో పడి నలిగి, వాడి, ఎండి, చిన్న పెద్ద సూదుల అటూయిటూ రగడాయింపులలో చితికి, తొలకరిచినుకులకు చిగిరించి, వేదజయంతుల గాలివానలలో పేరుమాసిపోకుండా గిడుగు చాటుచేసుకొని, తుక్కుదులుపుకొని, క్రొత్త ముస్తాబుతో కన్నులపండువుగా కనబడుతూ వున్న ఈ తెలుగుకు, ఈనాటికి హిందీబాధ తగులుకొన్నది. సంస్కృతాన్ని లొంగదీసుకొన్న తెలుగు, హిందూస్థానీని స్వాధీనముచేసుకొన్న తెలుగు - హిందీకి దాస్యముచేయక తప్పదన్నట్లు కనబడుతూవున్నది.

రెండువేలయేండ్లక్రిందట కణ్వ బృహస్పతులకాలంలో, ఆ సేతుహిమాచలం ఆంధ్రులప్రతిభ వెలుగుతూ ఉన్నప్పుడు వ్యాకరణం తెలుగుకు పుట్టింది. అయితే ఏమిలాభం? తెలుగువ్యాకరణం సంస్కృతంలోనే నేర్చుకోవా లన్నారు ఆనాటిపండితులు. తెలుగున కవిత్వం ఆనాడు చెప్పినకవులు తెలుగుకవులే అయినారు. తెలుగువ్యాకరణం రచించవలసిన పండితులు సంస్కృతపండితులే అయినారు. రాజాస్థానాలలో సంస్కృతపండితులకే ప్రవేశం. తెలుగుసంప్రదాయాలు స్థూలంగా తెలుసుకోవడమే సంస్కృతపండితులకు ప్రయోజనం. కాబట్టి తెలుగుకు వ్యాకరణాలు లఘువుగా సంస్కృతంలోనే, వ్రాయవలసి వచ్చింది. రాజులకు సంస్కృతకవిత్వమే కాని తెలుగుకవిత్వము అక్కరలేనందున తెలుగుకవిత్వం ఆస్థానాలలోకి వెళ్లలేదు. అయితే, క్రమక్రమముగా తెలుగుఛందస్సులలో, తెలుగువృత్తాలలో ఉన్న తెలుగుకవిత్వం సంస్కృతఛందస్సులతో, సంస్కృతవృత్తాలతో కలగాపులగం కావడం ఆరంభించింది. ఉదాహరణాలు, యక్షగానాలు తెలుగుకవుల చేతులలో నుంచి సంస్కృతపండితుల చేతులలోకి వచ్చినవి. తెలుగుకవిత్వం రాజశాసనాలలోకి ఎక్కింది. రాజాస్థానముల పొదికట్టుకు తెలుగుకవిత్వం వెళ్లిం దన్నమాట. పొదికట్టున కనిపెట్టుకొని ఉన్న తెనుగుకవిత్వాన్ని నన్నయభట్టుగారు చిత్తగించినారు. బలే-బాగుందన్నారు. "స్వస్థానవేషభాషాభిమతాస్సంతో రసప్రలుబ్ధధియః లోకే బహుమన్యంతే వైకృతికావ్యాని చాన్య దపహాయ" అని ఆలోచించినారు. "రా, నాతో రా" అని తెలుగుకవిత్వాన్ని రాజాస్థానంలోకి తీసుకొని వెళ్లినారు. రాజుగారప్పు డేమిచేస్తూ వున్నారంటే, "బహుభాషల బహువిధముల, బహుజనములవలన వినుచు భారతబద్ధ, స్పృహు"లై ఉన్నారు.

ఏలినవారు మా మనవికూడా కొంచెం చిత్తగించా లన్నారు భట్టుగారు. "తెనుగుకవిత్వమేనా" అన్నారు మహారాజావారు. 'చిత్తం' అన్నారు భట్టుగారు. "అయితే,

..................... అస్మదీయ వంశమునం ప్రసిద్ధులై విమలసద్గుణశోభితులైన పాండవోత్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్టమెమ్మెయిన్.

కాబట్టి, మహాభారతబద్ధ నిరూపితార్థమేర్పడం దెనుంగున రచియింపు మధిక ధీయుక్తిమెయిన్" అని మహారాజావా రానతిచ్చారు. భారతరచనలో భారతఘోరరణమైనది. ఛీఛీ పాడుచేశీశా డన్నారు వైదికులు. లేదు లేదన్నారు నారాయణభట్టుగారు. వేణీసంహారం రచించి జయభేరీవాయించిన నారాయణభట్టుగారి వద్ద అందరూ నోటితాళాలు బిగించుకొన్నారు. భారతరచన సాగింది. తెలుగు ఆస్థానపీఠం అలంకరించింది. అయితే తెలుగు తెలుగువేషంతో లేదు. నబాబుల ఆస్థానాలలో ఉండిన తెలుగు ఉద్యోగస్థులు తురకవేషాలు వేసుకొన్నట్లు నేటి ఇంగ్లీషు ఉద్యోగస్థులంతా దొరలవేషాలు వేసుకొంటూ ఉన్నట్లు, నన్నయభట్టుగారు రాజాస్థానంలో తెలుగుకు సంస్కృతవేషం వేయించినారు. ఆలాగైతేనే

గాని సంస్కృతపండితులు సంతో షించరని కాబోలు పాపం!—

నన్నయభట్టుగారు తెలుగుకవిత్వానికి వేయించిన సంస్కృతవేషం ఇదివరకు అందరూ చూచినదే అయినా మరోమారు చికాకుపడకుండా చిత్తగించండి. ఇదిగో—

క. అమృతముతో నుద్భవమై, యమరేశ్వర
యోగ్యమైన హయరత్నము త,త్సమములో
దధి తీరంబునఁ, గొమరుగ
నేకతమ యిచ్చఁ బ్రసన్మరుచున్నన్,

వ. కద్రువయు, వినతయు వినోదార్థంబు విహరించువారు, కరిమకర నికరాఘాత జాత వాతోద్ధూతతుంగ తరంగాగ్ర సముచ్ఛలజ్జల కణాసారచ్ఛటాచ్ఛాదితగగనతలంబైన దాని, నుద్యానవనంబునుంబోలె బహువిద్రుమలతాలంకృతంబైనదాని, నాటకప్రయోగంబునుం బోలె ఘనరసపాత్రశోభితరంగరమ్యంబైనదాని, దివంబునుంబోలె వహిమకరధరితంబైనదాని.

చ. అలఘు ఫణీంద్రలోక కుహ
రాంతరదీప్త మణిస్ఫురత్ప్రభా
వలి గలదాని శశ్వదుప
వాస మహావ్రత శీత పీడితా
చల మునిసాఖ్య హేతు విల
సద్బడబాగ్ని శిఖాచయంబులన్
జెలఁగెడుదానిఁ గాంచి రర
విందనిభానన లమ్మహోదధిన్.

మ. వివిధోత్తుంగతరంగ ఘట్టన చల
ద్వేలావనైలావలీ
లవలీ లుంగ లవంగ సంగత లతా
లాస్యంబు వీక్షించుచున్
ధవళాక్షుల్ సని కాంచి రంత నెదురం
దత్తీర దేశంబునం
దవదాతాంబుజ ఫేనపుంజనిభు న
య్యశ్వోత్తముం దవ్వులన్.

సంస్కృత వేషంతో ఉన్న తెనుగును సంస్కృతపండితులు చూచారు. బలే-బలే-అన్నారు. దొరవేషంతో ఉన్న తెలుగువాడికి దొరలంతా చేసినట్లు షేకుహాండు చేసినారు. ప్రక్కను కూచోపెట్టుకొన్నారు. దొరవేషంతో ఉన్నవాడికి బస్సులలో అగ్రస్థానం యిచ్చినట్లు తెలుగుకి అగ్రస్థానం ఇచ్చినారు. కేవలం సంస్కృతపండితులు "మీ తెలుగంటే ఏమిటో అనుకొన్నాం మా సంస్కృతమే నండీ" అన్నారు. గద్యపద్యాత్మకమైన చంపూప్రబంధాలు వ్రాస్తూవున్న సంస్కృత కవులు "తెలుగుకవిత్వ మంటే ఏమో అనుకొన్నాం, మా సంస్కృత కవిత్వమేనండీ" అన్నారు. 'అవునండీ అలాగే ఉంటుంది. అంతే, అంతే' అన్నారు భట్టుగారు. అయితే కొందరుమాత్రం మూతిముడిచారు. "సంస్కృతం సంస్కృతమే. ఎంతైనా గూఢంగా ఉండాలిగాని, ఈ తెలుగులో చెప్పేస్తే అంతా బట్టబయలై పోతూంది. గూఢంగా ఉండాలి గాని బయలైపోతే మాకేముంది?" అని గొణుగుకొన్నారు. చూడండి మా కాళిదాసుగారు ఏలాగు చెప్పినారో—

"అనసూయా—

అస్తి కౌశిక ఇతి కృతగోత్రనామధేయో మహాప్రభావో రాజర్షిః—పురాకిల తస్య రాజర్షేః ఉగ్రే తపసి వర్తమానస్య కిమపి జాతశంకైః దేవైః మేనకానామాప్సరా నియమవిఘ్నకారిణీ ప్రేరితా-తతో వసంతోదారసమయే తస్యా ఉన్మాదయితృకం రూపం ప్రేక్ష్య—"

అని, ఆ పైమాట చెప్పలేక సిగ్గుపడుతూ పడుతూ, సగంసగంలో నసుగుతూ ఉంటే రాజు ఆమాట అందుకొని, 'పరస్తాదవగమ్యత ఏవ' అని అనసూయ చిక్కు తీర్చినాడు — అన్నారు కాళిదాసుగారు.

"అయితే నన్నయభట్టుగారూ! మీ రేమిటండీ, ఇంత వైదికంగా చెప్పినారు—చూడండీ.

చ. అలసత యొప్పఁగాఁ దరుణి
యమ్ముని వల్లభు ప్రేమాల నున్న ప
మ్మిళిత సుగంధ బంధుర స
మీర వశంబునఁ దూలి, బాలపై
వలు వెసలన్ బయల్పడిరొ
వల్లకుచంబులఁ గను యుగ్మముస్
లలితకృశోదరంబుఁ దర
శ్రితవళీయుతరోమరాజియున్.

ఏమిటయ్యా ఈ వర్ణన? ఇంత వైదికంగా ఎవరైనా చెప్పుకొంటారయ్యా — ఈ తెలుగుకవిత్వం ఈలాగే ఎప్పుడూ ఉంటుంది కాబోలు? అందుకే తెలుగులో కవిత్వ మేమి టని మే మన్నాం" అని తాటించారు.

ఆమాట అందుకొని మరొకరు అన్నారుగదా — "భట్టుగారూ, ఏమిటండీ ఈ పద్యాలు?

సీ. పలుకులముద్దును, గలికిక్రాల్గన్నుల
తెలివును, వలుదచన్నుల బెడంగు,
నలఘుకాంచీపదస్థలములయొప్పును
లలితాననేందుమండలము రుచియు,
నలినీలకుటిలకుంతలములకాంతియు,
నెలజవ్వనంబునవిలసనమును,
నలసభావంబును, పొలుపును, మెలపును,
గలుగు నగ్గిరికను దలఁచితలఁచి,
ముదితయందుఁ దనహృదయంబు నిలుపుటఁ
జేసి, రాగ మదర భాసురముగ,
రమణతో వనాంతరమున రేతఃస్కంద
మయ్యె నవనిపతికి నెయ్య మొనర.

సీ. చపలాక్షి మాపులచాడ్పున కెద మెచ్చుఁ
జిక్కనిచనుఁగవఁ జేరఁగోరు;
నన్నువకౌఁదీఁగయందంబు మది నిల్పు
జఘనచక్రంబుపైఁ జలుపు దృష్టి;
యఖిలావయవపేర్పడువ ట్లుండఁగాఁ బల్కు
వేడ్కతో మఱుమాట వినఁగఁ దివురు;

వతిఘనలజ్జావనతయగు నక్కన్య
పైఁబడి, లజ్జయుఁ బాపఁగ నగు;
గీ. నెంతకాంతు లయ్యు నెంతజితేంద్రియు
లయ్యుఁ గడు వివిక్తమైనచోట
సతులగోష్ఠిఁ జిత్తచలన మొందుదు రెందుఁ
గాముశక్తి నోర్వఁగలరె జనులు.

యథార్థం వర్ణించారు నిజమే. కాని, శుద్ధవైదికంగా చెప్తే లోకం నవ్వుకోదయ్యా!" అన్నారు.

మరొక రన్నారు—

"నన్నయభట్టుగారు అవిరళ జప హోమతత్పరులు, సంహితాభ్యాసులు అవడంచేత కేవలవైదికు లను కొంటూ ఉన్నారా? వారు లోకజ్ఞులు, మత్యమరాధిపాచార్యులున్నూ కూడా సుమండీ! వారికి తెలియని లౌక్యవైదికాలు ఉంటాయా? ఐతే వారు సుజనులు, సద్వినుతావదాత చరితులున్నూ, కాబట్టి యథార్థకథనంకోసం ఆలాగు చెప్పినారు. అంతేగాని వేరేమీ కాదు. వారు చెప్పినదానిలో యథార్థంకానివిషయమేమైనా ఉంటే చూపించండి." ఎవరేమనుకొన్నా సరే చాలాకాలం వరకూ, నన్నయభట్టుగారు ప్రారంభించిన తెలుగుకవిత్వం పండిత లోకంలో ఆమోదం పొందలేదు. వైదికంగా ఉంటుందని. పోగా—పోగా కొంతకాలానికి ఒక నియ్యోగిపంతులుగారు ఇదంతా చూచినారు. ఆయన వైదికసంగ్రహంకూడా బాగా ఎరిగినవారు. లౌక్యవైదికాలు రెండూ నడిపించడానికి శక్తిసామర్థ్యాలు కలవారు. పైగా కవిత్వంచెప్పడంలో ఆరితేరినవారు. వీరు నన్నయభట్టుగారి భారతం బాగా చదివి 'బలే తెలుగు కవిత్వం' అన్నారు. పైని వివరించిన పద్యాలు చూచారు. వైదికంగా బట్టబయలుగా ఉందిగాని, చాలాచాలాసుగుణాలున్నా యన్నారు. సముద్రవర్ణన వింటూవుంటే సముద్రం ఎదురుగా కనిపిస్తూ ఉందన్నారు. దేవతాశ్వంలో దేవత్వం కనిపిస్తూ ఉందన్నారు. సముద్రప్రాంతాలలోని ఉద్యానవనం మనోహరంగా ఉందన్నారు. ఆసముద్రం—ఆప్రాంతంలో ఉద్యానం—అక్కడ మేస్తూవుండే గుఱ్ఱం—అక్కడికి వినోదానికి వెళ్లిన స్త్రీలు—ఈ దృశ్యం చాలా అద్భుతంగా వుంది. అయితే సంస్కృతవేషం—ఛాందసం—ఇవి మాత్రం లోపాలుగా ఉన్నవి. ఈ లోపాలు తప్పించి, తెలుగువేషం వేయించి, తెలుగుదృశ్యం చూపించి, లౌక్యంగా, అరచాటుదనం కలిగిస్తే, సంస్కృతకవిత్వాన్ని మింగేస్తూ ఉంటుంది తెనుగుకవిత్వం అనుకొన్నారు.

శ్లో. యంత్రాకృష్టసువర్ణసూత్రమివ య
త్పద్యం సుమేరోస్తటాత్
ప్రోన్మీలత్ కురువిందకందళ ఇవ
స్వచ్ఛః పదార్థోదయః,
తత్రాప్యుల్లలదంశుకాంతర లస
త్కాంతాకుచాంతోపమ
వ్యంగ్యం య త్తదహో, కవిత్వ మితర
ద్వాగ్దేవతోపద్రవః.

అన్నారుగదా పెద్దలు. నేను ఆ మాదిరిగా చెప్పి తెలుగుకవిత్వానికి గౌరవం కలిగిస్తాను. నన్నయభట్టుగారు కవిత్వాన్ని రాజాస్థానానికి ఎక్కించినారు గాని, 'సుకవితా యద్యస్తి రాజ్యేనకిం' అన్నమాట ఆలోచించినారు కారు. రాజులే కవిరాజుల పాదాలవద్దకు వచ్చేటట్టు చేస్తాను నేనన్నారు నియోగిపంతులుగారు. ఫక్కీ మార్చారు. సంస్కృతవేషం విప్పించి పారేశారు. తెలుగుకు తెలుగువేషమే వేయించారు. పైగా దృశ్యంలోకూడా తెలుగుతనమే చూపించారు. ఇదిగో చూడండి:

వ. అక్కాలంబున వినోదంబునకై యరిగి యొక్కయెడ.

సీ. చంచులఁ జిగురాకుఁ జించియాడుచు నలి
నెలుఁగించు గండుఁగోయిలలసొంపు,
అలరుఁదేనియఁ గ్రోలి, యున్న పోలంబుల
మరియు జేటుల నునుమ్రోఁతయింపు
తనిపండ్లరస మాని, తమలోనఁ జెలఁగుచుఁ
బలికెడు రాచిల్క పలుపురంగు;
కొలఁకులకెలఁకులఁ గూడి క్రీడించుచుం
డెడునంచతండంబు నడబెడంగు;
గీ. తరఁగఁ దేలుచుఁ బూఁదీవఁ దగులఁబడుచు
వచ్చు చిఱుగాలి సోకును, మెచ్చిమెచ్చి
తగిలి, కొనియాడుచును, వినతయును గద్రు
వయును, మున్నీటిచేరువ వనమునందు.

వ. మెలఁగుచుండి రట్టియెడ.

చ. కరువునఁ బోసిరో విధుని
కాంతి, సుధాబ్ధి తరంగఁ దెచ్చి గం
డరు వొవరించిరో, హరు జ
టాస్థలికిన్ దొడవైనయేటిపె
న్నురువున వ్రాసిరో యన, మ
నోజ్ఞసితచ్ఛవి నల్లసిల్లు సుం
దరతురగోత్తమంబుఁ దవు
దవ్వులఁ గాంచిరి చారులోచనల్.

వ. నిశేచ్ఛమై వచ్చిన యుచ్చైశ్శ్రవంబు
నిట్లాలోకించి...

మా గంజాంజిల్లాలో ఉద్దాన (ఉద్యాన) ప్రాంతంలోవున్న సముద్రతీరం, ఆప్రక్క ఉద్యానం, ఆమూల మేస్తూవుండే తెల్లగుఱ్ఱం, అక్కడ విహరిస్తూవుండే కాళింగస్త్రీలు ఇవి జ్ఞాపకానికి వస్తాయి - కళ్లకు కట్టినట్టు ఉంటాయి ఈ వర్ణనవింటే - అంతేకాకుండా—

తెలుగువారియింటి ఆడుపడుచులై వన్నెవాసులు గన్న కరువూ, గండరువూ, చిత్తరువూ కూడా వివరించారు. ఈవిధంగా గీర్వాణీవేషం విప్పించి, ఆంధ్రికి ఆంధ్రవేషమే వేయించినారు తిక్కన్నగారు. ఆ ఆంధ్రిని చూచి రాజాధిరాజు లంతా వలచినారు; చేపట్టినారు. అంతేకాకుండా ఆంధ్రవధూటి చొక్కపుం జనుఁగవఁబోలిన యరచాటుతనం కలిగించి, వైదికవేషం కూడా లేకుండా చేసి, నాజూకుతనం వచ్చేటట్టు చేసినారు. ఇదిగో ఆ నాజూకుతనం ఈలాగు చూడండి:—

సీ. అర్పించుఁ జప్పు డయ్యంగన కెంగేలి
జిగిసొంపు చిత్తంబు దిగిచికొనఁగ ;
నరసి కన్గొనునప్పు డయ్యింతికనుఁగవ
పొలపంబు రాగంబు వొదలఁ జేయ ;
నవ్వులఁ బనిఁ బంచునప్పు డమ్ముద్దియ
పలుకులతీపు కోర్కులఁ గెరల్ప ;
వల్లన యూఁచెడునప్పు డక్కొమ్మనా
తెరతావి ధైర్యంబు ద్రిప్పికొలుప
గీ. మరుఁడు తోడ్తోడఁ దేకువమాలి, కదిసి,
కూపుగముల క్రొవ్వాఁడిమినూప నంత
కంత కగ్గలమగు వలవంతఁ దూల
పోరెఁ బావకుఁ డేమి సెప్పుదు నరేంద్ర.

సీ. చిగురుటాకుల గాసిచేయు నీయడుగుల
చెలువంబు చూడ్కులఁ జేర్చుకొనియె;
మారేడుపండుల గారాము చెఱుచు నీ
యొలచన్నుఁగవ వేడుకలఁ బొనర్చె;
మనుఁదీగెఁ జిరికిఁ గొనని నీ మైదీవ
మురిపెంబు డెందంబు మరులుకొలిపె;
నెఱపందురుని సిగ్గువఱుపంగఁజాలు నీ
నెమ్మోము తాలిమి వమ్ముసేసె
గీ. నాతి, నీకునై పెక్కుబన్నములు వడితి
నంగజునిచేత వల్లభ వగను నాకు;
నాపుడును సిగ్గుగదిరి, యూననము వంచి,
యలఁతిరొలుఁగున నిట్లను నాలతాంగి.

నన్నయభట్టుగారి వైదికానికీ, తిక్కన్నగారి నియోగానికీ ఎంత తేడా ఉన్నదో చూడండి. ఇక్కడికి తెలుగుకవిత్వానికి వన్నెవాసులు స్థిరపడ్డాయి. తెలుగు ఒకయింటిరాణి అయినది. తన యిల్లు, తన సంసారం, తన సంతానం, తన మాట, తన ఆట, తన నాట చెల్లేటట్టు చేసుకొన్నాది. అయినా గీర్వాణి ఇంకా గీర్వాణంగానే వుంది. తెలుగంటే చిరికన్ను వేస్తూనే ఉంది. ఆ సంగతి తెలుగు కనిపెట్టింది. ఈ గీర్వాణి నాకు దాస్యం చేయవద్దా అంది. ఒక్కసారి తనవాళ్లనందరినీ తేరిపార చూచింది. పెద్దమీసాల నియోగిపంతులు జరీకండువా సవరించుకొని యెదుట చేతులు జోడించుకొని నిలబడ్డాడు. 'ఏమి పంతులూ—కథ అంతా విన్నావా?' అన్నది. 'ఏమమ్మా ఏమి కథ' అన్నాడు నియోగిపంతులు.

చూచేవా, సంస్కృతవేషం వేసుకొంటే 'తెలుగుకు సంస్కృత వేషమా' అన్నారు. పోనీ అని తెనుగువేషం వేసుకొంటే 'వట్టి తెలుగువేషమా' అన్నారు. ఇకను ఏవేషమో ఏమీ తోచలేదు అన్నది.

"నేనుండగా నీకేమి లోపమమ్మా, అందరూ నీకు దాసులే అవుతారు. చూస్తూవుండు—అని ఆంధ్రికి క్రొత్త ముస్తాబు చేశాడు.

గీ. ప్రౌఢిఁ బరికింప సంస్కృతభాషయండ్రు
పలుకునుడికారమున నాంధ్రభాషయండ్రు
ఎవ్వ రేమన్న నండ్రుగా కేమికొదువ,
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష.

అన్నాడు శ్రీనాథుడు. ఒకప్రక్క కర్ణాటభాష, ఒకప్రక్క సంస్కృతభాష—చామరాలు వీస్తూ వుంటే, లక్ష్మీసరస్వతులు సేవిస్తూ ఉంటే మధ్యను వున్న శ్రీ రాజరాజేశ్వరీభట్టారికవలె సింహాసనేశ్వరియై శ్రీనాథునియింట కూర్చుంది ఆంధ్రి. ఆ ఆంధ్రిని సేవించినారు రాజాధిరాజులు. ఆ ఆంధ్రిని చూచి తక్కినవారంతా మచ్చరించినారు.

గీ. బోధ మల్పంబు; గర్వ మభ్యున్నతంబు,
కాంతి నిప్పచ్చరమ్ము, మచ్చరము ఘనము;
కూపమండూకములఁబోలెఁ గొంచెమెఱిఁగి
పండితమ్మన్యులైన వైతండికులకు.

అయినా శ్రీనాథుఁడు ఆంధ్రిని భయపడవద్దన్నాడు. ఏమన్నాడంటే—

మ. హరమూఁడాహరణాంకవక్రతయుఁ గా
లాంతస్ఫురత్ చండికా,
పరుషోద్గాఢపయోధరస్ఫుటతటో
పర్యంతకాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె వనఁగా,
సత్కావ్యముల్ దిక్కులం
జిరకాలంబు నటించుచుండుఁ గవిరా
జీగేహరంగంబులన్.

కాబట్టి నీవు నాయింట్లో సింహాసనంమీద కూర్చోవలసింది. నిన్ను నేను సేవిస్తాను. రాజాధిరాజులను నీయింటికి రప్పిస్తాను—అన్నాడు. అప్పటికి శ్రీనాథుఁడు ప్రౌఢనిర్భర వయఃపరిపాకములో ఉన్నాడు. ఆంధ్రనాయకుడైన భీమేశ్వరస్వామికి ఆదిభిక్షుత్వము మానిపించి సింహాసనం ఎక్కించినాడు. ఆంధ్రనాయికయైన కావ్యకాంతకు గీర్వాణీదాస్యము విడిపించి, గీర్వాణీ, కర్ణాటీ కామినీద్వయము సేవలుచేస్తూఉంటే సింహాసనేశ్వరిని చేసినాడు. ఇదిగో ఆ వైభవం చూడండి—ఆనందించండి. ఇందులో శ్రీ రాజరాజేశ్వరీ

సోపమున నున్న ఆంధ్రిని పశ్యంతీ వాక్కులతో ధ్యానించండి.

సీ. హాలాహలం బను నల్లనేరేడుపండు
 మిసిమింతుఁడును గాక మ్రింగినాఁడు;
పెన్నశైలికోనగోర బిసరుహాసనుమోముఁ
 గెందమ్మి విరివోలె గిల్లినాఁడు;
పంచవన్నియతోడఁ బ్రసవనారాచుని
 నెత్తిచిచ్చుఁగంట జొత్తినాఁడు;
మెఱుఁగుఁగోలలు దుల్ల మృత్యుదేవతనోరు
 గట్టించి, యముఁ గాలఁ దన్నినాఁడు;
గీ. త్రిపురదైత్యావరోధవాణీవిలాస
దంతతాటంకముల క్రస్త దలఁచినాఁడు,
దక్షపురిపానిహాఁతులఁ దవిలినాఁడు,
విశ్వలోకకుటుంబి భీమేశ్వరుండు.

సీ. నేదిష్టమున సప్తగోదావరంబున
 నఘమర్షణస్నాన మాచరించి
త్ర్యాయుతమంత్రాక్షతాభిమంత్రిత మైన
 విమలభూతిత్రిపుండ్రము ధరించి
మొగలివాకిలిఁ దాటి, దినువ శాక్వరరాజ
 నగరిపై వెన్నుని నమువుఁ జూచి
మణిశిలాసోపానమధ్యమార్గంబుగా
 నత్రింకపంబైన హర్మ్యమెక్కి
గీ. సప్తపాతాళభువనవిష్కంభములను
దొలచి వెడలిన జ్యోతిఃప్రదీప్తమూర్తి
శంభు భీమేశ్వరేశ్వరస్వామిఁ గొలుచు
పరమమాహేశ్వరున కేమిప్రాఁతి యుక్తి ?

సీ. గజచర్మ మెన్నఁడో కాని, నిచ్చలుఁ గట్టుఁ
 బసిఁడికమ్ముల పట్టుపచ్చడంబు;
భసిత మెన్నఁడో కాని ప్రతిదినంబునయందు
 మలయజంబు కురంగమదముఁ గూర్చు;
నిడుదపాములరాజులోడవు లెన్నఁడో కాని
 తారహారములు నిత్యము ధరించు;
నృకరంకరుండమాలిక లెన్నఁడో కాని,
 ధరియించుఁ గహ్లారదామ మెపుడు;
గీ. కాటివసుచక్క నెన్నఁడో కాని, యుండు
దక్షవాటీసువర్ణసౌధములమీఁద;
నెన్నఁడో పిశాచములనుగాని, ఇందుముఖుల
నెల్లకాలంబుఁ దలఁచు భీమేశ్వరుండు.

సీ. ఒకవేళ ధరియించు యువనాశ్వుఁ డిచ్చిన
 కట్టాణిముత్యాలకంఠమాల;
మాంధాతృఁ డిచ్చిన మాణిక్యఖచితకే
 యూరంబు ధరియించు నొక్కవేళ;
నిక్ష్వాకుఁ డిచ్చిన హీరాంకురంబుల
 యుంగరంబు ధరించు నొక్కవేళ;
ఘనచక్రవర్తియిచ్చిన ప్రవాళంబుల
 యొడ్డాణము ధరించు నొక్కవేళ;
గీ. వేడ్క ధరియించు నొక్కొక్కవేళయందు
భరత దుష్యంత రంతి నాభాగ నహుష
నల భగీరథ నృగమహీనాథ దత్త
హేమమణిభూషణముల భీమేశ్వరుండు.

ఆంధ్రభీమేశ్వరునకు మహారాజాధిరాజుల హేమమణిభూషణములు సమర్పించినాడు. అవన్నీ ఆమన ఆంధ్రీపరాశక్తికి సమర్పించినాడు. ఆంధ్రమాత అవన్నీ తన ఆంధ్రసుతులకు సమర్పించింది. గీర్వాణీ కర్ణాటీకృతసేవల నంగీకరించిన ఆంధ్రమాతదా అదృష్టము? ఆమె గర్భవాసమునఁ బుట్టిన మనదా అదృష్టము? ఈ వైభవ మంతా ఏనాడు చూచినామోగదా!

సీ. ధారాసురత్రాణధాటీసమారంభ
 గర్వపాథోరాశికలశజులకు,
సప్తమాడెయరాయ ఝాడెయష్ట్మపాల
 వందిత శ్రీపాదవనరుహులకు,
సింహాద్రిపర్యంతసీమాంధ్ర మేదినీ
 మండలీపాలనాఖండలులకు;
హరిదంతదంతిదంతావళీలిఖ్యమా
 నానేకజయశాసనాక్షరులకు,
గీ. వీరభద్రేశ వేమ పృథ్వీధవులకు,
నమఁగుమంత్రి మహాప్రధానాగ్రగణ్య
శెండపూడన్న జగనొబ్బగండబిరుద
సచివదేవేంద్రుఁ గృతి కధీశ్వరునిఁ జేసి.

ఆంధ్రసామ్రాజ్య స్వతంత్రాంధ్ర సార్వభౌముఁడు—అతని యాస్థాన మండలి ఆంధ్ర మంత్రిసార్వభౌముఁడు - ఆంధ్ర కవిసార్వభౌముఁడు— ఈ ముగ్వురును త్రిమూర్తులవలె సేవిస్తూవుంటే ఆంధ్రీపరాశక్తి ఆంధ్రసింహాసనేశ్వరియై కూర్చుండిన దినములు మరి రావుగదా. రాజులను పాదాక్రాంతులను జేసిన కవిసార్వభౌముని విడిచి, రాజులను తృణీకరించిన కవిమహాత్ముని మహిమను స్మరించుదాం-యింకొకసారి.

గౌడవంశస్థుఁడై సంస్కృతకవియైన డిండిమభట్టారకుని కంచుఢక్కను పగులగొట్టించి, ఆంధ్రీయశఃచంద్రికలను వ్యాపింపఁజేసి శ్రీనాథుఁ డీలాగు ఢంకామీద దెబ్బకొట్టి చెప్పినాడు:—

శ్లో. అయం మే వాగ్గుంఫో లలితపదవిన్యాస
 విశద, స్ఫురద్బంధో వంధ్యః పరహృది
 కృతార్థః కవిహృది, కటాక్షో వామా
 క్ష్యాః దరదళితనేత్రాంతగళితః, కుమారే
 నిస్సార స్పృహ కిమపి యూనస్సుఖయతి.

శ్లో. నిర్మాణే యది మార్మికోఽసి నితరా
 మత్యంత పాకద్రవన్
మృద్వీకామధుమాధురీమధుపరీ
 పాకోద్ధురాణాం గిరామ్;
కావ్యం తర్హి సఖే, సుఖేన కథయ
 త్వం సమ్ముఖే మాదృశాం
నోచే ద్దుష్కృత మాత్మనా కృతమివ
 స్వాంతా ద్బహి ర్మాకృథాః.

ఆ ఢంకాదెబ్బకు ఆనాటి సంస్కృతపండితు లంతా ఝడిసినారు. చేసినప్రతిజ్ఞ నిలబెట్టుకొన్నాడు కవిసార్వభౌముడు—ఆనాటివాడు.

# అధునాతన సామ్రాజ్యతత్త్వము

బారు గోవిందరావు

సామ్రాజ్యతత్త్వము వివిధదేశముల దృక్పథమున వివిధరూపములుగా మార్పులు పొందుచు వచ్చినను ప్రపంచచరిత్ర యెంత ప్రాచీనమో అంత ప్రాచీనతను వహించియున్నది. ఒక సంఘమువారు తమ ఆర్థికప్రాబల్యమువలనగాని, తమకుగల పలుకుబడివలనగాని, ఏవిధముగానైనను, మఱియొక సంఘమువారి నెప్పుడు అణచుటకు ప్రయత్నింతురో, అప్పుడే యీసామ్రాజ్యతత్త్వ మున్నదన్నమాట. ఆర్థికస్థిరత్వము (Economic Stability), ఆత్మ ఔన్నత్యమును సముపార్జించుట మానవసహజము. అందువలననే తఱచుగా మనము వలసరాజ్యముల నిర్మాణము ఖండ ఖండాంతరముల గనుగొనుటకు జరుగు సముద్ర యానములు, విజయవాంఛలతో జరుపబడు రక్తమయములగు పోరాటములు చూచుచున్నాము. ఇట్టి సామ్రాజ్య స్థాపనా తత్త్వమును గర్హించుచు ౧౯-వ శతాబ్దప్రథమ భాగమున ఆడమ్‌స్మిత్తు (Adam Smith), మిల్, బెన్‌థామ్ (Bentham) మొదలగు రాజకీయార్థిక తత్త్వవేత్తలు తమతమ యభిప్రాయములను వెలిబుచ్చిరి.

వీరి మహోత్కృష్టాభిప్రాయములే సామ్రాజ్యవాదమునకు ద్వితీయ దశయను నద్వితీయ 'అర్వాచీన సామ్రాజ్యతత్త్వమునకు' దారితీసినవి. కడపట ౧౯-వ శతాబ్దపు చరమ భాగమున డిస్రయిలీ (Disraeli) పోషకత్వమువలనను, తరువాత ఖండ ఖండాంతరముల వ్యాపారమునకై డబ్బు పెట్టుబడిచేసి లాభము పొందనెంచిన రాత్స్‌చైల్డ్సు (Ro-thechilds) మొదలుగాగల జ్యూయిషు ద్రవ్యాధికారుల రక్షకత్వమువలనను, ప్రారంభింపబడినది. అధునాతన సామ్రాజ్యవాద విమర్శనమునకు బూనుకొనుటకు బూర్వము మధ్యయుగముల (Middle Ages) నాటి నుండియు నీసామ్రాజ్య వాదాభివృద్ధిని సంగ్రహముగా సూచింప ప్రయత్నింతును.

౧౫, ౧౬ శతాబ్దములందు అమెరికా, ప్రాగ్దేశముల బయల్వెడలిన సముద్రయానముల వలనను, బంగారుగనులను వెదకి, నూతన వ్యాపారమార్గాన్వేషణ మొనర్చి తమ యధికార ప్రాబల్యము నన్యదేశములతల మోపవలయునను ఆవేశమువలనను జరిగినవి. మొట్టమొదట సామ్రాజ్యస్థాపనమును కాంక్షించినది, కొంతకాల మార్థికముగా నధికారమును చలాయించి యస్తమించిన స్పెయినుదేశము. తరువాత స్పెయినువారిని త్రోసిరాజని జర్మనీ వారును, ఇటాలియనులును ప్రాబల్యమువహించిరి. వీరితరువాత డచ్చి, పోర్చుగీసువారు పైకి వచ్చిరి. ౧౭, ౧౮ శతాబ్దములలో ప్రపంచ చరిత్రమునం దార్థికముగా కొంత మార్పు జరిగినది. ఇంగ్లండు, ఫ్రాన్సుదేశములందు పరిశ్రమ దినదినప్రవర్ధమానమగుచు వచ్చెను. ముడిసరుకులను విదేశములనుండి తెప్పించుకొని యంత్రములను, యంత్రసామగ్రులను తయారుచేసి విక్రయించుకొను తలంపుతో నారెండుదేశములు కూడా వలస రాజ్యముల నేర్పరచుకొనుటకు రంగమున ప్రవేశింప, దినుసుల విషయమున పోరాటములు బయలుదేరినవి. శ్వేతజాతులవారు ప్రపంచమందలి యున్నప్రదేశములను గనిపెట్టి క్రమముగా వలసరాజ్యముల నేర్పరచుకొని యచట ఆనాదిజాతులపై తమ యధికారమును చెలాయించుచువచ్చిరి. ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు కెనడాదేశమునకు, స్పెయినువారు ఫ్రెంచివారు మధ్య దక్షిణఅమెరికాకు, ఇంగ్లీషువారు ఆస్ట్రేలియాకు వలస పోయి వాటిని ఆక్రమించిరి. వారు తూర్పుద్వీపములందును, హిందూదేశమునందును వర్తకస్థానముల నేర్పరచుకొని క్రమముగా రాజ్యములను స్థాపించిరి. కాని వారి పరిపాలనాభారమును మోయజాలకపోవుచేట కొన్ని దేశముల వలస రాజ్యములు చ్యుతమయ్యెను. క్రీ. శ. ౧౭౫౬-౬౩ సంవత్సరములకుమధ్య జరిగిన సప్తసంవత్సరముల యుద్ధమువలన ఫ్రెంచి వలసరాజ్యములు నశించినవి. క్రీ. శ. ౧౭౭౬-వ సంవత్సరమున జరిగిన అమెరికా స్వాతంత్ర్య యుద్ధమూలకముగా అమెరికాదేశము నందలి ఇంగ్లీషు వలసరాజ్యములు స్వాతంత్ర్యమును సంపాదించినవి. స్పెయినువారిని ధిక్కరించి దక్షిణ అమెరికాదేశస్థులు స్వాతంత్ర్యమును ప్రకటించిరి. పోర్చుగీసులు బ్రెజిలు దేశమును కోల్పోయిరి. ఈ పరిస్థితులలో ఒక క్రొత్త ఆర్థికసిద్ధాంతము తలచూపినది. 'లెయిస్సెజ్ ఫెయిర్' అను, నీ క్రొత్తసిద్ధాంతము విదేశములతోగల వర్తకవ్యాపారముసంబంధమున ప్రభుత్వమువారు జోక్యము కలిగించుకొనగూడదని చాటెను. తరువాత కెనడా, కేప్ కాలనీ, ఆస్ట్రేలియా, న్యూజీలండులందలి యింగ్లీషు వలసరాజ్యములు స్వపరిపాలనమును సంపాదించినవి.

పారిశ్రామిక విప్లవము, నేత, యినుప సామానులు తయారొనర్చుటలో జరిగినమార్పులలోని యభివృద్ధి, ఇంజనీరింగులో వచ్చిన మార్పులు, యంత్రసామగ్రిని తయారుచేయుటకు గావలసిన ముడిసరుకుల యావశ్యకత, జర్మనీ, ఇటలీ, పోలండు మొదలగు పాశ్చాత్య దేశములం దభివృద్ధిజెందుచున్న జాతీయోత్సాహము, దేశభక్తిమూలకముగా సరిహద్దులను దాటి యన్యదేశముల నాక్రమింపవలయునను వాంఛ, కూలినాలివలన జీవించువారి జీవన పద్ధతిప్రమాణము (Standard of Life) లో కలిగినమార్పు—వీనివలన, 'సామ్రాజ్యతత్త్వము' మరల చిగిర్చినది. ఇదియే పైన పేర్కొనబడిన ద్వితీయదశ, అధునాతన సామ్రాజ్యవాదదశయును. ఇందు దినుసులు హెచ్చుట, వ్యాపారాభివృద్ధి ప్రబలుట, జలాశయములను నిర్మించుట మొదలగు ప్రజోపయోగకరములగు కార్యములను నిర్మించుటకు వలస రాజ్యములలో కంట్రాక్టులను సంపాదించుట, వానికి కావలసిన సామగ్రిని దిగుమతిచేయుట

మొదలగునవి—యీ ద్వితీయదశయందలి సామ్రాజ్యవాదగుణములు.

వ్యాపారాభివృద్ధివలన వలసరాజ్యములతో గలిగిన రాజకీయసంబంధమునకుతోడు, ఆర్థికముగాగూడ కొంత సంబంధమేర్పడెను. ఈ శతాబ్దమునం దార్థికముగా పారిశ్రామిక వ్యాపారములలో పాల్గొని కొలది బ్యాంకుల మూలకముగా ధనము నంతయు అమెరికా, జర్మనీదేశములు తమలోతాము పంచుకొనినవి. గతప్రపంచయుద్ధమువలన నేర్పడినసంక్షోభమీ పరిస్థితులకు మరింత తావు కల్పించినది.

సామ్రాజ్యవాదము లెన్ని రకములో, సామ్రాజ్యములను స్థాపింప ప్రయత్నించిన దేశముల ముఖ్యోద్దేశము లెవ్వియో నిర్ణయింప బూనుకొనుట జరుగనేరనిపని. వీరి యాశయములవలన సమకూడిన ముఖ్యప్రయోజనము ౧౯-వ శతాబ్దపు చివరభాగమున ఆఫ్రికాఖండమును కొలదిమంది ఐరోపాఖండవాసులు—ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మనీ, పోర్చుగీసువారు—పంచుకొనుట. ఆఫ్రికా ఖండమునందు యూరోపియనుల సామ్రాజ్యవాదము కేవలము దేశము నాక్రమించుకొనుటపై గాక ఆర్థికాధిపత్యముపై నాధారపడి యున్నది. ప్రపంచ మహాసంగ్రామానంతరము మొట్టమొదట అమెరికా యూరప్‌ఖండవాసుల దృష్టి సామీప్యప్రాచ్యదేశముల వైపునకు మరలినది. టర్కీయందు వ్యాపార సంబంధములైన హక్కులను సంపాదించుకొనువిషయమునందే కాక, ఓడిపోయిన టర్కీని పంచుకొనువిషయమునగూడ వారిలో పోటీ బయలుదేరినది. తరువాత మధ్యాసియా యందలి టర్కీ మొదలు చైనావరకుగల దేశముల—పర్షియా, టర్కీస్థానము, ఆఫ్గనిస్థానము, టిబెట్—విషయమునగూడ నిట్టి తికమకలు గలిగెను. అతివిస్తీర్ణమును, అధిక సంఖ్యాకులగు నానాజాతులుగలదియునగు హిందూదేశమును అయిదువేలమైళ్లదూరమున నున్న యింగ్లండువంటి చిన్నరాజ్యముసర్వవిధములకొల్లగొట్టుట బహుశోచనీయమును, ప్రపంచచరిత్రకునొకనిరుపమానమైనయుదాహరణమునుగదా యింగ్లీషువారి సామ్రాజ్యతత్త్వమునకు! ప్రథమమున వర్తక వ్యాపారమునకై వచ్చిన బ్రిటిష్‌వారు క్రమేణ రాజ్యము నెల్ల నాక్రమించుకొని పరిపాలన నెలకొల్పగలిగిరి. ౧౯-వ శతాబ్దమున హిందూదేశము ప్రభుత్వమువారి సామ్రాజ్యమునకు సర్వవిధముల నెడదయై వర్తించుటయు, తరువాత నెమ్మదిగా స్వపరిపాలనము కొలదికొలదిగా సంపాదించుకొనుచుండుటయును ప్రతివారికిని తెలిసిన విషయమే కాని ప్రాచ్యదేశీయుల దేశభక్తి, స్వాతంత్ర్యకాంక్ష, ప్రజాస్వామికప్రభుత్వవాంఛయు దినదినాభివృద్ధి యగుచు, వారు సామ్రాజ్యతత్త్వము నెదుర్కొనుచు నుండుటచే నాదేశములపై పశ్చిమదేశములకు గల ప్రాబల్యము తిరుగుమొగము పట్టి నాడి నెమ్మదిగా నంతరించుచున్న దని చెప్పవలయును. చివరకు బ్రిటిష్‌వారు తమ యఖండ సామ్రాజ్యమును పరిపాలింపజాలక, దేశమునందలి ప్రజలలో ప్రజలకు కలహములను కల్పించి పరిపాలించుటకు ప్రయత్నించుచుండ నింగ్లీషురాజకీయవేత్త యగు జనరల్ స్మట్స్, అది అక్రమ మని దూషించి ప్రతిపక్షము వహించెను. ౧౮-వశతాబ్దమునహిందూదేశమునరాజ్యమును కోల్పోయినదానికి మారుగా ౧౯-వ శతాబ్దమున ఫ్రెంచివారు ఆసియాఖండమునందాగ్నేయభాగమును సంపాదించుకొనిరి. ఇది హిందూదేశమును రక్షించుకొనుటకుగాను దానిచుట్టును తాటస్థ్యసంస్థానముల (Buffer-States) నేర్పరుచుకొనుటకు బ్రిటిష్‌వారిని పురికొల్పినది. ఈ పరిస్థితులలోనే సీయాంగు, మలయా, సింగపూరులందు బ్రిటిష్ వర్తకస్థానము లేర్పడుటయు, పాశ్చాత్యులు వలసదిగి రబ్బరుక్వారీలందు పనిచేయించుటకుగాను కొన్ని టన్నులద్రవ్యమును వ్యయ మొనర్చుటయు జరిగినది. డచ్చివారి తూర్పుద్వీపముల (East-Indies)యందు వలసదిగిన జనము ౫ కోట్లు. డచ్చివారు పంచదార, కాఫీ, తేయాకు, పొగాకు, సుగంధద్రవ్యములు ఉత్పత్తియగు ప్రదేశములలో దేశవాసులచే నిర్బంధముగా పనిచేయించిరి. డచ్చివారితోపాటు బ్రిటిష్‌వారును రబ్బరుపరిశ్రమకును, నూనెగనులను కనిపట్టుటకును కొంత ద్రవ్యమును వ్యయపరచి, వారితో సంబంధము కల్పించుకొనిరి (Royal Dutch shells). ఈ స్వాతంత్ర్యదేశముల భాగస్వామిత్వము ఒకవిధముగా నిరువురికిని లాభమునుగూర్చు సంబంధము నేర్పరుచుచున్నది.

ఐరోపాఖండమునకు దూరముగా నున్న తూర్పుదేశముల విషయమునుగూర్చి విపులముగా ముచ్చటింపవలసియున్నది. కారణమేమన, ప్రస్తుత చీనా-జపాను యుద్ధమును గూర్చి మనము విపులముగా నాలోచించుటయే. ఐరోపాఖండమునందలి వివిధదేశములు ఇతరదేశములలో తమ యధికారమును స్థాపించుట కేపద్ధతులనవలంబించెనో యీ ప్రాంతములగూడ నాపద్ధతినే యవలంబించెను. ఈ తూర్పుదేశములతో నైరోపాఖండవాసులకు గల సంబంధము మొదట ఒకరకముగా నుండినది, తరువాత నింకొకరకముగా మారినది. క్రీ. శ. ౧౮౪౦-౫౦ వరకు ఐరోపాఖండదేశస్థులు చైనా, జపానులతో వర్తకవ్యాపారసంబంధము కల్పించుకొనిరి. నల్లమందు యుద్ధములకు (క్రీ. శ. ౧౮౩౯-౪౨—౧౮౫౬-౬౦) ఫలితముగా నింగ్లీషువారు హాంగుకాంగును సంపాదించి, చైనావారిపట్టణములనైదింటిని యూరోపియనుల వర్తకమునకు బహిరంగపరచిరి. దీనికి దోడుగా తొమ్మిది రేవులందు ఇంగ్లీషువారు తమ అధికారమును చెలాయించిరి. అమెరికా సంయుక్తరాష్ట్రములవారు కూడా ఐరోపాఖండవాసులతో సంధిచేసుకొని చైనాద్వారములను వ్యాపారమునకు తెఱచిరి. తరువాత క్రీ. శ. ౧౮౯౦-వ సంవత్సరమున యూరప్‌ఖండవాసులు కేవలము వ్యాపారపుహక్కులతో తృప్తిచెందక చైనాలో చాలాడబ్బు వ్యయపరచి యక్కడ తమ యధికారమును స్థాపించి మార్కెట్టులను తమవశము గావించుకొనిరి. వారు అంతటితోగూడా తృప్తిచెందక చైనాదేశము నాక్రమింపజొచ్చిరి. తరువాత కొంతకాలమునకు జపానువారు పాశ్చాత్యపద్ధతుల నలవరచుకొని వ్యాపారరంగమునకు దుమికి, చైనాను యుద్ధమున నోడించి, కొరియా స్వాతంత్ర్యమును ప్రకటించుటకు సహాయమొనర్చి, మంచూరియాలో కొంతభాగ

మాక్రమించుకొనిరి. వీరి దినదినాభివృద్ధిని జూచి భయపడిన రష్యా, ఫ్రాంసు దేశములవారు జపానుతో సంధి గావించుకొని యేకమైరి. రష్యావారు తమ సొంతసొమ్మును వ్యయపరచి, వ్లాడివాస్టక్ (Vlodivostock) నుండి మంచూరియాద్వారా సైబీరియాకు 'చైనా ప్రాచ్య రైలుమార్గము'ను నిర్మించిరి. జపానువారు చైనానుండి యుద్ధప్రతిఫలముగా చాలాధనము కోరగా కబళింప గాచుకొనిన యూరోపియన్ బ్యాంకులు సప్లయిచేసినవి. క్రీ. శ. ౧౯౦౩—౫ వరకు రష్యా జపానులకు జరిగిన యుద్ధములో జపానువారు విజయము గాంచి లియావొటంగ్ ద్వీపకల్పము నుండి, పోర్టు ఆర్థరు (Port Arthur) నుండి రష్యావారిని పారద్రోలిరి. ౧౯౧౦ లో కొరియాను జపాను తన సామ్రాజ్యమునందు కలుపుకొనెను.

ఆధునిక కాలమున నన్ని దేశముల నావరించిన జాతీయత యుద్ధములకు మూలకారణమయ్యెను. ఐక్యమును కోరిన దేశములను విడివడజేసినది. అన్యదేశీయుల పరిపాలనాభారమును మోయుచున్న వలసరాజ్యములు స్వాతంత్ర్యమునకై పోరాడజొచ్చినవి. విజయముల గాంచు దేశము లన్యదేశముల నావరింప నుంకించుచున్నవి. ఇవి ప్రపంచసంగ్రామ పౌర్వాపర్యములనాటి కథలు.

క్రీ. శ. ౧౯౧౪-న సంవత్సరమున జరిగిన ప్రపంచ మహాసంగ్రామము జపానువారికి సామ్రాజ్యసముపార్జనమునకు దారి చూపినది. జపానువారు జర్మనీవారితో యుద్ధము ప్రకటించి కియాచౌను ముట్టడించిరి. మరుసంవత్సరమున పెకిన్ (Pekin) కు వారు కోరిన ౨౧ కోరికలను చెల్లించి స్నేహము సల్పిరి. జపానువారికి మంచూరియా, మంగోలియాలతో వర్తక మొనర్చుకొనుటకు చైనావారు ప్రత్యేకహక్కుల నొసంగిరి. పూర్వము జర్మనీవారికి షాంగ్‌టంగ్ నందు గల హక్కులను జపానువారికి మార్చిరి. తరువాత కొంత కాలమునకు జపాను తా నాక్రమించిన దేశము నంతయు వదలివేసి, కేవలము వర్తకవ్యాపారపు హక్కులను కోరెను. ఈ సందర్భమున రష్యాయందు సాంఘికముగా విప్లవము (Socialism) వచ్చిన దని చెప్పకతీరదు. ఇట్లు కూలివారు ధనవంతులపై తిరుగబాటు సల్పి సర్వసామ్యములను పొందవలసిన పని ప్రతి దేశమునందును జరుగవలయు నని రష్యా పట్టు పట్టెను. ప్రయత్నములు తీవ్రముగా జరుపుటచే కొలదిమంది ధనవంతులవలన ప్రపంచములో మహాసంగ్రామములు చెలరేగుచు వచ్చినవి. అరాజకము ప్రబలు కాలమున రష్యా ఆచరణలో పెట్టదలచుకున్న ఆశయము మహోత్కృష్టమైనదిగదా!

ఇట్టి పరిస్థితులలో జపాను జాగరూకమై సక్రమమైన పద్ధతులమీద యుద్ధసన్నాహ మొనర్చుకొనెను. నేవల్ లిమిటేషన్ కాన్ఫరెన్సు (Naval Limitation conference) జరిగిన సందర్భములో బ్రిటన్, అమెరికా సంయుక్తరాష్ట్రములు, ఫ్రాన్సు, ఇటలీ జపానులు ముఖ్యముగా పాల్గొనినవి. పసిఫిక్ మహాసముద్రమును కాపాడుకొనుటకు జపాను ప్రప్రథమమున నొప్పుకొని తరువాత తాను చేసిన ప్రమాణమును త్రోసిరాజన్నది. క్రీ. శ. ౧౯౩౪ వాషింగ్టన్, లండన్ ఒడంబడికలను త్రోసిపుచ్చి తన చేతిలో నున్న తోలుబొమ్మవంటి మంచూరియాను చైనా కష్టమను క్లిష్టపరిస్థితులలో నున్న సమయమున విడదీసెను. తరువాత నౌకాసమాచారములను బట్టి జపాను, ఇంగ్లండు, అమెరికా సంయుక్తరాష్ట్రములతో నౌకాదళసంబంధము కుదుర్చుకొన ప్రయత్నించె నని తెలియుచున్నది. అదియునుంగాక యొక జపాను రాజకీయతత్త్వవేత్త జపాను ముఖ్యముగా నన్యదేశములతో గల వర్తకసంబంధమువలననే జీవించుచున్న దని చెప్పెను. జపానువారు పసిఫిక్ మహాసముద్రమునం దున్న మాండేటు దీవులను (Mandated islands) బలపరచుకొనుటకు క్రా (Isthmus of Kra) భూసంధియందు ౫౦ మైళ్ల కాలువ నొకదాని నడ్డముగా త్రవ్వించి సింగపూరునకు పోటీ చేయుచున్న క్రాయందు నౌకాదళము నుంచు నూహతో నున్నారు. తూర్పుసముద్రములపై బలవంతులుగా నుండుటకు ప్రస్తుతము సయామతో స్నేహము కల్పించుకొని మెలగుచున్నారు. జపాను ఆసియా నంతయు కబళింప నుంకించుచు ప్రప్రథమమున చైనాపై కాలు దువ్వినది. పెకిన్‌తోసహా, ఉత్తర చైనాదేశమును సామంతరాజ్యముగా జేసికొనుటకు ప్రస్తుతము తలపెట్టినది. అంతర్జాతీయ వలసదేశములందుగాని, హాంగుకాంగునందుగాని జపానుకు ప్రత్యేకపుహక్కు లేమియు లేవు. జపాను యొక్క పశుబలమే జపానువారిని రక్షింపవలయును.

అమెరికా అన్యదేశములపై నధికారమును కాంక్షించి కొలది ధనవ్యయమను మఱియొక నూతనమార్గ మవలంబించినది. దీనినే Dollar diplomacy అందురు. ఇది కేవలము బీద దేశములకు ధన మిప్పించి యార్థికముగా నధికారము చెలాయించుట యన్నమాట. క్రీ. శ. ౧౮౨౩ వ సంవత్సరమున అమెరికా సంయుక్తరాష్ట్రముల కధ్యక్షు డగు మన్రో (Monroe doctrine) పశ్చిమార్ధగోళము లోనికి యూరపుఖండవాసులు ప్రవేశించినచో నమెరికాకు శాంతి శూన్యమని తెల్పెను. ఆ పద్ధతి ననుసరించి పశ్చిమార్ధగోళములోనికి యూరోపియనులను రానీయకుండ కాపాడుటకు ప్రయత్నములు జరుగుచు వచ్చెను. క్రీ. శ. ౧౮౯౮-వ సంవత్సరమున జరిగిన స్పెయిన్ అమెరికా యుద్ధఫలితముగా క్యూబా, ఫిలిప్పయిన్ (Phillipines), హవెయి, (Hawai), హైటీ (Haiti) దీవులను బలవంతముగా సంయుక్తరాష్ట్రముల సంపాదించెను. మధ్య అమెరికాలోగూడ ౧౯౨౦-వ సంవత్సరమున పెనామాజలసంధిని త్రవ్వించి ప్రపంచమంతటితో నౌకాసంబంధమును కల్పించుకొనెను. నూనె సంపాదనమునకు (oil concessions) మెక్సికోను వశపరచుకొనిరి. ఈవిధముగా ౨౦ వ శతాబ్దములోని అమెరికావారు తమ ప్రాబల్యము నన్యదేశములపై చూపుటకు ప్రయత్నించిరి. క్రీ. శ. ౧౯౧౪ నాటి ప్రపంచ మహా సంగ్రామానంతరము నుండియు వీరి ప్రయత్నములు హెచ్చుచుచున్నవి. వీరు నూతనప్రపంచమును వదలి యూరప్‌ఖండములో సంగ్రామమువలన దెబ్బ

తినిన దేశములపైన, దగ్గరగానున్న ప్రాదేశములపై కన్నువైచిరి.

నానాజాతి సమితి (League of Nations) యీ సామ్రాజ్యతత్త్వ విజృంభణము నెడల నెట్టి యభిప్రాయము వహించియుండెనో తెలిసికొనుట మన ముఖ్యకర్తవ్యము. 'Laissez-Faire Liberatism'- లైసిఫైరీ మితవాదిత్వము - నేషనల్ లేబరుమువ్‌మెంట్లు (National Labour movement) సామ్రాజ్యతత్త్వము నెంతగా నెదుర్కొన్నను పెచ్చుపెరిగి పోవుచునేయున్నది. ప్రపంచ మహాయుద్ధమునాటి చివరరోజులలో నానాజాతిసమితివారు సభ జరిపిరి. అధ్యక్షులగు విల్సన్ (Woodrow Wilson) తన ౫ వ పాయింటుగా వలసరాజ్యములయొక్క లాభములుగూడ ప్రభుత్వమువారి లాభములతో సమానములుగా నుండవలయు ననియు పరిపాలకులకు హక్కెంతవర కున్నదో నిర్ణయింపవలయు ననియును చెప్పెను. ఈ సభవారి తీర్మానమైనతరువాత జనరల్‌స్మట్స్ (General Smuts) చే నేర్పరుపబడిన వలసరాజ్యముల పరిపాలనాపద్ధతి (Mandate System) ని విల్సన్‌గారామోదించి, నానాజాతిసమితికి వలసరాజ్యముల నుండియు ప్రజాప్రతినిధులు వచ్చునట్లు ప్రయత్నించిరి. శాంతిని గూర్చుటకు క్రీ. శ. ౧౯౧౯ లో పారిస్‌నందు గొప్ప సభజరిగెను. ప్రపంచమందలి సర్వ మానవజాతుల ప్రతినిధులును దానికి విచ్చేసిరి.

ఈ విధముగా శాంతిని గూర్చుటకు ప్రయత్నించినవారు వలసరాజ్యములను A B C. అని మూడురకములుగా విభజించిరి. A.రకపు వలసరాజ్యములు సంపూర్ణ స్వాతంత్ర్యము ననుభవించ వచ్చును. ఇవి ఫ్రెంచివారి సిరియా, ఇంగ్లీషువారి మెసపొటోమియా; పాలస్టయినులు, పూర్వకాలము నుండియు టర్కీ సామ్రాజ్యములో గలసి మణగియున్న అరబ్బీయుల దేశములు. B. వలసరాజ్యములు సామాన్య వలసదేశములుగా నుండవలయును. ఆత్మస్వాతంత్ర్యము, మతస్వాతంత్ర్యము ననుభవింతురు. వల్లమందు, బానిస వ్యాపారములనుమానుదుమనియూరప్ వాసులు B. వలసరాజ్యములవారి కభయమిచ్చిరి. సర్వస్వాతంత్ర్యము వహించి వ్యాపారముగూడ చేయు నుని వాగ్దానమిచ్చిరి. ఈ B. మాండేటులు పూర్వము జర్మనీవారి వలసరాజ్యములగు ఆఫ్రికాలోని భాగములు. అనగా నీవలస దేశములు ఆర్థికములను పరిపాలకుల చేతులలో నుంచవలయునన్న మాట. C. రకపు మాండేటులు తమ సామ్రాజ్యమున కలుపుకొబడినవి. ఇట్టివి కొన్ని జర్మన్ కాలనీలు సౌత్ వెస్టు ఆఫ్రికా, న్యూగినియా,సామసా, జాప్ మొదలైనదీవులు.

వలసరాజ్యముల పరిపాలనాపద్ధతి నీవిధముగా జూచినచో తరువాత కొంతవరకు బాగుపడినదని చెప్పవచ్చును. ఈ వలసరాజ్యములపై గల యధికారము నానాజాతిసమితి వారికి వారి ప్రతిసంవత్సరపు రిపోర్టులను పరిశీలించుటయే. ప్రస్తుతము ప్రపంచమున ౧౦ యూరోపియన్‌రాజ్యములు సామ్రాజ్యాధిపత్యము వహించియున్నవి. ఇవి ఇంగ్లండు, ఫ్రాన్సు, హాలండు, రష్యా, జపాన్, అమెరికా, సంయుక్తరాష్ట్రములు, బెల్జియము, పోర్చుగల్, ఇటలీ, స్పెయిను దేశములు. ఇందు ఇంగ్లీషువారి సామ్రాజ్యము చాల గొప్పది. వీరి సామ్రాజ్యమందలి 3/4 వ వంతు జనసంఖ్య హిందూదేశముననే గలదు. ఇటలీ, జపాను సామ్రాజ్యములందు జనసంఖ్య యభివృద్ధిపొందుటచే నన్యదేశాక్రమణమును కాంక్షించుచున్నవి. అమెరికా, ఫ్రెంచి, పచ్చి దేశములలో పరిశ్రమ లభివృద్ధిచెందుటవలన వాటినివిక్రయపరచుకొనుటకు, ముడిసరుకులను తెప్పించుకొనుటకును, అన్యదేశములతో వర్తక వ్యాపారమును కాంక్షించుచున్నవి. రష్యా దేశముయొక్క ఆసియాయందలి సామ్రాజ్యముగూడ నొక ప్రత్యేక ప్రాముఖ్యము వహించియున్నది. సామ్రాజ్యతత్త్వ ముఖోద్దేశములు వారి వాంఛితమున చెల్లెనో లేదో మనము నిర్ణయింపజాలము.

ఈ విధముగా అన్యదేశములపై యధికార వాంఛ కేవలము ఆర్థికపరిస్థితుల ననుసరించి, అనగా నొకానొకదేశము తన కొరతలను దీర్చుకొనుట కన్యదేశములపై నాధారపడుట మిక్కిలి శోచనీయముగా పరిణమించిన దని చెప్పకతీరదు. సామ్రాజ్యవాదులందఱును తమ కార్థికముగా గలిగిన లోటుపాటులను దీర్చుకొనుటకు ప్రయత్నించి యన్యదేశముల కొల్ల గొట్టుచున్నారని చెప్పకతప్పదు.

ప్రస్తుత మైరోపాఖండమునందు యుద్ధనీతితోపాటు ఆర్థికనీతిని విడదీయలేము. ప్రజాప్రభుత్వ మున్న దేశములు తాటస్థ్యము వహించుటకు తోడుగా సహకార దేశములు చెలరేగుచున్నవి. ఆర్థికముగా క్లిష్టపరిస్థితులు వచ్చినచో యుద్ధములు చెలరేగుట సహజము. ఈ శతాబ్దమున ననేక దేశములు నూనెపై లాభములకొఱకు యుద్ధరంగమునకు తయారైనవి.

ఇక జపానుపరిస్థితుల నాలోచించినచో నీ సంవత్సర మాగష్టునెలయందు, కొరియా, మంచూరియా, చైనా దేశాభ్యుదయమున కన్న పేరుతో జపానుచే ఆర్థిక కేంద్రాలోచనసభ (A Central economic council) స్థాపింపబడినది. పోయిన ప్రపంచసంగ్రామమున దెబ్బ తిన్న దేశములను కొన్ని బలవంతములైనదేశములు వాటిని పంచుకొని తమయధికారమును చెలాయించుటచే వారి కార్థిక దుస్థితి సంభవించినది. ఇట్టి సందర్భమున జర్మనీదేశము మంచి యుదాహరణ మగుటయేగాక ప్రస్తుత యూరోపుపరిస్థితుల నన్నిటిని ఆ దేశచరిత్ర విప్పి చెప్పగల సామర్థ్యము గల్గియున్నది. కొన్ని సైనికసంబంధమైన షరతులకు జర్మనీని లొంగదీసి యా దేశముయొక్క యుద్ధసామగ్రిని నిర్మూలముచేయుటకు మిగిలిన దేశములు ప్రయత్నము చేసినవి. జర్మనీదేశమునందు రైనునది కుత్తరముగా నున్న దేశమంతటను మిగిలిన యూరప్‌ఖండవాసు లందఱును కలసి, జర్మనీని నేలమట్టము చేయు తలంపుతో తమ సొంతసైన్యములను నిల్పిరి. ఇట్లు ౧౫ సం. వత్సరములు జరిగెను. తరువాతజర్మనీవారు సైన్యమునుబలపరచుకొనుటకుగాని, తిరిగీ కోటగోడలను కట్టించుకొనుటకుగాని వీలు లేదని తీర్మానము గావించిరి. ఈ పరిస్థితులలో జర్మనీదేశము యుద్ధసామగ్రిని తయారు చేసుకొనుచు నానాటికి బల

వంతు లగుచున్న అన్యదేశములమధ్య ఆత్మసంరక్షణముకూడ తావులేని శోచనీయదశ ననుభవించుచున్నది. ఇట్లెంతోకాలము కట్టిపెట్ట లేక పోయెను. క్రమముగా జర్మనీ కోలుకొనెను. వర్సాయిల్సుసంధి (Treaty of Versailles) యేవిధముగానైనను శాంతిని సమకూర్పలేక పోయెను. జర్మనీకి దుస్థితి తొలగినది. జర్మనీనియంతయగు హిట్లరు రెండు సంవత్సరములకు పూర్వమే సైన్యమును బలపరచుకొని, వాయుసముద్రాయుధములనుగూడ (?) కూర్చుకొనుచుండగా నెదురాడిన దేశము లేదు. వెనుక బలమును కూర్చుకొనగూడదని శాసించిన దేశములోనికి తనసైన్యమును ప్రవేశపెట్టి మాజినాట్ వద్ద నన్యదేశీయులచే కట్టబడినకోటగోడలను నేలమట్టము గావించెను. వర్సెల్సు సంధిని ధిక్కరించెను. యుద్ధానంతరము ఫ్రెంచివారనుభవించిన ప్రాబల్యమును క్రీ. శ. 1923 నుండి జర్మనీవారనుభవించుచున్నారు. హిట్లరు జర్మనీదేశము ప్రపంచసామ్రాజ్యము స్థాపింపవలయు ననియు, తూర్పుదేశముల నాక్రమింపవలయు ననియును చాటగలిగెను. దీనికి తోడుగా జర్మనీభాష మాట్లాడు వారలందరు నేకము కావలయునన్న సంఘవేదాంతమును (Social Philosophy) నాజీపక్షమువారు ప్రబోధించుచువచ్చిరి. ఇట్టి పరిస్థితులలో సంధిని కూర్చుటకు రాజకీయతత్త్వవేత్తలు పట్టణమునుండి పట్టణమునకు తిరుగుచుండిరి. ఆసమయమున నెంతచిన్న తగాదా వచ్చినను ఇంగ్లండుకు సంబంధించకుండా పోజాలదు.

దేశాభ్యుదయమునకు సైన్యమే కారణమనియు, సైన్యాభివృద్ధి యొనర్చుకొనుట వలన చేయనేరనిపని లేదనియు విర్రవీగుట వలన ముప్పువచ్చినది. ఇంగ్లండు తనకు నౌకాదళమువలననే సామ్రాజ్యము లభించినదని విర్రవీగుచున్నది. పూర్వము ఫ్రాన్సుదేశాధీశుడైన పదునాల్గవ లూయీయును (Louis-XIV), నెపోలియనులును తమసైన్యమువలననే ఐరోపాఖండమును జయింపగల్గిరి గాని వారు పరిపాలించినది రక్తసిక్త ప్రపంచము గాని శాంతియుతప్రపంచము గాదు. సంఘీభావమే సర్వాధికారమును చేకూర్చునని బిస్మార్కు (Bismarck) జర్మనీకి బోధచేసెను. ఇంగ్లండుకూడా తదుపరి తాను సామ్రాజ్యమును స్థాపింపగలిగినది తన నౌకాదళమువలనగాక వర్తక వ్యాపారమువలన నని గ్రహింపగలిగినది. పరిశ్రమలే యుద్ధమునకు మూలకారణముగా పరిగణింపబడుచున్న యీకాలమున ఉక్కు, రసాయనపరిశ్రమలు, యుద్ధసామగ్రిని చేకూర్చునను తలంపుతో హెచ్చుగా పోషింపబడుచున్నవి. ఇట్లన్ని దేశములును పరిశ్రమ లభివృద్ధి జేసుకొనుటవలన ప్రతిదేశమునకు ప్రక్కదేశమన్న భయము జనించెను. గొప్ప గొప్ప దేశములు 'సమవృద్ధి విధానము' (Balance of Power) నిలువబెట్టుటకై సంధిచేసుకొనెను. యుద్ధమువలన ప్రపంచమునకు గలిగిననష్టము.

1914-18

90 లక్షల జనులు చనిపోయిరి.

2 కోట్లు గాయములు దెబ్బలు తగిలినవారు.

56 బిల్లియన్ల పౌనుల ధనవ్యయము.

1930 (తరువాత)

1 కోటి 50 లక్షలమందికి నిరుద్యోగము.

890 పౌనులు ప్రతిసంవత్సరపు యుద్ధసామగ్రి ఖర్చు.

యుద్ధమునకు కావలసిన సామగ్రిని తయారుచేసుకొనకుండ చూచుభారము నానాజాతిసమితివారిపై బడినది. సైన్యాధ్యక్షులందఱిని ఎషర్ స్కీము (Eser Scheme) నంగీకరించి యాలోచించుటకే పిలిచిరిగాని సైన్యములను నుజేంచి యాలోచించుటమానిరి. యుద్ధసామగ్రి తయారుచేయుట జాగ్రత్త పరచుటనుగురించి తర్కింప మొదలిడిరి. తమనే దారితీయుమందు రేమోనని గొప్పదేశములవారు కాచుకొనిరి. యుద్ధప్రతికూలముగా కెల్లాగ్ ఒడంబడిక (Kellog Pact) జరిగెను. ప్రపంచమందలి గొప్ప దేశములన్నియు దాని కొడంబడినవి. యుద్ధములు ముందెన్నడును తరువాత జరుగుటకు వీలులేకపోయినను అమెరికావారు హెచ్చుధనము వ్యయమొనర్చి నౌకాదళ మభివృద్ధిచేసుకొనిరి.

'డైలీహెరాల్డు' పత్రికా సంపాదకవర్గములో నొకడైన ఫ్రాన్సిస్ విలియమ్సు (Living Age) అను పత్రికలో యుద్ధసామగ్రికై యేయే దేశము లెంతవ్యయపరచినదియు పొందుపరచియున్నాడు. అన్యదేశీయులు యుద్ధసామగ్రిని బలపరచుకొనుచున్న సందర్భమున బలములేని దేశములను కేవల మాత్మసంరక్షణముకూడా లేకుండచేయుట యన్యాయమని వాదోపవాదములు కొన్ని సంవత్సరములకాలము జరిగెను. యుద్ధసామగ్రిని తయారుచేసుకొనరాదని ప్రకటింపబడిన సభ లనేకములు నవ్వులపాలయ్యెను. ఈసందర్భమున నానాజాతిసమితి యేమియు చేయలేకపోయినది.

హేగుపట్టణమునందు అంతర్జాతీయ న్యాయసభ (International Court of Justice at Hague), ప్రతిదేశమును తనకోరినవిధముగానందు రక్షణమును దీసుకొనుటనుబట్టి, నామమాత్రావశిష్టములయ్యెను. నానాజాతిసమితికూడాను ప్రపంచశాంతి నెలకొల్పుటకు ప్రయత్నించి విఫలమయ్యెను. ప్రతిదేశమును యుద్ధసామగ్రినిబలపరచుకొనుచునేయున్నది. యుద్ధమువలన గలుగు నార్థికఫలితములను గూర్చి ఇటలీనియంతయగు ముసోలినీ తన యాత్మకథయందు 'ఫాసిస్టుస్టేటు-దానిభవిష్యత్తు' (Fascist State and its future) అనుశీర్షిక క్రింద విపులముగ చర్చించియున్నాడు. ఇతడే మరియొక యుపన్యాసమున మానవశక్తి నంత యత్యుత్తమదశకు గొనివచ్చి సంఘములో పలుకుబడియిచ్చునది యుద్ధమొక్కటే ననియు, శాంతియసంభవమని, యుద్ధము లాగినచో శాంతి యుండవలసినదేగాని యన్యతరముగా శాంతిశూన్యమని తమసౌభాగ్యముతప్ప యితరవిషయ మనవసరమనియు చెప్పెను. ఇంగ్లండు ఫ్రాన్సుదేశములకు వ్యతిరేకముగా ఇటలీ అబిసీనియాయం దేమియు చేసియుండెడిదిగాదు. ఒకానొకప్పుడు ఫ్రెంచివారుగూడ నిటలీవారికి చేదోడువాదోడుగా పనిచేసిరి. తరువాత వర్సెల్సుసంధికి వ్యతిరేకముగా ఆంగ్లజర్మనీ నౌకాసంధి జరిగెను. రూజువెల్టు అధ్యక్షుని 'నూనెకొఱకుచేసిన విజ్ఞాపన (Oil embargo) నామోదించినచో నిటలీ నేలమట్టమై యుండెడిది. నానాజాతిసమితి ఆర్థికముగా

పనిచేయగలిగినదేగాని సర్వమానవసౌభాగ్యము కొఱకు పనిచేయలేకపోయెను. అట్లుచేయలేక పోయినచో నాసమితిప్రయోజనము శూన్యముగాన అట్టిసమితి యనవసరమని చెప్పవచ్చును.

ఇక సామ్రాజ్యతత్త్వమువలన మతనైతిక సంబంధములకు కలుగులాభనష్టముల నాలోచించవలయును. మతవిషయమై ప్రస్తుతదేశముల దృక్పథము విషాదకరముగా నున్నది. రష్యాదేశమందు కమ్యూనిస్టులు బాహాటముగా మతము నెదుర్కొందురు. ప్రస్తుతరష్యాకు స్టాలిన్ తప్పనన్యమైన భగవంతుడులేడనియు నాతనియుద్దేశముల నెదురు చెప్పువారు అతని మతమున నాస్తికులనియు ట్రాట్స్కీ (Trotsky) రష్యామతమునుగూర్చి యెగతాళిగావించుచున్న విషయ మెల్లరకును దెలిసినదియే. ప్రస్తుతనాజీ జర్మనీయందు మతము వ్యక్తిస్వాతంత్ర్యమున కేయడ్డు రానంతవరకు సహింపబడును. ఇటలీయందు నియంతయే భగవంతుడుగా పరిగణింపబడుచున్నాడేగాని పరమాత్ముని వా రెఱుగరు. ఇట్టివన్నియు బౌద్ధమతాభిమానులను జపానువంటి ప్రాగ్దేశమునందలి యాస్తికుల కేహ్యముగా దోచవచ్చును. కానియూరప్ఖండవాసుల నావరించిన శూన్యమతతత్త్వము లేక నాస్తికము వీరినిగూడ నావరించుచున్నది. ఇట్టితత్త్వమంతయు విజయములనుచున్న దేశములదేకాని అబిసీనియావంటి నోటమిజెందిన దేశములవారు చెప్పనదిగాదు. వారు భగవంతుని పరమేశ్వరత్వమును నమ్ము వారే.

యుద్ధమువలన వ్యక్తిగతముగా నొకానొక దేశమువారికైన సౌఖ్యము ననుభవింతురేమో గాని సర్వదేశములకు శాంతిశూన్యము. ఈనాడు యుద్ధసామగ్రి విరివిగా పెరిగిపోయి లోకము నల్లకల్లోలములో ముంచివేయుచున్నది. ఇట్టికల్లోలములు రూపసంగవలయు నన్నచో మానవసౌభ్రాత్రమునకు, నాగరికతకు వేరుపురుగులగు నియంత సమ్రాట్టులపదవులు నాశనముకావలయును.

ఈవిధముగా ప్రపంచమంతటిని కొన్ని దేశములు పంచుకొనుచున్నవి. ఓడిపోయినదేశము వారి కణగిమణగియుండినను శాంతిని కాంక్షింపరు. వీరికి శాంతియున్నకాలమున ముడిసరకులు దొరకుచున్నను యుద్ధమును మానక వలసరాజ్యములకై ప్రయత్నించి సామ్రాజ్యమును స్థాపింపప్రయత్నింతురని తత్త్వవేత్తయగు ఆల్ఫ్రెడ్ ప్లమ్మర్ (Alfred Plummer) చెప్పుచున్నాడు. జర్మనీ, ఇటలీ, జపానులు యుద్ధసామగ్రిని తయారుచేయుటలో గర్వమును వహించియున్నారు. అంతర్జాతీయముగా జరుగబోవుదోపిడుల నాపుటయెట్లన్న ప్రశ్న వచ్చును. వలసరాజ్యములను పంచిపెట్టుటతో నాసనని తలపోయుదమన్న (ముడిసరకుల కమిటీ Raw-Material Committee) వా రిదివరకే యట్లుచేసినారుగాదా! కాలనీలవారియభిప్రాయమును చేకొని నానాజాతిసమితివారు కాలనీలను మాండేటరీలను తిరిగిపంచినచో ప్రపంచమున శాంతి కలుగునేమో యని నానమ్మిక. నానాజాతిసమితి కూడా కొన్నిమార్పులను పొందవలయును. అందలిమాండేటుకమిషన్ వారికి మరికొన్ని హక్కుల నొసంగవలయును. దాని పరమోద్దేశము సర్వదేశములకు ముడిసరకులను సప్లయి చేయుచు యుద్ధము రాకుండునట్లు చూచుచుండుటయే యైయుండవలయును. సామ్రాజ్యదేశములు డిక్టేటర్లు చేయుదౌష్ట్యము, వారిమనము మార్చివేయవలయునుగదా!

ఈనాడు మానవజాతికి గలయభిప్రాయమునుగూర్చి అబిసీనియాచక్రవర్తి హైలీసలేసీ (Haile selassie) పరవావరులు కొందఱు యుద్ధసామగ్రిని తయారుచేసి దేశములనాశన మొనర్చుటలో నలుపులేక పనిచేయుచున్నప్పుడు విజ్ఞానధనులను స్త్రీపురుషులు పనికిరానివారైరి. సర్వమానవ సౌభాగ్యమునకు పాటుపడవలయు నన్నచో నాధ్యాత్మికజ్ఞానము ముఖ్యావసరమని చెప్పెను. మన మొకానొక దేశసౌభాగ్యమునకు పాటుపడుటకన్న సర్వమానవసౌభాగ్యమునకే పాటుపడుట పరమోద్దేశముగా నుంచుకొనవలయును. ఇక మున్ముందు రాబోవువీరులకు, వీరవనితలకిదియే కర్తవ్యము.

# ఆంధ్రభాషాపరిణామము

గరిమెళ్ల సత్యనారాయణ

మానవులలో ఎట్టి పరిణామములు జరుగుచుండునో వారుమాట్లాడుచుండు లేక వ్రాయుచుండు భాషలలోకూడ అట్టి పరిణామములు జరుగుచుండుట సహజము. భరతఖండమునందలి ప్రతిజాతియందును నేడు అత్యద్భుతమైన పరిణామములు జరుగుచున్నవి. ప్రాతవిశ్వాసములపై ఒకవరుసనుండి విరోధము, క్రొత్తసూత్రములపై నొకవరుసనుండి విశ్వాసము లేచుచున్నది. ప్రాతదే పరమావధి క్రొత్త దెల్లయు నీటిబుడగవలె తాత్కాలిక మనుభావములు కూడ ఒక ప్రక్కను లేకెత్తుచున్నవి. ప్రాచీననాగరికత లేని దేశములలోవలె మనదేశమువంటి దేశములలో క్రొత్తపద్ధతులపై దుర్గ్రాహము ప్రబలుట సంభవింపదు. క్రొత్తదానిపై కొల్ల నెగ్రాకగోరు కొందరుచపలు రుండుచున్నను, అలతి కాలములో వారికే ప్రాచీనచైతన్యతాజ్ఞానముదయించి, వారిభావములను మథించి మరియొక నూతనమార్గమునకు వారలను త్రిప్పివైచును.

అయినను జేనినికాని క్రొత్తదను నేకైక కారణమున తృణీకరించుట లెప్పుడును కాదు; సాధ్యమును కాదు. ఎవ రెంతగింజుకున్నను "క్రొత్తప్రాతల మేలుకలయిక క్రొమ్మెరుంగులు చిమ్ము"చునేయుండును. క్రొత్తదాని నేవగించుకొనువారును అవలంబించువారును గూడ దానితత్వము వామూలాగ్రముగ గ్రహించియే విసర్జించుటకైనా స్వీకరించుటకైనా చేయుచుందురు. మన భరతఖండమును, అందుగల వివిధరాష్ట్రములును ప్రస్తుతము ఈ అవస్థయందే తటపటాయించుచున్నవి. ప్రాతదానిని విసర్జించుటకును వీలులేదు, క్రొత్తదాని ననేకమును స్వీకరించకయు తప్పదు.

ఈ విధమైన చైతన్యమువలన మన ఆంధ్రభాష యెట్లు పలుభంగులుగామారుచు పరిణామములందున్నదో గమనించుట యెంతయును అవసరము. ఈ పరిణామములకన్నింటికిని ఈ జాతీయనూతనచైతన్యమే కారణ మని చెప్పటకు వీలులేదు. జాతులలో విజాతీయసంబంధమైన నూతనసంచలనములు కలుగుచున్నను, మానుచున్నను కాలగమనమును పట్టికూడ మార్పులును, పరిణామములును సంభవించుచునే యుండును. వేయిసంవత్సరములక్రిందటి పదములును, ప్రయోగములును, వ్యాకరణవిశేషములును యెన్ని నేటికి మాయమైనవో యెవ్వ రూహింపగలరు! ఆనాటి వ్రాతప్రతులేనైన దొరకినయెడల ఇది ఆంధ్రమేనా అను సందేహము మనకు కలుగకమానదు.

ఆయినను అస్థిరమైనభాషలు మారునంత వేగముగా స్థిరమైనభాషలు మారవు. స్థిరమైన భాషలలోకి యెన్నిమార్పులు వచ్చినను వాని యథారూపము ఒకరీతిని శాశ్వతముగానే ఉండును. ఆంధ్రభాషకు నన్నయభట్టుకాలమున ఒకమోస్తరు స్థిరత్వమేర్పడినదని చెప్పవచ్చును. అతనితరువాత సుప్రసిద్ధులైన కవిద్వయము ఆతని వరవడినిబట్టియే గ్రంథములు వ్రాయుచుండిరి. తరువాతికవులు తమ పదములు కవిత్రయప్రయోగములేనా అని ఒక ప్రమాణమును బట్టి కొలుచుకొనుచుండిరి. తరువాత నెందరోకవులు నూతనప్రయోగముల చేయుచున్నను మహాకవిప్రయోగముల కున్న గౌరవము అల్పకవులవ్రాతలకు లేక మాడిపోవుచుండెడివి. మహాకవులుగూడ అనేకులు పుట్టి నూతనప్రయోగములు హెచ్చుచుండుట వలనను సాధారణప్రయోగములను నిరసించుచుండుటవలనను భాషకొక క్రొత్తమోస్తరు స్థిరత్వ మేర్పడినది. ఇది పద్యకావ్యముల ధోరణి.

గద్యకావ్యములకును, పదకవిత్వములకును ఇట్టి నిర్బంధము లేవియును లేకుండెడివి. సాధారణకవిమండలులు, వ్యాపకర్తలు వ్యాఖ్యాతలు వాడుకభాషను విరివిగా ఉపయోగించి మహాకావ్యములయందలి గూఢార్థములను నేటతెలుగులో ప్రజల కెరుకపరచుచుండిరి. ఈ వ్యావహారిక భాషావ్యాఖ్యానములు విరివిగానుండుటవలన కావ్యభాష ప్రాతగిల్లక, ఏనాటికిని సరిక్రొత్తదను నూతనత్వముతోనే రాణింపజొచ్చినది. ఈవిధముగా ప్రాతక్రొత్తలు సస్నేహముగా సరళరీతిని మధ్యయుగము లేక రాయలయుగముదాకా వర్ధిల్లినవి. రాయల యుగములో నాంధ్రభాష ఒక మహాన్నత్యదశ ననుభవించినది. ప్రాతపురాణ కవిత్వములోనికి క్రొత్త ప్రబంధఫక్కీలు ప్రవేశించినవి. క్రొత్త కల్పనలు నిరాఘాటముగ సాగుచుండినవి. వీనితోకూడ క్రొత్తప్రయోగములు విరివిగా దూరినవి. కవులను పోషించుట, కవిత్వములను వినిపించుట రాజులకు మంత్రులకు శ్రీమంతులకు పరిపాటియైనది. ఆకాలమున పుట్టిన ప్రబంధములకును కృతులకును అంతులేదని చెప్పవచ్చును. నేటికి అచ్చుపడిన వెన్నోపడగా మిగిలిన వెన్నో తంజావూరు భాండాగారమునందును, గృహస్థుల గృహములందును మిగిలియేయున్నవి. ప్రతిగృహస్థునకును తానొక కవికుటుంబమువాడనని చెప్పుకొనుటకు గర్వముగాఉండెను. ప్రతికవియు తనతాత ముత్తాత లెటువంటికవులో యే యే గ్రంథములు వ్రాసెనో గ్రంథాదిని యేకరువుపెట్టుకొనుట సంప్రదాయమైనది. జనసామాన్యములో కవిజనాదరణము హెచ్చిపోయెను. ఎవని కేవిద్యయున్నను ఏవిద్య లేకున్నను నోటిలో నాలుగుమాట లుండి పద్యము లల్లగలశక్తియుంటే చాలును. దేశాటనము గౌరవముగా చేయగల ఆధారము లభించుచుండెడిది. ప్రతిమహాకవియు అనేకసాధారణ కవులను తన శిష్యవర్గముక్రింద భావించి తరిఫీదు చేయుచుండెను. రానురాను సాధారణలేఖలును నిత్యవ్యవహారములునుగూడ కవిత్వభాషలో జరుపుకొనుట యొకవిశేషముగ నెంచబడెను. ఇవి నిజముగా ఆంధ్రభాషామతల్లికి అధికసౌభాగ్యదినములు. దేశములో యెన్నియుద్ధములు వచ్చి యెందరు ప్రాతరాజులు కూలి క్రొత్తసంస్థానములు క్రొత్తగద్దెలు యేర్పడుచున్నను, కవితాపోషణము కవితాప్రసంగములును యథారీతిని సాగుచునేయుండెను. క్షత్రియులు, రెడ్లు, వెలమలు, మహమ్మదీయులు సమస్తపౌరుష జాతులును కవిపోషణము నేమరక నేయుండెను.

కనుక విజ్ఞానము వేయిచేతులకేడువలె దేశము నంతటిని వెలిగించుచునే యుండెను.

ఈ ప్రబంధభాష యింత విజృంభించి కూడా, కవిత్రయము భాషను వెనుకకు త్రోయలేదు. నేటికిని ఈ ప్రబంధము లెంత సుగ్రాహ్యములై యున్నవో తిక్కనాదుల భాషకూడ అంత సుగ్రాహ్యమై యున్నదన్న ఆంధ్రభాష యొకమోస్తరుగా స్థిరస్వరూపమును వహించియున్నదని చెప్పుట కాటంకమేమికలదు? అయినను స్థిరత్వముకే ఒకమోస్తరు దేవతగా భావించి పూజింప మొదలుపెట్టినచో అనుకరణము ప్రబలి అసలు చైతన్య మంతరించకమానదు. పిదప కాలపు ప్రబంధముల కిట్టిదోషమే కొంతవరకు పట్టిపోయినది. ఈ స్థితికి ఆకాలపుకవుల స్థిరత్వారాధన మొక్కటియే కారణముకాదు. ఆంధ్ర జాతీయచైతన్యమే మందగించినరోజు లవి. ఆంధ్రులశిల్పనైపుణ్యము, క్షాత్రప్రజ్ఞ, వైదిక దీక్ష, ప్రాచీన గౌరవసంప్రదాయ పరిరక్షణము మొదలగు సుగుణములెల్లయు వసివాళ్లు వాడినవి. అంతకుముందుండిన దేశీయ - అల్లకల్లోలము లడుగంటె బ్రిటిషుప్రభుత్వమువారి వర్తకవాణిజ్యముల కనుకూలమైన శాంతి వాతావరణ మేర్పడినది. దేశస్థులందరిప్రజ్ఞలును ఆ ప్రభుత్వనీతిని పోషించు దెసనే వ్యాపింపజొచ్చినవి. ఆంధ్రసంస్కృతభాషలలో పాండిత్యము బిరుదులకంటె ప్రభుత్వమువారిచ్చు బియ్యే, యెమ్మే, టైటిల్సుమీద వ్యామోహము హెచ్చినది. ఆంధ్రభాషోపన్యాస ధోరణియందుకంటె ఆంగ్లేయభాషా వాచాలత్వమునందు చపలత హెచ్చినది. గ్రామములలోని పెద్దమనుష్యుల తీర్పులయందుకంటె జిల్లాకోర్టు హైకోర్టులతీర్పుల కెక్కబాకు ఆసక్తి పెరిగినది. స్వదేశీవస్త్రములు, బొమ్మలు, కత్తులు, ఆయుధములు వస్తువులకంటె విదేశీవానిపై కులుకువర్ధిల్లినది. ఆంధ్రభాషయందును ఆంధ్రాచారములయందును గల ఆసక్తి యొకమోస్తరు చాదస్తముక్రింద భావించబడినది. వానియం దింకను దీక్షగలవారికి శ్రీమంతులిచ్చు పారితోషికములు దానములుగా భావించబడుటవలన, వానిని స్వీకరించువారి ఆత్మగౌరవము క్రుంగిపోయినది. ఆంధ్ర భాషామతల్లికి దుర్దినము లవి. పిల్లలపాఠపుస్తకములుమినహాగా మరియెట్టియుద్గ్రంథములును ఈ కాలమున పొడమలేదు. అవి తప్ప యితరగ్రంథములు చెల్లలేదు. విద్యాశాఖవారి పోషణము తప్ప సాహిత్యాభివృద్ధికి వేరుమార్గము లేదాయెను. క్రమక్రమముగా కవిసంతానము లడుగంటినవి. ప్రతివానికిని ద్రవ్యాపేక్షయు, ఉద్యోగపరవశత్వమును నిత్యవిధులైనవి. ధీమంతులకు కొందరికి ఆంధ్ర విజ్ఞానాభిలాష యుండినను అది కేవలము క్షేమజమాత్రమై యుండెను. స్వజాతీయచైతన్యము నశించినజాతికి ఇట్టిదుర్గతి పట్టుట ఆశ్చర్యముకాదు.

ఈ విధముగా ౧౯౦౫ వ సంవత్సరము వరకును వచ్చితిమి. బంగాళా విభజనము ధర్మమంటూ ఒకవినూతన జాతీయచైతన్యము ఆసేతుశీతాచలపర్యంతమును చెలరేగినది. భారతదేశపు జాతులన్నిటికివలెనే ఆంధ్రులకును మెలకువకలిగి ఉదాసీనత వీడినది. ఆంధ్రభాషయందు, ఆంధ్రజాతీయతయందును ఒక భక్తి ఉదయించినది. దీనితో ప్రాచీనవిజ్ఞాన పరిశోధనము చరిత్రసంస్మరణము, ప్రబంధపఠనము తలయెత్తినవి. విద్యాధికులు, అందునను విద్యార్థులు కళాశాలలలో నేర్చుకొనుచుండు విషయములతో తృప్తిపడి యూరకుండక తీరిక దొరకినప్పుడెల్ల ఆంధ్రగ్రంథపఠనము నవలంబించి అందలిసారస్యమును గ్రహింపజొచ్చిరి. తాము పఠించుచుండిన ఆంగ్లకవుల విశిష్టమహత్త్వమును గుర్తించి తమ భాషలో అట్టిమార్పులను తెచ్చుటకై కంకణము కట్టుకొనిరి. ఆంగ్లసాహిత్య చరిత్రమువలె ఆంధ్రసాహిత్యచరిత్రమును యే యే కాలముల నెట్టియెట్టి పరిణామములకు పాత్రమైనదో యూహించి వ్రాయజొచ్చిరి. కోటి ప్రబంధము లున్నను అందులోని విషయమును విమర్శించి రసమును వెలిబుచ్చు విమర్శకులు లేకుండుటే ఆంధ్రభాషా నీరసత్వమునకు కారణమని ఊహించి విమర్శకగ్రంథములను వ్రాయ జొచ్చిరి.

పాఠశాలలలో ఆంగ్ల భాషకు పట్టముకట్టబడినదనిన్నీ, ఆంధ్రభాష తోడపెళ్లి కూతురువలె ఒకమూల కూర్చున్నదనిన్నీ, అందులో నేర్పబడువిషయములు యేదో పొట్టకై మాత్రమే చెప్పబడుచున్నవనిన్నీ దేశస్థులు గ్రహించినారు. ఆంధ్రభాష కధికప్రాముఖ్య మీయవలెననిన్నీ, ఆంధ్రవిశ్వవిద్యాలయము స్థాపించబడవలెననిన్నీ, ఆంధ్రరాష్ట్రమేర్పడవలెననిన్నీ మొట్టమొదట ఆంధ్రదేశమునందు జాతీయాందోళనము ప్రభవించినది. పాఠశాలలలోని గద్యపాఠ్య గ్రంథములభాష సనాతన గద్య గ్రంథభాష కాదనిన్నీ, గద్యభాషలో అనేక వ్యావహారికపదాలు రూపాలూ అనుక్రమంగా వాడబడుచూ ఉండేవనిన్నీ, ప్రజాసామాన్యం సులభంగా గ్రంథాలు చదువవలెనన్నా వ్రాయవలెనన్నా వాడుకభాషారూపాలు జోరుగా గ్రంథాలలో ఉండవలెననిన్నీ, వాడుకభాషకై పూర్వకాలంలో ఇప్పటున్నంత వెగటూ ఏవగింపూ లేక అటువంటి ప్రయోగాలు కవులు తమ పద్యకావ్యాలలోకూడా ధారాళంగా వాడుతూవుండేవారనిన్నీ, ప్రస్తుత గ్రాంథికభాష కేవలం కృతకభాష అనిన్నీ, దానికి నిజమైనవాడుకభాషకుండే సౌందర్యం రాదనిన్నీ శ్రీగిడుగు రామమూర్తి పంతులుగారు వగైరాలు తమ పరిశోధనలు ఉదాహరణాలు రూపకంగా అఖండమైన ప్రచారంచేశారు. చెళ్లపిళ్ల వెంకట కవీశ్వరులవంటి శతావధానులుకూడా ఈవాదన నంగీకరించి ఈభాషలో నేడు ధారాళంగా గద్యంవ్రాసేస్తున్నారు. ఆగద్యం గ్రాంథికభాషకంటే వేయిరెట్లు అందంగావుందనికూడా మనము అంగీకరింపక తప్పకుండావుంది. వాడుకభాషమీద నిరసనదండయాత్రచేయడం ఇప్పుడు అవివేకం వ్యర్థంకూడాను. అయినా బ్రిటిషు పాఠశాలలు స్థాపించబడినప్పటినుంచీ ఈకృతక భాషలో వ్రాయడం మనకభ్యాసమయ్యేవుంది. వాడుకభాషలో వ్రాద్దామని కలంపట్టుకున్న మహారథులకుకూడా అప్పుడప్పుడు 'వచ్చింది' అనే దానికి బదులు వచ్చినది అనో, ఐతే అనుటకు బదులు అయినను అనో, వచ్చాను, అనే దానికిబదులు వచ్చితిని అనో పూర్వపదం పడుతూనే ఉంటుంది. కృతకభాషే అనండి మరే భాష [illegible] లో ఉండే ప్రయోగాలు

వన్నిటినీ బహిష్కరిస్తూ గ్రంథాలు వ్రాయగల గడుసరి నేటివరకు యెవరూ పుట్టలేదు, బహుశా ఒక్క రామమూర్తి పంతులుగారు వారివంటి ఒకరిద్దరూ మినహాగా.

ఇక శుద్ధ గ్రాంథికభాషలో వ్రాయగల వారు అసలే శూన్యంగా ఉన్నారు. ఇదుగో నేను లేచానని యెవరేనా అన్నారా. 'దీని లోని ప్రయోగాలు శుద్ధతప్పులు, ఈ పదాలు కేవలం వాడుకలు' అని యెవ్వరైనా చూపించ వచ్చును. ప్రస్తుతం మనభాషాస్థితి ఈ రెండింటి మధ్యనా ఉయ్యాలలూగుతున్నది. వ్యావహారిక భాషావాదము నంగీకరించకా తప్పదు. అంగీ కరిస్తే దానికిహద్దుల నేర్పరచడమూ కష్టమే. ఉన్నవి అన్న శబ్దానికి ఉన్నాయి, ఉన్నయి, ఉన్నై మొదలను ప్రాంతీయాలను వాడు తున్నారు. నిలచుండు శబ్దానికి నిలచోను, నిల్చొను, నించోను, నుంచోను శబ్దాలను వాడుతున్నారు. వెళ్లినశబ్దానికి వెళ్లితే, వడితే శబ్దాలనుకూడా వాడుతున్నారు. వేళకు జ్ఞాప కానికి రావుకాని ఇటువంటి ప్రయోగాలు వందలూవేలూ పత్రికలలో కనబడుతున్నవి. కొన్నింటినిచూచి రామమూర్తి పంతులుగారే ఆశ్చర్యపడుతున్నారు. అయినా ఏ ప్రాంతం లోనైనా సర్వ సాధారణంగా వాడుకలో వుండే ప్రయోగాల్ని ఇతర ప్రాంతాల్లో లేవన్న కారణంచేత యెట్లా విసర్జించగలము? బహుశా ఇల్లాగు రెండుమూడు శతాబ్దాలు వెళ్లే సరికి ఇవన్నీ మనకు ప్రాతగిల్లి ఆశ్చర్యకరంగా ఉండకపోవచ్చును. అంతవరకూ యెవరెవరే భాషలో వ్రాస్తున్నా ఆక్షేపించడాని కెవ్వ రికీ అధికారం లేదు. వీనిలో కొన్ని కేవల ప్రాంతీయములు కొన్ని అఖిల ప్రాంతీయ ములు ఉంటవి. కేవల ప్రాంతీయములను కాదని అఖిల ప్రాంతీయములను వ్రాసేవారిని మనము కొనియాడవలసినదే. అట్లు కాదని కేవల ప్రాంతీయాలను వాడేవారినికూడా మన మభినందించ వలసినదే. కళాగాపులగంగా వ్రాసేవారినికూడా మనమభినందించకతప్పదు. రాగారాగా యేమిటితోచుచున్నదంటే జను లు వ్రాసే భాషలనుపట్టి మన మట్టేపేచీలు పెట్టుకొనరాదనిన్నీ, వ్రాసినవిషయముయొ క్క ప్రశస్తినుగూర్చియే యోచించవలెననిన్నీ తోచుచున్నది. విషయమునుబట్టి భాషయొక్క ధోరణి మారుతూనేవుంటుంది. ఒక వ్యాసము లోనే రెండుమూడువిషయములలాంటివి యెత్తుకోవలసివస్తుంది. అటువంటప్పుడు ధోరణి కూడా మారుతుంది. ఈవ్యాసంలోనే భాషల తత్త్వములు, ఆంధ్రభాషపరిణామములు మొద లైన విషయములను తీసుకున్నప్పుడు ప్రారం భించినధోరణికిన్ని, వ్యావహారిక భాషావశ్య కతనుగూర్చి నిరూపించవలసిన ధోరణికిన్ని యెంతో భేదము కనుపించుచున్నది. ఒకేధోర ణిలో వ్యాసమంతా సాగింతామంటే సాధ్య మైనదికాదు. ఈ ఒక్కవ్యాసమునేకాదు, నేనే గ్రంథమును వ్రాతామని నిశ్చయించు కొనికూర్చున్నా, అది ఒకధోరణిలో ప్రారం భంకావడం, మధ్యన మరియొకధోరణిలోకి మారడం, తరువాత మరియొకధోరణిరావడం ఇది మామూలైపోయినది. ఇది నా చేతకాని తనమనియైనా కొందరనుకోవచ్చును, విషయ మునుబట్టి ధోరణి అట్లు మారవలసివచ్చినదని యైనా కొంద రనుకోవచ్చును. ఇదైనా నా ఒక్కనినుకుటనే వ్రాయబడ్డవ్రాతలాగ కని పించలేదు. ప్రస్తుత వార్తాపత్రికా సుప్రసిద్ధ విలేఖరులనుకొనబడే అనేకుల వ్రాతలలో యిం తోకొంతో యిటువంటిభేదము లనుపించు చున్నవి. తొలిచూపునకు ఇది చిత్రవిచిత్రప్ప ధోరణులవలె కనిపించును. కాని విచారించి చూస్తే యిది యీవిధంగా యీకాలంలో ఉండకతప్పదు కాబోలు ననిపించుతుంది. కేవలం పాఠ్యపుస్తకములను వ్రాసేవారు కొం చెంపట్టు పూరాగా పూర్వపుధోరణిలోనే వ్రాస్తున్నారు. లేకుంటే అవి పాఠ్యగ్రంథ ములుగా అంగీకరింపరేమో అన్న భావం చేతను అయినా వారు ఆ సమయములయందు తీసుకునే అతిజాగ్రత, భయము, అవ్యగ్రత, అందులో కనిపించుతునేఉంటుంది. అయి నప్పటికీ కేవలపాఠ్యగ్రంథములు ఆధోరణిలో ఉంటే వచ్చేఉపద్రవం యేమీలేదు. అవిబాల కులకు పాఠశాలలలో ఉన్నంతకాలం గమ నించవలసిన కొన్ని సూత్రములను మాత్రమే సూచించును కాని, పాఠశాలలను విడచి పెద్దవారైనతరువాత వ్రాయగల గ్రంథము లేధోరణిలో వ్రాయవలెనో నిర్బంధించవు. కేవల పాఠ్యపుస్తకములు కాక గణితము, భూగోళము, చరిత్ర, సైన్సు మొదలైన విష యములను వ్రాసే పుస్తకములలోని భాష ఇన్ని కట్టుదిట్టములతో ఉండవలెనని నియ మించ నక్కరలేదు. ఏ గ్రంథకర్తకు ఏ ధోరణి యేసమయమున బాగుంటుం దని తోస్తే ఆ ధోరణిలోనే వ్రాయవచ్చును. ఆ పుస్తకములను విద్యార్థులు పఠించడం ఆ ధోరణికొరకు కాదు, ఆ విషయవిజ్ఞానము కొరకు. ఏ విషయమైనను సుగ్రాహ్యముగా ఉండవలెనంటే, ఆయా సందర్భములకు తగి నట్లు గ్రంథకర్త ధోరణిని మార్చుకొనక తప్పదు. కనుక పాఠ్యగ్రంథ నిర్ణయమండ లులవారు పూర్వపు అధికారములతో విజృంభించి, నవీనగ్రంథములను ధోరణుల కారణముగా త్రోసివేయరాదు. విషయము మనోహరమై, అవశ్యమై యున్నప్పుడు, గ్రంథము ప్రవీణు నిచే వ్రాయబడినప్పుడు వారు దేనినైనను అంగీకరించక తప్పదు. లేనియెడల యేవేవో కొందరి కిష్టమైన శయ్యాపద్ధతుల నభివృద్ధి పరచుటకొరకు ప్రశస్తమైన విషయములనే త్రోసిరాజుచేసిన నేరము వారియందు నిలచును.

దుష్టప్రయోగం నిర్దుష్టప్రయోగం అన్న శబ్దాల కిప్పుడు పాటించుచున్న అర్థములు తృప్తికరములు కావు. మిత్రులు, అదృష్ట వంతు డనుటకై అదృష్టుడు, పంథా, ప్రకా శించుట, కలశి (కలసి), వ్రాశి, పుస్తకం యీ మొదలైనవానిని దుష్టప్రయోగము లనవలెను. రాతిరి యనుటకు రేతిరి, లేచి యనుటకు లెగిసి, పోతుంది అనుటకు పోతాది, వస్తుంది అనుటకు వస్తాది– ఈ పదములను ఇప్పటివరకు శిష్టు లుపయోగించకుండా వున్నారు గనుక ఇటువంటివానిని కొంచెమెడబెట్టుట మంచిది. తెలుగు బూతుమాటలను దుష్టము లనకతప్పదు గదా! ఇటువంటివాటిని మినహాగా తక్కిన వానినెల్ల నిర్దుష్టములుగానే భావించవలెను. భారతబోర్డు, ఇండియన్ భీమా, తపాలా ఫీసు మొదలైన మిశ్రసమాసముల నెందరో వ్రాయుచున్నారు. వీనిపై కినిసిన లాభము లేదు. ఇటువంటివన్నీ పాఠకులకు బాగాపరి చయమైతేనేకాని, ఈసమస్యలనుగూర్చి వ్రా యువారు తమ భావములను ధారాళముగా

ముందుముందు ప్రసంగించగలుగుట కవకాశము లేర్పడవు. ధోరణులు మార్చుకొనుట కెట్లు లేఖకులకు స్వాతంత్ర్య మీయబడుచున్నదో మిశ్రసమాసములపట్లకూడ అట్లే స్వాతంత్ర్యము నీయవలెను. క్రొత్తక్రొత్త వేదపంటమొదలైన సమాసములనే నేను కొన్ని సందర్భముల యందు వ్రాసితిని. ఇటువంటివి అపూర్వము లని చెప్పి విడిచిపెట్టితే చాలును.

ఇక పదములను ప్రయోగములను విడిచిపెట్టి వాక్యరచనాపద్ధతికి వత్తము. కొందరు వ్రాయువాక్యములలో కర్తృవాచకమును పోల్చుకొనుట కష్టము. తరచుగా అది క్రియకు చాలా దూరమైయుండును. కర్త్రర్థకములో ప్రారంభించబడిన వాక్యములు కర్మార్థకములోను, కర్మార్థకములో ప్రారంభించబడిన వాక్యములు కర్త్రర్థకములోను, ఏకవచన కర్తకు బహువచనక్రియయు, బహువచన కర్తకు యేకవచనక్రియయు ఈమోస్తరు లోపము లుండుచుండును. వ్రాసినవ్యాసము పునఃపఠన మొనరించినచో ఇవి యన్నియును తొలగగలవు. విశేషణములకు విశేష్య మెక్కడో దూరమై వేరొక విశేష్యమునకు సంబంధించిన ట్లగుపించును. కామాలు, సెమికోలనులు, హైఫనులు, అడ్డుగీతలు మొదలగు వానిని పెట్టుటలో కొందరేమాత్రమునుకాని యాదస్తులో పెట్టుకొన్నట్లు కనిపించరు. ఇటువంటివాని నన్నింటిని భాషాసంస్కరణములనీన్ని, నవీనపంథాలనీన్ని సమర్థిస్తున్నో, అలక్ష్యంచేస్తున్నో విడచిపెట్టుటకు వీలు లేదు. చిన్నచిన్న వాక్యములు వ్రాస్తే ఇట్టి చిక్కు లనేకము తొలగిపోవునుకాని, కొన్ని భావములను చిన్నచిన్న వాక్యములుగా త్రుంచివేయుటకు వీలులేని సందర్భములలో వానిని వ్రాయకతప్పదు. శాసనములలోని క్లాజులు, తీర్మానములలోని వాక్యభాగములు (Phrases) విడదీయుట కెట్లు సాధ్యము? కనుక వీనిని వ్రాయునప్పుడు లేఖకులు జాగ్రత్తగా ఉండవలెనని హుషారు చెప్పుటకంటె మన మధికము చేయజాలము.

ఇదికాక విభక్తుల ప్రయోగములలోనే మునుపటికిని ఇప్పటివానికిని భేదము కనిపించుచున్నది. నావల్లకాదు అనుటకు అతి తరచుగా నాచేతకా దనుచున్నాము. దాని యందు లేక వానియందునున్న దానిలో లేక వానిలో అను విభక్తులకున్న భేదము చేయక కలగాపులగముగా వాడుచున్నాము. వానికి చెప్పితిమి అనుటకు వానితో చెప్పితి మనుచున్నాము. ఇటువంటి సందర్భములలో సరియైన విభక్తిని ప్రయోగిస్తేనే వికారముగాను, వాడుకలోని విభక్తిని ప్రయోగిస్తేనే సబబుగాను కనిపించును. బహుళములు, ఆదేశములు మొదలగువాని మూలకముగా చిన్నయసూరిగారే ఇటువంటి మార్పులు కొన్నింటికి శాంక్షను ఇచ్చియున్నారు గనుక, వానిలో ఈ మొదలైనవానిని నవవ్యాకరణవేత్తలు చేర్చవలసి యుంటుంది.

ఇంతవరకు పదములు వాక్యములను గురించియే మన మాలోచించియున్నాము. ఇక విషయములకు వత్తము. కేవలము సాహిత్యమునుగూర్చినశ్రద్ధ ప్రపంచమునందే నానాటికిని సన్నగిల్లుచున్నది. కేవలసాహిత్య పరిజ్ఞానమును చర్చలును యెవరెవరో రసికుల యొక్క విలాసములకు విడచిపెట్టవలసినదిగాను, విషయపరిజ్ఞానమే మానవులకు పరమావధిగాను నేడు తలచబడుచున్నది. ఏదో హిస్టరీయో, జాగ్రఫీయో, సైన్సో, రాజకీయగ్రంథమో, అర్థశాస్త్రప్రసంగమో, కోఆపరేషను భోగట్టాయో, లేబరుసమస్యయో, రైతులబాధలో అయితే జనసామాన్యము దానిపై ప్రనకు దృష్టినిపరుపుచున్నారు; కవిత్వమో, కళయో అయితే దానిని మూలజాచి విడచుచున్నారు; అథవా అట్టివానిని వంటికి పట్టించుకొన్నను, కొత్త తీరికసమయవిలాసముగా మాత్రమే భావించుచున్నారు. పద్యాలను పాటలను తమపత్రికలలో ప్రకటింపనొల్లని అనేక ఆంధ్ర ఆంగ్ల పత్రికాధిపతులు నేడు వేనవేలున్నారు. ఆఖరుకు చిన్నకథలకు గూడా ఒకమూల తావివ్వని పత్రికలు కొన్ని యున్నవి.

పత్రికలు బహిష్కరించినంత మాత్రమున వాని ప్రతిభ కొరతపడదనియు, వానియెడల జనసామాన్యమునకు నిజమైన ఆసక్తి ఉండుచునే యుండునదనియు మనము నిశ్చితముగా చెప్పవచ్చును. కాని వానికి తీరికసమయములందలి విలాసములకు తగినంత స్థానముమాత్రమే యియ్యవలెననుటయు సమంజసమే. నేడు జాతుల భావము లెల్లయు మహాందోళనములతో తల్లడిల్లుచున్నవి. ఆంధ్రజాతిభావములును నట్లేయున్నవి. పంట లెంత యెక్కువైతే కాటక మంత యెక్కువగుటకు, ధన మెంత వృద్ధియైతే దారిద్ర్య మంత యెక్కువగుటకు, విజ్ఞాన (Science) మెంత యెక్కువైతే అజ్ఞాన మంత యెక్కువగుటకు, కోర్టు లెంత యెక్కువైతే నేరము లన్ని హెచ్చుచుండుటకు, బోధ లెంత యెక్కువైతే అనాచారము లేక అనాచరణ మంత వృద్ధి పొందుటకు, సైన్యము లెంత వృద్ధియైతే అశాంతి అంత వర్ధిల్లుటకు కారణము లెవ్వియో ప్రజలు తెలుసుకొనుటకు తల్లడిల్లిపోవుచున్నారు. ఈ మహారహస్యములు బట్టబయలు కానిదే ప్రపంచవాసు లందరికిని నిజమైనశాంతికాని సౌఖ్యముకాని కలుగనేరదు. ఒకొక్క రొకొక్క సిద్ధాంతమును పట్టుకొని యుద్ధమునకు వచ్చుచున్నారు. ఈమహాకల్లోలములో శాంతి నెలకొనగలదా యను ఆశకూడా అంతరించుచున్నది. ఈకల్లోల మెంత వృద్ధియైతే విప్లవవాదు లంత మంచి దంటున్నారు. దీనిని చూచీచూడడములో శాంతివాదులు బెగ్గిలిపోయి తమ పురాతనపద్ధతులను మరింత కట్టుదిట్టము చేసుకొనుచున్నారు. ప్రతీవాదము దిందును పైకి యెంత మేలు కనిపించితే, లోపల నంత నుల్ల యున్నట్లు స్పష్టముగా కనిపించుచునే యున్నది. అయినా, సిద్ధాంతులు ఆమాటకు ఒప్పుకొనకున్నారు. ఈవిషయములను గూర్చి నిష్పాక్షికముగా ఆలోచించి ప్రజలకు సత్యమును నిరూపించవలసిన బాధ్యత ప్రతివిద్యాధికునియందును గలదు.

అయినను ఈ ప్రచారముకూడ అంత సులభసాధ్యమైనట్లు కనపడదు. ఒకప్రక్కన ప్రభుత్వములనుండియు వేరొకప్రక్కన ప్రతిపక్షములనుండియు అట్టివారిపై దోషపరంపరలైన శిక్షణలో దూషణలో కురియుచునేయుండును. ఎవరివిశ్వాసము లెట్లాటివైనను, తీరా

నోరువిప్పేటప్పటికో, కలముతీసేటప్పటికో, పూర్వాపరసంశుద్ధికొరకో, కొందరికి అహితముగా ఉండకుండుటకొరకో, తద్వ్యతిరేకమైన వాక్యములను తెలుపవలసివచ్చుచుండును. మనసులో ఉన్నమాటంతా పైకి చెప్పితే చాలును, అనేకులకు తమ రాజకీయనాయకత్వములు గాలిలో ఎగిరిపోవునోయని భయము; ఉద్యోగములూడిపోవునోఅని భయము. నిజమైన సత్యాన్వేషు లెప్పటికిని ఉండనే ఉందురు. ఒకప్పుడు తామేదోమాటఅన్నాముకదా అని ఊరకొనక, భావము మారినప్పుడు క్రొత్తదానిని చెప్పుచునేయుందురు, రాజకీయనాయకత్వమును పాటింపరు, ప్రపంచ ప్రశంసలకొరకే తూగులాడరు, ఉద్యోగములు పోయినను సరకుచేయరు. నిదానముమీద అట్టివారిమాటలే నిలచును.

ప్రస్తుతం, ఆంధ్రదేశమునందుగల ప్రతీ సమస్యను ఈ రీతిని తర్జనభర్జనచేసి నిజమును నిరూపిస్తూ బోధించగలవారు అవసరం. ఇందుకై వారు ఒకరాజకీయములేమి, ఆర్థికములేమి, సాంఘికములేమి, శాస్త్రీయములేమి, ఆధ్యాత్మికములేమి సమస్తసమస్యలను పరిశోధనముచేసి తేటతెలుగులో వారిభావములను వ్రాయుచుండవలెను. ఆంధ్రదేశ మిప్పుడీయుగములో తేలుచున్నది. కవీశ్వరు లీగీతములను పాడుచున్నారు, వక్తలీప్రసంగముల నల్లుచున్నారు, విద్యాశాలలు వీనిని తమప్రణాళికలో చేర్చుకొనజూచుచున్నవి, రాజకీయవాదు లీ మార్పుల నాచరణములో పెట్టుటకై యత్నించుచున్నారు. ఈ మహాకల్లోలములో ఉత్తములైనవా రందరికిని దేని పదము, దేని ధోరణి సులువైనట్లు కనిపించినదో దానిని వాడితీరుదురు.

ఇదికాక మన మిప్పుడు నేర్చుచున్న ఈ ఆధునికవిజ్ఞానమున కంతకును మనకు మాతృక ఆంగ్లభాష. దాని పోలికలూ, వాసనలు, పదములూ, పరిభాష వద్దన్నను మనకు తప్పదు. అదే యిప్పటి రాజకీయభాష, ఎలెక్షనుల భాష, వైద్యభాష, సహకారులభాష, శాసనకారులభాష. జను లందరికిని వీనిని గూర్చిన ఆంగ్లపదములు నోరు తిరుగునట్లు తెలును, సంస్కృతం తర్జుమాలు నోరు తిరగవు. ఆంధ్రదేశము బహు విశాలమైనది. కన్నడ భాషాప్రాంతీయులకు అనేక కన్నడ పదములు ప్రయోగములూ, అరవభాషాప్రాంతీయులకు కొన్ని అరవభాషాసంప్రదాయములు, ఉరుదూభాషాప్రాంతీయులకు కొన్ని ఉరుదూమర్యాదలు, తమ స్వంతభాషలోనివానివిగానే అల్లుకొనిపోయినవి. ఇదికాక మండలమండలభాషకును, తూసకును భేదమెంతో కొంత ఉండనేఉన్నది. రెయిల్లు లేనికాలములో, పరిచయములు తక్కువైన కాలములో ఇవి ఒకదాని కొకటి సవతిబిడ్డలవలె కనిపించుచుండవచ్చును. బ్రిటిషు గవర్నమెంటు ధర్మమంటూ, కాంగ్రెసు ధర్మమంటూ, ఆంధ్రనాయకుల ధర్మమంటూ, ఆంధ్ర మంతా ఒకేరాష్ట్రము, ఒకే భాష, ఆంధ్రులు ఒకేజాతి యనుభావము బాగుగా పాదుకొనినది. నేడు మనము దూరదూరపు బంధువులవలె చూచీచూడనట్లు కాలక్షేపము చేసుకొనుటకు వీలు లేదు. ఇంతకుముందు మన కిట్టిపరస్పరసంబంధములు తక్కువగా ఉండుటవల్లనే ఒకరికొకరము దూరస్థులవలె కనిపించితిమి. కాని రాకపోకలు, ఉత్తరప్రత్యుత్తరములు, సంబంధబాంధవ్యములు హెచ్చువరైయుండినచో ఆంధ్రభాషలో ఇట్టిప్రభేదము లుండకపోయెడివేమో ?

ఈ భేదములను చెరుపుకొని మన మందరము నేకకుటుంబమువార మని గ్రహించవలసిన తరుణ మిది. కనుక మీప్రాంతముమాట మాకు తెలియదు, కనుక దానిని వ్రాయకూడదు అని ఒకరినొకర మనుకొనకూడదు. ఏ మండలమునందలి పెద్దలు అక్కడి పరిభాషలో తమ సమస్యలను గూర్చి వ్రాయుచు ప్రసంగించుచు ఉండవలెను. తక్కిన మండలములవా రెల్లరును వానిని ఆనందముతో పఠించి గ్రహించుచుండవలెను. ఇట్లు ఒక పదిసంవత్సరములపాటు జరిగినచో ఆంధ్రుల పదబాహుళ్యము, విజ్ఞానము, పరస్పరస్నేహము, సంపద, సౌభాగ్యము వర్ధిల్లును. మనము తోడిజాతులవా రందరితో సమానులమై, భారతీయనాగరికతకు పెట్టనికోటలము కాగలుగుదుము. గుజరాతీ, బెంగాలీ, హిందీ, మహారాష్ట్రిభాషలవా రందరును ఈరీతిగానే తమ విజ్ఞానమును, భాషలను, సమస్యలను, సర్వమును పరిష్కరించుకొని సర్వాభివృద్ధిని పొందుచున్నారు. మనము కొన్ని పెడబోధనలు వినియో, వేరుచింతనల చొక్కియో పాతికసంవత్సరముల క్రిందట ప్రారంభించిన ఈ శుభప్రదాందోళనముయొక్క ఫలితమును నేటివరకును అనుభవింపజాలకున్నాము. ఈ విధమైన సర్వతోముఖాందోళనము జరుగుటకు భాష యొక్కటియే ప్రశస్తసాధనము. కనుక ప్రతి భాషాసేవకుడును తన చాకచక్యమును, ప్రతిభను, విజ్ఞానమును ప్రకటించుకొనుటకై భాష కెన్నివిధములను చక్కనిమార్గములను గూర్చవలెనో అన్నిటిని గూర్చగడంగును గాక! వచ్చీ రాని జ్ఞానముతో తెలిసీ తెలియని పదాలను ప్రయోగించి ఇదంతా భాషా సంస్కారమే అని భావించుకొను వెర్రితనము లేకుంటే చాలును. భాషాపోషకమైన, ప్రతీ విధమైన మార్పునకును స్వాగతం! సుస్వాగతం !!

15. .4 11

# కీ॥ శే॥ వడ్డాది సుబ్బారాయుడుగారు

పందొమ్మిదవ శతాబ్ది చివరపాదమున తెలుగు దేశమునందు బలువురు పండితులు కవులు నవతరించి ప్రఖ్యాతిని గాంచిరి. అట్టివారిలో వడ్డాది సుబ్బారాయుడుగా రొకరు. వారు సహస్రమాసముల కధికముగ జీవించి, కడచిన నెలలో వసువులను బాసిరి. వారింత పెద్దవయసు వచ్చువరకు జీవించియుండుటకుఁ గావలసిన యారోగ్యైశ్వర్యములు వారి కమరియుండినవి. అందువలన వారికిఁగల 'వసురాయకవి' అను సంగ్రహనామము మిక్కిలి సార్థకమయినది.



వారి యుద్యోగజీవిత ముపాధ్యాయత్వముతో నారంభమయి దానితోనే యంత మొందినది. వారికి శిష్యులు సహస్రాధికముగఁ గలరు. వారి ప్రయత్నము మూలమున వారు పలుమారు సత్కారములను బొందిరి నిక్కముగ వారిది ధన్యమయిన జీవితము. వా రుద్యోగమును మానుకొనినను ఉపాధ్యాయత్వమును మానుకొనినవారు కారు. వా రనేకవిషయములను తమ రచనముల ద్వారమున నాంధ్రులకు బోధించుచునే యుండిరి.

వసురాయ కవిగారు సారస్వతప్రియులు. సంస్కృత నాటకములను గొన్నిటి నాంధ్రీకరించిరి. వానిలో నెన్నఁదగినది వేణీసంహారము. దానికవిత చాలబరువయినది. మూలమును జదివినఁ గలుగునానంద మనువాదమును జదివినఁ గలుగదు. ఈదోష మనువాదరచనముల. అందును నాటకముల- నన్నింటినిఁ బట్టియున్నయదియే.

స్వతంత్రరచనము లనఁబడునవి వీరివి కొన్ని గలవు. వానిలో భక్తచింతామణి ప్రథమగణ్యమని ప్రసిద్ధి. భారతీయహృదయము నిరంతరము భక్తితత్పరము. వారు పరమార్తులు. తమయార్తిని, వా రేదేనొక దైవము నెదుట మొర పెట్టుకొని తొలఁగించుకొనఁ గోరుచుందురు. ఆర్తియట్లు తొలఁగునో తొలఁగదో ఆమాట యటుండనుఁగాక! అట్టి యార్తియే భక్తిగాఁ బరిణమించినది. ఆభక్తికిఁ దగినభావములు, వానిని జక్కఁగా, వినువారి మనస్సు కరఁగునట్లు ప్రకటించుటకుఁ దగినవాక్యరచన, పదజాలము- 'పేటెంటు' చేయఁబడినవి వాఙ్మయమున ననాదిగాఁగలవు. వానిఁ దగిలించి నచో నెంతచేతగాని వానికవిత్వమేనియు భక్తహృదయమును రంజింపఁ జేయఁగలిగియుండు ననినచో వసురాయకవివంటి పండితకవి రచనముమాట చెప్పవలసినది లేదు. రచనము చదువుగలిగియుండుట దీని కింకొక మెఱుఁగు. ఈ దృష్టిని వీరిభక్తచింతామణి నిస్సంశయముగ భక్తులపాలిటికిఁ జింతామణియే.

ఆకాలపుఁబండితులకు సామాన్యముగఁ గల యలవాటుమాటిమాటికి నేవిషయము నేని యుఁ బద్యములలోఁ జెప్పుచుండుట. వీరు నట్టియలవాటుకు దాఁటనివారే. కావుననే విన్నమొన్నటిదాఁక వీరిపద్యములను జదువుభాగ్యమాంధ్రుల కబ్బియుండెను.

ఈ పండితకవి, నేడు-కాడు. ఇఁక నెన్నఁడును-మనకన్నులకుఁ గానరాఁడు. కాని తన రచనములలో నంతర్భూతుఁడయి, వానిని జదువునప్పుడెల్ల మన మనోనేత్రములయెదుట ప్రత్యక్షమగుచుండఁగలఁడు.

---

# కీ. శే. డా. మిస్. జయంతి సుభద్రాదేవిగారు

యం. బి. బి. యస్., డి. జి. ఒ.

ఈమె జననము ౧౯౨౦. ౧౯౨౭ లో స్కూల్ ఫైనల్ పరీక్షలో కృతార్థురాలయి మేజర్ మెడ్డ్ నాల్డు బహుమతిని పొందినది. కలకత్తా యూనివర్సిటిలో ౧౯౨౮ సం. మొదటి తరగతిలో ఇంటరు ప్యాసయినది. మదరాసు వైద్యకళాశాలలో చదివి ౧౯౩౩




సం. యం. బి. బి. యస్. పట్టమును బడసినది. క్లిఫ్ఫర్డు మెడలు, లేడీగ్రాంటు డఫ్ మెడలు ఈమెకు లభించినవి. ఇంకనువక్తృత్వాది సామర్థ్యములకు పెక్కుపతకములను పడసినది. వైద్యమున మరియొక డిప్లొమాకూడ సంపాదించుకొనినది. కర్నూలులో తొలుతను, తరువాత రాజమండ్రిలోను వైద్యవృత్తి స్వతంత్రముగ ప్రారంభించి ప్రజాసేవ చేయుచుండెను. ఈమె ౬౦ ఏండ్లు నిండియు నిండకమునుపే కీర్తిశేషురాలయ్యెను. ఈమె రాజమండ్రి ట్రెయినింగు కాలేజి ప్రొఫెసరు జయంతి సత్యనారాయణగారి కుమారిత.

---

# విమర్శనము

## పట్టాభిగారి "సోషలిజం"

[సైజు ౧/౧౬ రాయల్; ౫౦ పుటలు; వెల ఆరు అణాలు. గ్రంథకర్త: గోపీచంద్, సూతాశ్రమం తెనాలి.]

ఇది చూసి, ముచ్చటైన బహు చిన్న గ్రంథమేగాని విప్పిచూస్తే భారత రాజకీయ విషయం. ఇతర రాజధాని నాయకుల సంగతేమి చిక్కు సంధిస్తుందోనని అటు తిరిగి ఇటుతిరిగి స్వరాష్ట్ర నాయకుడైన డాక్టరు పట్టాభిగారిని సాధనంగా చేసికొని కాంగ్రెసు మీదికి తోలినాడీ గ్రంథకర్త తన మోటబండిని గట్లమీద, బురద చేలల్లోంచి, దుబ్బుల పైనించి అడ్డదిడ్డంగా.

గ్రంథవిషయం సోషలిజం. మొదటి పేజీల్లో సోషలిజం యెట్లా అమలులోనికి వచ్చిందో, సోషలిజాన్ని గురించిన శ్వేతుల నిర్వచనాల కొంకి ఆధారంతో భారతకాంగ్రెసులోని భిన్నపక్షాలకు చెందినవారిని పృచ్ఛిస్తూ "స్వాతంత్ర్యోద్యమాన్ని నక్క జిత్తులతో అల్లకల్లోలం చెయ్యటం ఎందుకు? ప్రజాసామాన్యమునకు కుతర్కంతో వాక్ప్రావీణ్యంతో బెదరగొట్టడం ఎందుకు? నూతనభావాలంటే ఇంత నిరాదరణ, ఇంత కంటగింపు ఎందుకు?" అని గాంధీని, గాంధీ అనుచరుల్ని మర్దన చేస్తున్నారు. ఈ ఊపులో సాగనగా పట్టాభిగారి ౨౫ వ తూర్పుగోదావరి మండల సభ ఉపన్యాసభాగాల్ని గ్రహించారు గోపీచంద్ గారు.

గోపీచందుగారు దీనిని రచించే సందర్భంలో మానవ మనస్తత్వాన్ని మరచినట్టు లున్నారు. ప్రాతపద్ధతులు పోయి క్రొత్త పద్ధతులు రావటమంటే సామాన్య విషయం కాదు. కొందరకు సంతృప్తి, మరికొందరకు అసంతృప్తి వుంటేక మానదు. భారతదేశానికి సోషలిజం అనేది స్వతంత్రదేశం అయినపిమ్మటనే గాని పారతంత్ర్యంలో వున్నంతవరకు అది పుట్టనోని తేనెవంటిది. భారతదేశ భవితవ్యతను యోచించేందుకు కొంత ఉదారత, ముందు వెనుక యోచన అవసరం. తీవ్ర-సోషలిస్టులైన జవహరలాలు, సుభాషుబోసులు కాంగ్రెసు అధ్యక్షులైన అనంతరం వారి తత్వం మళ్లటమే దీనికి తార్కాణం. గోపీచందుగారుకూడ తీవ్రసోషలిస్టు. గాంధి అనుచరుల నిర్వచనాన్ని విమర్శించటంలో గోపీచందుగారు తర్కాన్ని ఆధారంగా తీసికొన్నారే కాని సోషలిజంయొక్క ఫండమెంటల్సును ఆధారంగా గ్రహించినట్టు తోచదు. "సోషలిజం హింసాత్మకమైంది అనేదానికి ఆలోచించి చూస్తే గాంధిగారి అహింసావాదం హింసాత్మకమైంది కాదా?" అంటున్నారు గోపీచందుగారు.

గోపీచందుగారి రచనలో వారి రక్తనాళాల్లోని ఉద్వేగం స్పష్టంగా తెలుస్తోంది. యువకులు సవాళ్లు వేసేదానికంటె రథసారథ్యం మనసా వహిస్తే మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెనుక సోషలిజమో లేక మనదేశానికి అనుకూలమైన మరేదైనా 'ఇజమో' పెట్టుకోవచ్చు. ఆత్యాగంమినహా విమర్శలు, సవాళ్లు, దెబ్బలు తీయటాలు, కించెపరచటాలు, కేవలం ఐకమత్యాన్ని దూరం చేసేవి.

"Causing irritation is likely to obscure the fundamental unity of all ranks within the Congress and introduce an element of sectarianism in our thought and action that is bound to prove harmful the end." "I believe further that both groups can march shoulder to shoulder as far as the final goal of independence. On the way adjustments will have to be made, clashes will have to be reconciled. But the Companianship can and must remain unbroken" అని సోషలిస్టు క్రామేడు జయప్రకాశ నారాయణ గారు హెచ్చరిస్తున్నారు. —వ. కు.

---

## సుభాషచంద్రబోసు

[క్రౌను ౧/౧౬ సైజు; ౧౦౭ పేజీలు; గ్లేజు కాగితం, ఖరీదు ఆరు అణాలు. రచయిత, ప్రకాశకులు: కొమాండూరి శఠకోపాచార్యులుగారు, ఎం. ఏ., బి. ఎల్., కాకినాడ.]

తెలుగువారి కిటీవలే అయిసుబల్లే చేర వదలింది. గుణితంకూడా పూర్తిఅయినట్లే. తల, వల, మొల, పలక అనే రెండేసి మూడేసి అక్షరాల మాటలుకూడా పలుకుతున్నారు. దీనిఫలితమే కాబోలు యీనాటి మన పత్రికలకి యీమాత్రపు ప్రచారమైనా. పత్రికా ప్రచారంతోపాటే పుస్తకప్రచారం కూడా.

గ్రంథప్రచారకులు, పత్రికాప్రచారకులు యిప్పుడే శ్రద్ధచూపవలసిన సమయం, చంటిబిడ్డకుదంతాలు వచ్చేసమయంవంటిది. పత్రికాపఠనం గ్రంథప్రచారం వృద్ధికావలెనంటే ఆ వ్యవహర్తలు గమనించవలసినవిషయాలు రెన్నోవున్నాయి. ఆకర్షణీయంగా ముద్రించాలి. ఖరీదు దేశ-ఆర్థిక పరిస్థితులకి అనుగుణంగాను, బీదవాడుకూడా కొని చదువటానికి వీలయ్యేటట్టుగాను ఉండాలి. రచనాపద్ధతికూడ క్లిష్టంగావుండక, డొంకతిరుగుళ్ళు లేక సామాన్యుల కర్థమయ్యే సులభశైలిలో వుండాలి. తపాలు ఖర్చులు దండుగ తగులకుండా అసలు వెలకే పాఠకుని గ్రామంలోనే లభ్యమయ్యేటటువంటి ప్రచార సౌకర్యం చెయ్యాలి. ఇవన్నీ కలగలుపితే వాణిజ్యపరిచయం ముఖ్యమని తోచకపోదు.

పత్రిక లమ్ముకునే యేజన్సీ వ్యాపారం ఒకటి యిటీవల కొందరికి జీవనోపాధి అయి పట్నాల్లో పల్లెల్లో పత్రికలు పంపక మవుతున్నాయి. ఇక పుస్తకాలసంగతి. వాణిజ్యం నేర్పు ముఖ్యమైనకారణాన గ్రంథం అచ్చువేస్తే వెయ్యిప్రతులు అచ్చువెయ్యటం, యీ వెయ్యింటిలో అచ్చుఅయినవెంటనే ౨౦౦ అయినా అమ్మకు పోకపోతాయా, ముద్రణ ఖర్చు మళ్లి రాకపోతుందా, తతిమ్మాప్రతులు అప్పుడప్పు డమ్ముతూవచ్చినా 3 లేక ౪ సం

వత్సరాల్లో ఖాళీకాకపోతాయా అనే అంచనాలతో ప్రారంభించటం మనలో చాలా మందికి అలవాటైపోయింది. పైహేతువుచేతనే పుస్తకంవెల అసలుఖరీదుకంటె నాలుగైదురెట్లు పెట్టి సామాన్యులకు అలవికాకుండా వుండటం సంభవిస్తూ పుస్తకవ్యాపారం బహు నీరసంగా వుంది. ఇక రచనలుకూడా పైవిధమైన సంకుచితదృష్టికి అనుగుణంగానే వుంటున్నాయి. గ్రంథంయొక్క వస్తువు యెంతటి మహత్తరవిషయమైనప్పటికిని ఋజువుగా, మృదువుగా, మధురంగా ఉండేటట్టుచేసే పద్ధతిని నేర్చుకోవడంలో శ్రమచేయకుండా కఠినమైన వ్రాతల్లో వుంటున్నాయి.

సుభాషచంద్రుడు గొప్ప కుటుంబంలో జన్మించాడు, యువకుడు; విద్యాధికుడు; ప్రపంచ పరిభ్రమణంవల్ల అనేకవిషయాల్ని అవగతం చేసికొన్న ఘటకుడు; త్యాగి; తీక్ష్ణమైన మేధాశక్తికలవాడు; జీవితపరమావధి మానవసేవ ఒక్కటేనని గాఢంగా విశ్వసించి కలెక్టరుద్యోగాన్ని కాలదన్నిన విరాగి; వివేచనాపటిష్ఠుడు; కార్యదక్షుడు; సాహసి; బ్రహ్మచారి. జవహరలాలుకు సుభాషుకు అనేకం పోలికలున్నాయి. ఆతని వెనుక అధ్యక్షపీఠానికి అర్హుడైనవాడు సుభాషబాబేనని భారతవర్షం యేకగ్రీవంగా ఆమోదించి యీ సంవత్సరం వానిపరం చేసింది. ఒక్క సంవత్సరంపాటు భరతావనియొక్క క్షేమ, ఐశ్వర్యాలు యీతని భుజస్కంధాలమీద నున్నాయి. ప్రపంచమంతా ఒక కన్నుచేసికొని యితని చర్యలను గమనిస్తూ వుంటుంది. ఇంతటి మహత్తరపదవి సుభాషుకు లభించటానికి, ప్రజాసేవే ముఖ్యఆరాధనగా స్వీకరించటానికి అవకాశము కల్పించిన ఆతనిని కనిన అపూజ్యదంపతులకు చెందాలి నిజంగా మన జేజేలు. ప్రజానీకము సుభాషుని జీవితచరిత్రవల్ల నేర్వతగినదానికంటె ఆమాతాపితల మహోదారాతిశయము వెయ్యింతలు జ్యోతిర్మయమైనదంటే అతిశేషం లేదు.

బిడ్డలభవితవ్యం తల్లిదండ్రులమీద వుంటుంది. వారి బాగు ఓగులు, సుఖసంపదలు, ప్రతిష్ఠాప్రతిష్ఠలు మొదలైనవన్నీ తల్లిదండ్రులు శిశుదశలో యిచ్చేతయారులో వుంటుంది. పెద్దలు ఉదారతకలవారైతే బిడ్డలూ అంతే. పెద్దలు తుంటరులైతే బిడ్డలూ అంతే. సుభాషు జననీజనకులు మహోదారులు అవటంచేతనే యీతడుకూడ మహోదారుడుగ తయారైనాడు. గవర్నమెంటువారు కలెక్టరుద్యోగం యిస్తాం కవెనెంటుమీద చేవ్రాలు పెట్టమంటే ఆత్మశుద్ధికి త్యాగానికి గొప్ప పరీక్ష సంఘటించి స్వదేశభక్తి ప్రజాసేవ ఉద్యోగాన్ని తృణప్రాయంగా కాలదన్నే వరకు మన స్థితిగతిం చిక్కిందికాదు. The Heaven-born Service ను ఉఫ్అని ఊదివేసినను హర్షించి యౌవనమందునుగు కొడుకుల్లో ఒకడిని దేశ ఆరాధనకు, స్వదేశానికి స్వాతంత్ర్యం తెచ్చే మహాయజ్ఞానికి ఒక అర్చకుడుగా, ఒకయింధనంగా వదలివేసిన ఆపూజ్యదంపతులా భారతవీరులు, లేక సుభాషచంద్రబోసా? సుభాషుని తల్లిదండ్రులవంటి త్యాగధనులు మనలో నెందరు కలరో ఆత్మపరీక్ష చేసికోవటం అవసరం. బిడ్డల్ని ప్రయోజకులుగా చేసేవిధానం మనం వారిదగ్గర నేర్చుకోవాలి.

ప్రకృతం-కొమాండూరి శఠకోపాచార్యులుగారి సుభాషచంద్రబోసు జీవితచరిత్రరచన పై విషయాలన్నిటిని యెంతవరకు తృప్తిపరుస్తోందో పరిశీలిద్దాం. శైలి సులభమైనదే. వెల ఆరుఅణాలు పెట్టి కొనడం సామాన్యులకు(కొంచెము)కష్టమే. ఇక వస్తువును గూర్చి భూమికలో రచయిత "ఇంతవరకాయనజీవితచరిత్ర మేభాషలోను నాకు దొరకలేదు. పృథ్వీశచంద్రరాయిగారు ఇంగ్లీషులో నొకచిన్న పుస్తకము వ్రాసినారు. దాని నుపయోగించినాను. కాని అది గాఢమైనది. అందు చాలసంగతులు లేవు. తక్కిన వానిని కలకత్తా మునిసిపల్ గెజెటు వగైరా పత్రికలనుండి గ్రహించినాను. ఆయనకు బి. ఏ. చదువులో సహాధ్యాయిఅగు శ్రీవినయభూషణ రక్షితుగారినుండి సుభాసువిద్యార్థిదశలోని కొన్ని సంగతులు తెలిసికొంటెని." అని వ్రాశారు. సుభాషుబోసుజీవితం ఆదర్శప్రాయమైందని నిరూపించటానికి అవసరమైన ఉత్తేజనశక్తి (force) పుష్టి, వ్రాతలో అనుపడటం లేదు. గ్రంథం తరుణంలో రాదగినది మాత్రం అవును.

ఈగ్రంథంలో సుభాషునిజీవితం యిరవైప్రకరణాలక్రింద విభజింపబడింది. ఐ. సి. ఎస్. చదువు, జవహరు, గాంధి, సుభాషు, మొదలైన కొన్నిప్రకరణాలు సొంపుగా ఉన్నాయి.

మహామహుల జీవితచరిత్రలు రచిస్తే చప్పిడిగ నింపడం భావ్యంకాదు. భాషకు మెరుగు యివ్వాలి. పాఠకుని ఉన్నతపథాల్లోకి తీసుకు పొయ్యే నూతనభావోదయం కలగాలి. జీవిత పరమావధిని స్థిరపరచే తత్వప్రాప్తి వుండాలి. ఒకటిరెండు సంవత్సరాల వయస్సప్పుడు ఎర్రకుక్క నల్లకుక్క అని యేవో దొంగకబుర్లు పిచ్చికథలు చెప్పి బిడ్డలకు అన్నంతినిపించ ప్రయత్నించేవిధంగా యిప్పటిప్పుడే చదువు నేర్చుకుంటున్న మన తెలుగువారికికూడా విషయాన్ని (Dramatic) గా చెప్పి ఆసక్తి కలిగించాలి. కొంచెం హుషారుగావుండి చక్కని గ్రంథాలను ప్రచురిస్తే రచయితలు, పుస్తకవిక్రేతలు యిప్పుడనుభవిస్తున్న దుర్దశ అనుభవించరు; వ్రాతలూ నిష్ప్రయోజనంగా పోవు. —వ. కు.

---

"రాష్ట్రపతి సుభాషచంద్రుడు"

[సైజు ౧/౮ క్రౌను; ౫౦ పేజీలు; వెల ౭ అణాలు. గ్రంథకర్త: 'అగ్నిహోత్రుడు.' ప్రకాశకులు, జ్యోతి గ్రంథాలు, ౩౯, ఆండర్సన్ వీధి మద్రాసు.]

సొగసైన ఈ చిన్నిగ్రంథం జ్యోతిగ్రంథాలకు సంబంధించి తొలికిరణంగా వెలువడింది. అంశం సుభాషచంద్రబోసుని జీవితచరిత్ర. ౧౫ వరకు చిత్రాలుగూడ యిందులో చేర్చబడ్డాయి.

దీన్ని రచించడంలో గ్రంథకర్త శ్రమ తీసుకొని విషయాన్ని సేకరించినట్లే కనపడుతోంది. సులభమైన శైలి; ప్రతి రెండణాల

వెల, సామాన్య తెలుగు శైలియొక్క ప్రస్తుత విజ్ఞాన-ఆర్థిక-తాహతు ననుసరించి గ్రంథకర్త నిర్ణయించినట్లు తోస్తుంది. రచన ఎత్తుగడ, శక్తి, విషయవిస్తీర్ణం, భావాలు గమనిస్తే 'అగ్నిహోత్రుడు' చెయ్యితిరిగినవానివలె అగుపడటమే కాకుండా భారత స్వాతంత్ర్య సమరవీరారాధకుడివలె కనపడుతున్నాడు. ఇతర భారతజ్యోతుల చరిత్రలుగూడ యీ గ్రంథమాలవారు 'అగ్నిహోత్రుని' తోడుతో క్రమక్రమంగా వెలువరించి తెలుగుతల్లి ఆదరాతిశయాన్ని పొందదగుదురు.

—వ. కు.

---

## పరాధీన భారత దేశము

[డాక్టరు పట్టాభిగారి తొలిపలుకుతో - గ్రంథకర్త: దేశిరాజు రామచంద్రరావు గారు. బి. యే., వకీలు, రాజోలు. వెల రు 0-6-0]

దేశచరిత్రకును, వ్యక్తిజీవితమునకును అవినాభావసంబంధము కలదు. సత్యమై, సర్వతోముఖమైన భారతచరిత్ర మేకొలదిమంది విద్యార్థులకుమాత్రమో తెలియును. ఆర్థిక, రాజకీయపరిస్థితుల కలరూపును పామరులెఱుగనే యెఱుగరు. దుస్థితిని, దారిద్ర్యమును తమపై పురికొలిపిన హేతువులను వీరవగతులు కారు. బ్రిటిషుపరిపాలనముయొక్క మేల్మను గుఱించిన ఉదంతమును పెద్దక్కరములందు వీరు చదివియుండిరి. అంతియే! భారత పరిస్థితుల నిక్కంపువృత్తాంతము చిన్నక్కరములందైన వీరికి గోచరింపలేదు. క్షరముగాని అక్షరములందీయుదంతమును సంక్షేపముగా గ్రంథకర్తగా రిపుడు వివరించిరి.

విషయము జటిలమైనది. వాడి మెదడు గలవారే అర్థశాస్త్రములందలి బహుళమాత్రముల నవగాహన మొనరించుకొనగలరు. రచనా విధానమును పరికించినపుడే గ్రంథకర్త విషయము నెట్లు హృదయంగమ మొనరించుకొన జాలిరో గ్రహింపజాలుదుము. కళకు అక్కరైన శైలి వేఱు; శాస్త్రమున కవసరమైన శైలి వేఱు. అది హృదయమునకు సంబంధించినది; ఇది మేధస్సునకు సంబంధించినది. దాని శైలి సౌందర్య సౌష్ఠవ మాధుర్యములకు నిక్షేపమై యుండవలెను. దీని శైలి చులకనై స్పష్టమై, క్లుప్తమై యుండవలెను. హేతుపర్యాలోచనమువలనగాని శాస్త్రాంశము మనసున బ్రవేశింపదు. తనకు స్పష్టమైనవిషయమునే గ్రంథకర్త పఠితకు స్పష్టము గావింపగలడు. ఈ సిద్ధాంతములను దృష్టిలో నిడికొని ప్రస్తుత గ్రంథమును పరిశీలించినపు డది కర్తహృదయమునకు దర్పణమాయెనని గుర్తింతుము. విషయమును గుఱించి గ్రంథకర్తకు చక్కని పరిజ్ఞానము కలదని తోడనే గ్రహింతుము.

కాని తనపాండితిని ప్రదర్శించుట గ్రంథకర్త ఆశయము కాదు. ఉద్గ్రంథమును రచించుటయును వీరియుద్దేశము కాదు. అర్థశాస్త్రసూత్రములను చర్చించి (ప్రత్యేక న్యాయశాస్త్రాంశములను వివరించుతటి జూరిస్ ప్రూడెన్సు లోని నిబంధనములను నిర్వహించునట్లు) సాధారణార్థిక సిద్ధాంతములను పరిశీలించి భారతదేశముయొక్క ప్రత్యేక పరిస్థితులను వీరు విమర్శించిరికారు. చారిత్రక దృష్టితో ఆర్థిక రాజకీయ పరిస్థితులను సింహావలోకన మొనరించిరి. విషయమునకు సంబంధించిన ఉద్గ్రంథములనుండి చక్కని ప్రమాణముల గైకొనిరి. పట్టాభిగారి పీఠిక, రచయితయత్నమునకు వన్నెదెచ్చెను.

భారతభూమియొక్క తొల్లింటివిభవము నుల్లేఖించుచు, వీ రీకర్జమునకు కడంగిరి. హిందూరాజులకాలమందును, ముసల్మాను ఏలికల సమయమందును భారతాంబ దారిద్ర్యము నెఱుగదు. తాను తయారుచేయువస్తువుల నన్యసీమల కంపి, అంతర్జాతీయవాణిజ్యమున నుండంజ వేసి ధనధాన్యములతో తులదూగుచుండెడిది. ఈవాణిజ్యముపై కన్నువేసినవారు పాశ్చాత్యులే! ముసల్మానుసోదరులవలె భారతభూమి నిమాతృదేశ మొనరించుకొని, భారత విభూతిని భారతావనికై వెచ్చించుట వీరియాశయము కాదు. భారతవర్తకమును తమవర్తకము జేసికొని, భారతదేశమునుండి ధనరాసులను తమదేశమునకు పట్టించుటే వీరిప్రధానోద్దేశము. ఈయుద్దేశసిద్ధిని దృష్టినిడికొనియే రాజకీయమైన అధికారమును హస్తగతము గావించుకొనిరి.

ఇగ్లాండున లభించునవి బొగ్గు, మఱియినుముమాత్రమే! కావున నిగ్లాండున కాహార పదార్థములను సప్లయిచేయవలసిన బాధ్యత భారతదేశమునకు చెందినది. భారతభూమి నుండి ముడివస్తువులను గొంపోయి, వీరికై చక్కనివస్తువులను తయారొనరించి వీరికి పంపుట ఆంగ్లేయులపనియైనది. ఈయుద్దేశము నెరవేరవలెననిన వీరు బహుళోపాయముల శరణ్యము నందితీరవలెను. తొలుత భారత పరిశ్రమలు పడిపోవలెను. భారతవస్తువు లొకచోటినుండి వేఱొకచోటునకు పన్నుభారముతో కుంటుకొనిపోవలెను. పెద్దమొత్తమునకుగాని ఒరులకు లభింపరాదు. ఇంగ్లాండునుండి ఇండియారేవులను, ఈరేవులనుండి దేశాంతర్భాగములను ఆంగ్లఫేక్టరీలందు తయారైనపదార్థములు అవలీలగ చేరుకొనవలెను. కావున నోడరేవులును, రైలురేవులును రాళ్లవలె గాక బెండులవలె నుండవలెను. నోట్ల సరఫరా, నాణెముల చెలామణీ లాభంపుమొగ్గును తమవంకకు ద్రిప్పవలెను. అధికారము చేతిలోనున్నపుడు వీనికి సంబంధించినతంతు జరుగుట అసాధ్యము కాదు. ఇండియాసామ్రాజ్య ఇంగ్లాండును ఇంగ్లీషు దేశస్థులను చేరుట కింకను వ్యవస్థలు చేయబడినవి. ఇవి రాజకీయములకు సంబంధించినవి. ఉద్యోగస్థులవేతనములు, ప్రభుత్వవ్యయము, సైన్యపువెచ్చము మున్నగు వానియం దీవ్యవస్థలు కలవు. నూటయేబదేండ్లనుండి విజృంభించుచున్న రాజకీయార్థిక కారణములే భారతకృషీకుని ప్రస్తుతస్థితికి దెచ్చినవి. ఈస్థితిని మాపుచేయునది స్వరాజ్యమే! జంపుగొంకులకు తావీయక, మొగమోటకు చోటొసగక గ్రంథకర్తగారీయంశముల నన్నిటిని కడుంగడు చక్కగా వివరించిరి.

"బ్రిటిషుపాలనమందలి లాభములను" మననము చేసికొనువారు చప్పున నీ గ్రంథమును చేబట్టవలెను. విషయపరిజ్ఞానము నెఱుగక రొంపిలో నిలిచిన రైతులు వెంటనే ఇందలి యంశములను హృదయంగమ మొనరించుకొనవలెను. గ్రామపునరుద్ధరణ మొనరింప గంకణముగట్టుకొనిన దేశసేవకు లిందలివిషయముల నచిరములో జీర్ణించుకొనవలెను. భావినాయ

కులు కాగోరువిద్యార్థులును, పత్యముపై మక్కువగల జిజ్ఞాసువులును దీనిని పుంఖాను పుంఖముగ పరిశీలింపవలెను. ఇందలి పరిజ్ఞానము ఈవిషయమునకు సంబంధించిన గభీరపఠన మునకు మార్గదర్శకము కాగలదు. నేడు మిక్కి లి యక్కరైనగ్రంథమును రచించిన శ్రీ దేశ రాజు రామచంద్రరావుగా రెంతయు వంద నీయులు. —జో. స.

---

## మేఘసందేశము

[కాళిదాసకృతికి తెనుగు]

[రచయిత : మాడభూషి మఠం వేంక టాచార్యులు, బి.ఏ., ప్లీడరు, తిరుపతి. వెల ఎనిమిదణాలు]

కవులలో ముఖ్యుడయిన కాళిదాసు కావ్యములందలి మేల్పవిచూడంగా నీ కావ్య మును తెలిగింపఁగొనినట్లు వేంకటాచార్యులు గారు మనవిచేసినారు. ఇదివరకే దీని నెందరో తెలిగించినారు. ఎన్నిమార్లు చదివినను చాలని పించని భావములకూర్పు 'మేఘసందేశము' కావున వీరి ప్రయత్నముకూడ అపేక్షణీ యమే. మూలమునందలి భావసంపదను తెలు గులోనికి దేబ్రయత్నించినమాట వాస్తవమే కాని, వేంకటాచార్యులుగారు తెలుగునుడికకు గాని, అన్వయశుద్ధికిగాని, రసశుద్ధికిగాని ఎక్కువ లక్ష్యమును, మిక్కిలి ప్రయత్న మును గన్పరచినట్లు ప్రస్తుతగ్రంథము సాక్ష్య మివ్వజాలకున్నది. ప్రతిపదమనోహరమైన మూలమేఘసందేశము ఇందులో యథావత్తుగా ప్రతిబింబించుట లేదు. మొట్టమొదటి పద్య మునే నిదర్శనముగా గ్రహింపవచ్చును :

"ఒక యక్షుండు ప్రమత్తుఁడౌటఁ దన యు
 ద్యోగంబునన్, ఱేఁడు వా
నికి శాపంబిడ నొక్కవత్సరము ప
 త్నింబాయఁ, దానుండెఁ దెం
పుకొ అంతై జనకాత్మజాప్లవ పకీ
 పూతోదకచ్ఛాయ వృ
క్షకదంబోజ్జ్వల రమ్యరామగిరి వి
 స్తారాశ్రమశ్రేణులన్."

'కశ్చిత్కాంతావిరహగురుణా' అను మూల శ్లోకమునందలి భాషా, భావసౌందర్యమున కును ఈ తెలుగుపద్యమందలి దాని యనుకృతి కిని గల తారతమ్యమును వివరింప నక్కర లేకయే రసికపాఠకులు గ్రహింపగలరు. 'యక్షశ్చక్రే - జనకతనయాస్నానపుణ్యోదకేషు, స్నిగ్ధచ్ఛాయాతరుషు వసతిం రామగిర్యాశ్రమేషు' అని రామగిర్యాశ్రమములకు కాళిదాసు కూర్చిన విడివిడి విశేషణముల సందర్భశుద్ధి, సారళ్యములకును వేంకటాచా ర్యులుగారు కూర్చిన 'జనకాత్మజాప్లవపకీ పూతోదకచ్ఛాయ వృక్షకదంబోజ్జ్వల రమ్య రామగిరి విస్తారాశ్రమశ్రేణులన్' అనెడి దీర్ఘసమాసమందలివానికిని బింబ ప్రతిబింబ తయే కన్పించకున్నది. ('ఛాయవృక్ష' శబ్ద సాధుత్వమును వేంకటాచార్యులుగారు ఎట్లు సమర్థింతురో తెలియకున్నది.) ఇటువంటి అనుకరణములవలన మూలమునందలి మేల్పవి గ్రహింపనోపుట కష్టసాధ్యము.

—'ఆచార్య.'

---

## అమరుకావ్యము

[నెల్లూరునివాసులు గుత్తుము వేంకట సుబ్రహ్మణ్యముగారు (బి.ఏ.,బి.ఎల్) దీనిని సంస్కృతమూలమునుండి అనువ దించి ప్రకటించినారు.]

ఇది యొక శృంగారచాటువుల సంపుటము. అమరుకవి రచించినది కాబట్టి ఇది అతని పేరు తోనే అమరుకావ్యమని వ్యవహరింపబడు చున్నది. ఇందలి ఒక్కొక్కచాటువు ఒక్కొక్క శృంగారరసగుళిక యని చెప్ప వచ్చును. 'అమరుకకవేః ఏకః శ్లోకః ప్రబంధ శతాయతే' అన్నంతటి ప్రతిష్ఠబడసిన దీ కావ్యము. ఇంత రసవత్తరముగా పరిగణింప బడు నీకావ్యమును తెలుగులోనికి పరివర్తించి ఏతత్కావ్యామృతమును తెలుగువారాస్వా దింప నవకాశము గలుగజేసిన సుబ్రహ్మణ్యము గారి ప్రయత్నము శ్లాఘనీయము. ఇదివరకే దీనికి ఒకటి రెండు అనువాదము లున్నట్లు తెలియుచున్నది గాని 'క్షణేక్షణే య న్నవ తాముపైతి,తదేవ రూపం రమణీయతాయాః' అన్నట్లు ఈ రసగుళికలకు ఎందరెన్నివిధ ముల రూపకల్పన జేసినను అవి క్షణక్షణనవ ములే యగుచుండునని మాత్రము చెప్పవచ్చును. సుబ్రహ్మణ్యముగారు దీని ననువదించుటలో మూలమును చక్కగా అర్థముచేసికొని, మూల భావములు సొట్టపోకుండ తెలుగుపద్యములు రచించినట్లు స్పష్టమగుచున్నది. రచనముకూడ వారి 'ఋతుసంహారము' వలె దుశ్ఛేద్యము గాకుండ సరళముగాను, ధారావాహికము గాను, రసవంతముగాను నడచినది. ఒక్కొ క్కపద్యమునకును అవతారికలవంటి సూచన లను పుటల క్రిందిభాగమున పాఠకుల సౌక ర్యార్థమై రచయితలు ఇచ్చియున్నారు. అమరుకవినిగురించియు, అతని కావ్యమును గురించియు, సుబ్రహ్మణ్యముగారి అనువాద మునుగురించియు విపులముగా కొటూరి వేంక టేశ్వరరావుగారు తమ ఉపోద్ఘాతములో తెలిపియున్నారు. —'ఆచార్య.'

---

# గ్రంథస్వీకారము

## విద్యార్థి

[నిజాము కళాశాల తెనుగు సారస్వత సాంవత్సరిక సంచిక] వెల రు ౧-౦-౦

ముఖ్య సంపాదకుడు : విద్వాన్ సరిపల్లి విశ్వనాథశాస్త్రి, యం. ఏ.

ప్రకాశకుఁడు: ప్రెసిడెంటు, తెలుగు లిట రరీ యూనియన్, నైజాం కాలేజి. హైదరా బాదు (దక్కను)

---

## ఆంధ్రపత్రిక—ఉగాదిసంచిక

బహుధాన్య ౧౯౩౮—౩౯

మామూలుసైజు. ఆర్టుపేపరు. దాదాపు ౧౫౦ పుటలు. వెల రు. ౧-౦-౦

ఆంధ్రపత్రికా కార్యాలయము, ౯౬, తంబుశెట్టివీథి, మదరాసు.

---

## గ్రంథాలయములకు వలయు నాంధ్రగ్రంథముల రెండవపట్టిక

మద్రాసు గ్రంథాలయ ప్రచారకసంఘము వారు (తిరువల్లిక్కేణి, మదరాసు) దీనిని ప్రకటించిరి. వెల రెండణాలు.

### భగవద్గీత (వచనము)

చిన్నసైజున ౧౬౦ పుటలు. వెల రెండణాలు తపాలుబిళ్లలు. అవి ముందే పంపవలెను. కర్త: తుపాకుల అనంత భూపాలుఁడు (పదునెనిమిదవ శతాబ్ది). ప్రకాశకులు: గీతాప్రచార పరిషత్తువారు, ఎలమంచిలి, విశాఖపట్టణము జిల్లా.

---

### ఆంధ్ర గణితము

౧. (నాల్గవతరగతి పు. ౨౨౬. వెల రు. ౦-౧౦-౦.

౨. (ఐదవతరగతి) పు. ౨౫౬. వెల రు. ౦-౧౨-౦.

౩. (మొదటిఫారము) పు. ౨౮౬. వెల రు. ౦-౧౪-౦.

౪. (రెండవఫారము) పు. ౨౦౫. వెల రు. ౧-౦-౦.

౫. (మూడవఫారము) పు. ౩౨౭. వెల రు. ౧-౨-౦

గ్రంథకర్త: గిడుగు నరసింహమూర్తి, బి. ఏ., యల్. టి. ప్రధానగణితాధ్యాపకుడు, జి. సి. బి. హైస్కూలు, కురుమెళ్ల, గుంటూరుజిల్లా.

ఇవి ఆయాతరగతులలో వాడుకకని వ్రాయబడినవి.

---

### Great Expectations.

(An exposition of the Problems of Hyderabad from the peoples point of View )

[క్రౌను ౧/౮, సైజు, పు. ౧౧౨, వెల ౦-౮-౦ ప్రకాశకుడు : బి. ఏ. రావు, బెంగుళూరుసిటీ ]

౧. (అభినవ) సుమతిశతకము (నాలవ ముద్రణము. ౧౯౩౭ సం.)

౨. భక్తుఁడు (ఆఱవకూర్పు. ౧౯౩౮ సం.)

౩. విశ్వామిత్రుఁడు (రెండవకూర్పు.)

ఈమూఁడుగ్రంథముల రచయిత : దుర్భా సుబ్రహ్మణ్యశర్మ, తెలుగులెక్చరరు, వి. ఆర్. కాలేజి, నెల్లూరు.

---

## భారతీయ మహిళామండలి



శ్రీమతి ఆచంట శారదాదేవిగారు

శ్రీయుత ఆచంట వెంకట్రామశర్మ, బి. ఎ., బి. యల్., గారి సతీమణి. ఈమె బందరు లేడీ యాంప్తిల్ గవర్నమెంటు గరల్సు హైస్కూలు విద్యార్థిని. ఈమధ్య జరుపబడిన వక్తృత్వ, వ్యాసరచన, ఏకపాత్రాభినయముల పోటీలలో పాల్గొని ప్రథమబహుమతులను బడసినది. మరియు బ్యాడ్మింటన్, వాలీబాల్, నెట్‌బాల్ వగైరా ఆటలపందెములలో పాల్గొని ప్రథమబహుమానములను బడసినది.




వైద్యకుశల డా. యం. సి. పౌనెను లూకోసుసతి

తిరువాంకూరు ప్రభుత్వమున సర్జను జనరలు పదము నధిష్ఠించిన ప్రథమయువతి

---

Printed and Published by K. Nageswara Rao,
at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras. Editor:—K. Nageswara Rao.